అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక 306

సంపుటి: 37 సంచిక: 6 ఆగస్టు - సెప్టెంబరు 2014

పేజీలు: 68 వెల: రు. 20

లాల్‌సలాం ఖాన్‌సాబ్



వాళ్లు వస్తారు
అగ్ని శిఖల మీదినించి
ధిక్కారం పలుకుతూ వస్తారు
కొత్త బాణీలు కట్టి
కొత్త మాటలు మాలలు కట్టి
రేపటి వేకువ కోసం
కొత్త పాటలు పాడుతూ వస్తారు

పదేళ్ల ఐక్య విప్లవోద్యమానికి జేజేలు!

బోల్షివిక్ స్ఫూర్తితో దండకారణ్య జనతన సర్కార్‌ను, ప్రత్యామ్నాయ ప్రజాపంథాను ప్రచారం చేద్దాం!

సదస్సు : సెప్టెంబర్ 21న ఉదయం 11గంటల నుంచి 2.00 గంటల వరకు సుందరయ్య విజ్ఞానకేంద్రం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాదు

అధ్యక్షత : జి.కళ్యాణరావు, అంశం : విప్లవంలో మూడు మౌలిక నిర్మాణాలు- పాణి; అధ్యక్షత-సిఎస్ఆర్. ప్రసాద్;

ఈ దశాబ్ది విప్లవ పోరాటాలు-అమిత్ భట్టాచార్య; విప్లవోద్యమం-బోల్షివీకరణ-వరవరరావు

పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరీ వసంత కాలమేఘం దేశమంతా కురిసింది. ఈ చినుకులకు తడిసి పులకరించిన నేల వ్యవసాయక విప్లవాన్ని కలగన్నది. వేలాది మంది ప్రజలు, ఆలోచనాపరుల రాజకీయ సిద్ధాంత ఆచరణలతో విప్లవ మార్గం రూపుదిద్దుకున్నది. భారత విప్లవోద్యమం దిన దిన ప్రవర్ధమానమవుతోంది.

భారత విప్లవోద్యమంలో 2004 సెప్టెంబర్ 21కి చారిత్రక ప్రాధాన్యత ఉంది. మునపటి మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా, సి.పి.ఐ. (ఎంఎల్) (పీపుల్స్‌వార్) ఆరోజు విలీనమై సి.పి.ఐ. మావోయిస్టు ఏర్పడింది. భారత విప్లవోద్యమానికి నాయకత్వం వహించే ఐక్య కార్మికవర్గ పార్టీ అవతరించింది. ఈ రెండు పార్టీలు అనేక ఆటుపోట్ల మధ్యనే పురోగమిస్తూ బలమైన శత్రువును ఓడించడానికి, విప్లవ సాఫల్యానికి ఒక్కటయ్యాయి. ఈ పదేళ్లలో విప్లవోద్యమం ఆపరేషన్ గ్రీన్‌హంట్ రెండో దశను సహితం ఎదుర్కొని నిలబడింది. యుద్ధం మధ్యనే ప్రజా యుద్ధం రాటుదేలుతున్నది. ఆదివాసులు, అట్టడుగు ప్రజలు ఎర్ర సైనికులుగా భారత ప్రభుత్వ సైనిక, అర్ధ సైనికులతో సాహసోపేతంగా పోరాడుతూ గణనీయ విజయాలు సాధిస్తున్నారు. ప్రజా సైన్యం లేకుండా ప్రజలకు ఏదీ సిద్ధించదనే విప్లవ సూక్తి వాస్తవ రూపం ధరిస్తున్నది.దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా దండకారణ్యంలో బీజరూపంలో ప్రజా రాజ్యాధికారం అంకురించింది. విప్లవమంటే ప్రజల చేతుల్లోకి రాజ్యాధికారమనే సుప్రసిద్ధ సూత్రీకరణ దండకారణ్యంలో నిజమవుతున్నది. నూతన ప్రజాస్వామ్య స్ఫూర్తితో దేశవ్యాప్తంగా భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలు వెల్లువెత్తుతున్నాయి. వేర్వేరు జీవన రంగాల్లో వ్యవస్థ సృష్టిస్తున్న సంక్షోభాలకు మావోయిస్టు ఉద్యమమే పరిష్కారమనే నిర్ధారణకు ప్రజలు, బుద్ధిజీవులు చేరుకున్నారు. నిర్బంధం, సంస్కరణలు అనే ద్విముఖ వ్యూహంతో సాగుతున్న సామ్రాజ్యవాద దాడిని ప్రత్యామ్నాయ అభివృద్ధి, ప్రజా రాజ్యాధికారం అనే ఆయుధాలతో విప్లవోద్యమం ఎదుర్కొంటున్నది. ఈ పదేళ్లలో ఎన్నో ప్రజాస్వామిక, అస్తిత్వ సంచలనాలు ముందుకు వచ్చినా, వ్యవస్థ మీద సాంఘిక, సాంస్కృతిక, భావజాల రంగాల్లో విమర్శలు పెట్టినా. దాని రాజకీయార్థిక పునాదిని ప్రశ్నించ లేదు. అందువల్ల అవి సునాయాసంగా వ్యవస్థలో భాగమైపోతున్నాయి. రాజకీయార్థిక తలం నుంచి సకల ఆధిపత్యాలను, పీడనలను, వివక్షలను ప్రశ్నించి సాయుధంగా ఎదుర్కొంటున్నందునే మావోయిస్టు ఉద్యమం వ్యవస్థకు ప్రత్నామ్నాయంగా నిలబడింది.

ప్రజాస్వామ్యమంటే అట్టడుగు నుంచి ప్రజా పాలన. ఉత్పత్తి దాయకమైన ప్రజలు అన్ని రకాల రాజకీయ నిర్ణయాల్లో భాగస్వాములై అసలు సిసలైన నిర్ణయాధికారాన్ని చెలాయించడం. ప్రజాస్వామ్యం గురించి భారత రాజ్యాంగం ఎన్నో సుభాషితాలు ప్రకటించి ఉండవచ్చు. అవన్నీ సారాంశంలో బూర్జువా ప్రజాస్వామ్యానికి సంబంధించినవే. అయితే ఆచరణలో అవి కూడా అమలు కావడం లేదు. వర్గ సమాజంలో ఉత్పత్తి సాధనాల మీద యాజమాన్యం ఉన్న వర్గానికే రాజ్యాంగయంత్రం మీద అధికారం ఉంటుంది. అప్పుడు అమలయ్యేది బూటకపు ప్రజాస్వామ్యమే. అధికార మార్పిడి తర్వాత భారత భూఖండం మీద తొలిసారిగా దండకారణ్యంలో ప్రజాస్వామ్యం చిగురిస్తున్నది. ఉత్పత్తి, ప్రత్యామ్నాయ అభివృద్ధి, ప్రజాపాలన అనే మూడింటిని విప్లవోద్యమం వర్గపోరాటం ఇరుసు మీద అక్కడ నిర్వహిస్తున్నది. విప్లవకర వర్గాల ఐక్య సంఘటన ప్రభుత్వం బీజ రూపంలో దండకారణ్యంలో కనిపిస్తుంది. పార్లమెంటరీ వ్యవస్థ నానాటికి తనలోని సకల దుర్మార్గాలను, రుగ్మతలను బట్టబయలు చేసుకుంటున్న తరుణంలో ప్రజా యుద్ధమొక్కటే ప్రత్యామ్నాయంగా నిలబడగలిగింది. వ్యవస్థలోని సంక్షోభాలకు పార్లమెంటరీ మార్గంలో ఎన్నో ప్రత్యామ్నాయాలు ఉండవచ్చు. కానీ మావోయిజం ఈ వ్యవస్థకే ప్రత్యామ్నాయం. ఐక్య పార్టీ నాయకత్వంలో ఇవాళ మావోయిస్టు ఉద్యమమే ఏకైక ప్రత్యామ్నాయంగా నిలబడింది. భారతదేశంలో ఈ ప్రజారాజకీయ ప్రత్యామ్నాయానికి సుమారు యాభై ఏళ్ల చరిత్ర ఉంది. 1969 ఏప్రిల్ 22న ఏర్పడ్డ సి.పి.ఐ. (ఎంఎల్) అతి కొద్ది కాలంలోనే చీలిపోయింది. అయినా నక్సల్బరీ శ్రీకాకుళ పోరాటాలు, ఎంఎల్ పార్టీ ఆవిర్భావం ఈ దేశ పీడిత ప్రజలకు విప్లవ పంథాను, దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని పరిచయం చేశాయి. వర్గపోరాటం ద్వారానే వ్యవస్థ మారుతుందనే భావజాలాన్ని అందించాయి. సోషలిస్టు పరివర్తనా దశలో కూడా వర్గపోరాటం తప్పని సరి అనే మహత్తర చైనా సాంస్కృతిక విప్లవ స్ఫూర్తితో రివిజనిజాన్ని, భూస్వామ్య-సామ్రాజ్యవాదాలను, పార్లమెంటరీ పంథాను ఎదిరించగల అజేయమైన విశ్వాసాన్ని నింపాయి. అంతకు మించి వర్గపోరాటం ద్వారానే నూతన మానవి, మానవుడు ఆవిర్భవిస్తారని తిరుగులేని విధంగా ప్రకటించాయి. అయితే అనేక కారణాల వల్ల ఆనాటి విప్లవోద్యమం వెనుకతట్టుపట్టింది. "గతాన్ని సమీక్షించుకొని సాయుధపోరాటమార్గంలో పురోగమిద్దాం" అని 1974 ఆత్మవిమర్శతో పునర్నిర్మాణ ప్రయత్నాలు మొదలయ్యాయి. ప్రజాపంథాలో కరీంనగర్, ఆదిలాబాద్ పోరాటాలు వెల్లువెత్తాయి. గెరిల్లా జోన్ పర్‌స్పెక్టివ్ రూపొందించుకొని విప్లవోద్యమం 1980లనాటికే దండకారణ్యం చేరుకున్నది. తీవ్ర నిర్బంధం మధ్యనే దేశవ్యాప్తంగా విస్తరిస్తూ 1998లో సి.పి.ఐ. (ఎంఎల్)(పార్టీ యూనిటీ)తో విలీనమైంది. సరిగ్గా ఈ క్రమంలోనే పశ్చిమ బెంగాల్, బీహార్ కేంద్రంగా మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ భూస్వామ్య వ్యతిరేక సాయుధ పోరాటాలను ఉధృతం చేసింది. 2003లో రెవల్యూషనరీ కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా (మావోయిస్టు)తో కలిసి ఎం.సి.సి.ఐ.గా అవతరించింది. అనేక చారిత్రక కారణాల వల్ల విప్లవకారుల ఐక్యత సాధ్యమేనా? అనే నిరాశ ఆవరించి ఉన్న తరుణాన ఎంసీసీ వేర్వేరు మావోయిస్టు సంస్థలతో ఐక్యం కావడం, పీపుల్స్‌వార్, పార్టీ యూనిటీ ఒక్కటి కావడం, చివరికి ఎం.సి.సి., పీపుల్స్‌వార్ కలిసిపోవడం ఈ పదేళ్లలోని ఒక ఆశావహ పరిణామం. దీన్ని మరో అడుగు ముందుకు తీసికెళ్తూ సి.పి.ఐ. (ఎంఎల్) (నక్సల్బరీ) కూడా మావోయిస్టు పార్టీలో విలీనమైంది.

ఈ పదేళ్లలో విప్లవోద్యమం సాధించిన విజయాలను విశాల విప్లవకర ప్రజల్లో ప్రచారం చేయడానికి, వాళ్ల మద్దతు, భాగస్వామ్యం కూడగట్టవలసిన తరుణమిది. మావోయిస్టు ఉద్యమమే ఈ వ్యవస్థకు ఏకైక ప్రత్యామ్నాయమని హేతుబద్ధంగా వివరించవలసిన సందర్భమిది. దీని కోసమే దేశంలోని విప్లవాభిమానులతో ఈ ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ఏర్పడ్డది. ఐక్య విప్లవోద్యమం మొదలైన సెప్టెంబర్ 21న హైదరాబాదులో జరిగే సదస్సుకు, బహిరంగసభకు అందరినీ స్వాగతిస్తున్నాం.

సాయంత్రం 5 గంటలకు సుందరయ్య పార్క్ నుంచి ఇందిరా పార్క్ వరకు ర్యాలీ బహిరంగ సభ

అధ్యక్షత : వరవరరావు; వక్తలు : బొజ్జా తారకం, కంచన్‌కుమార్, ప్రొ. జగ్‌మోహన్, హరగోపాల్, కెఆర్ చౌదరి, చలసాని ప్రసాద్, కళ్యాణరావు, ఆర్.నారాయణమూర్తి, పద్మకుమారి;పుస్తకాల ఆవిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి

ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక

కన్వీనర్ : వరవరరావు, సభ్యులు: బొజ్జా తారకం, ప్రొ.హరగోపాల్, ప్రొ. కె.ఆర్ చౌదరి, కె.శివారెడ్డి, కాకరాల, ఆర్.నారాయణమూర్తి, కంచన్‌కుమార్, అరుణ్ చక్రవర్తి (పశ్చిమబెంగాల్), చలసాని ప్రసాద్, టి.కృష్ణాబాయి. జి.కళ్యాణరావు, సిఎస్ఆర్ ప్రసాద్, కె.ఎన్.పండిత్ (ఝార్ఖండ్), జి.పద్మకుమారి, పాణి.

3
KLVA101M170

అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

306

సంపుటి : 37 ◆ సంచిక : 6 ◆ ఆగస్టు-సెప్టెంబరు, 2014

సంపాదకుడు
చలసాని ప్రసాద్
వర్కింగ్ ఎడిటర్
డి.వి. రామక్రిష్ణారావు
ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా,
మౌలాలి, హైదరాబాద్ - 500 040.
* కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా
రచనలు పై చిరునామాకూ,
ఇ-మెయిల్ ద్వారా
arunatara1977@gmail.com కూ
పంపవచ్చు
సంపాదకవర్గం :
ఉజ్వల్, బాసిత్, కూర్మనాథ్

చందాలు పంపాల్సిన చిరునామ
మేనేజర్
ఎస్. రవికుమార్
5-1307, దొరసానిపల్లె రోడ్,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.
సెల్ : 9866021257

విరసం కార్యదర్శి చిరునామా
పి. వరలక్ష్మి
5-1820, గీతాశ్రమం వీధి,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.

డి.టి.పి. & లే అవుట్, 2, 3 కవర్ డిజైన్
ఆర్. భాగ్యలక్ష్మి
1, 4 కవర్ డిజైన్
పి. వరలక్ష్మి, క్రాంతి
3 కవర్ ఫొటోలు
విరసం మిత్రులు, పావని
http://www.facebook.com/arunatara.virasam
Virasam website : *www.virasam.in*

ఈ సంచిక వెల : రు. 20/-

సంపాదక లేఖ...

'సామ్రాజ్యవాద, భూస్వామ్య శృంఖలాలను బద్దలు కొట్టండని, ఈ కుళ్ళు వ్యవస్థను ధ్వంసం చేసి మీ చేతులతోనే మీ భవిష్యత్తును, ఈ దేశ భవిష్యత్తును నిర్మించండ'ని అంటూ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తన పదవ ఆవిర్భావ వార్షికోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు పిలుపునిచ్చింది. పదేళ్ళ క్రితం 2004 సెప్టెంబర్ 21న సిపిఐ (ఎం.ఎల్)(పీపుల్స్‌వార్), ఎం.సి.సి.ఐ. పార్టీలు ఐక్యమై భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భవించింది. అనేక ఆటుపోటుల మధ్య, అనేక త్యాగాలతో దేశంలోని వివిధ ప్రాంతాలకు విస్తరించింది. ఈ దశాబ్ద కాలంలో దండకారణ్యం, బీహార్, ఝార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమ బెంగాల్, కర్నాటక, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, ఉత్తారాఖండ్, అస్సాంకు చెందిన దాదాపు 2500 మంది కామ్రేడ్స్ తమ విలువైన జీవితాలను ఉద్యమం కోసం ధారపోసారని తెలియజేసింది. ఈ క్రమంలో అనేక మంది ప్రజలు అత్యున్నత త్యాగాలు చేశారని విప్లవోద్యమం పేర్కొంది. శత్రు నిర్బంధాన్ని ప్రజలే భరించారని, వాళ్ళే విశ్వాసాన్ని అందించారని, వారి గొప్ప త్యాగాలు, అపారమైన ఉత్సాహం లేకపోతే దీర్ఘకాల ప్రజా యుద్ధం ముందుకు పోవడం అసాధ్యమై ఉండేదని పేర్కొంది. నూతన రాజకీయాధికారం మొలకెత్తి ఒక నూతన సమాజ నిర్మాణం జరుగుతోందని తన సందేశంలో తెలియజేసింది.

ఈ నేపధ్యంలోనే రాజకీయ ప్రత్యామ్నాయ వేదిక ఆధ్వర్యంలో విప్లవ మేధావులు, విప్లవాభిమానులు, ప్రజల పూనికతో సెప్టెంబర్ 21న హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పదేళ్ళ ఐక్య విప్లవోద్యమ కృషిపై చర్చించడానికి సదస్సు, ర్యాలీ, ఇందిరా పార్కు వద్ద బహిరంగ సభ తలపెట్టారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో తొలిసారి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన కె.సి.ఆర్. తెలంగాణ ఉద్యమ సందర్భంలో అనేక సార్లు స్వయంగా మావోయిస్టు ఎజెండానే తమ ఎజెండాగా ప్రకటించారు. అయితే అధికారం చేపట్టాక కె.సి.ఆర్. అంతకుముందు పాలక వర్గాల అణచివేత విధానాలను తలదన్నేలా కనీసం హాలు మీటింగుకు కూడా అనుమతి ఇవ్వలేదు. రాజకీయ ప్రత్యామ్నాయ వేదిక కన్వీనర్ వరవరరావు, విరసం సభ్యులు కళ్యాణరావు, వరలక్ష్మి, పాణి, అమరుల బంధుమిత్రుల సంఘం అంజమ్మ, పద్మకుమారి, ఝార్ఖండ్ ప్రజానాయకుడు జితేన్ మరాండీ, చైతన్యమహిళా సంఘం దేవేంద్రలతో సహా ఎక్కడికక్కడ ప్రజా సంఘాల నాయకులను, కార్యకర్తలను అర్ధరాత్రి నుంచే కేసిఆర్ ప్రభుత్వం అరెస్టులు చేసింది. ఇళ్ల నుంచి, రైల్వే స్టేషన్ల నుంచి, బస్సుల నుంచి అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించింది.

మరోపక్క ప్రజా ఉద్యమాల అణచివేతలో దుర్మార్గమైన చరిత్ర ఉన్న చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా విప్లవోద్యమంపై, ప్రజా ఉద్యమాలపై అణచివేతలకు వ్యతిరేకంగా చేపట్టిన గ్రీన్‌హంట్ వ్యతిరేక సభలను తిరుపతి, విశాఖపట్నంలలో జరగకుండా అడ్డుకుంది. అనేక మందిని ముందస్తు అరెస్టులు చేసింది. గృహ నిర్బంధాలు అమలు చేసింది.

ఆటా పాటా మాటా బంద్ కొనసాగుతోంది. నిత్య ఎమర్జెన్సీ అమలు అవుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో మొత్తంగా దేశంలోని పాలకవర్గాలు సామ్రాజ్యవాద ప్రయోజనాలను నెరవేర్చడంలో భాగంగా అంతటా 'శాంతి'ని స్థాపించాలనుకుంటున్నాయి. కేంద్రంలోని మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం తన హిందూత్వ ఎజెండాకు పదును పెడుతోంది. ప్రజలకు పోరాటం తప్ప మరో మార్గం లేదు.

ఇదే కాలంలో నక్సల్బరీ, శ్రీకాకుళ వారసత్వాన్ని ఎత్తి పడుతూ జీవిత కాలమంతా ఆ విలువలతో ప్రజా పోరాటాలే శ్వాసగా బతికిన విరసం వ్యవస్థాపక సభ్యులు కామ్రేడ్ ఎం.టి. ఖాన్ (79) ఆగస్టు 20న హైదరాబాద్‌లోనూ, అక్టోబర్ 10న కామ్రేడ్ భాగ్యనగర్ విజయ్‌కుమార్ (65) కరీంనగర్‌లోనూ అమరులయ్యారు. కామ్రేడ్ ఖాన్‌సాబ్‌కు, కామ్రేడ్ విజయ్‌కుమార్‌లకు విరసం అరుణారుణ జోహార్లు అర్పిస్తోంది. అమరుల ఆశయ సాధనలో విరసం తన వంతు కృషిని సాహిత్య సంస్కృతిక రంగాలలో కొనసాగిస్తుంది. ప్రఖ్యాత దళిత కవి పైడి తెరేష్‌బాబు (51) సెప్టెంబర్ 29న అనారోగ్యంతో హైదరాబాదులో మరణించారు. ఆయనకు విరసం నివాళులు అర్పిస్తోంది.

సంచిక - 306

సంపాదకీయం (5-6)
ప్రత్యామ్నాయ రాజకీయాలు-ప్రజాస్వామ్యం - **పి. వరలక్ష్మి**

సంస్మరణ (6-9)
ఖాన్‌సాబ్ జీవనశైలి - **వివి**
పెద్దన్న ఖాన్ సాబ్ - **కృష్ణాబాయి**

పాటలు/కవిత్వం (10-16)
సర్కారంట అన్నా.. సర్కారంట్ల - **భూసారం శివన్న**
జనతన సర్కారుకు జేజేలు - **డప్పు రమేష్**
ఎం. రాఘవాచారి కవితలు రెండు :
ప్రజలు అజేయులు; పథక రచయితలు
ఉద్యమాల ఊపిరి - **కోటయ్య పిన్నిబోయిన**
జన నేత జ్ఞాపకాలు - **టి. రామమోహనరావు**
ఈ వెన్నెల మరీ తెల్లన... - **అరసవిల్లి కృష్ణ**
మహమూద్ కవితలు రెండు :
కాగడా నీడలో కదులుతూ...; ఒక జీవితం - వేయి ఖండికలు

కథలు (17-26)
1/70 × 420 - **డాక్టర్ దిలావర్**
నెంబర్ 11045 - **ఎస్.డి.**

వ్యాసాలు (26-34)
ఆదివాసీలు ఎందుకు మునగాలి? - **బాసిత్**
మేడిపండు ప్రజాస్వామ్యం - **క్రాంతి**
భగ్నసభ ఇచ్చిన సందేశం - **వరలక్ష్మి**

సంస్మరణ (35-41)
సాహిత్యలోకంలో ఒక చేరా ఎప్పుడూ ఉండాలి! - **వి. చెంచయ్య**
చేరా లేరు. కానీ ఆయన సాహిత్యం ఉంది. ఉంటుంది - **పిన్నిబోయిన కోటయ్య**
ద్వారాలు తెరిచి ఉంచుకున్న కవి - **అరసవిల్లి కృష్ణ**

పుస్తక పరిచయం (42-43)
యదార్ధ పోరాట ఘటనలు - దండకారణ్య కథలు - **కవిని**

వ్యాసాలు (43-56)
ప్రపంచ సినిమా చరిత్రను అద్దంలో చూపిన
'సినిమాగా సినిమా' - **పి.వి. రమణ**
పంజా విసిరిన కార్పొరేటు ఉగ్రవాదం - **విశ్వం**
ఈ నిర్వేతుక దాడి ఎందుకోసం? - **ఎస్. రవి**
ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ఆహ్వానం - **వరవరరావు**

ఆహ్వానలేఖ (57)
దండకారణ్య జనతన సర్కార్ గురించి చర్చించుకుందాం! - **వరలక్ష్మి**

నివేదిక (58-63)
దండకారణ్య సంభాషణ - ప్రత్యామ్నాయ సహాన్వేషణ - **బాసిత్**

సౌహార్ద సందేశం (63-64)
సామ్రాజ్యవాదం, హిందూ ఫాసిజంపై
విశాల ప్రాతిపదికన ఐక్యంగా ఉద్యమిద్దాం - **పి. వరలక్ష్మి**

లేఖ (64)
లేఖ

పత్రికా ప్రకటనలు (65-66)
కామ్రేడ్ ఎం.టి.ఖాన్‌కు అరుణారుణ జోహార్లు!
ఎ.బి.వి.పి. దాడులను ఖండిద్దాం!
తెలంగాణ మేధావులు ఇకనయినా గ్రహించాలి
పైడి తెరేష్‌బాబుకు నివాళి

(సవరణ : జూన్-జూలై సంచికలో జి.ఎన్. సాయిబాబా అరెస్టుకు నిరసనగా అచ్చయిన కరపత్రంలో ప్రజా కళా మండలి సంఘం పేరు అచ్చు కాలేదు. ఈ పొరపాటుకు చింతిస్తున్నాం - సం.)

విరసం సాహిత్యాన్ని కరపత్రాలను, స్టేట్‌మెంట్లను, అరుణతార పత్రికను **www.virasam.in** వెబ్‌సైట్‌లో చూడవచ్చు. అలాగే వివిధ సాహిత్య పత్రికల బ్లాగులు, సైట్‌ల లింకులను కూడా చూడవచ్చు.

అరుణతార చదవండి!
చదివించండి!
చందాదారులు కండి!

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి.
డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.
విడి సంచిక వెల - రు. 15; సంవత్సర చందా - రు. 180;
రెండు సంవత్సరాల చందా - రు. 350; మూడు సంవత్సరాల చందా - రు. 500;
ఐదు సంవత్సరాల చందా - రు. 800; దశాబ్ది చందా - రు. 1600/-

ప్రత్యామ్నాయ రాజకీయాలు-ప్రజాస్వామ్యం

-పి.వరలక్ష్మి

సరిగ్గా పదేళ్ళ క్రితం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రెండు విప్లవ పార్టీలు సిపిఐ (ఎం-ఎల్) పీపుల్స్ వార్, సిపిఐ (ఎం-ఎల్) జనశక్తిలకు మధ్య శాంతి చర్చలు జరిగాయి. ఆ సందర్భంలో తెలుగు సమాజం మొత్తం అనేక సామాజిక రాజకీయార్థిక అంశాలపై చర్చించింది. విప్లవ పార్టీలతో నేరుగా సంభాషించింది. చర్చల పట్లగాని, అందులోని అంశాల పట్లగాని ప్రభుత్వం కపట వైఖరితో ఉన్నా ఒక సంభాషణ ప్రారంభమైన ఆ సందర్భమే స్వేచ్ఛాయిత భావాల వెల్లువ వల్ల ప్రత్యేకమైనది. ఆ సందర్భంలోనే సిపిఐ (ఎం-ఎల్) పీపుల్స్‌వార్, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్‌ల విలీనాన్ని ప్రకటించింది. పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వం హైదరాబాదులో బహిరంగంగా వెలువడింది. సిపిఐ (మావోయిస్టు) పార్టీ ఈ దేశంలో బలమైన విప్లవోద్యమ పార్టీగానే కాక పార్లమెంటరీ రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా ముందుకొచ్చిన నక్సల్బరీ పంథా సుదీర్ఘకాల వ్యవధిలో నిర్మించుకున్న ఐక్య మావోయిస్టు ఉద్యమం. ఐక్య నిర్మాణం అది సాధించిన మొదటి విజయం. 90ల నుండి నాలుగు విప్లవపార్టీలు ఐక్యం కావడం ఈ దేశ విప్లవోద్యమ చరిత్రలో కీలక పరిణామం. సమాజం ఎంతగా సంక్షోభం దిశగా పరిణామం చెందుతుందో అంతగా అది ఘర్షణను తీవ్రతరం చేస్తుంది. సంఘర్షించే శక్తులను ఐక్యం చేస్తుంది.

ఈ సెప్టెంబరు 21నాటికి సిపిఐ (మావోయిస్టు) పార్టీ ఏర్పడి పదేళ్ళవుతుంది. పదేళ్ళగా ఎన్నో ఆటుపోట్లు, ఎగుడు దిగుడుల ప్రయాణంలో పురోగమిస్తున్న ఉద్యమం ఈ దేశానికే ప్రత్యేకమైన అనేక సాంఘిక, రాజకీయార్థిక సవాళ్లను ఎదుర్కొంటూ వర్గపోరాట పంథాను మరింత పరిణితి చెందిన ఆచరణాత్మక రూపంగా తీర్చిదిద్దుకుంటున్నది. ఎన్నికలు ఒక ఫార్సుగా, వ్యవస్థలు పరమ దుర్మార్గంగా, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోని డొల్లతనమంతా రోజురోజుకూ విస్పష్టంగా బట్టబయలవుతున్న దశలో ప్రత్యామ్నాయ రాజకీయాల చర్చకు ప్రాధాన్యత ఎక్కువయింది. వివిధ సమూహాల ప్రజాస్వామిక ఆకాంక్షల వేదికలు వచ్చాయి. అవినీతి నిర్మూలన పేరుతో బూర్జువా ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీలూ పుట్టుకొచ్చాయి. వ్యవస్థకే ప్రత్యామ్నాయంగా ముందుకొచ్చిన మావోయిస్టు ఉద్యమం గురించి చర్చించడానికి ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ఏర్పడింది. తన మొదటి సదస్సును సెప్టెంబరు 21 హైదరాబాదులో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. మావోయిస్టు పార్టీ ఆవిర్భావ ప్రకటన వెలువడిన హైదరాబాదు నగరంలో పదేళ్ళ ఐక్యవిప్లవోద్యమ సదస్సుకు, ర్యాలీ, బహిరంగ సభలకు సంకల్పించింది. ఈ సభను రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి భగ్నం చేసిన తీరు, రెండు రాష్ట్రాల్లో వందల సంఖ్యలో అరెస్టులు ఆ తర్వాతి పరిణామాలు, మొత్తంగా దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు కూడా కలిపి చూస్తే పదేళ్ళ ఐక్య విప్లవోద్యమ సందర్భానికల్లా నెలకొని ఉన్న పరిస్థితులు మరో కీలక సన్నివేశాన్ని మన ముందుంచుతాయి.

మొట్టమొదట తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించిన బూర్జువా రాజకీయ శక్తులపైన తెలంగాణ మేధావులకు ఎవరికైనా భ్రమలు ఉంటే మబ్బులు తొలగిస్తూ సెప్టెంబరు 21 నిర్బంధ సందర్భం వచ్చింది. నిజానికి అంతకు ముందే తెలంగాణ ప్రభుత్వ నియంతృత్వ స్వభావాన్ని వెల్లడి చేసిన ఉదాహరణలు లేకపోలేదు. కాని రాజకీయ విశ్వాసాల పట్ల, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పట్ల ఉద్యమ పార్టీ అని చెప్పుకునే తెలంగాణ రాష్ట్ర సమితి వైఖరిని తేటతెల్లం చేసిన సందర్భమిది. తెలంగాణ మేధావివర్గం తాము ఏ పక్షం తీసుకోవాలో గ్రహించపోతే తెలంగాణ పాలకవర్గాలు మునుపటి పాలకవర్గాల కన్నా శక్తివంతమయి ప్రజాస్వామిక హక్కుల్ని మరెంతగానో హరించి వేయడానికి తెగబడే ప్రమాదం ఉంది. అసమ్మతి లేని అధికారం నిరంకుశత్వానికి దారి తీస్తుంది. కనుక బుద్ధిజీవులు నిరంతర ప్రతిపక్ష పాత్ర నుండి ఏమారకుండా ఉండవలసిన అవసరాన్ని ఇది గుర్తు చేస్తుంది. ఇదంతా ఎందుకు చెప్పవలసి వస్తున్నదంటే తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సందర్భంగా బుద్ధిజీవుల మద్దతు కూడగట్టుకున్న తెలంగాణ బూర్జువా శక్తులు వారిని ఎన్నికల్లోనూ తమవెంట ఉంచుకోగలిగాయి. రాజ్య స్వభావం పట్ల అప్రమత్తంగా ఉండే మేధావుల్ని సైతం రాజ్యం తనలోకి ఇముడ్చుకో గలగడం తెలంగాణలో ప్రాంతేతర పాలకులు పోయి తెలంగాణ పాలకులు వచ్చాక సాధ్యమయింది. ఇది పూర్తియిందా లేదా అనేది ఇప్పుడా మేధావులు మాట్లాడతారా లేదా అన్నదానిబట్టి తెలియవలసి ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం గురించి కొత్తగా చెప్పాల్సింది ఏమీ లేదు. ఆయనకు రాజకీయ భిన్నాభిప్రాయాలు కాదు కదా, పౌరహక్కులపైనా గౌరవం లేదు. చంద్రశేఖరరావుతో కలిసి హైదరాబాదు సభపై నిర్బంధాన్ని ప్రయోగించడంతో ఆగకుండా తిరుపతిలో ఆపరేషన్ గ్రీన్‌హంట్ వ్యతిరేక కమిటి సభను అదే రీతిలో అడ్డుకున్నాడు. హాలు అద్దెకిచ్చిన వాళ్ళను భయపెట్టి, తాళాలు వేయించి చుట్టూ పోలీసులు మోహరించారు. పౌరహక్కుల సంఘాలు మారికొన్ని ప్రజాసంఘాలు కలిసి ఏర్పడిన గ్రీన్‌హంట్ వ్యతిరేక కమిటిలో భిన్న రాజకీయ విశ్వాసాలున్నవారు ఉన్నారని, అది మావోయిస్టు రాజకీయాలను మాట్లాడ్డానికి ఉద్దేశించిన మీటింగ్ కాదని కూడా నిర్వాహకులు స్థానిక పోలీసు అధికారులకు చెప్పారు. ఆ కమిటీలో దళిత, ఆదివాసీ, బిసి సంఘాలు ఉన్నప్పటికీ అందులో ప్రత్యామ్నాయ రాజకీయ వేదికకు చెందిన వాళ్ళు, విరసం వాళ్ళు ఉన్నారు కనుక అదీ, ఇదీ ఒకటే అని కూడా ఒక పౌరహక్కుల సంఘం నాయకుడిని నిర్బంధించిన పోలీసు అధికారి అన్నారట. నిజానికి ఒక రాజకీయాలు మాట్లాడనివ్వరని వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏమీ మాట్లాడనివ్వరని చరిత్రలో అనేక సార్లు రుజువయింది. అవి ఏ రాజకీయాలైనా గానీ సరే మాట్లాడనివ్వకపోవడమే ఫాసిజం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ఫాసిస్టు విధానాలలో ఆరి తేరి ఉన్నారు.

సంస్మరణ

ఖాన్‌సాబ్ జీవనశైలి

- వివి

1994 డిసెంబర్ నుంచి 95 మార్చ్ వరకు జైలు ఖైదీలు నక్సలైట్ ఖైదీల రాజకీయ డిమాండ్ల కోసం, లైఫర్స్ విడుదల కోసం కలిసి పోరాటం చేసినప్పుడు బయట ప్రజాసంఘాలు, కవులు, కళాకారుల నుంచి విస్తృతమైన మద్దతు వచ్చింది. తెలుగుతల్లి విగ్రహం ఉన్న చోట పాత సెక్రెటేరియట్ గేట్ కనిపించే మూల మీద సంఘీభావ శిబిరం ఉండేది. అది ఒక రకంగా ఆ నాలుగు నెలలు ప్రజాస్వామిక కార్యకలాపాలకు, సాంస్కృతిక కార్యకలాపాలకు కూడలిగా ఉండేది. ఆ శిబిరంలో తరచు ఎం.టి. ఖాన్‌గారు వచ్చి కూర్చునేవారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా తెలుగుదేశం ప్రభుత్వం రెండోసారి ఏర్పడిన సందర్భం. అప్పుడు హోంమంత్రిగా ఉన్న ఇంద్రారెడ్డి ధర్మవంత్ కాలేజిలో ఎం.టి. ఖాన్ విద్యార్థి మాత్రమే కాదు ఎమర్జెన్సీలో చంచల్‌గూడ జైల్లో పిడిఎస్‌యు విద్యార్థిగా ఆయన సహ డిటెన్యూ కూడ. అందుకే ఖైదీల డిమాండులన్నీ ప్రభుత్వం ఒప్పుకొని హోంమంత్రి సమక్షంలో ఇరుపక్షాలు సంతకం చేసినప్పుడు కె.జి. కన్నబిరాన్‌తో పాటు ఆయన ఉండాలని మంత్రి కోరాడు. చంచల్‌గూడ, ముషీరాబాద్ జైళ్లలో పోరాటానికి నాయకత్వం వహించిన శాఖమూరి అప్పారావు, పటేల్ సుధాకర్‌రెడ్డి కూడా కోరారు. ఆయన పురానాపూల్ ఇంటి దగ్గరే భోజనం చేసి శిబిరానికి వచ్చేవాడు. రాత్రి ఏ తొమ్మిది గంటల ప్రాంతంలోనో వెళ్లేవాడు. అక్కడ ఎక్కువ మంది యువకులు, విద్యార్థులతో వారిలో ఒకడుగా హాస్యోక్తులు మాట్లాడుతూ లైవ్లీ వాతావరణం ఉండేలా చూసేవాడు. దినమంతా శిబిరం ఉండేది. తినడానికి పండ్లో, తినుబండారాలో ఎవరో ఒకరు తెస్తుండేవాళ్లు. కనుక ట్యాంకుబండు మీద అడుక్కునే పిల్లలు కూడ అక్కడ చేరుతుండేవాళ్లు. ముక్కు చీమిడి కారుతూ, చినిగిన మురికి బట్టలతో వచ్చే ఆ పిల్లలను దగ్గర తీసుకుని ముక్కు చీమిడి తుడిచి, శుభ్రంగా మొహం కడిగి, తన లాల్చీ కొనతోనే తుడిచి తనకు టిఫిన్ డబ్బాలో తెచ్చిన పూరీలను వాళ్లను తన ఒళ్లో కూచోపెట్టుకుని తినిపించేవాడని నా సహచరి హేమలత చెప్పింది. ఇంద్రారెడ్డి మొదలు బాలభిక్షువు వరకు ఆయన ప్రవర్తనలో ఏదీ తెచ్చిపెట్టుకునేదిగా ఉండేది కాదు. ఏదీ ఇతరులు చూడడం కోసం చేసేది కాదు. ఆయన జీవనశైలి అది. పైజామా, జుబ్బా, చంకకు సంచీ. ఎక్కువగా బస్సు ప్రయాణం. ఒకసారి ఇద్దరం కలిసి కాచీగూడ నుంచి రైలు ప్రయాణం చేసాం. స్టేషన్లో కలిసాం. మెళ్లో మూడురంగు దారాలు వేళ్లాడుతున్నాయి. 'ఈ తాయెత్తులు ఎందుకో తెలుసా?' అని బయటికి తీసాడు. అవి ఒకటి బస్సు పాసు, ఒకటి న్యూస్‌టైంలో పనిచేస్తున్న జర్నలిస్టు కార్డు. మరొకటి కళ్లజోడుకు కట్టుకున్నది.

అట్లని ఆయన అధికారం ముందు స్వీయాభిమానాన్ని ప్రదర్శించే విషయంలో ఎప్పుడూ రాజీపడలేదు. జైల్లో సోమవారాలు, మొత్తం అధికారులందరూ కడక్ ఇస్త్రీ యూనిఫారాల్లో వచ్చేవాళ్లు. ఆ రోజు ఖాన్‌సాబ్ కూడ ఖడక్ జుబ్బా పైజామా వేసుకొని, దాని మీది నుంచి వేస్ట్‌కోట్ వేసుకొని, నోట్లో హుక్కా పెట్టుకొని అది వెలిగిస్తూ హలో అంటూ జైల్ సూపరింటెండెంట్ ఎదురుగా వెళ్లేవాడు. వాస్తవానికి యూనిఫాంలో ఉన్నప్పుడే ఆయన సూపరింటెండెంట్ కాని, కురుడూర్‌కర్‌గా ఆయన మరాఠీ నాటకరంగం ద్వారా ఎం.టి. ఖాన్‌కు చిరపరిచితుడైన స్నేహితుడే. విజయ టెండూల్కర్ నాటకాలు హైదరాబాదులో ప్రదర్శించే రోజుల్లో వాళ్లిద్దరికీ స్నేహమైంది. జైల్లో మమ్మల్ని కలవడానికి ఆయన విజయ టెండూల్కర్‌ను తీసుకవచ్చాడు కూడ. భూమయ్య - కిష్టాగౌడ్‌ల ఉరిశిక్ష 74 నవంబర్‌లో మొదటిసారి ఆగిపోయినప్పుడు ఆ వార్త చెప్పడానికి అర్ధరాత్రి వచ్చి ఆయన

కాబట్టి ఇప్పుడు ఫాసిజం మన ముందున్న యదార్థం. సామ్రాజ్యవాదంతో జతకట్టిన మతోన్మాద ఫాసిజం ప్రతిపక్షం కూడా లేని శాసనసభలో ఇప్పుడు అందలమెక్కి కూర్చుంది. ఒక వైపు మీడియా అధినాయకుడిని భక్తి పారవశ్యంతో పొగుడుతూ ఉంటే మరో వైపు తెలుగు రాష్ట్రాల్లో వాక్ సభా స్వాతంత్ర్యాలతో పాటు మైనారిటీ మత విశ్వాసాలు ప్రాణసంకటంలో పడ్డాయి. బక్రీద్ సందర్భంగా హైదరాబాదు మొదలుకొని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో గోసంరక్షణ పేరుతో సంఘపరివార శక్తుల వీరంగం, వారికి పోలీసుల మద్దతు పౌరహక్కుల అణచివేతతో కలిపే చూడాలి.

సరిగ్గా తిరుపతి సభను భగ్నం చేస్తున్న సమయంలో నరేంద్ర మోడీ అమెరికా ప్రసంగం గురించి మీడియా పారవశ్యాన్ని ఎట్లా చూశామో, అదే మీడియా ఆ సభాప్రాంగణం ముందు మోడీకి వ్యతిరేకంగా కొన్ని వందల మంది నిరసన తెలిపిన వాస్తవాన్ని తొక్కిపెట్టడం కూడా గమనించాలి. దేశవ్యాప్తంగా మత ఉద్రిక్తతలు పెరిగిపోతూ ఉండటం, ఒకప్పుడు గుజరాత్ సంఘటనల్ని ప్రపంచం ముందు పెట్టిన మీడియా సంస్థలు కూడా అంతే సంచలనాత్మకంగా మోడీ ఘనకీర్తిని ప్రచారం చేయడం దేశం ఏ కల్లోల కాలంలోకి పయనిస్తున్నదో సూచిస్తోంది. ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు మోహన్ భగవత్ నాగపూర్‌లో చేసిన ప్రసంగాన్ని దూరదర్శన్ గంట పాటు ప్రసారం చేసిన వివాదం కూడా నడిచింది. ఇదీ యాదృచ్ఛికం కాదు. ప్రసారభారతి ప్రభుత్వ సంస్థ అని దానిని మతతత్వ ప్రచారానికి దుర్వినియోగపరచడం మొదలుపెడితే అది అధికార పార్టీలలో ప్రమాదకరమైన సంప్రదాయానికి బీజం వేస్తుందన్న విమర్శలు బలహీనంగా వినపడ్డాయి. అది ఒక వార్తగానే మేము ప్రసారం చేశామని దూరదర్శన్ వాళ్ళు వివరణ ఇస్తే, మోహన్ భగవత్ చెప్పిన వాటిలో సమాజానికి ఉపయోగపడే అంశాలు చాలా ఉన్నాయని దాచుకోకుండానే చెప్పింది బిజేపి. అందువల్ల పదేళ్ళ ఐక్య విప్లవోద్యమ సందర్భం విప్లవ శక్తుల ఐక్యత గురించే కాదు, దేశంలో లౌకిక, ప్రజాస్వామిక శక్తుల ఐక్య ఉద్యమం ఎంత అవసరమో, ఎంత అవశ్యమో కూడా చెప్తున్నది.

ఖాన్‌సాబ్‌ను మా బ్యారక్ కటకటాల నుంచే కౌగలించుకొని బయట ఉంటే సెలబ్రేట్ చేసుకునేవాళ్లం అన్నాడు. అయితే మరి ఖాన్‌సాబ్‌కు ఈ దర్ప ప్రదర్శన ఎందుకు? జైలర్ మీద కోపం. ఆయన ఎ.జి. గార్డినర్ వ్యాసంలోని 'రీసెంట్‌ఫుల్ ఎంప్లాయి' వంటివాడు. భూమయ్య – కిష్టాగౌడ్‌ల ఉరిశిక్ష ఆగిపోతే అందరికందరం ఆనందిస్తుంటే ఆయన అంతక్రితం ఉదయం నుంచి ఉరిదీయడానికి చేస్తున్న హోంవర్క్ అంతా వృథా అయిందని మా ముందే బాధపడిపోయాడు. రోజూ సాయంకాలాలు లాకప్ అయ్యే విషయంలో మాతో గొడవపడేవాడు. మేం జైలు మ్యాన్యువల్ చూపమనేవాళ్లం. యూనిఫాంలో ఉన్న నేను ఏది చెబితే అది రూల్ అనేవాడు ఆయన. అదీ ఖాన్‌సాబ్‌కు ఉన్న పేచీ. చర్చల సమయంలో అరవిందరావుతో కూడ అటువంటి నిష్ఠూరమైన ధోరణిలోనే ఆయన వ్యవహరించి రాజకీయ చర్చలలో మీరు తలదూర్చవద్దని చెప్పాడు.

ఖాన్‌సాబ్ నా కన్న నిజానికి ఐదారేళ్లే పెద్ద. మగ్దూం మొహియుద్దీన్ కన్న కనీసం ఇరవై ఐదేళ్లు చిన్నవాడు అయి ఉంటాడు. 1946లోనే మగ్దూం సిటి కాలేజ్ లెక్చరర్ ఉద్యోగం వదిలేశాడు. అప్పటికి ఖాన్‌సాబ్‌కు పదమూడేళ్లకు మించి ఉండకపోవచ్చు. సిటీ కాలేజ్ హైస్కూల్ విద్యార్థిగా బహుశా ఆయన మగ్దూం ప్రభావంలోకి వచ్చి ఉంటాడు. కాని ఆ కమ్యూనిస్టు టీచర్ ప్రభావంలో కమ్యూనిస్టుగా మారిన ఖాన్‌సాబ్ మా తరానికంతా మగ్దూం సమకాలీనుడుగానో, మా కోసం మిగిలిన మగ్దూం బహుముఖీన వ్యక్తిత్వంగానో కనిపించేవాడు. 1947 సెప్టెంబర్ 11న సాయుధ పోరాటానికి రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డిలతోపాటు మగ్దూం అజ్ఞాత జీవితానికి వెళ్లిన తర్వాత ఎం.టి. ఖాన్ ఆయనకు కొరియర్‌గా కూడ పనిచేసాడు. లక్ష్మీదాస్‌తో పార్టీ, రాంచందర్‌తో ఫ్యాక్టరీల్లో కార్మికులను కూడగట్టి ట్రేడ్ యూనియన్‌లు నడపడం కూడ చేసాడు. శ్యాంసుందర్ వంటి దళిత నాయకులతో కూడ కలిసి పనిచేసాడు. ఖాన్‌సాబ్ కవిత్వం మీద శ్రద్ధ పెట్టి కొనసాగించే ప్రయత్నం చేయలేదు గాని 1973 నవంబర్‌లో మొదటిసారి మీసా కింద అరెస్టు అయినప్పుడు ఆయన జంగల్ సంథాల్ మీద ఇంగ్లిష్‌లో రాసిన కవిత మగ్దూం కవిత్వంలోని ఆగ్రహావేశాలకు, భావోద్వేగానికి ఏమీ తీసిపోదు. మొన్న ఆగస్ట్ 20న ఆయన అంత్యక్రియల దగ్గర ఆయన మృతదేహాన్ని మట్టిలోకి విడుస్తున్నప్పుడు 'వెయ్యి టిఎన్‌టిల శక్తితో బలంగా హఠాత్తుగా పేలే', 'తూర్పు పడవల మూలల్లోంచి మాట్లాడుతున్న బాణంగా, ఎర్రగా ఉద్రేకంతో ఊగుతూ, మంటలు ఎగజిమ్ముతూ' వచ్చే జంగల్ సంథాల్ కవితా చరణాలు గుర్తు చేసుకున్నాం. వెయ్యి టిఎన్‌టిల శక్తి అని పలవరించాం. మళ్లీ సికింద్రాబాద్ కుట్రకేసులో ముషీరాబాద్ జైల్లో ఉన్నప్పుడు చైనా శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవ ఉపాధ్యాయుడుగా మావోను గుర్తు చేసుకుంటూ ఒక దీర్ఘకవిత సృజన కోసం రాశాడు. అప్పుడు జైల్లోకి వస్తున్న అన్ని చైనా పత్రికలలో మావో సె టూంగ్‌కు ఇన్ని విశేషణాలు ఎందుకు వాడుతారు, ఆయన 'నన్ను మీరు టీచర్‌గా గుర్తిస్తే చాలు, ఎందుకంటే నేను ఎల్లవేళలా విద్యార్థిని కూడా' అని చెప్పేవాడు అని అనేవాడు.

74 మే నుంచి 75 జనవరి దాకా మేం జైల్లో కలిసి ఉన్నప్పుడు ఆయన నాకు సహఖైదీ మాత్రమే కాదు, ఒక టీచర్. చెరబండరాజుకు ఎప్పుడు తగువు పెట్టుకునే ఒక జిగ్రీ దోస్త్. అప్పటికే ఆయన తలపండిన విప్లవ మేధావి. 73 అక్టోబర్‌లో మీసా కింద ఖాన్‌సాబ్, చెరబండరాజుతో పాటు నన్ను కూడ అరెస్టు చేసారు కాని, అప్పుడు వాళ్లు ముషీరాబాద్ (సికింద్రాబాద్) జైల్లో ఉన్నారు. నేను వరంగల్ జైల్లో ఉన్నాను. వరంగల్ సాహిత్య పాఠశాల వేసిన ప్రభావమే మా అరెస్టుకు కారణం. నవంబర్‌లో హైకోర్టు మమ్ములను విడుదల చేస్తూ ఏదైనా తక్షణ ప్రమాద చర్యకు దారితీస్తే తప్ప, భావాల కొరకు ఎవ్వరినీ అరెస్టు చేయకూడదని హైకోర్టు తీర్పు చెప్పింది. మరో ఆరు నెలల్లో మీ మీద ఒక కుట్రకేసు రాబోతున్నదని మా లాయర్ చెప్పాడు. అన్నట్లే 74 మే నెలలో సికింద్రాబాద్ కుట్రకేసు వచ్చింది. నన్ను వరంగల్ నుంచి తీసుకువచ్చి వీళ్లతో కలిపి ముషీరాబాద్ జైల్లో పెట్టారు. కావలి నుంచి కెవిఆర్, తిరుపతి నుంచి మధుసూదన్‌రావులను కూడా తెచ్చారు. హైదరాబాద్ నుంచే 'పిలుపు' సంపాదకుడు రంగనాథంను కూడ ఈ కేసులో పెట్టారు. నాకు 'సబ్ లీక్ హై' కవితలో ముషీరాబాద్ జైలు గోడల మీద 'ముళ్లతీగల్లో చిక్కుకున్న చంద్రుడి' గురించి చెప్పిన కవి మిత్రుడు ఖాన్‌సాబే. మనమే కాదు, చంద్రుడు కూడ జైల్లో ఉన్నాడు అని ఆయన ఉత్సాహం కలిగించే ప్రయత్నం చేసేవాడు.

ఎమర్జెన్సీ కాలమంతా ఆయన జైళ్లలోనే ఉన్నాడు కాని, నేను వరంగల్‌లో ఉన్నప్పుడు ఆయన చంచల్‌గూడలో, నేను చంచల్‌గూడలో ఉన్నప్పుడు ఆయన ముషీరాబాద్ జైల్లో ఉన్నాడు. ఎమర్జెన్సీలో మన రాష్ట్రంలో అరెస్టయిన మొట్టమొదటి డిటెన్యూ ఆయనే. హైకోర్టు విడుదల చేస్తే మళ్లీ అరెస్టు చేశారు. చంచల్‌గూడ నుంచి విడుదలై, మళ్లీ అరెస్టై ఎమర్జెన్సీ చివరి దాకా జైల్లోనే ఉన్నాడు. సికింద్రాబాద్ కుట్రకేసులో 75 జనవరిలో బెయిల్ వచ్చి ఆయన, చెరబండరాజు అనంతపురం విరసం మహాసభలకు వెళ్లగలిగారు కాని, ఆ కేసు మాత్రం 89 ఫిబ్రవరిలో కొట్టివేశారు. అట్లా పదిహేను సంవత్సరాల సుదీర్ఘకాలం మేం సహఖైదీలం. 86-89 మధ్యకాలంలో నేను రాంనగర్ కుట్రకేసులో టాడా కింద ముద్దాయిగా ఉన్న రోజుల్లో నన్ను సికింద్రాబాద్ కుట్రకేసు విచారణకు కూడ తీసుకువచ్చినప్పుడు హైదరాబాద్‌లో ఉన్నాడు గనుక రెగ్యులర్‌గా కోర్టు వాయిదాలకు వచ్చేవాడు ఎం.టి. ఖాన్. అప్పుడు కోర్టు పాత సాలార్‌జంగ్ మ్యూజియం ఆవరణలో ఉండేది. ఆయన పురానాపూల్ నుంచి నడక దూరమే. మా కేసు వాదిస్తున్న కన్నబిరాన్‌కి 87 నవంబర్ 9 అనుకుంటాను 60వ పుట్టినరోజు వచ్చింది. ఆ రోజు ఖాన్‌సాబ్ ఒక ఎర్రగులాబీ పూవు తెచ్చి కోర్టులో ఆయనకిచ్చాడు. కన్నబిరాన్ కుటుంబానికి ఖాన్‌సాబ్ ఆత్మీయ మిత్రుడు.

దిగంబర కవులకు, విరసం ఆవిర్భావానికి మధ్యన ఒక కర్టెన్ రైజర్ లాంటి అంటార్కిటికా ఇంగ్లిష్ సాహిత్య పత్రిక ప్రసిద్ధ చిత్రకారుడు లక్ష్మాగౌడ్ ముఖచిత్రంతో రెండు మూడు సంచికలు వచ్చాయి. దీన్ని నిర్వహించిన వాళ్లు కవి వేణుగోపాల్, ఎం.టి. ఖాన్, తేజ్ రాజేంద్రసింగ్. ఈ పోస్టర్ కవితా సంచికలు సంచలనాలు సృష్టించాయి. విరసం ఏర్పడిన తరువాత రెండో రోజు సభల్లోనే 71లో ఢిల్లీలో జరిగే ఆఫ్రో ఆసియా రచయితల సభల్లో పాల్గొని, ఆ సభలు అమెరికన్ కోకాకోలా వాదాన్ని, రష్యా ఓడ్కా వాదాన్ని ప్రచారం చేయడానికి ఏర్పడినవని బట్టబయలు చేసి, నక్సల్బరీ, శ్రీకాకుళ రాజకీయాలు ప్రకటించి రావాలని నిర్ణయం తీసుకున్నప్పుడు వెళ్లిన వాళ్లు శ్రీశ్రీ, జ్వాలాముఖి, ఎం.టి. ఖాన్. అక్కడే శ్రీశ్రీ, హన్సరాజ్ రహబర్ కన్వీనర్లుగా అఖిల భారత విరసం ఏర్పడింది. కాని, అప్పటికింకా అఖిల భారత స్థాయిలో ఒక విప్లవ సాహిత్య సంస్థ ఏర్పడే భౌతిక పరిస్థితి లేదనుకుంటాను.

శ్రీకాకుళ ఉద్యమం సెట్‌బ్యాక్‌కు గురవుతూ ఇంకా సత్యం, కైలాసం

బతికుండగా తెలంగాణలో శ్రీకాకుళ పోరాట విస్తరణలో భాగంగా పార్టీ నిర్మాణం చేయతలబెట్టిన కొండపల్లి సీతారామయ్యకు హైదరాబాద్‌లో ముగ్గురు వ్యక్తులు కలిసి వచ్చారు. వాళ్లు పార్టీ నిర్మాణంలో ఆయన చెప్పిన పనులు ఆచరించే జంగయ్య మాస్టారు, పార్టీ ప్రజాసంఘాల పనులు చేయగలగడమే కాక, సలహాలు ఇవ్వగల ఎం.టి. ఖాన్, టంగుటూరులోని తాలీం ఖానా నుంచి వచ్చి యవ్వనావేశంలో ఉన్న యువ న్యాయవాది పత్తిపాటి వెంకటేశ్వర్లు. 71 దాకా జ్వాలాముఖి కూడా ఉన్నాడు కాని, జైలుకు వెళ్లి వచ్చాక కె.ఎస్. రాజకీయ అవగాహనకు దూరమయ్యాడు. అందుకే కె.ఎస్. ఎం.టి. ఖాన్ ప్రింటర్, పబ్లిషర్‌గా, రంగానాథం సంపాదకుడుగా పీడిత ప్రజల పక్షపత్రిక 'పిలుపు'ను 72 డిసెంబర్‌లో ప్రారంభించాడు. సహజంగానే శత్రువుకు అది కన్నెర్ర అయింది. 73 అక్టోబర్‌లో ఎం.టి. ఖాన్ అరెస్టుకైనా, 74 సికింద్రాబాద్ కుట్రకేసులో ఆయనను ముద్దాయిగా చూపడానికైనా ప్రధానంగా 'పిలుపు' సంపాదకీయాలు, 'పిలుపు'లోని రచనలే ఆరోపణలయ్యాయి.

70 జూలై 4న విరసం ఏర్పడి, అక్టోబర్‌లో మహాసభలు జరిగి మూడు నెలలు గడవకముందే 'మార్చ్', 'ఝా' కవితా సంకలనాలు నిషేధింపబడ్డాయి. హైదరాబాద్‌లో రచయితల ఇళ్లపై దాడులు చేశారు. వరంగల్‌లో 'మార్చ్' సంపాదకుడు పెండ్యాల కిషన్‌రావును అరెస్టు చేసి రాజద్రోహం నేరం పెట్టారు. 71 ఆగస్టులో పిడి చట్టం కింద జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, చెరబండరాజులను అరెస్టు చేశారు. 71 సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో విరసం రెండో మహాసభలు తలపెట్టినా ప్రధాన కార్యదర్శి కెవిఆర్, ఆయన చేదోడుగా ఉన్న ఐ.వి. సాంబశివరావు వచ్చి హైదరాబాద్‌లో కొన్ని రోజులు ఉన్నప్పటికీ ఆ నిషేధ, నిర్బంధ కాలంలో ఆ మహాసభల భారమంతా మోసినవాళ్లకు నాయకుడు ఎం.టి. ఖాన్.

విరసం ఏర్పడగానే మేం నిబద్ధులమే కాని, నిమగ్నులం కాదు, మేం తెరవెనుక ఉండేవాళ్లమే కాని, రంగం మీదికి వచ్చేవాళ్లం కాదు, మాది యుక్తి, విప్లవకారులది శక్తి వంటి సిద్ధాంతాలు, 'సాహిత్య నక్సలైట్లు'గా అభివృద్ధి నిరోధక రచయితలు చేస్తున్న ఆరోపణలకు జవాబుగా విరసం నాయకత్వం చేసింది. ఆరంభంలోనే తలెత్తిన ఈ ధోరణులను కొంచెం తీవ్రంగానే ఖండిస్తూ (తీవ్రం ఎందుకంటే 'మార్క్సిస్ట్ వ్యతిరేక ధోరణులను ప్రతిఘటించండి' అని కొండపల్లి సీతారామయ్య ఈ పుస్తకం రాశాడు. అట్లా కాకుండా మార్క్సిస్టేతర భావాలు అని రాసి ఉండాల్సింది అని ఆయన ఆ తరువాత తానే అభిప్రాయపడ్డాడు) వెలువడిన పుస్తకానికి విరసం సభ్యులమై ఉండి ఎం.టి. ఖాన్, నేను ప్రచురణకర్తలుగా బాధ్యత వహించాం. అందుకు విరసం సంస్థ క్రమశిక్షణను ఉల్లంఘించామని కూడ అంగీకరించాం. అయితే ఆ రోజుల్లో కేంద్రాన్ని బద్దలుకొట్టే సాంస్కృతిక విప్లవ కార్యక్రమంగా మేం అది భావించాం. ఖాన్ సాబ్ వినమ్రత, తొణకనితనం, నిండు కుండ లాంటి స్వభావం మృదుభాషిత్వం వల్ల ఎప్పుడూ బయటపడే వాడు కాదు గాని, అక్కడి నుంచి కర్నూలు 74, అనంతపురం 75 దాక విప్లవంలోని వివిధ ధోరణుల్లో చారు మజుందార్ రాజకీయాల ప్రాతినిధ్య బాధ్యత కె.ఎస్. ఆయనకే అప్పగించేవాడు. అదే సమయంలో వివిధ ఎం.ఎల్. గ్రూపుల నాయకత్వాలకు కూడ ఎం.టి. ఖాన్ అంతే గౌరవనీయుడైన స్నేహితుడుగా కూడ వాళ్ల విశ్వాసాన్ని చూరగొన్నాడు. పార్వతీపురం కుట్రకేసులో ముద్దాయిలుగా ఉన్న కాను సన్యాల్, నాగభూషణ్ పట్నాయక్, ఎస్.ఎ. రవూఫ్, సౌరెన్‌బోస్, కె.జి. సత్యమూర్తి మొదలైన వారితో చర్చలు జరిపి వాళ్లు ఏమనుకుంటున్నారో తెలుసుకుని చెప్పే బాధ్యత కె.ఎస్., కొల్లా వెంకయ్యలు ఆయనకే అప్పగించారు.

ఆయన మీద ఈ గౌరవం, విశ్వాసం 2004లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చలకు అడవి నుంచి విప్లవ నాయకులను తీసుకరావడానికి వెళ్లిన ప్రతినిధుల వెంట పెద్దదిక్కుగా ఆయన రావాలని కోరినదాకా కొనసాగింది. అప్పటికి ఆయన కొంచెం అనారోగ్యంగా ఉన్నాడు. నేను చనిపోతే నా మీద ఎర్రజెండా కప్పుతారా, మధ్యకాలంలో నేను ఎపిసిఎల్‌సి అధ్యక్షుణ్ని అయ్యాను కాబట్టి అందుకు ఏమైనా పరిమితులు ఉంటాయా అని ఆయన నాయకత్వాన్ని అడిగేవాడు. మీరెక్కడున్నా మాకు మీరు ఒక ఆదర్శప్రాయమైన కమిటెడ్ కమ్యూనిస్టు మేధావులే. విప్లవోద్యమం తప్పకుండా మీకు ఎర్రజెండా కప్పే వీడ్కోలు చెబుతుంది. అయితే మీరప్పుడే ఇటువంటి ఆఖరి కోర్కెలు వెలిబుచ్చవద్దు. మీ సేవలు ఇంకా చాలా కాలం అవసరం అన్నది పార్టీ.

ఆయన ఎక్కువ అనారోగ్యంగా కనిపించిన సందర్భం 2013లో ఎపిసిఎల్‌సి మహాసభలు ప్రారంభించడానికి వచ్చినప్పుడు. ఆయన పౌరహక్కుల ఉద్యమ నేతగా దశాబ్దాలు కృషి చేశాడు. అందరి మెప్పు పొందాడు. శ్రీశ్రీ, కన్నబిరాన్‌ల తరువాత ఆ సంస్థకు అధ్యక్షుడయ్యాడు. ఆయనను ఆ సభలను ప్రారంభించడానికి పిలవడం తనను తాను గౌరవించుకోవడం అనుకున్నది. ఎపిసిఎల్‌సి అమరుల స్మృతిలో ఎపిసిఎల్‌సి జెండా ఎగరేసినప్పుడు ఆ సభలో జాపా లక్ష్మారెడ్డి గారి సహచరి కూడ ఉంది. ఆ అమరుల జ్ఞాపకాలతో ఉద్వేగం పొందిన ఖాన్‌సాబ్ సభలో 'నన్నీ సభలు ప్రారంభించడానికి పిలిచినందుకు గర్వంగా ఉంది. థాంక్స్' అని మాత్రం చెప్పి కూర్చున్నాడు.

2014 జనవరిలో వరంగల్‌లో జరిగిన చరిత్రాత్మకమైన విరసం మహాసభలను ప్రారంభించడానికి ఎం.టి. ఖాన్‌ను పిలవడం మమ్మలను మేం గౌరవించుకోవడంగా మేం భావించాం. ఆ సభ ప్రారంభ ఉపన్యాసంలో మాత్రం ఆయన వరంగల్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని, కాళోజీతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని 'ప్రజా ప్రత్యామ్నాయంలో కాళోజీ' అనే నా పుస్తకాన్ని ఆవిష్కరించి ముగించాడు. కిందికి దిగి వచ్చిన తరువాత 'నేను విరసం సభ్యుడినే. కమ్యూనిస్టుని. నేను చనిపోతే నాకు ఎర్రజెండా కప్పుతారు కదా' అని చెప్పి వీడ్కోలు తీసుకున్నాడు.

1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కూడ ఎం.టి. ఖాన్ పాల్గొన్నాడు. 1972లోనూ పాల్గొన్నాడు. ఆ రోజుల గురించి ఎం.టి. ఖాన్ ఎప్పుడూ ఒక విషయం చెబుతూ ఉండేవాడు. ఉద్యమంలోని మిలిటెన్సీ, త్యాగనిరతి గురించి చెబుతూ 'ఈ ఉద్యమాన్ని అణచివేసి, నెత్తురుటేరులు పారించడానికి హైదరాబాద్ నగరంలో బ్రహ్మానందరెడ్డి ఎం.ఐ.ఎం. అధ్యక్షుడు సల్లావుద్దిన్ ఓవైసీ సహాయం తీసుకున్నాడు. ఇందుకు కృతజ్ఞతగా మీకేం చేయాలని అడిగినప్పుడు ఆయన పాత నగరం కోసం మంచినీళ్లు, విద్యుత్తు, మంచి రోడ్లు, స్కూళ్లు, వైద్యశాలలు అడగలేదు. మసీదులలో మైకులు పెట్టించాలె అని మాత్రమే అడిగాడు' అని ఎప్పుడూ కోపంగా చెప్పేవాడు.

మతకలహాల పేరుతో హైదరాబాద్ పాతనగరంలో రాజకీయ మారణకాండ జరిగినప్పుడల్లా అక్కడ ఒక ఒంటరి దీపస్తంభం వలె నిఖార్సైన సెక్యులర్ ప్రజాస్వామ్యవాదిగా, అందరికీ తెలిసిన కామ్రేడ్‌గా ఆఖరి శ్వాసదాకా నిలిచినవాడు ఎం.టి. ఖాన్. ఆయన ఇంటి పక్కనే

పెద్దన్న ఖాన్ సాబ్

- కృష్ణాబాయి

తెల్లటి లాల్చీ పైజామా, తెల్లతెల్లగా మెరుస్తూన్న వంకీల జుట్టు, చంకన సంచితో చిరునవ్వుతూ అందర్నీ పలకరించే ఖాన్ సాబ్ మరిలేరన్న మాట దిగ్భ్రాంతికి గురిచేసింది. నాకన్నా మూడేళ్ళు చిన్నవాడైనా ఆయన్ని విరసంలో పెద్దన్నగానే భావించేదాన్ని.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో ప్రభావితుడైన కామ్రేడ్ ఎంటి ఖాన్ విద్యార్థి దశలోనే కమ్యూనిస్టుగా మరాడు. మగ్దూం మొహియుద్దీన్, రాజబహదూర్ గార్‌ల సహచరుడుగా ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారు. మగ్దూం ప్రభావంతో ఉర్దూ, పార్శీ సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. అరబ్బీ, మరాఠీ, హిందీ, ఇంగ్లిషు భాషలలో నిపుణుడు. ఇంగ్లిషులో కవిత్వం రాశారు. జంగల్ సందాల్ మీద ఇంగ్లిషులో రాసిన కవిత సుప్రసిద్ధం.

హిందూ ఛాందసత్వాన్ని వ్యతిరేకించినంత దృఢంగానూ, ఇస్లామిక్ ఛాందసత్వాన్నీ వ్యతిరేకించారు. ఆయన అచ్చమయిన కమ్యూనిస్టు.

అల్లకల్లోలంగా మారిన కశ్మీరులో బాలగోపాల్ బృందంతో కలిసి పర్యటించి విశాఖకూడా వచ్చారు. అక్కడి దారుణాలన్నీ వివరించారు.

సికింద్రాబాదు కుట్రకేసులో భాగంగానూ, మీసాకిందా, ఎమర్జన్సీలోను జైలు శిక్ష అనుభవించినా, ఏమాత్రం చలించకుండా, ప్రజాఉద్యమాలతోనూ, విరసం సభ్యుడిగాను కడకంటా కొనసాగారు.

'సియాసత్' పత్రికాఫీసులో కూర్చుని రాతప్రతి చూసుకునేవారు. ఆయన గొప్ప ప్రజ్వాస్వామికవాది.

విరసం ఆవిర్భవించిన ప్రదేశాలూ, విరసంలో మొదటినుంచీ ఉన్న కామ్రేడ్స్‌నీ (సాధ్యమైనంతవరకు) దర్శించేందుకు విరసం సభ్యులం కొందరం చేసిన పర్యటనలో భాగంగా ఖాన్‌సాబ్ ఇంటికి వెళితే ఆయనపొందిన ఆనందం, సంతృప్తి ఆయన కళల్లో ప్రస్ఫుటించింది. అల్లంతదూరాన ఉన్న వాహనం దగ్గరకి మేం వెళ్తూంటే, తన వాకిట్లో నుంచుని, కొసకంటా నవ్వుతూ చెయ్యి ఊపినదృశ్యం ఇప్పటికీ కళ్ళముందు మెదుల్తోంది.

పీడితప్రజల పట్లా చివరిదాకా నిబద్ధుడై నిల్చిన ఖాన్‌సాబ్‌కి వినమ్రంగా జోహార్లు అర్పిస్తున్నాం.

ఒక శిథిలమవుతున్న పురానాపూల్ ఉంటుంది. ఆయన ఇంటి ముందు ఆయన పూర్వీకుల సమాధులు ఉంటాయి. అవి ఆయన పూర్వీకులయిన సూఫీ మతగురువులు గనుక 'ముహ్‌మాంగే' (ఎంత అడిగితే అంత) డబ్బు ఇస్తామని రెండు కోట్ల రూపాయలు ఆఫర్ చేసి ఇవ్వాలని అడిగితే 'నాకెందుకు, కమ్యూనిస్టును. ఫకీర్‌గా వచ్చాను. ఫకీర్‌గా పోతాన'న్నాడట.

ఆయన మాత్రం ఏ మత విశ్వాసాలు లేని ఒక కమ్యూనిస్టుగా జీవించాడు.

ఆయన కొడుకులిద్దరికి ఆశీష్, అసీమ్ అని పేర్లు పెట్టాడు. ఇవి వాస్తవానికి హిందీ పేర్లు. ఆశీష్ అంటే ఆశీర్వాదాలు పొందినవాడని, అసీమ్ అంటే సీమలు లేనివాడని అర్థం. ఇవి హిందీ శబ్దాలు కద ఈ పేర్లు ఎందుకు పెట్టారని వాళ్ల పెద్దబ్బాయిని అడిగాను. ఉర్దూ ప్రజలందరి భాష అని, అది ముస్లింల భాష అని భావించడం తనకు ఇష్టం ఉండదని, అందుకనే తను హిందీ పేర్లు పెట్టాననే వాడని చెప్పాడు. అయితే అందరు తనను ఆశీమ్ ఖాన్ అని, తమ్ముణ్ని ఆసిఫ్ ఖాన్ అని పిలిచేవారని చెప్పాడు. పెద్దవాడు ఆశీష్ 1974 నాటికే హైకోర్టులో ఎలక్ట్రిసిటి డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగి. రెండవ వాడు అసీమ్ కొద్దిరోజులు దుబాయ్‌లో ఉద్యోగం చేసి వచ్చి, ఇప్పుడు అన్వరులుం కాలెజిలో కామర్స్ లెక్చరర్‌గా కాంట్రాక్టు ఉద్యోగంలో ఉన్నాడు.

ఎఐపిఆర్‌ఎఫ్ జాతుల పోరాటాలపై 96లో ఢిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ సెమినార్‌లో విలియమ్ హింటన్, గూగూ వా థియాంగోలతో పాటు ఖాన్‌సాబ్ పాల్గొన్నాడు. ఆ సభావరణకు ప్రత్యేకించి ఖాన్‌సాబ్‌ను తీసుకపోవడానికి ప్రఖ్యాత చిత్రకారుడు ఎం.ఎఫ్. హుస్సేన్ వచ్చినప్పుడు గానీ వాళ్లెంత దగ్గరి స్నేహితులో మాకు తెలియలేదు. 'మా భూమి' నాటకంలో మగ్బూల్ పాత్రకు స్క్రీన్‌ప్లే, సంభాషణలు ఆయనే రాసాడు. 'ఊరు మనది' రాసాడు. ఉర్దూలోకి ఆయనే అనువదించాడు. ఆయనకు ఉర్దూ, ఇంగ్లిష్, ఫార్సీ, హిందీ భాషల్లో ప్రావీణ్యం ఉంది. తెలుగులో ప్రవేశముంది. అట్లే చిత్రకళ, శిల్పకళ, నాటకరంగాల గురించి అధ్యయనం ఉంది.

సికింద్రాబాద్ కుట్రకేసులో జైలులో ఉన్నప్పుడు తొలిరోజుల్లో ఆయనను సరోజినిదేవి హాస్పిటల్‌కు తీసుకుపోతే చేతులకు హ్యాండ్‌కఫ్స్ చూసి ఆసుపత్రికి వచ్చినవాళ్లు ఆయన గురించి అనుమానంగా చూశారంట. ఆ రోజుల్లో బ్లాక్ మార్కెటింగ్ చేసేవాళ్లను కూడ బ్లాక్‌మెయిల్ చేయడానికి కొద్దికాలం పాటు జైళ్లలో పెట్టేవాళ్లు. తనను అట్లా ఊహించుకుంటన్నరేమోనని మరోసారి పోయినప్పుడు ఒక సుత్తీ కొడవలి బొమ్మ చేసుకొని తన లాల్చీకి తలిగించుకుని పోయి పోలీసు వ్యాన్ దిగుతూ పిడికిలి ఎత్తి నినాదాలు చేశారాయన. ఆయన ప్రజల విషయంలో ముఖ్యంగా అట్టడుగు ప్రజల విషయంలో ఎంత అణుకువతో, వినమ్రంగా, మృదువుగా ఉండేవాడో అధికారం విషయంలో, ఆధిపత్య భావజాల విషయంలో అంత ధిక్కార భావంతో ఉండేవాడు. ఎప్పుడూ పిల్లల్లో పిల్లవాడుగా ఉండేవాడు. పురానాపూల్‌లో ఆయన ఇంటి ముందు ఎప్పుడూ ఆయన సహచరులు, ఆయన మనవడు, ఆయన పెంచుకున్న ఆ వాడలోని కుక్కపిల్ల, దాని స్నేహితులు. తన చుట్టూ ఈ పరివారంతో ఆయన ఆ ఇంటి ముందు అట్లా వస్తూ పోయేవారిని చూస్తూ, పలకరిస్తూ, చేయి ఊపుతూ అటు హైదరాబాద్ తెహజీబ్‌కు, ఇటు కామ్రేడ్స్ అసోసియేషన్ ప్రారంభించి హైదరాబాద్‌లో పరిఢవిల్లిన కామ్రేడ్ల సంస్కృతికి మగ్దూం వదిలి వెళ్లిన ఒక మధుర జ్ఞాపకంగా ఉండేవాడు. ఇప్పుడు ఆయనా వెళ్లిపోయాడు. పురానాపూల్ పక్కన మరెన్నో వంతెనలు వచ్చాయి. కాని ఏ వంతెనా ఇరువైపుల మనుషులను కలపలేకపోయింది. ఇంతకాలం కలిపి ఉంచిన ఎం.టి. ఖాన్ కమిట్‌మెంట్, విలువలు మనకు మిగిల్చిపోయిన ఆరు దశాబ్దాల సుసంపన్నమైన వారసత్వం.

పాటలు / కవితలు

సర్కారంట అన్నా.. సర్కారంట

- భూసారం శివన్న

సర్కారంట! అన్నా.. సర్కారంట!
భలే భలే భలే.. సర్కారంట
జన జన జన.. జనతనా సర్కారంట
అదేనంట అదేనంట
చత్తీస్‌గఢ్ అడవుల్లో
ఊరూరా వెలిసెనంట
ప్రతిగూడెం గుండెనది గెలిచెనంట
సర్కారంట! అన్నా.. సర్కారంట!
భలే భలే భలే సర్కారంట
జన జన జన జనతనా సర్కారంట ..

గిరిజనుల కలల పంట
వనవాసుల వెన్నంట
దన్నంట గన్నంట
ఝూటా సర్కారుకు
దడ దడ దడ
గుండె దడ పుట్టెనంట
సర్కారంట భలే భలే భలే సర్కారంట
జన జన జన జనతనా సర్కారంట..

నేల మీద సల్వాజుడుం, నాగదండ్లు
కోబ్రాలు, జీబ్రాలు, గ్రేహౌండ్లు
నింగి నుండి మనిషిలేని విమానాలు
ఆపులేక గుండ్ల వాన కురిపించే
ఝూటా సర్కార్.. ఈ దోపిడి సర్కార్..
ఝూటా సర్కార్.. ఈ దోపిడి సర్కార్..
ఊచకోత నిత్య హింస.. గూడేల అగ్గిమంట
ఎందుకంట గ్రీనుహంటు వేట ?
మాపై ఎందుకంట ఈ గ్రీను హంటు వేట ?

సర్కారంట అన్నా.. సర్కారంట
భలే భలే భలే.. సర్కారంట
జన జన జన.. జనతనా సర్కారంట
అదేనంట అదేనంట
చత్తీస్ గఢ్ అడవుల్లో
ఊరూరా వెలిసెనంట
ప్రతిగూడెం గుండెనది గెలిచెనంట
సర్కారంట అన్నా.. సర్కారంట
భలే భలే భలే సర్కారంట
జన జన జన జనతనా సర్కారంట

ఆకు చాటు పిందెలము
చెట్టు-చేమ రంగు-రంగు
పక్షులతో సావాసము
అడివితల్లి ఒడిలోన
ఒదిగుండే బిడ్డలము
ఎవరిదేమి ఆశించము
భూమాత అడవితల్లి
ఇచ్చేదే బువ్వ మాకు
మమ్మెందుకు తరుముతోంది ?
మమ్మెందుకు చంపుతోంది?
మాగూడేలను కూల్చుతోంది? కాల్చుతోంది ?
ఝూటా సర్కార్.. ఈ భారత దోపిడి సర్కార్..
ఝూటా సర్కార్.. ఈ భారత దోపిడి సర్కార్..

అడివంతా మీదంటరు
అడివిపైన హక్కులన్ని మీవే.. నంటరు
అడివి తల్లి సంపదపై
వేరెవ్వరికి లేదంటరు..
హక్కే లేదంటరు..
ఆకు తెంచ్తె , పువ్వు కొస్తే
బువ్వొంద రాలు-కట్టె ముట్టుకుంటే
పీక మీద తుపాకీ గురిపెడతరు
తన్నుకుంటూ గుద్దుకుంటూ
దండుగలూ కట్టమంట్రు
కట్టకుంటే.. కొట్టుకుంటూ
పసువులోలె తోలుకెల్లి
కటకటాల కొట్టంలో కుక్కుతరు
బతుకేదదిరో.. మాకు?
ఈ బతుకెందుకురో.. మాకు?

దాదలూ .. రాకముందు
బతుకంతా.. చీకటేను
అన్ని ఉండి.. పూటకింత తిండిలేదు
తలఎత్తుకు తిరగలేము
యమదూతలు.. ఫారెస్టు.. గార్డులు
బీడాకు దళారులు
భూస్వాముల తెగపెద్దల ఆగడాలు
చావలేని బతుకు మాది.. బతికున్న చావు మాది..

దాదాలు, దీదీలూ మాలోని ఒక్కరయ్యి..
మాచేత సంఘాలు.. పెట్టించి
జబ్బుచేస్తే మందులిచ్చి
మాకోసం ప్రాణమిచ్చి సర్వమిచ్చి
మా కళ్ళు.. తెరిపించి
గూడేల గుండెల్లో గూడుకట్టి.. మాతోనే నివసించి
ఝూటా సర్కారుతో.. పోరాడి గెలవమని
వెన్నుతట్టి.. గన్నులిచ్చి
ప్రజాయుద్ధ సందేశం.. మోసుకొచ్చి
గ్రామ రాజ్య కమిటీలకు జోడించి
ఈ రాజ్యం మీదేనని..

ఝూటా సర్కారును నేలకూల్చు
మీపాలన.. మీ సర్కార్.. నిర్మించ
జనతన సర్కారును స్థాపించి
సాయుధమై సాగమని---
మాతోనే కదం కదం..
మాతోనే లాంగ్ మార్చ్ ..
మాతోనే కదం కదం
మాతోనే లాంగ్ మార్చ్ ---

సర్కారంట అక్కా.. సర్కారంట
భలే భలే భలే.. సర్కారంట
జన జన జన.. జనతనా సర్కారంట
అదేనంట అదేనంట
చత్తీస్‌గడ్ అడవుల్లో
ఊరూరా వెలిసెనంట
ప్రతిగూడెం గుండెనది గెలిచెనంట
సర్కారంట అన్నా.. సర్కారంట
భలే భలే భలే సర్కారంట
జన జన జన జనతనా సర్కారంట ..

జనతన సర్కారుకు జేజేలు

- డప్పు రమేష్

జనతన సర్కారుకు జేజేలు
దండకారణ్యం కొండల్లోన
విప్లవ పోరుతో వికసిస్తున్న
ప్రజా రాజ్యముకు విప్లవ జేజేలు ॥జనతన॥

నక్సల్బరిలో కురిసిన జల్లుకు - భారతదేశం పులకించింది
దున్నేవానికే భూమి యన్నది - విప్లవానికే ముఖ్యమన్నది
చారుమజుందార్ సారథ్యంలో - దొరభూస్వాముల నేల కూల్చినది
ఆ పోరాటం అంచెలంచెలుగా
అన్ని రాష్ట్రముల కల్లుకు పోతూ
దండకారణ్యం దండుగ మారిందీ ॥జనతన॥

ప్రజా పంథను అమలు జేయక - వీర శ్రీకాకుళ మోడి పోయినది
ఆత్మ విమర్శ, ఆ తరువాత - ప్రజా పంథ పరవళ్ళు తొక్కినది
రాడికలు విద్యార్థి సంఘములు, రాడికల్ యువజన సంఘములు
గ్రామాలకు తరలండి పిలుపుతో
రైతుకూలి సంఘాలను బెట్టి
పీపుల్స్‌వారు పురుడుబోసుకుంది ॥జనతన॥

భూ పోరులో పొందిన భూమిని - రక్షించుకునే విప్లవోద్యంలో
నిర్బంధాలూ, నిషేధాలను, బూటకపు ఆ ఎదురు కాల్పులను
లాఠీ దెబ్బలు, తుపాకి తూటాలు, అత్యాచారం, హత్యాకాండలను
చుట్టు ముట్టిన అణచివేతలను
గెరిల్ల సేనతో తిప్పికొట్టుతూ
గ్రామరాజ్య కమిటీలను బెట్టిందీ ॥జనతన॥

ప్రజా సైన్యము, ఐక్య సంఘటన - పార్టీ చేతిలో ఆయుధాలుగా
గ్రామాలను విముక్తి జేస్తూ - పట్టణాలను చుట్టుముట్టమని
గ్రామరాజ్య కమిటీలను పెడుతు - గ్రామ రక్షక దళాలు గడతూ
దీర్ఘకాల విప్లవ పంథా
విముక్తి ప్రాంత లక్ష్యం తోటి
దండకారణ్య పోరు సాగుతుందీ ॥జనతన॥

పీపుల్స్‌వార్, ఎం.సి.సి.లు - మావోయిస్టుగ ఏర్పడ్డాక
అణచివేతలను, అవరోధాలను, ఆత్మబలంతో అధిగమించినది
ఆపరేషన్ గ్రీనుహంటునూ - ఎదుర్కొంటు నిలదొక్కుకున్నది
ఆదివాసులే ఎర్రసేనగా
మిల్ట్రీ సైన్యాలతో ఢీ కొడుతూ

అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక

1970లలో తొలినాళ్ళలో వచ్చిన ప్రత్యేక సంచికలతో మొదలుకొని - 2013లో సాహిత్య విమర్శ ప్రత్యేక సంచికగా వచ్చిన 301వ సంచిక వరకు

డివిడి

అమ్మకానికి సిద్ధంగా ఉంది!

ప్రతులకు :
నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్. ఫోన్ : 040-24652387
దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాద్. ఫోన్ : 040-27640574

వెల : రు. 125/-

జనతన సర్కార్లను నిర్మించిందీ ॥జనతన॥

పార్లమెంటరీ వ్యవస్థలోన – ప్రజాస్వామ్యమూ పచ్చిబూటకం
(ఈ)వర్గ, కుల దోపిడీ వ్యవస్థలో – రాజ్యాంగమే ధనవంతులదీ
వ్యవస్థ మార్పుకు ప్రత్యామ్నాయం – మావోయిజమని నమ్ముతున్నరూ
సంక్షోభాలకు పరిష్కారము
మావోయిస్టు విప్లమేనని
ఎంతోమంది విస్వశిస్తువ్రను ॥జనతన॥

పాటా మాటా బందుబెట్టినా – ప్రజా సంఘాల నిషేదించినా
ఇన్ఫార్మర్లను చంపేసినా – కోవర్టులను ప్రయోగించినా
నల్లదండు ముఠాలను దించిన – హక్కుల గొంతులు నరికివేసినా
జైళ్ళ నిండా నింపివేసినా – కేసులు పెట్టిగోస బెట్టినా
విప్లవ పార్టీ వెంటఉంటమని
లక్షల ప్రజలు దేశమంతట
జనతన సర్కారుకు జై యంటుంద్రూ ॥జనతన॥

ప్రజాసైన్యమూ లేకుండా – ప్రజలకు ఏదీదక్కబోదనీ
గ్రామరాజ్య కమిటీలను గడుతూ – ప్రజా విముక్తి సైన్యం పెంచుతు
దీర్ఘకాలిక విప్లవంతో – మన దేశాన్నే విముక్తి చేస్తమని
ప్రజా విముక్తి గెరిల్ల సైన్యం
దండకారణ్యం కొండల నుండీ
ఢిల్లీ కోటను గురి జూస్తూ ఉంది ॥జనతన॥

ఎం. రాఘవాచారి కవితలు రెండు

ప్రజలు అజేయులు

వాళ్ళు వస్తారు
అగ్నిశిఖల మీదినించి
ధిక్కారం పలుకుతూ వస్తారు

కొత్త బాణీలు కట్టి
కొత్త మాటలు మాలలు కట్టి
రేపటి వేకువ కోసం
కొత్త పాటలు పాడుతూ వస్తారు

శాంతి
ముఖం మీద పులుముకునేది కాదు
మునిపెదవుల మీద సన్నగా మీటేదీ కాదు
హృదయంలో జీవించేది

క్రాంతికాముకులు వాళ్ళు
క్రాంతిలోనే శాంతిని దర్శిస్తున్న వాళ్ళు
వాళ్ళకి స్పష్టత ఉంది
ఏ గూటి పిట్ట ఏ పాట పాడేదీ
తెలుసువాళ్ళకి

ఉద్యమాలు నడుస్తున్నప్పుడు
ఉద్యమాలలో నడుస్తున్నపుడు
బిడ్డలు పిట్టలోలె రాలిపడుతున్నపుడు
ఏలికలకు ఏదురీదిన వాళ్ళు
పాలకుల బండారం ప్రకటించిన వాళ్ళు
జై తెలంగాణ నినాదం
ఎంత నెత్తుట తడిసిందో తెలిసినవాళ్ళు

ప్రయోగశాల ఆంధ్రప్రదేశ్‌లోంచి
యుద్ధరంగమే అయిన తెలంగాణలోంచి
కుతకుత ఉడికిన ఇండ్లలోంచి
పొక్కిలి పొక్కిలైన వాకిండ్లలోంచి
నడివీధుల్లో నిలిచి
పల్లెల నగరాల గుండెలు రగిలించిన వాళ్ళు
జై తెలంగాణ నినదించినవాళ్ళు

కృష్ణమ్మ నీలాల నీట నడయాడి
నల్లమల సిగలో
సరికొత్త రాగాల పువ్వుల్లు తురిమి
చెంచు విల్లంబులకు
కొత్త చూపులు దిద్ది
త్యాగాలు చాలుగా పోసిన వాళ్ళు
ఒరిగిన బిడ్డల ముద్దులు పాడి
తల్లినేల దుఃఖంలో తడిసి ముద్దైనోళ్ళు

మనసుమానేరై
పరీమళాలు ప్రవహించి
ప్రాణహిత పెన్‌గంగ
వరదలు వరదలై
గోదావరి అలల కలలోంచి
పయనించి పయనించి
దండకారణ్యమైన వాళ్ళు
రాత్రిలేదు పగలూ లేదు
విముక్తి గీతాలై బతుకును మేల్కొలిపిన వాళ్ళు

రాజ్యపు రక్తదాహం తెలిసినవాళ్ళు
సామ్రాజ్యవాది రహస్యం తెలిసినవాళ్ళు
వాళ్ళు గొప్పగా వస్తారు
ఇప్పుడు
కొత్తగా వచ్చిన సమస్యేమీలేదు
మొరటు కత్తులను ఎదుర్కున్నవాళ్ళు
స్మార్ట్ కత్తులను ఎదుర్కుంటారు
ఒక్క ప్రయోగశాలను ఎదుర్కున్నవాళ్ళు
రెండు ప్రయోగశాలలతో తలపడతారు
వాళ్ళు ప్రజలలో ఉన్నవాళ్ళు
వాళ్ళు ప్రజలు
ప్రజలు అజేయులు

పథక రచయితలు

పాలిస్తున్నారు
తీరికల్లేవు
భద్రతకు కొత్తగుడ్డలు తొడిగి
భద్ర గీతాలకు ట్యూన్‌కటి
టెండర్లు పాడుకుంటున్నారు

కొత్తగా కుట్టే పనిలో ఒకడు
కుట్టిన గుడ్డమీద
రంగు రంగుల మాసికలు
అంట గుట్టే పనిలో ఒకడు
తీరిక లేదు

లక్షలు కోట్లు
అంకెల గాంభీర్యత
ఇసుమంత లెక్కలేదు
వేలకోట్ల లెక్కలు పలికి
కళ్ళు మిరుమిట్లు గొలిపే కాంతులు చిలికి
ఏమీ కనబడకుండ జేసే
మాంత్రికులు వాళ్ళు

మనని భ్రమలలో ముంచి
వచ్చే ఎన్నికలకు వ్యూహాలు రాసి
టెండర్ల పాటల మీద నడిపిస్తారు
వాటర్‌గ్రిడ్లలోంచి నేరుగా
గొంతుల్లో మంచినీళ్ళు దుంకిస్తారు
పడకటింట్లు కట్టి
మనని జోకొడతారు
సితార్‌మీద పాటసాగినట్టు
అవుటర్ రింగురోడ్లు కట్టి
తొవ్వ తెలియకుండా
ప్రయాణం చేయనిస్తారు

పిల్లలకు పరీక్షల యాతన తప్పిస్తారు
వాళ్ళే చదువుకుంటారు
మన ఆరోగ్యాలకు
వాళ్ళే వైద్యం చేసుకుంటారు
గంటకు రెండు గంటలు పని చేస్తారు
తీరికలో లేరు
నిన్నటివి మొన్నటివి
మాటలు గుర్తు చేస్తే గంభీరమవుతారు
ఆకులు కాదు కదా రాలిపడేందుకు

నిశ్చింతగా ఉండమంటారు
చెరువు గాలికి సేదదీరే బాట చూపుతారు
ఊరూరి చెరువుల పక్కన / అద్భుతమైన తర్కంతో
కొత్త సమాధుల పథకం ప్రకటిస్తారు

ఉద్యమాల ఊపిరి

- కోటయ్య పిన్నిబోయిన

హక్కుల ఆకాశంలో
రెపరెపలాడే కీర్తిబావుటా
నీ ఉజ్వల, ఉద్విగ్న పోరాటాల
ఎరుపు మెరుపుల సంకేతం!

ముఖ్యం భావవీచికలలో
పతాకమై ఎగిరిన వాడా
తెలంగాణ సాయుధ పోరుకు
పాత బస్తీలో యుద్ధ రహస్యతంత్రులు మీటినవాడా!

వామపక్ష ఉద్యమాల ఊపిరివై
ఎప్పుడూ లెఫ్ట్‌కే జరిగిన వాడా
కొండపల్లి సహచరుడా
ఉద్యమాల ఊట చెలిమా!

హిందూ, ముస్లిం మతఛాందసాన్ని
సమ దూరంలో విసిరి
సామ్యవాదం, సోషలిజం అంటూ
భాగ్యనగరిలో అల్లుకుపోయినవాడా!

లాల్‌జెండా హమారా జెండాని
దిక్కులు పిక్కటిల్లేలా
ధిక్కార స్వరఢంకా
కడదాకా మోగించిన వాడా!

సస్పెన్షన్‌లూ, డిస్‌మిస్‌లూ
అరెస్టులు, జైళ్ళు
నిర్బంధాలూ, నిరుద్యోగం
నీ సంకల్ప బలానికి దాసోహమయ్యాయిగదా!

ముల్లాలై అల్లాని ప్రేమించాల్సిన నువ్వు
మార్క్సిస్టై ప్రజల్ని ప్రేమించావ్
కడదాకా కామ్రేడ్‌లా
కామ్రేడ్లీ పంచావ్!

విరసానికి కేరాఫ్
పౌరహక్కుల కేరాఫ్
పోరాటాల కేరాఫ్
ఖాన్ భయ్యా! ఖాన్ సాబ్! ఎంటి ఖాన్!

జన నేత జ్ఞాపకాలు

- టి. రామమోహన్‌రావు

లాల్‌ఘడ్, జంగిల్ మహల్

బస్తర్ అడవులు, ఎక్కడైతేనేం?
అక్కడో దృశ్యం
గళ్ళగళ్ళ కండువాను
తలమీది నుండి మెడచుట్టూ తిప్పుకుని
భుజానికి రైఫిల్ తగిలించుకుని... నువ్వు
మైకులు పట్టుకుని, ప్రశ్నాస్త్రాలను సంధిస్తూ
వెనుక నుండీ అయితేనేం?
నీ ముఖం కనబడక పోతేనేం?
నిన్ను చూస్తున్న, నీ మాటలు వింటున్న
ఆ క్షణాలు
ఎంత ఉద్వేగభరితం!
ఎంత ఉత్తేజపూరితం!!
నీ ప్రతిమాటా
మలో నూతనోత్సాహాన్ని నింపి
మాలోని నిర్వేదాన్ని పటాపంచలు చేసి
మాలో ఆశల మోసులు వేయించేవి
మా భుజం తట్టి నువ్వు మాకు
ధైర్యం నూరిపోస్తున్నట్లుండేది
భవిష్య ద్విజయంపై భరోసా కల్పిస్తూ
మాలో నూతనోత్సాహాన్ని నింపేవి
కామ్రేడ్!
ఆ దృశ్యాన్ని మా మదిలో దాచుకుని
మా మస్తిష్కాలలో రిజిస్టర్ చేసుకుని
పదే పదే నీ మాటలను మననం చేసుకుంటూ
నీ రూపాన్ని కళ్ళముందు ఆవిష్కరించుకుంటూ
అంతులేని ఆత్మవిశ్వాసంతో
లక్ష్యం వైపు దృఢంగా అడుగులు ముందుకేస్తాం
ముందుకే వేస్తాం.
(కా॥ కిషన్‌జీ యాదిలో...)

ఈ వెన్నెల మరీ తెల్లన...

- అరసవిల్లి కృష్ణ

నలుగురు కలిస్తే
చీమ కంట్లో శూలం దిగదు
నలుగురు కలిస్తే
ప్రవాహం దారి మళ్ళదు
మనుషులు ఆయుధాలతో రారు
అప్పుడే విరిసిన మల్లె పూలై వస్తారు

నలుగురు కలిస్తే
వెన్నెల మరింత తెల్లదవుతుంది
మనుషులు గునపాలతో రారు
చేతులతో నిర్మించుకున్న
వంతెనలను కూల్చరు
పక్కన కూర్చున్న మనిషి
కన్నీళ్ళు తుడుస్తారు

ఎక్కడెక్కడి నుంచో నడిచి వచ్చారు
నడుస్తున్న దారి నిండా మొక్కల్ని నాటారు
పసిపాపల ఏడుపుని
పాలనవ్వుల్ని దాటుకుంటూ
నలుగుర్ని కలవాలని
నలుగుర్ని ఆలింగనం చేస్కోని
మాటలతో ప్రపంచాన్ని తాకాలని వచ్చారు

నలుగుర్ని కలవడం
మనుషుల గురించి మాట్లాడటం
నేరమని తెలియని వారు
గుంపులు - గుంపులుగా ఉన్న
మనుషుల మధ్య ఇనుప కంచెలు వేసి
మనిషిని విద్రోహిగా నమోదు చేశావు
మానవబాంబుగా అనుమానపడ్డావు

అరే నాయినా!
మనిషి నిర్మాణం కదరా!
మనుషులు ఓ చోట చేరితే
మనుషులు మాట్లాడితే భయపడ్డవాడివి
ఒకేసారి మనుషులు కాగడాలయితే

రాత్రంతా నడిచి
వెలుతురు నుండి వెలుతురులోకి వచ్చారు
పదేళ్ళుగా ఎగురుతున్న జెండాను
భుజాన మోసుకొని వచ్చారు
తల్లుల హృదయాల నుండి నిద్రలేచి
పసికళ్ళతో వచ్చారు

నగరం తెలవారుతుండగా
ఓ ఇంద్రధనుస్సును చూద్దామని వచ్చారు
ప్రజల ప్రేమికులు

ఈ రోజు నీదే కావొచ్చు
మనిషిని - మాటను
ఖైదు చేయవచ్చు
నలుగుర్ని కలవకుండా చేయొచ్చు

పెదవులపై
హృదయాలపై

మొలకెత్తిన వరినాట్లు
తుపాను బలహీనపడినాక
మరింత నిఠారుగా మొలకెత్తుతాయి

(ప్రత్యామ్నాయ వేదిక సభ భగ్నం అయినాక)

మహమూద్ కవితలు రెండు

కాగడా నీడలో కదులుతూ...

నడవడమో, పరుగులెత్తటమో
మనిషి నీడ మాగాణిలా నేలమీద పరుచుకోవటమో
జీవితమొక ప్రోసెస్ లేదా ప్రొగ్రెస్
ఒక్క ఘడియ విరామం కోసం
వందల ఏళ్ళ చరిత్ర యుద్ధమై నిలుస్తుంది

ఒక్క నీటి బొట్టును రాల్చుకోవడం కోసం
వందల మేఘాల్ని పిండుకుంటుంది

ఘర్షణకు పరాకాష్ఠగా
ఆయుధంతో ప్రపంచం దృశ్యమానం అవుతూ ఉంటుంది

నిక్కబొడుచుకున్న ఎముకల గూళ్ళలో ఏళ్ళతరబడి
తన్నుకులాడుతున్న ఖాళీతనాన్ని
తరమడానికి వెన్నెల ప్రయత్నిస్తూ ఉంటుంది

సన్నని అగ్గిపుల్ల వెలుతురులో ఒక్కోసారి
అడవి లాంగ్ మార్చ్ చేస్తుంటుంది
మలేరియల్ ఫివర్ వొదలని పర్వతం ఒకసారి
ప్రాణాలు పోగొట్టుకుంటుంది

తలలు తగలబడుతున్న గూడెంలో
ఆదివాసి అక్కలను చెల్లెళ్లను చెరుకుగెడల్లా
నమిలినట్టుండే రాత్రులలో
రుధిరరుతువు తాండవంలో
దుఃఖాన్ని దూరం చేసే దవాఖానాలుండవు
అడవి చల్లదనమొక్కటే ఆసరా!

విషపు ప్రయోగాలు ఒక వైపు విషసర్పాలు ఒక వైపు
అరణ్యం కన్నుమీద కాటు వేస్తుంటాయి

సంప్రదాయ నృత్యాల్లో, గీతాలాపనల్లో,
మృత్యువు వంతపాడుతుంటుంది

అంబుష్ ప్రెడేటర్ వదిలిన బుల్లెట్ గుండెల్లోకి దిగినప్పుడు
అనిర్వచనీయ సలపరింపుల్లో ప్రాణం గింగిరాలుపోతున్నప్పుడు
నరుడు భాస్కరుడౌతాడు

గురితప్పిన బుల్లెట్ మా కనుల కొసలను తాకుతూ
దూసుకెళుతున్నప్పుడు జీవితం మృత్యు భయాన్ని
గెలిచేసే కవిత్వమౌతుంటుంది

సమాచారం చేరవేయడానికి, తీసుకోడానికి
అరణ్యం ఉపయోగించే సెటిలైట్లు మనిషి భుజాలు

మనిషి మనసుకు పట్టం కట్టినట్టుండే త్యాగాలు

చూపును తాకుతూ, చూపుకు స్వేచ్ఛనిస్తూ
గాలితెమ్మెరలా పచ్చ నాకు దేహాలు
పచ్చదనాన్నే క్షీరంలా స్వీకరించే హృదయాలూ,
నూనూగు మీసాల ఆదివాసీ గాన-నృత్యాలూ
ప్రకృతే ఆవిష్కర్తగా పంచభూతాల పోరాట వారసత్వాలు

మృగాలతో, వ్యాధులతో, విషకీటకాలతో ఎంగేజ్ అవుతున్నప్పుడు
బరితెగింపును బతుకు పుట్టుకతో తోడు
తెచ్చుకుందా అన్నట్టు ఉంటుంది

పోరాడ్డంలోనే ప్రాణం పెట్టుకున్న చోట
చెట్లాకులు రాసుకొని రాలిపడే శబ్దం ఒక్కోసారి
ఏరియల్ సర్వేకి సిగ్నల్ అవుతుంది
నిఘా కళ్ళు అనకొండల్లా బుసలుకొట్టే బుల్లెట్లు చెరుగుతాయి
కొంతమంది నేలకొరుగుతారు

ఎదుర్కోవాలి, ఎదుర్కోవడంలోనే బతకాలి
ఎదురుతెన్నులు తగిలించుకొని ఎదుర్కోవడంలోనె చావాలి
నగ్నత్వాన్ని బహిరంగం చేసే అన్ సివిలైజ్డ్ వార్‌లో
చీకటి - వెలుతురు పాత్రలు మార్చుకుంటాయి

ఒక నగ్న తాండవం
ఒక వికృత వ్యాపకం
తెల్లభవనం లోపల పురుడుపోసుకొని
ప్రపంచం అంతా వ్యాపించే లోహవిహంగాల
యుద్ధోన్మాద వ్యాసంగం
పశ్చిమ కనుమల మీద పడగనీడై అలుముకొంది

మనిషిని, శ్రమని, గాలినీ, వాననీ, ప్రకృతిని
సరుకుగా మార్చేసిన వ్యాపారం
ఆ అంగళ్ళలో అసత్యం టోకుగా అమ్మబడుతుంది
శవాలతో వ్యాపారం చేస్తున్నదెవరో చూడాలంటే
మా రక్తంలో చేతులు కడుక్కున్న వాళ్ళ వేలిముద్రలు చాలు
ఆ వేలిముద్రలు చెబుతాయి కోటి నిజాలు

రెడ్ స్టార్ తలకు చుట్టుకున్న జాబిల్లు
ఒంటి నిండా పొడుచుకొచ్చిన గాయాలు నిజాలను నినదించే నిజాలు
మేం మోస్తున్న ప్రతి గాయం ఓ నిజం
మేం రాసుకుంటున్న త్యాగాల స్మృతులు నిజం
కాలపు కన్రెప్పపై కదులుతున్న సాయుధ వసంతం ఓ నిజం
కంఠం గాయపడినా గానం చేస్తున్న కోయిల పాట నిజం

ఇక్కడ మనుషులకే కాదు చీమలు, చెట్లూ, పల్లెలు
జలప్రవాహాలు, జలపాతాలు మోస్తున్నవి గాయాలెన్నెన్నో
గాయాల్లోంచి పుట్టుకొచ్చే స్మృతిగీతాలెన్నెన్నో

మా తల్లుల పొత్తిళ్ళలో ఒదిగి నిదురిస్తూ మేల్కొంటున్న రేయింబవళ్ళు
పచ్చి పుండ్లు
గాయాల గజళ్ళు సాయంకాలాలు

ప్రతి గాయం ఒక గానం
ప్రతి వేకువా ఓ గాయం
ప్రతి మలుపులో ఏదో ఒక గాయాల నిషాని గాయాల కహానీ
పిల్లలకు పాలు పడుతున్న ప్రతి వక్షం ఓ గాయం
పాలు పీలుస్తున్న ప్రతి పసి పెదవి ఓ దర్దకీ దాస్తాన్
విషాదం - ఆనందం మధ్య చెరిగిన గీతలపై తలపెట్టి నిదిరిస్తున్న
ఆకుల సవ్వడి మధ్య
పరిశోధన - పరిపక్వత జుగల్బందీ చేస్తుంటాయి
అబద్ధాన్ని నిజం చేసే ఆత్మన్యూనతలిక్కడ ఉండవు
మీకన్నం ముద్ద కలిపి పెట్టే తల్లి తారసపడినపుడు
ఆమె గర్భాన్నోమారు తడమండి
అక్కడింకా మీ మీదున్న మాతృత్వపు తడిస్పర్శ తగలకపోతే అడగండి
తల్లీ నన్ను నువ్వే కన్నావా అని
ఇక్కడ బిడ్డల్ని కోల్పోయి తల్లడిల్లుతున్న అమ్మల గాథల కన్నీటి తరంగం
ఓ నిజం

సత్యాల కాగడాల నీడలో పోరాటాన్ని పదునుపెడుతున్న వాళ్ళం
అబద్ధాలల్లడానికో, పొరబాట్లను సమర్థించుకోడానికో మేం
చేస్తున్నది వ్యాపారం కాదు
విప్లవ వ్యవసాయం

We let revolution check everything
Our thoughts have eyes
Our weapons have moral
come and have a look

ఒక జీవితం - వేయి ఖండికలు

నది - కవి ఒక్క లాంటివే!
ఒకరిది నీటి ప్రవాహం
ఒకరిది అక్షర ప్రవాహం

అన్ని ప్రవాహాలు ఒక్కటి కానట్టే
అన్ని రాతలు ఒక్కటి కావు

అతడు కవి
దళిత తత్వానికి మేధావి
దేహానికి పూయబడ్డ మలినత్వాన్ని
కడగడానికి కరవాలాలే కావాలా
అతడి ప్రతి అక్షరం ఓ కరవాలం
ప్రతి మలినుడి గడప దగ్గర గద్గద స్వరంతో
నిలబడ్డ వేయిఖండికల అతడి జీవితం
కవితలల్లుకున్న బతుకు పుస్తకం

నది ఇప్పుడు భూమిలోనికి ఇంకిపోయింది
అక్షరాల రేణువులని ఉపరితలం పై వొదిలి
(పైడి తెరెష్ బాబుకి)

చదవండి
చదివించండి

వెల : రు. 180/-
పేజీలు : 448

నక్సల్బరీ వెలుగులో...
(భారతదేశ నక్సలైట్ ఉద్యమ చరిత్ర)
సమంతా బెనర్జీ

ప్రచురణ : విప్లవ రచయితల సంఘం
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో లభించును.
www.virasam.in
Email : arunatara1977@gmail.com

మీ రచనలను అరుణతారకు ఈ-మెయిల్ కూడా చేయవచ్చు!
పేజ్‌మేకర్ ఓపెన్ ఫైల్, పి.డి.ఎఫ్. పద్ధతులలో (అను 6.0లో అయితే మేలు),
మైక్రోసాఫ్ట్ వర్డ్, ఎం.ఎస్. భాషాలో కూడా అరుణతారకు మెయిల్ చేయగలరు
ఈ-మెయిల్ : arunatara1977@gmail.com
http://www.facebook.com/arunatara.virasam

1/70 X 420

- డాక్టర్ దిలావర్

వలసలు మనకు కొత్త కాదు. పడగ విప్పిన నగరీకరణ పచ్చ పచ్చని పల్లెపట్టుల్ని ఎలా కబళిస్తున్నాయో కూడా విదితమే. కాకపోతే ఇక్కడ కథ అడ్డం తిరిగింది.

రాజారాం గారంటే అందరికీ జాలి. ఎక్కడో సుదూరం నుంచి వలస వచ్చాడు. అదీ ఏ నగరానికో కాదు. ఎక్కడో...కొండల మధ్య విసిరేసినట్టు, మారుమూలలో ఏ కనీస సౌకర్యాలు కూడా నోచుకోని పల్లెకు. పల్లె అయితే కొంత మెరుగ్గానే ఉండేది పరిస్థితి. అది ఫక్తు ఓ కోయగూడెం.

వచ్చిన కొత్తలో అడవి జంతువుల్లా, అడవి మనుషులు బెదిరి పోకుండా- 'మనమంతా ఒక్కటే. నన్ను మీలో ఒకణ్ణిగా భావించండి. ఏదో పెద్దరికం అంటగట్టి నన్ను దూరంగా ఉంచే ప్రయత్నం చేయ్యొద్దు. నేను చాలా బాధ పడతాను.' అంటే వంగి వంగి దండాలు పెడుతుండేవాడు. జనాలు ఆయన్ను చూసి అబ్బుర పడేవాళ్ళు.

'ఎంత కలుపోగోలుతనం. మర్యాదా మట్టూ గొప్పోళ్ళకు తెలిసినట్టు మనకెట్టా తెలుత్తది?' అనుకునే వాళ్ళు.

'విస్తరి' సామెత చెప్పుకొని కుషాలు పడేవాళ్ళు.

రాజారాం గారు 'దొర'గా మారే క్రమంలో చాలా పరిణామాలు చోటు చేసుకున్నాయి. రాజారాం గారంటే జనాలకు ఇంతకు ముందున్న జాలి స్థానంలో భయం చోటు చేసుకుంది. భయంతో పాటు భక్తి కూడా జత కూడింది. రాజారాం గారి పేరేంటో చాలా మంది మరిచేపోయారు. దొరగానే పేరు స్థిరపడి పోయింది.

దొరంటే అదేదో 'బూచి' అన్నట్టుండడు. పొందూరు ఖద్దరు ధరించడు. దర్పానికి ప్రతీకగా భుజం మీద మూడు రంగుల కండువా వేసుకోడు. జులపాలు లేవు. మెలేసిని బుర్ర మీసాలు లేవు. చేతిలో పొన్ను కర్ర లేదు. నోట్లో లంక పొగాకు పొర చుట్ట ఉండదు. మెడలో పులిగోరు వేళ్ళాడదు.

చాలా సాదాసీదాగా ఉంటాడు దొర. దొరగారు అని చెప్పకుంటే ఆయన్ని చూసిన వారెవరూ ఆయన్ని దొరగారని నమ్మరు.

తెల్లని పాలియస్టర్ పొట్టి చేతుల చొక్కా ధరిస్తాడు. మ్యాచింగ్ పైజమా వేసుకుంటాడు. తలమీద ఉన్న నాలుగు పోచల్ని పెద్దగా పట్టించుకోడు. హిందీ సినిమా హీరోలా మీసాల్లేకుండా నున్నగా గడ్డం గీక్కుంటాడు. ముఖంలో దొరతనం తాలూకు ఛాయలేవీ తారాడవు. ముఖంలో లోపలికి లోయల్లో ఉన్నట్టుండే కళ్ళు. ఆ కళ్ళలో ఏ పడగలు బుస కొడతుంటాయో,ఏ పులులు గాండ్రిస్తుంటాయో ఎవరికీ తెలియదు. అసలాయన ముఖం కేసి చూసే ధైర్యం ఎవరికుంటుంది గనక! పులులే ఉంటాయని కూడా చెప్పలేం. గుంట నక్కటూ, తోడేళ్ళూ కూడా సంచరిస్తుంటాయి.

ఓ రోజు కొత్తగూడెం వెళుతున్నాడు దొర. ఎటు వెళ్ళినా జగన్నాథ రథం లాంటి జీపులో వెళ్ళాల్సిందే. (మొట్టమొదటి సారి ఆ ఊరికి దొర జీపు వచ్చింది. దాన్ని చూసిన జనాలకు మూర్ఛ వచ్చినంత పనైందట) ఇల్లెందు-కొత్తగూడెం రోడ్డు చేరుకోవాలంటే, గూడెం నుండి మూడు కిలోమీటర్లు కచ్చా కంకర రోడ్డు మీంచి వెళ్ళాల్సిందే.

జోరు మీదున్న దొర కళ్ళకు ఇంకా జోరు మీదున్న జొన్న చేను విరగబడి నవ్వుతున్నట్టు కనిపించింది. గాలి వీచినప్పుడల్లా తలలు వంచి, తరువాత మళ్ళీ శిరసులెత్తుకుంటూ- చేను, జొన్న కంకుల అలలు సృష్టిస్తున్నది. పచ్చని మిసిమితో పెటపెట లాడుతున్న జొన్న చేను 'రా రమ్మ' ని దొరను కవ్విస్తున్నట్టుగా అనిపించింది. పంటతో నవనవ లాడుతున్న చేనును చూస్తున్న కొద్దీ కారం ముద్ద మింగినట్టు గొంతు నుంచి పెద్ద పేగు దాకా అపరిమితమైన మంట లేస్తున్నది. ఇహ లాభం లేదు. ఏదో ఒకటి చెయ్యకపోతే ఈ దెయ్యం మంట ఇక ఆగదు.

జీపులో వెనక కూచొని ఉన్న యాసం బుచ్చయ్యను 'ఈ చేను ఎవరిదిరా బుచ్చయ్యా!' అని అడిగాడు. లోపల మంటలు తొందరపెట్టుతున్నాయి.

బుచ్చయ్య గుండెలు దడదడ లాడాయి. కన్నయ్యకు 'ఆయి' మన్న చేను గిదొక్కటే ఉంది. దొరోని కళ్ళు పాడుగాను. పాపిష్టి కళ్ళు కన్నయ్య చేను మీద పడ్డాయి. అనుకున్నాడు బుచ్చయ్య.

'దొరా...గిది....గిది' చెప్పడానికి నోరు రావడం లేదు బుచ్చయ్యకు.

'చేను ఎవరిదిరా అంటే నీళ్ళు నములుతున్న వేందిరో?' గద్దించినట్టు అన్నాడు దొర. ఆలస్యమయినా కొద్దీ కడుపులోని మంట కళ్ళలోకి పాకుతున్నది.

'గిది....గిది...గీ చేను...వాసం కన్నయ్యది' తడబడుత చెప్పాడు బుచ్చయ్య.

'అట్ల చెప్పరాదూ..!' దొర ప్రాణం కొంచెం నిమ్మళించింది.

కొత్తగూడెంలో ఎక్కువ సమయం వృథా చేయలేదు. వెంటనే తిరుగు ప్రయాణమయ్యాడు. అలా ఇల్లు చేరుకున్నాడో లేదో, అర్జెంటుగా రమ్మని వాసం కన్నయ్యకు కబురు చేసాడు.

వాసం కన్నయ్యకు గుండెలు గుభిల్లుమన్నాయి. దొరోడు తన నెందుకు రమ్మన్నడబ్బా! అని మల్లగుల్లాలు పడుతున్నాడు కన్నయ్య. అతని మనసు కీడును శంకిస్తూనే ఉంది. ముఖానికి పట్టిన చెమటను తలకు చుట్టుకున్న తువ్వాలుతో తుడ్చుకున్నాడు.

బయంబయంగానే దొర ఇంటికి చేరుకున్నాడు. దొర ఇల్లంటే అదేదో ఏడంతస్తుల మేడ కాదు. చుట్టూ గడి గోడలు, బురుజులు గట్రా ఏమీ లేవు. ముందే చెప్పుకున్నాం కదా - దొర చాలా నిరాడంబరంగా జీవిస్తాడని. ఎదురు బొదురుగా రెండు గడ్డింఢ్లు ఉన్నాయి. ఇంటి ప్రాంగణం మాత్రం కొంచెం విశాలంగానే సుమారు ఐదారు ఎకరాల వైశాల్యముంటుంది. మళ్ళీ ప్రాంగణమంటే పెద్ద మాట కదా అని అనుకోవచ్చు. అదేం లేదు. చుట్టూ వెదురు, చిల్లకంపతో

కట్టిన అలవ మాత్రమే ఉంది. ఇళ్ళకు దూరంగా పొడవాటి చెక్కలు చుట్టూ పాతిన పశువుల దొడ్డి ఉంది.

తలగుడ్డ విప్పి, దులుపుకొని భుజం మీద వేసుకున్నాడు కన్నయ్య. 'అయ్యా! దండం!' వినయంగా వొంగి దొరకు దండం పెట్టాడు.

కనిపించీ కనిపించనట్టు తల పంకించాడు దొర.

పోడుగొట్టుకొని, తునికాకు ఏరుకొని, వెదురు బుట్టలల్లుకొని బతకాల్సిన ఈ అడివి మనుషులకు ఇన్నిన్ని ఎకరాల పట్టా భూములా? లోలోన మనసు ఉడికిపోతున్నది. కడుపులో మంట 'నేనున్నాను' అని గుర్తు చేస్తున్నది. మనసులోని భావాలు ముఖం మీదికి పాకకుండా చాలా జాగ్రత్త పడ్డాడు దొర.

'ఒరేయ్ సింగన్నా! మన కన్నయ్య ఎండలో పడొచ్చాడు. చల్లని మజ్జిగ ఇవ్వురా!' కృత్రిమమైన నవ్వును పెదాల కంటించుకుంటూ అన్నాడు దొర.

సింగన్న నూనూగు మీసాల వాడు. దట్టమైన కనుబొమ్మలు కలవాడు. ఎక్కుపెట్టిన బాణం లాంటి చూపులున్నవాడు. బండ పెదాలు. చప్పిడి ముక్కు. రింగులు తిరిగి తలకంటుకొని ఉన్న నల్లని జుత్తు. అప్పుడప్పుడే చియ్య బట్టుతున్న కర్రి దున్నపోతులా కండలు మెలి దిరిగి ఉన్న మెరికలాంటి కుర్రాడు.

సంతలో బాగా కండపట్టిన గొర్రె పొట్టేలను ఏరికోరి కొనుక్కున్నట్టుగా సింగన్నను ఏరికోరి తన దగ్గర పనిలో పెట్టుకున్నాడు దొర.

కన్నయ్య గుండెలో దక్కు మన్నది. దొరోడు గింత తియ్యంగ మాట్లాడుతున్నడంటే - ఆ తేనే మాటల ఎన్క ఇసం దాక్కొని ఉన్నదన్న మాట

సింగన్న లోనికెళ్ళి మజ్జిగ తీసుకొచ్చి కన్నయ్యకిచ్చాడు.

'వద్దంటే...అదేం సొడ్లో' అని భయపడ్డాడు కన్నయ్య. సత్తు గళాసు పైకెత్తి, గటగటా మజ్జిగ తాగేసాడు.

'చూడు కన్నయ్యా! రోడ్డుకు వెళ్ళే దారిలో ఎడం పక్కనున్న జొన్న చేను నీదేనటగా?' తెలియనట్టే అడిగాడు దొర.

'అయ్యా! నాదే దొరా!' అన్నాడు కన్నయ్య, ఎండిపోతున్న పెదాలను నాలుకతో తడి చేసుకుంటూ.

'పంటతో నిగనిగ లాడతూ కడుపుతో ఉన్న ఆడదానిలా మిసమిసలాడుతూ భలే ఉంది చేను...!' అసలు విషయం బయట పెట్టకుండా చాకచక్యంతో కన్నయ్యను మాటల్లోకి దింపాడు దొర.

'గీ డొంక తిరుగుడెందుకు? చెప్పేదేందో సూటిగా చెప్పొచ్చు కదా?' అని మనసులో అనుకున్నాడు కన్నయ్య.

కన్నయ్యకు ఏం మాట్లాడాలో తోచలేదు. ముఖం కిందికి దింపుకొని మౌనంగా ఉండిపోయాడు.

'గిన్ని ఊచ బియ్యమన్నా తినిపించలేదేం కన్నయ్యా?' కారెడ్డమాడుతూ అన్నాడు దొర.

'గిప్పుడద్గుతె ఎట్ల దొర? గింజ ముదిరిపాయె...' సంజాయిషీ ఇస్తున్నట్టుగా అన్నాడు కన్నయ్య.

'ముదురువో...లేతవో...నీ గింజలెవడిక్కావాలోయ్. గింజలు పండే భూమినే సొంతం చేసుకోవాలని చూస్తుంటే...' లోపలి గుంట నక్క వూళ వేసింది.

'చూడు కన్నయ్యా! అరు గాలం రెక్కలు ముక్కలు చేసుకున్నా వ్యవసాయంల ఏ మొస్తది దుబ్బ తప్ప?' తన పన్నాగానికి నాంది పలికాడు దొర.

'దుబ్బే...దూలో...గీ మట్లనె పుట్టినం. మట్లనే పెద్దైనం. మట్టి పిసుక్కుంటనే బతికినం. కడాకర్కి గీ మట్లనే కలిసిపోతం..' ఉద్వేగంతో అన్నాడు కన్నయ్య.

'గదె...గదె...నేను గూడ అనేది గదే...గీ మట్టి పూస్కుంట నానాతంటాలు పడుటెందుకు? హాయిగా కాలు మీద కాలేసుకొని దొరోలె కూసోవచ్చు గదా?' కనకయ్య మీద ఎంతో సానుభూతి చూపిస్తున్నట్టు నటిస్తూ అన్నాడు దొర.

'మా కంత ఆశలు లెవ్వులెండి. ఏందో...గీ బత్కులిట్ల తెల్లారితే సాలు' నిర్లప్తంగా అన్నాడు కన్నయ్య.

'అదృష్టం తలుపు తట్టుతుంటే మొకాలడ్డుతావేమయ్యా? పెద్ద వెర్రిబాగు లోడిలా ఉన్నట్టుంది కద...' కన్నయ్య క్షేమం పట్ల తను తెగ ఇదై పోతున్నట్టు అన్నాడు దొర.

కన్నయ్యను మళ్ళీ మౌనమే ఆదుకుంది.

'నీ మంచి కోసమే చెబుతున్నా. ఆ చేనును ఎంతకో అంతకు అమ్మేసెయ్. నడి యీడు వచ్చింది. ఇంకా ఎందుకు కష్టపడతావ్?' అన్నాడు దొర.

పక్కనే పిడుగుపడ్డట్టు అదిరిపడ్డాడు కన్నయ్య.

'ఆ చేను అమ్మనండి. మా బతుకు తెరువు గదే గదా? ఐనా గా చేను అమ్మితే మా పిలగాండ్లు ఊకోరండి...' నాన్చుతూ అయినా తన అయిష్టతను తెలిపాడు కన్నయ్య.

'చేను అమ్మకపోతే మరి... నేను ఊర్కోలేనే...' అనుకున్నాడు దొర.

'బాగా ఆలోచించుకో కన్నయ్యా! మళ్ళీ ఇలాంటి అవకాశం రాకపోవచ్చు...' కన్నయ్యకు నచ్చచెప్పేందుకు ప్రయత్నిస్తున్నాడు దొర.

'బాగానె ఆలోచిచ్చుకున్న దొరా! అయినా మా బూంవులు ఏరే వాళ్ళెవ్వరూ కొనొద్దని- అమ్మొద్దని రూల్సు ఉన్నయట గద దొరా...?' ఏదో ఒక విధంగా తప్పించుకోడానికి మార్గాలు వెదుకుతూ అన్నాడు కన్నయ్య.

'అమ్మ నా కొడకా! రూల్సు మాట్లాడేంతటి పెద్దోడి వైపోయావా? ఇక ఉపేక్షిస్తే లాభం లేదు' లోపల అనుకున్నాడు దొర.

'ఆ రూల్సు నాకు తెలియవా? అయినా బూవులు నేనేం చేసుకుంటాను? నాకు తెలిసిన మీ వోడే...ఒకడు చారెడు చెల్క గావాలంటే నిన్ను అడిగాను. అంతే...'అందులో తన స్వార్థమేమీ లేనట్టుగా చెప్పాడు దొర.

'కన్నయ్యా! నువ్వు చెప్పల్సింది నువ్వు చెప్పావు. నేను చేసేది నేను చేస్తాను' అనుకున్నాడు దొర.

'ఇన్నాల్ల సంది గీ బూంవమ్మనే నమ్ముకొని బత్కుతున్నం. కన్నతల్లసుంటి బూంవి తల్లిని అమ్ముకుంటె పుట్టగతులుండవు... మా కులపోడికైనా సరే బూంవిని అమ్మను గాక అమ్మను...దొరా!' అంటూ కరాఖండగా చెప్పి దొర ఏమైనా అనుకోనీ.. అనుకుంటూ వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు కన్నయ్య.

చిద్విలాసంగా నవ్వుకున్నాడు దొర. తనలో తాను ఏదో గొణుకుంటూ తల మాటి మాటికీ పంకిస్తున్నాడు. అప్రయత్నంగా సింగన్న వైపు చూసాడు.

అప్పటికే సింగన్న ఉగ్రనరసింహుని రూపం ధరించి ఉన్నాడు. క్రోధంతో వూగిపోతున్నాడు. 'తను పుట్టిపెరిగి దొరగారిని ఎదిరించిన నరమానవుణ్ణి ఎరగడు. ఇయ్యాల గీ కన్నయ్యకు కండ్లు నెత్తికెక్కినయ్' అని అనుకుంటుంటేనే నెత్తురు సలసల మరిగిపోతున్నది.

'ఏంటి దొరా! వాడట్ల పొగరుతోటి ఎదిరిత్తంటే...మీరేంది వాణ్ణి ఓపికతోని గోకుతున్నరు? వాణ్ణేమన్నా ఊకెనే చెల్క యిమ్మంటిమా? మన కోసం ఇమ్మంటిమా... నా కొదిలి పెట్టుండ్రి. దెబ్బకు దెయ్యం ఒదిలిస్త' ఆవేశంతో పళ్ళు పటపట కొరుక్కుంటూ అన్నడు సింగన్న.

సింగన్న ఇప్పుడు పూర్తిగా దొరకు నమ్మినబంటుగా మారాడు. తన మీద ఏనుగు ఎక్కి తొక్కినా పర్లేదు. దొర మీద మాత్రం ఈగ కూడా వాలకుండా ఉండాలని కోరుకుంటున్నాడు.

సింగడు తన కోసం ప్రాణాలిమ్మన్నా ఇస్తాడని దొరకు తెలుసు. పిల్ల కాక్కేం తెలుసు ఉండేలు దెబ్బ అనుకున్నాడు దొర.

'ఒరే సింగా! కోపం తోటి పనులు అయితాయిరా? సాపకిందికి నీళ్ళు రావటం నరమానవునికి తెల్వొద్దు. ముందు ముందు నీకే తెలుస్తయిలే...' పెంపుడు కుక్కను దువ్వినట్టు సింగన్నను దువ్వుతూ అన్నాడు దొర.

జరగబోయే దారుణం చూడలేక సూర్యుడు ఘాట్టిగా కళ్ళు మూసుకున్నాడు. భయం భయంగా మబ్బుల పరదాల్లోంచి తొంగి తొంగి చూస్తున్నాడు చంద్రుడు. గొర్రెల మంద బెదిరి, చెల్లాచెదురైనట్టు చుక్కలు ఆకాశం నిండా చెల్లాచెదురై బిక్కు బిక్కు మంటున్నాయి.

చీకట్లో కర్రలు తప్ప– ఆ కర్రల్ని పట్టుకున్న వాళ్ళెవరో తెలియడం లేదు. కన్నయ్య ఇంటి చుట్టూ కర్రలు మోహరించాయి.

తరువాత ఏం జరిగిందో ఏమో! దొర ఏ మాయ చేసాడో ఏమో! రాత్రికి రాత్రే పెళ్ళీడు కొచ్చిన కన్నయ్య బిడ్డ మాయమైందన్న పుకారు ఊరంతటా గుప్పుమన్నది.

రెండు మూడు రోజుల్లో క్రయవిక్రయ దస్తావేజులు చేతులు మారాయి. కన్నయ్య తన కులం వాడే అయిన సోడె సారయ్యకు చెలక అమ్మినట్లు కాయితం పుట్టిచ్చిండు దొర. దొర నామ మాత్రపు ధర కట్టి ఇచ్చిన పైకం సోడె సారయ్య దగ్గర్నుండి కన్నయ్య చేతిలో కొచ్చి పడింది.

గుడ్ల నీరు గుడ్లలో కుక్కుకుంటూ దొరకు దండం పెట్టాడు కన్నయ్య. సారయ్య కొన్న కాయితాలు తీసుకొచ్చి దొర చేతిలో పెట్టాడు.

'ఏందిరో సారయ్యా! బూంవి కొనుక్కోని కాయితాలు నా కిస్తవేందిరో' పరిహాసంగా అన్నాడు దొర.

'సాల్లెద్దురు. మీ ముంగట బూంవులు కొననీకి మేం ఎంతటోల్లం దొరా? ఏదో మీ నీడల ఎంత సోటుంటె సాలు. మాకు బూంవులెందుకు లెండ్రి. మేమేవన్నా ఊళ్ళేలాల్నా...రాజ్యాలేలాల్నా?' అంటూ తన విశ్వాసాన్ని ప్రకటించుకొని తరించాడు సారయ్య.

దొర తృప్తిగా నవ్వుకున్నాడు. ఆ రోజు కంటి నిండా నిద్రపోయాడు.

వరుసబద్ద తరువాత ఇక మనం ఆగమన్నా ఆగవు పరిస్థితులు. రాను రాను సింగన్నకు ఊపిరి పీల్చుకోడానికైనా వీలు చిక్కడం లేదు. రెండు చేతుల నిండా పనే. ఒకరి తరువాత ఒకరికి – గూడెం వాళ్ళందరికీ 'మజ్జిగ' ఇవ్వలేక సింగన్నకు తల ప్రాణం తోక కొస్తున్నది.

దాదాపు గూడెంలోని వాళ్ళందరికీ మజ్జిగ ఇప్పించడం పూర్తయినట్టే. మజ్జిగ ఇచ్చినంత మాత్రాన మిన్ను విరిగి మీద పడలేదు. కాళ్ళ కింది నేల చీలి పోలేదు. పేర్లు మార్పే తప్ప అడవి బిడ్డల భూములు– వాళ్ళ జాతికి చెందిన వాళ్ళ పేర్లతోనే ఉన్నాయి. కాకపోతే ఆ కాయితాలు దొర భోషాణంలో తలదాచుకున్నాయి. పండిన ధాన్యం దొర గుమ్ముల్లో కునారిల్లుతున్నది.

ఎటుబడి–దొరకళ్ళలో సంతోష కాసారాలు పొంగి పొర్లుతుంటే, ఆదివాసీల కళ్ళలో దుఃఖ సముద్రాలు పోటెత్తుతున్నాయి.

ఓ రోజు ఎవడో తాగుబోతు తప్పుడు కూతలు కూసుకుంటూ వీధిలో వీరంగం వేసుకుంటూ వెళ్ళుతున్నాడు ఆ కూతల్లో 'బినామీ' అన్న పదాన్ని కోకిల కూతలా కూసాడు.

అట్నుంచి వస్తున్న సింగన్న 'బినామీ' అన్నమాట విన్నాడు. సింగన్నకు దాని అర్థం తెలియకపోవడంతో తాగుబోతు వెధవ బతికిపోయాడు. లేకుంటే అక్కణ్ణే వాణ్ణి ముక్కలు ముక్కలుగా నరికి పోగులేసేవాడు.

* * *

ఇంతలో స్థానిక సంస్థల ఎన్నికలొచ్చాయి. అది ఏజెన్సీ ఏరియా కాబట్టి కింది నుండి పై దాకా అన్నీ రిజర్వేషన్ స్థానాలే. 'ఛీ! పిచ్చి సర్కారు... తుగ్లక్ పాలన...! తనలాంటి మోతుబరులకు... భాగ్యవంతులకు చక్రం తిప్పగల సమర్థవంతులకు కనీసం పంచాయితీ బోర్డు ప్రెసిడెంట్ పదవి కూడా లేకుండా చేసారు. కోతికి కొబ్బరికాయ దొరికినట్టు అడవి పుత్రులకు అధికారం దొరికితే ఇంకేమన్నా ఉందా? అంతా అడవి.... ఆగమాగం.' అనుకుంటూ చిరాకు పడ్డాడు దొర.

అనుకుంటుండగానే ఎన్నికలు దగ్గర పడనే పడ్డాయి.ప్రచారం జోరందుకుంది.హోరందుకుంది. ఏ పార్టీ అన్నది ముఖ్యం కాదు. ఏ అభ్యర్థి అన్నది కూడా ముఖ్యం కానే కాదు. ఒక కుక్కను నిలబెట్టి 'అంతా ఆ కుక్కకే ఓటెయ్యండి' అని దొర చెబితే అంతా కళ్ళు మూసుకొని కుక్కకు ఓటేసి తమ జన్మ ధన్యమైందని అనుకుంటారు. పంచాయితీ బోర్డు ప్రెసిడెంట్ గా కుంజ పాపయ్య ఎన్నికైనాడు. సమితి ప్రెసిడెంటుగా (అప్పటి కింకా మండలాలు రాలేదు) జవ్వాజి యీరయ్య ఎన్నికైనాడు. జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పూనం రోషయ్య ఎన్నికైనాడు.

పార్టీల కతీతంగా, జెండాల కతీతంగా, మురాల కతీతంగా ఎన్నికైన అభ్యర్థులంతా తాము దొర మనుషులం మాత్రమే అని ఏకగ్రీవంగా విశ్వాసాన్ని చాటుకున్నారు.

ఉత్త మాటల్లోనే కాక చేతల్లో కూడా తమ నమ్మినబంటు తనాన్ని చాటుకునేందుకు ఒకరిని మించి ఒకరు పోటీ పడ్డారు. కోడి కూత కంటే ముందే లేచిన పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు హుటాహుటిగా దొర ఇంటికి వెళ్ళి దొడ్లోని గేదెల పాలుతీసి ఇచ్చి దొర కనుసన్నల్లోనే ఉన్నానని చాటుకున్నాడు. పంచాయతీ సమితి ప్రెసిడెంటు వారానికి ఏ ఒక్క రోజు పంచాయతీ సమితి కార్యాలయానికి వెళ్తాడో లేదో కాని దొర తోటల చుట్టూ, చేల చుట్టూ రంచనుగా నాగా లేకుండా మాత్రం తిరుగుతాడు. తోటల్లో 'కాపు' కు ఏ చీడ పట్టిందో ఏ మందు పిచికారీ చెయ్యాలో దొరకు నిత్యం 'రిపోర్టు' సమర్పిస్తాడు. ఏ చేలో పిట్టలు వాలుతున్నాయో, ఏ చేలను అడవి పందులు ముట్టెలతో తవ్వుతూ సర్వనాశనం చేస్తున్నాయో మొదలైన విషయాలు దొరకు విన్నవించుకొని అతని మన్నన పొందుతాడు. జిల్లా పరిషత్ ఛైర్మన్ స్వయంగా జీపులో వచ్చి దొరను కలుసుకుంటాడు. ఎవరు అస్మదీయులో ఎవరు తస్మదీయులో దొరనడిగి తెలుసుకుంటాడు. ఏ ఏ పనులకు టెండర్లు

పిలవాలో....ఏ కాంట్రాక్టర్లకు 'కాంట్రాక్టు' ~~అప్పజెప్పాలో...ఏ~~ ప్రాంతాలకు రోడ్లు వేయాలో, ఏ ఏ గ్రామాలకు నీటి వసతి కల్పించాలో...అన్ని విషయాల్లోనూ దొర సూచించిందే ఫైనల్. కమిషన్లు, పర్సంటేజీలు...గిట్టని వాళ్ళు అనే 'లంచాలు' అన్నీ దొర బ్యాంకు అకౌంట్లో జమ అయి బ్యాలన్సులుగా మారుతాయి.

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు కూడా 'డిటో' నే. ఏజెన్సీ ఏరియా అంతటా దొరదే హవా. ఎం.ఎల్.ఏ. గా కొమురం ముత్తయ్య, ఎం.పీ గా వాసం సమ్మయ్య ఎన్నికయ్యారు. ఎన్ని కయ్యారు అనడం కంటే దొరే వాళ్ళను ఎంపిక చేసాడు అంటే వాస్తవికతకు దగ్గరగా ఉంటుంది.

ఓ సారి దొర మందీ మార్బలంతో మర్కోడు, గుండాలకు బయలుదేరాడు. దట్టమైన అడవి. ఇరుకుగా, మెలికలు తిరిగిన కొండ దారి. సింగన్న అడ్డబట్ట నుండి నిక్కర్లలోకి మారినట్టే ఇప్పుడు నిక్కర్ల నుండి ప్యాంటూ,షర్టుల్లోకి మారాడు. నూనూగు మీసం లోంచి కోర మీసం లోకి మారినప్పుడు ఇవన్నీ తప్పవు కదా. ఇవి గమనించిన దొర సింగన్నకు ప్రమోషన్ ఇచ్చాడు. చల్ల చిలకడం, వెన్న తీయడం, పశువుల కొట్టంలోని పేడ తియ్యడం, కసవు ఊడ్చడం...అన్నీ ఓ బుడ్డోడికి అప్పగించాడు దొర. తన సొంత ఖర్చులతో డ్రైవింగ్ నేర్పించాడు. డ్రైవింగ్ లైసెన్సు ఇప్పించాడు.ఇంక కిరాయి డ్రైవర్ అవసరం లేదు. ఇప్పుడు సొంత మనిషే తన జీపు డ్రైవర్. ముట్టకుంటే అంటుకు పోయే రకం సింగన్న. డ్రైవింగ్‌లోని ఆనుపానులన్నీ ఇట్టే ఆకళింపు చేసుకున్నాడు. డ్రైవింగ్ చెయ్యడంలో ఆరితేరాడు. రహదారి ఇరుకుగా, గతుకులతో... ఎట్లున్నా చాలా నేర్పుగా జీపు నడుపుతున్నాడు సింగన్న.

ఇంతలో అనుకోని అవాంతర మొకటి వచ్చి పడింది. దారి కడ్డంగా పెద్ద పెద్ద రాళ్ళు పెట్టారు ఎవరో. వాటిని తొలగించుదామని జీపు దిగబోయాడు సింగన్న.

'నువ్వెందుకులే అబ్బయ్యా! మేం ఉన్నం కదా. చిటికెలో పనైపోతది...'జీపు దిగి, పంచెల గోచీలు సవరించుకుంటూ బండ రాళ్ళ దగ్గరకు వెళ్ళారు ఎంఎల్యే-ఎంపీనూ. చెరొక పక్క నుంచొని ఒక్కొక్క బండరాయనే దారి నుంచి తొలగించారు.

తాము ఎంత ఎదిగినా ఒదిగే ఉంటామని, నిష్కళంకమైన తమ ప్రభు భక్తి చాటుకోవాలని తెగ ఆరాట పడే గిరిజన ప్రతినిధుల వరసలో వీళ్ళిద్దరూ మొట్ట మొదట ఉంటారు.

కింది నుంచి పైదాకా అంతా తన వాళ్ళే ఉన్నాక- తానేం చెయ్యాలన్నా అడ్డే ముంటుంది?

ఇక గిరిజన సంక్షేమం మొదలైంది. నిధులు వెల్లువెత్తాయి. గిరిజనులకు తోటలంటే యిష్టం కదా? మామిడి మొక్కలు, బత్తాయి మొక్కలు...కొబ్బరి మొక్కలు, సపోటా మొక్కలు...లారీల కొద్దీ దిగాయి. 'ఇవన్నీ ఎవరి కోసం?' అని ఎవరైనా అమాయకంగా అడిగితే ఫెళ్ళున నవ్వుతారెవరైనా...ఇంత చిన్న విషయం కూడా తెలీదా? అన్నట్టుగా వాళ్ళ వైపు జాలిగా చూస్తారు. జుట్టు పీక్కోడం అడిగిన వాళ్ళ వంతవుతుంది.

మరీ యింత చౌకబారు మొక్కల్తో ఏమొస్తుంది? బురద మడుగులో చేపలు పట్టితే ఏం గిట్టుబాటవుతుంది. అన్న ఆలోచన గిరిజనుల మెదడులోకి బట్వాడా అయింది. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా అన్న సామెతను ససేమిరా ఒప్పుకోడు దొర. గిరిజనులు తలచుకుంటే దేనికీ కొదవలేదు అన్నది ఇప్పటి సూక్తి అని గట్టిగా నమ్ముతాడు దొర.

గిరిజనుల ఆలోచన ఆచరణ లోకి రావడానికి ఎంతో కాలం పట్టలేదు. కానైతే లారీల్లో దిగుమతి అయిన శాల్తీల రూపురేఖలు మాత్రం మారాయి. ఈసారి జెర్సీ గేదెలు లారీల్లో వచ్చాయి. ఒక్కో గేదె ఏనుగులా ఉంది. ఎన్ని కిలోల దాణా తింటాయో...తిన్నప్పుడు గానీ తెలియదు. పొదుగులు మాత్రం గోవర్ధనగిరి పర్వతాల్లా ఉన్నాయి. పూటకు పది లీటర్ల పాలు చులాగ్గా యిస్తాయి. 'ఇక గిరిజనుల ఇండ్లలో పాలేపాలు! పాల సముద్రాలొచ్చి గిరిజనుల గుడిసెలోల పోటెత్తుతాయి' అంటూ ప్రచారం చేస్తున్నారు అధికార్లు. దేనికైనా ఓ ధర ఉంటుంది కదా! ధర లేని దానికి విలువేమి ఉంటుంది? అనుకుంటూ సమృద్ధిగా అధికార్ల చేతులు తడిపి తన విలువ పెంచుకుంటాడు దొర.

ఎంతైనా దొరది జాలిగుండె కదా! తన చేలల్లో గిరజనులు రెక్కలు ముక్కలు చేసుకుంటూ చెమటోడ్చటం చూడలేకపోతున్నాడు దొర. ఎండలో వానలో మరీ యింత గొడ్డు చాకిరీ చెయ్యడం దొరకు మాత్రం యిష్టమా. వందల ఎకరాల భూముల్ని యీ బక్క సన్నాసులు సాగు చేయగలరా? అందుకే ఓ ట్రాక్టర్ కొన్నాడు. అది అలాంటి యిలాంటి ట్రాక్టరు కాదు. ఆంబోతులా ఉంది. బైలారస్. రష్యా తయారీ. గూడెంలోకి తీసుకొచ్చినప్పుడు గిరిజనులు భయపడ్డారు. 'ఏందిరా యిదీ?' అనుకొని ఒకరి మొఖాలు ఒకరు చూసుకున్నారు. భయపడ్డారు, బెదిరిపోయారు....ట్రాక్టరు సింగన్న అధీనంలోకి రాగానే క్రమంగా తేరుకున్నారు.

దొర సాధారణంగా కార్లలో తిరగడు. ఆడంబరాలు దొరకు నచ్చవు. ఎప్పుడైనా బంధువులొస్తే మాత్రం తప్పదు. బంధువు లంటే భార్య తరపు వాళ్ళు. అత్తా, మామ, వదినెలు, మరదళ్ళు, షడ్డకులు, బావమరుదులు ఓ పెద్ద బలగం! వాళ్ళొచ్చినప్పుడు మాత్రం దొర పూర్తిగా మారిపోతాడు.మామిడి తోటలను, కొబ్బరి తోటలను, బత్తాయి తోటలను, సపోటా తోటలను చూపించడానికి కార్లలోనే తీసుకెళ్తాడు.

తోటలను బంధువులకు చూపించేప్పుడు దొర ముఖంలో కించిత్ దర్పం మెరిసి పోతుంటుంది. దర్పానికి కొంచెం గర్వం కూడా తోడవుతుంది.

'చూడండి...యీ పండ్ల తోటలు...వందల ఎకరా నల్లరేగడి చేలు అన్నీ...అన్నీ...మనవే...మన సొంతమే...' అంటూ చిద్విలాసంగా నవ్వుతాడు దొర.

బంధువులు ఆశ్చర్యంతో కొయ్యబారినట్టవుతారు.

ఓ సారి 'యివన్నీ....గిరిజనుల దగ్గర ఎలా కొనగలిగావు?' అని అడిగాడు షడ్డకుడు.

దొర నవ్వే అతనికి సమాధానమైంది.

'అది కాదు బ్రదర్! గిరిజన చట్టాలుంటాయి కదా...? మరి యింత భూమి కొనడం ఎలా సాధ్యమైంది?' షడ్డకునికి అంతా చిత్రంగా, అయోమయంగా ఉంది.

'పిచ్చి సన్నాసులున్నంత వరకు ఏ గిరిజన చట్టమూ మనల్నేం చేయలేవు బ్రదర్! డబ్బు నాగ స్వరం లాంటిది. అది వూదితే ఎలాంటి ఆఫీసు పాములైనా పడగలెత్తి ఆడాల్సిందే....' షడ్డకుని ముందు తన ప్రయోజకత్వానికి కొంచెం మెరుగు పెట్టి ప్రదర్శించాడు దొర.

చివ్వున తలెత్తి చూసాడు డ్రైవింగ్ సీట్లో ఉన్న సింగన్న. దొరలో ఏదో తేడా కనిపిస్తున్నది. ఎప్పుడూ తాను చూసే దొర కాదని మనసులో

అనుకున్నాడు సింగన్న.

కాలం పొరలు పొరలుగా రోజుల్ని విడుస్తున్నది. సూర్యుణ్ణి కప్పేసిన మబ్బు పింజలు తొలగిపోతున్నాయి. రాత్రుళ్ళలో చుక్కలూ, చంద్రుడూ ఆకాశ వీథుల్లో నిర్భయంగా సంచరిస్తున్నారు.

సింగన్న మెదడులో ఆలోచనలు పోటెత్తుతున్నాయి. ఇన్నాళ్ళూ దొర అసలు ముఖం కనిపించకుండా దాచిన ముసుగు క్రమంగా తొలగిపోతున్నది. సింగన్నను ఆవరించిన మైకం కూడా కొంచెం కొంచెం కరిగిపోతున్నది. దొర ఆవు తోలు కప్పుకున్న పులి అని తెసుకునే లోపే జరగవలసిన నష్టమంతా జరిగిపోయింది. ఓహ్! ఇన్నాళ్ళూ తనెంత మత్తులో దొగాడుతున్నాడు! తన జాతికెంత ద్రోహం చేసాడు! బంగారం పండించిన తమ చేలల్లోనే ఇప్పుడు తాము పొట్ట కూటి కోసం కూలీలుగా చెమటోడ్చవలసి వస్తున్నది. అమాయక గిరిజనుల పొట్ట గొట్టి- తన ముందే - లక్షలకు లక్షలు ఆర్జించాడు దొరోడు. చేతులు కాలినంక ఆకులు పట్టుకున్నట్టు ఉంది తన పరిస్థితి అనుకున్నాడు సింగన్న.

సాధారణంగా సోమరితనంతో - బద్ధకంగా గుడిసెలో పడిఉండడు సింగన్న. దొరను చూడందే- పలకరించందే ఒక్క క్షణమైనా ఉండలేదు సింగన్న. అలాంటిది పది రోజులవుతున్నది సింగన్న దొర కొంపకు వెళ్ళక.

బయట ఏదో అలికిడయ్యేసరికి సింగన్న ఆలోచనలు తెగిపోయాయి. పది పదిహేను మంది-అంతా తన యీడు వాళ్ళే. బిల బిల మంటూ గుడిసెలోకి వచ్చారు. వాళ్ళను చూసి సింగన్న ముందహాసం చేసాడు.

'మన మనుకున్నదంతా గ్యాపకమున్నది కదా..?' వచ్చిన వాళ్ళ వైపు చూస్తూ అన్నాడు సింగన్న.

అంతా 'ఉంది' అన్నట్టుగా తలలూపారు.

'గింత సుత పొల్లుపోవద్దు. అంతా మనమనుకున్నట్టే జరగాల' తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెబుతూ హెచ్చరించాడు సింగన్న.

'నువ్వైతే అన్ని సంగతులు యిగురంగ అడుగుతవ్! రారాదె...' అన్నాడు వచ్చిన మిత్ర బృందంలోంచి ఒకడు.

'ఇప్పుడు గాదు. నేనొచ్చే టైం ముందున్నది. మీరెల్లండి. ధైర్యంగ అడగండ్రి' మిత్రులకు ధైర్యం నూరిపోస్తూ అన్నాడు సింగన్న.

దృశ్యం దొర యింటికి మారింది.

'ఏంద్రో...? ఏందో...అంతా కట్టకట్టుకొని వచ్చిండ్రు?' దొర కనుబొమ్మలు ప్రశ్నార్థకంగా ముడివడ్డాయి.

'దొరా...గూడెంల కడాకర్కి తలకాయ నొప్పి వచ్చినా మందిచ్చేటోడు లేడు. మనం గూడెంల దోమల తోటి, ఈగల తోటి పెద్ద పెద్ద రోగాలొస్తుండయ్. కొత్తగూడెమో-యిల్లెందో తీస్కపోతుంటే దార్లెనే పానాలిడ్సినోల్లు చాలా మంది వున్నరు.' లచ్చుమయ్య గొంతు సరాయించుకొని అన్నాడు.

'అయితే?' తీక్షణంగా చూస్తూ అన్నాడు దొర.

'అయితే ఏం లేదు. మన గూడెంకు ఆసుపత్రి వస్తె బాగుంటదని...' నసిగాడు లచ్చుమయ్య.

గుండెల్ల పిడుగు పడ్డట్టు అదిరిపడ్డాడు దొర.

ఓర్నా కోయ కొడకల్లారా! ఎంత తెలివి మీరి పోయిండ్రురా మీరు? ఇవ్వాళ ఆసుపత్రి అంటరు. అంతటితో ఆగుతరా? ఆగరు. రక్షిత నీటి పథకం కావాలంటరు. బడి కావాలంటరు. పశువులకి ఆసుపత్రి, పోలీసు స్టేషను, పోస్టాఫీసు...ఇంకా ఇలాంటివే ఏవేవో గొంతెమ్మ కోర్కెలు...గియన్ని ఒస్తే యీ అలగా జనం యిక తన చెప్పుచేతల్లో ఉంటారా?

ఉక్రోషం లోలోపలే మింగుకుని 'ఐతే నన్నివ్వుడేం చెయ్యమంటారు?' సూటిగా ప్రశ్నించాడు దొర.

ఇల్లెందు-కొత్తగూడెం రోడ్డు నానుకొని ఓ ఆరెకరాల చేనుంది కదా! ఆసుపత్రికి అదివ్వండి చాలు. ముందు స్థలం చూపిస్తేనే గాని ఆసుపత్రి మంజూరు చెయ్యరట.

'ఆ స్థలంల దొరసాని బిల్డింగు కట్టాలని అనుకుంటున్నది...' అన్నాడు ఆ స్థలం యివ్వడం కుదరదు అన్నట్టుగా చూస్తూ.

'ఎవరి సొంత జాగా అని అందుల బిల్డింగు కట్టుతరు?' స్వరం పెంచి అన్నాడు రాజయ్య.

రాజయ్య మాటలకు- దొరకు ముచ్చెమటలు పోసాయి.

'ఏందిరో ఇయ్యాల కొత్త కొత్తంగ మాట్లాడబట్టిండ్రు? మా సొంత జాగలనె బిల్డింగ్ కట్టుకుంటం. మీకేం నొప్పి?' అసహనంగా అన్నాడు దొర.

'ఇక్కడ సెంటు బూమి సుత మీ సొంతం కాదు. అంతా మాది. మా కోయలది. గా బూమి మీరియ్యకుంటె మేమే తీసుకుంటం. రేపే పునాది రాయి ఏత్తం..ఏం జేస్కుంటవో చేస్కో' అన్నాడు రాజయ్య.

'ఆహా!అంత దూరమొచ్చిందా యవ్వారం? ఎవడొత్తడో రాండిరా! తుపాకితో పిట్టల్ని కాల్చిపారేసినట్టు కాల్చేస్తాను...దమ్మున్న మొగోడెవడో...నా భూమిల ఎట్ల కాలు పెట్టుతాడో...చూస్తా' పట్టరాని ఆగ్రహంతో వూగిపోతూ అన్నాడు దొర.

చూస్కుందం అంటే చూస్కుందం అని సవాళ్ళు, ప్రతిసవాళ్ళు జరిగాయి. యువకులంతా వెనుదిరిగి పోయారు.

తెల్లవారడమే ఆలస్యం. దొర తన బలగాన్నంతా తీసుకొని రోడ్డు సమీపంలోని తన స్థలంలోకొచ్చాడు. అప్పటికే అక్కడ జనం మొహరించి వున్నారు.

'ఛీ యిలాంటి మంచి సమయంలోనే సింగన్నకు జ్వరం రావాలా? పది పదిహేను రోజుల నుంచి ఐపు లేడు. సింగన్న ఉంటే ఒక్కడే యింత మందికి జవాబు ఇవ్వగలిగేవాడు' అనుకున్నాడు దొర.

'ఆఖరు సారిగా హెచ్చరిస్తున్నా. మర్యాదగా స్థలం ఖాళీ చేసి వెళ్ళిపొండి. లేకుంటే మీ గుండెల్లో తుపాకి గుండ్లు దిగుతయ్' అంటూ తుపాకి ఎత్తాడు దొర. గురిపెట్టేందుకు తుపాకి మడమ భుజం మీద పెట్టుకొని, ఒక కన్ను మూసి గురి చూస్తున్నాడు.

ఇంతలో సముద్రపు హోరులా కేకలూ, పెడబొబ్బలూ వినిపించాయి. ఎత్తిన తుపాకి దింపి ఎదరకు చూసాడు.

అందరి కంటే ముందున్నాడు సింగన్న. చేతిలో యమదండంలా ఎక్కుపెట్టిన విల్లమ్ములున్నాయి. తన కళ్ళను తానే నమ్మలేకపోతున్నాడు దొర. కళ్ళు నలుముకొని చూసాడు. సింగన్న వెనక వరసలో అర్ధచంద్రాకారంగా నుంచొని ఎక్కుపెట్టిన విల్లమ్ములతో గూడెంలోని యువతీ యువకులున్నారు. వారి వెనక తనకు తెలిసిన గూడెం జనమంతా వున్నారు. అందరి చేతుల్లోనూ ఎక్కుపెట్టిన విల్లమ్ములున్నాయి...

కథ

నెంబర్ 11045

- ఎన్.డి.

అమ్మలారా, అయ్యలారా...మా నెంబర్ 11045 మీకు ఎక్కడైనా కనిపించాడా? కనిపిస్తే మాకు తప్పక చెప్పండి. తప్పిపోయి రెండ్రోజులు అవుతుంది కనుక తొడుక్కున్న తెల్ల కుర్తా, పైజామా కొద్దిగా మాసిపోయి ఉండొచ్చు. బక్కగా, ఒంట్లో చెటాకు మాంసం లేనట్టు ఉంటాడు, వయసు 35-40 మధ్య ఉంటుంది గానీ యాభై ఏళ్లవాడిలా కనిపించినా కదిపి చూడండి. అన్నిటికంటే మావాడిని గుర్తుపట్టాలంటే మార్గం అతన్ని పేరు అడిగితే తప్పకుండా నెంబర్ 11045 అని చెప్తాడు. తల్లులారా, మావాడు ఇప్పటికే జీవితంలో చాలా కష్టాలుపడ్డాడు, ఇప్పుడు తప్పిపోయి ఇంకెన్ని కష్టాలు పడుతున్నాడో తలచుకుంటేనే కడుపు తరుక్కుపోతుంది. అన్నలారా, మావాడి ఆచూకీ మీకు ఎక్కడ కనిపించినా తప్పక మాకు తెలియజేయండయ్యా....ఇన్షాఅల్లా మావాడు తప్పక దొరుకుతాడు...మా పతా కింద ఇస్తున్నాం...

* * *

2002 మా అందరి జీవితాల్లోనూ తెచ్చిన మార్పు ఎంత చెప్పినా మీకు పూర్తిగా అర్థమౌతుందని నాకు అన్పించడం లేదు. ఎందుకంటే ఆ మార్పు ఏదో ఒకదాంట్లో అయితే వివరించొచ్చు. మొత్తం మా జీవితాల్నే అల్లకల్లోలం, తలకిందులు చేసిన ఏడాది అది. పెద్ద వరద వచ్చి చెట్టు మీదున్న పిట్టగూడును అమాంతం ముంచెత్తి దాన్నీ, అందులోని పిట్టపిల్లల్నీ నిర్దాక్షిణ్యంగా నీటి ప్రవాహంలోకి తోసేస్తే ఆ పిట్టల జంట పరిస్థితి ఎలా ఉంటుందో మాదీ దాదాపు అలాంటి స్థితే. వరద తీసేశాక చూస్తే పిట్టపిల్లలు చనిపోయాయి, కొన్ని పిట్టలూ కానరాకుండా పోయాయి. మేట వేసిన నేలా, వరదనే కాదు నీళ్లంటేనే గజగజ వణికే భయమూ మాత్రం మిగిలాయి.

ఈ ప్రకృతి జీవమున్న ప్రతి ప్రాణికీ ఏమి పాలిచ్చి పెంచిందో గానీ ఎన్ని బీభత్సాలు, భయంకరమైన అనుభవాలు ఎదురైనా జీవించి వున్న ప్రతి ప్రాణీ తన జీవనాన్ని కొనసాగించడానికి మరుక్షణం నుండే ప్రయత్నం మొదలెడుతుంది. మనుషులమూ ఆ పాలే తాగాం కనుక మనమూ అంతే. లేకుంటే ఎన్ని యుద్ధాలు, ఎన్ని బీభత్సాలు, ఎన్ని ప్రకృతి వైపరీత్యాలు, ఎన్ని మానవహననాలు...ప్రతిసారీ మనుషులు వీటన్నిటినీ జీవితం ద్వారా ఎదుర్కొనే ప్రయత్నమే చేశారు. మేమూ అంతే. మాకెదురైన 2002ని జీవితం ద్వారానే ఎదుర్కొని నిలదొక్కుకునే ప్రయత్నం చేశాం.

నాకు ఒకోసారి అన్పిస్తది మాపై జరిగిన అకృత్యాలకు మేం ఆత్మహత్యలైనా చేసుకుని ఉండాలి లేదా మా జీవితాల్ని చెల్లాచెదురు చేసినవారిని హత్యలైనా చేసి ఉండాలి అని. కానీ మేం రెండూ చేయలేదు. వరదనీరు తీశాక తలలు లేపిన గడ్డిపరకల్లా మేం మెల్లగా ఆ రక్తపుమడుగుల్లోంచి తలలెత్తి మా చుట్టూ చూశాం. సందేహం లేదు, శ్మశానం మధ్యనే వున్నాం. అక్కడి నుండే మెల్లగా లేచి మా జీవితపు ముక్కల్ని ఏరుకోవడం మొదలెట్టాం. అది ఇప్పటికీ పూర్తి కాలేదు. బహుశా ఇప్పట్లో పూర్తి కాదు కూడా, మరీ ముఖ్యంగా మే 16, 2014 తర్వాత నాకు నమ్మకం తక్కువే.

క్రీచుమంటూ ఆగిపోయిన మా జీవితం బండి ఒక్కో మిల్లీమీటరు కదలడం మొదలైంది. దానికీ 2002కు అనివార్యమైన కొనసాగింపుగా ఎన్నో ఆటంకాలు, అవాంతరాలు. అవి 2002లో మా శరీరాల మీద అయిన కాలిన గాయాల మచ్చల్లా మాకు జీవితాంతం మోసుకుతిరగాల్సిన వాటిగా మారిపోయాయి. మేం ఊపిరి పీల్చినంత సహజంగా వాటికి అలవాటుపడ్డాం.

1948 తర్వాతి విషయాల్నే మాట్లాడుకుందాం. ఇది మీ దేశం కాదు అని పరిపాలకులు కొందరు మాకు బంగ్లాదేశ్ తీరాన వచ్చితీరే తుఫాన్లలా ప్రతి పదేళ్లకూ, ఐదేళ్లకూ, కాలవ్యవధి ఎంతైనా గానీ క్రమం తప్పకుండా అర్థం చేయించే ప్రయత్నం చేసినా దేశాన్ని విడిచివెళ్లడం ఒక పరిష్కారంగా మాకు ఎన్నడూ కనిపించలేదు. అక్కడ ఎటువంటి బతుకు ఉందిలే అని కాదు, అసలు మాదైన నేలను, దాని మీదే అంకురించి, దానితోనే ముడిపడిన మా జీవనాకాంక్షనూ మేం ఎందుకు వదిలి వెళ్లాలి అనేదాంతో. అందుకని మేం ఇంకా ఇక్కడే ఛిద్రమైన మా జీవితపు ముక్కల్ని ఏరుకోవడంలో మునిగిపోయి వున్నాం. మాకు నీడలాగ నిరంతర సహచరిగా మారిన భయాన్నీ ఈ జీవితపు ముక్కలతోనే ఎదుర్కొనే ప్రయత్నం చేస్తూ వున్నాం.

మా ప్రాణాలు, శరీర అంగాలు, మా నేల, మా ఇండ్లు, మా చిరుఆస్తులు, మా వృత్తులు, మా ఇతర మతాల స్నేహితులు, మా ఆత్మగౌరవం, మా పరువు మర్యాదలు, మా భద్రత, మా చిన్న చిన్న పండుగపూట సంతోషాలు, మా ప్రశాంతమైన నిద్ర...ఎన్నెన్ని లాక్కున్నారు! అయినా మేం జీవితాన్ని వదిలిపెట్టలేదు. మృత్యుహేలకు జీవితాన్ని ఎదురుగా నిలిపి, నిరాశకు ఆశను ఎదురుగా నిలిపి మేం బతుకుతూనే వున్నాం. ఆశ అంటే పరిస్థితి ఏదో మారుతుందనే ఆశ కాదు. అదింకా అధ్వాన్నంగా మారదేమో అనే దురాశా కాదు. కేవలం ఈ ప్రకృతి తాపిన పాలు తాగడం వల్ల మానవసహజంగా జీవితంతో ఉండే తెంచుకోలేని ఒక బంధం అంతే. దాన్నే ఆశ అన్నాను.

మా జీవితపు ముక్కల్ని మేం ఏరుకోబట్టి పదేళ్లకాలం ఎప్పుడో దాటిపోయింది. ఈలోపు రాష్ట్రంలో రెండుసార్లు ఎన్నికలు జరిగాయి. రెండుసార్లూ ఏ మార్పూ లేకుండా 2002 నాటి మనుషులే ఎటువంటి అడ్డంకీ లేకుండా గద్దెనెక్కారు. అంతే మార్పూ లేకుండా మా భయం నీడ మా వెంటే కొనసాగుతున్నది నిత్య సహచరిగా.

కొన్నేండ్లుగా వాళ్ల చూపు ఢిల్లీ వైపు. అందుకని మా మీద దాడులూ, మారణహోమాలు తిరిగి ఇక్కడ జరగలేదని చూపించుకోవడం వారికి అవసరం కావచ్చు అన్నారు కొందరు. కానీ నిజానికి మా నేల నుండి, మా ఆస్తుల నుండి, వృత్తుల నుండి తరిమేసే క్రమం 2002లోనే దాదాపు పూర్తయిపోయాక, భయాన్ని నీడగా వాళ్లు మా వెంట వదిలేశాక మళ్లొక 2002 వాళ్లకు అప్పుడే ఎందుకు అవసరమౌతుంది? రేపు ఢిల్లీలో కూర్చున్నాక అవసరమైతే 2002 లాంటి కత్తిని ఒరలోంచి

లాగడానికి ఎంతసేపు పడుతుంది! అంతేకాదు 2002 మా దగ్గరకు మళ్లీ రాకపోయినా దేశంలో తిరుగుతూనే ఉందనీ, ఉత్తరప్రదేశ్‌లో ఈమధ్యే చక్కర్లు కొట్టిందనీ, ఎన్నికల ఫలితాలు వచ్చాక మహారాష్ట్ర నుండి అసోం వరకూ సుడిగాలి పర్యటనలు చేస్తోందనీ విన్నాను. కాబట్టి మేధావులు ఏం విశ్లేషణలు చేసినాగానీ మా భయం నీడ మాత్రం మమ్మల్ని వదలకుండా వెంటే తిరుగుతోంది.

అగో, అలాంటి సమయంలో మా బస్తీకి తిరిగి వచ్చాడు నెం.11045. అతను 2003లో ఒకరోజు రాత్రిపూట మాయమై, క్షమించండి, మాయం చేయబడి తిరిగి వచ్చేనాటికి పదకొండేళ్లు పట్టినా, ఈలోపు మేం మా జీవితపు ముక్కల్ని పావువంతు కూడా ఏరుకోవడం పూర్తికాలేదు.

నెం.11045 మా బస్తీకొచ్చిన రోజు నేనింట్లో లేను. 2002లో మేం కొంత వైభవంగానే నివసిస్తుండిన, ఒకప్పుడు మాది కూడా అనుకున్న నగరంలో మిగిలిపోయిన కొన్ని జీవితపు ముక్కలేమైనా దొరుకుతాయేమో అన్నట్టు నూట ఒకటోసారి ప్రయత్నం చేద్దామని పోయాను. నూట రెండోసారి ఉత్తిచేతులతో వెనక్కి వచ్చేటప్పటికి మా ఇంట్లో, మొహల్లాలో, బస్తీ అంతటా ఒకటే చర్చ - నెం.11045 తిరిగి వచ్చాడు అని.

2002 తర్వాత కొంతమంది లాయర్లు మాకు కేసుల విషయంలో సహాయం చేస్తూనే వచ్చారు. అలాంటి లాయర్లలో ఒకరు మాతో అంతకు ముందే అని వున్నారు - 'దేవాలయంపై దాడి కేసులో జైల్లో పడేసిన నలుగురినీ నిర్దోషులుగా గుర్తించి కోర్టు విడుదల చేసేదే ఉంది త్వరలో' అని. అలా మాకు ముందే కొంత విడుదల గురించిన వార్త తెలిసినప్పటికీ గేటు బయటే తిరిగి కొత్త కేసులతో లోపలకు తోయడం పడమరన సూర్యుడు ఉదయించడం అంత అసహజం ఏం కాదు కనుక మాకు మనిషిని చూసేవరకు నమ్మకం లేదు. ఆ నలుగురిలోనూ నెం.11045 మా మొహల్లావాడే. అందుకని ప్రతి ఒక్కరి నోటా అతని వూసే.

ఏ నేరం చేయకుండా కేవలం మాలో పుట్టినందుకు లేదా మాలో పుట్టడం అనే నేరం చేసినందుకు అతన్ని తప్పుడు కేసు పెట్టి జైల్లో తోసేశారు అనేది మేం మా నేల నుండి తరమబడ్డాక వచ్చిపడ్డ ఈ మొహల్లాలో 2002 తర్వాత పుట్టిన పిల్లలకు కూడా ఉగ్గుపాలతోనే తెలిసిన సత్యం.

'ఒకటా రెండా పదకొండేళ్లు! హసన్ భయ్యా ఎంత పాడైపోయాడు, కళ్లలో వెలుగు లేదు, ఒంట్లో మాంసం లేదు, జుత్తంతా పండిపోయింది, పోలిక లేకుండా మారిపోయాడు. ఎంత చలాకీగా అందరికీ తలలో నాలుకగా ఉండేవాడు....' నా కోడలు హసీనా రోటీలు చేస్తున్నంతసేపూ ఇలా ఏదో ఒకటి అంటూ వాపోతూనే ఉంది. నా మనుమలు రషీద్, మహమూద్, చిన్నారి రెహనా...తమ పళ్లేల్లో వేడిగా పడుతున్న రోటీలను ఎప్పట్లా ఆత్రంగా తినకుండా, వాళ్లమ్మీకేసి కళ్లూ, చెవులూ అప్పగించి చూస్తున్నారు.

హసన్ భయ్యా అంటే నెం.11045నే. లేదా నెం.11045 అంటే హసన్ భయ్యానే. విడుదల అయ్యాక అతన్ని ఎవరు పేరు అడిగినా ముందు నెం.11045 అని చెప్పి, ఇంకా రెట్టిస్తే 'నువ్వు చెప్పు' అన్నట్టుగా తమ్ముడు రజాక్ కేసి చూసేవాడు. తన అన్న తనను మాత్రం మర్చిపోనందుకు ఒకరకంగా సంతోషించేవాడు రజాక్. అలా అలా హసన్ని నెం.11045గా పిలవడం చలికాలం తర్వాత చెట్లు ఆకులు రాల్చినంత సహజంగా మాకూ అలవాటైపోయింది.

2002కు ముందు అతనికీ, అతని తమ్ముడు రజాక్‌కూ కలిపి ఒకప్పుడు మాది కూడా అనుకున్న ఆ నగరంలో ఒక మంచి మార్కెట్ సెంటర్‌లో ఓ దర్జీ దుకాణం ఉండేది. మూడో మనిషి దూరలేనంత చిన్నదే. అయితేనేం, మంచి సెంటర్‌లో ఉండడం వల్ల, అన్నదమ్ముల పనితనం వల్ల దుకాణం బ్రహ్మాండంగా నడిచేది.

2002 నాటికి హసన్, రజాక్‌లు తమ తల్లిదండ్రులను చూసుకునేవారు, అక్కచెల్లెళ్లకు పెళ్లిళ్లు చేశారు. ఇక హసన్ నిఖా కూడా కావల్సి ఉండింది. తర్వాత చెప్పడానికేమీ లేదు. అందరికీ తెలిసిందే. 2002 జరిగింది. హసన్‌కు కూడా అప్పటికి మా అందరికి మల్లే అది ఒక సునామీ మాత్రమే. కానీ ఆ తర్వాత 2003లో మరొక భూకంపం కూడా తన జీవితంలో సంభవిస్తుందని అప్పుడు అతనికే కాదు, మాకెవరికీ తెలీదు.

2002 తర్వాత మా దగ్గరే కాదు దేశంలో చాలాచోట్ల ఏదో ఒక దాడి - దేవాలయం మీద కావచ్చు, రైల్వే స్టేషన్ల మీద కావచ్చు, మార్కెట్లలో కావచ్చు కాల్పుల రూపంలోనో, బాంబు బ్లాస్టుల రూపంలోనే జరుగుతూనే ఉండేవి. కొందరు ఆ దాడులన్నీ 1992, 2002 వల్లే లేదా అలాంటి వాటివల్లే ప్రధానంగా జరిగాయని అంటారు. నిజమా కాదా నిర్ధారించేంత జ్ఞానం నాకు లేదు. జీవితపు ముక్కల్ని ఏరుకోవడంలో తలమునకలైన నాకు తీరికా లేదు. కానీ మాకు అందరికీ స్పష్టంగా అర్థం, అనుభవం అయిన విషయం మాత్రం ఆ దాడుల్లో మేం కూడా చనిపోయాం లేదా గాయపడ్డాం అనేది. కొన్నిసార్లు మేమే ఎక్కువగా చనిపోయాం, గాయాలపాలైనాం కూడా.

అంతకంటే స్పష్టంగా మాకు అనుభవంలోకి వచ్చిన సత్యం ఏంటంటే ఈ అన్ని దాడులు జరిగాక పోలీసులు అర్ధరాత్రులు దాడులు చేసి పట్టుకుపోయింది మాత్రం దేశంలో ఎక్కడైనాగానీ హసన్‌లనూ, సలీంలనూ, మహమూద్‌లనే తప్ప సురేష్‌లనూ, రమేష్‌లనూ, రోహిత్‌లనూ కాదనేది. ఇప్పుడిప్పుడు వీటిలో కొన్నిటిని చేసిందంతా సురేష్‌లూ, రమేష్‌లూ, రోహిత్‌లే అనేది బైటకొస్తోందంటున్నారు. అది మా సలీంలనూ, హసన్‌లనూ, మహమూద్‌లనూ ఎంతమందిని కేవలం 11045 లాంటి సంఖ్యలుగా మార్చేశాక, ఎన్ని యవ్వనాలు కటకటాల వెనుక కడతేరిపోయాక అనేది మాకు వద్దనుకున్నా రాక మానని ప్రశ్న.

ఎందుకంటే 'ఏ గ్రహం నుండి తీసుకొచ్చి నన్ను మళ్లీ ఈ మనుషుల మధ్య పడేశారు, ఇది నేను వదిలిపోయిన ప్రపంచమేనా?' అని కొంత ఆశ్చర్యంగా, కొంత భయంగా, కొంత ఆనందంగా కనిపించిన వారందరినీ ప్రశ్నిస్తూ ఎప్పుడూ ఏదో వెదుకులాడుతూ నెం.11045 మా మొహల్లాలో తిరగుతూండడం అనే దృశ్యం మాకందరికీ ఇప్పటికే రోజువారీగా జరిగే సూర్యోదయంలా అలవాటు అయిపోయింది.

దేవాలయం మీద దాడిలో పాల్గొన్నాడనే ఆరోపణతో పోలీసులు 2003లో ఒక అర్ధరాత్రి హసన్‌ను ఇంటి నుండి ఎత్తుకుపోయారు. క్షమించండి. తప్పు చెప్పినట్టున్నా. ఎత్తుకుపోవడం ముందు, ఆరోపణ తర్వాత.

జరిగిందేంటంటే ఏడాది దాటుతున్నా 'దేవాలయ దాడి నిందితులు' ఏ పోలీసు టీములకూ దొరకలేదు. అందుకని ఒక ప్రత్యేక పోలీసు అధికారిని ఆ పరిశోధన కోసం నియమించారు. నియమించిన ఒక్క రోజులోనే ఆయనకు 'దేవాలయ దాడి నిందితులు' ఒకరు కాదు నలుగురు దొరికిపోయారు. దేశం మొత్తం ముక్కు మీద వేలేసుకుంది.

అది కేవలం ఆయన 'ప్రతిభ' కాదు, అప్పటి రాష్ట్ర హోంమంత్రి, ముఖ్యమంత్రుల 'సామర్థ్యం' కూడా తోడయ్యింది.

కొన్ని నెలల క్రితం పాట్నాలో ప్రధాని అభ్యర్థి ఎన్నికల ప్రచార సభ జరగాల్సి ఉండగా కొన్ని పేలుళ్లు జరిగినప్పుడు, వాటికి ప్రధాన బాధ్యుడిగా అరెస్టయిన, అనుమానితులుగా ప్రకటించిన వారి పేర్లు సురేష్, రమేష్, రోహిత్ లలాగా ఉండడం చూసి నా ముసలి చెవులకు కచ్చితంగా చెవుడు వచ్చేసిందనే అనుకున్నా. అయితే కొన్ని గంటలు కూడా కాకుండానే ఆ కేసులో అరెస్టు అయిన, అనుమానితులుగా ప్రకటించిన పేర్లు సలీం, మహమూద్, రషీద్ లాంటి పేర్లుగా మారిపోయాక గానీ నాకు చెవుడు లేదనీ, నేను కలగనడం లేదనీ, తిరిగి ఈ దేశంలోనే నివసిస్తున్నా అనీ నమ్మకం కలిగింది. మీరు కూడా రోజూ వార్తలు తెలుసుకుంటూ ఉంటే మీకు సందేహం రాదు, పదకొండేళ్ల క్రితం పట్టుకున్న నలుగురి పేర్లు ఏమై ఉంటాయనేది.

అయితే దేవాలయ దాడి నిందితులు దొరికారనే విషయాన్ని ప్రకటించడానికి కొద్ది గంటల ముందు మరో విషయం కూడా రోజూ సూర్యాస్తమయం అయినట్టుగానే సహజంగా జరిగిపోయింది.

హసన్‌ను పోలీసు హవేలీకి తీసుకువెళ్లి సామాన్యంగా చేసే పనులన్నీ చేశాక అంటే కాళ్లు ఎడంగా చేసి ఎక్కితొక్కడం, వేళ్లాడదీసి కొట్టడం, అరికాళ్ల మీద టైర్లతో కొట్టడం, వదిలేశాం పరుగెట్టు అని తూటాలు కాల్చడం లాంటి వారికి రోజూ చాయ్ తాగినంత సహజంగా అలవాటు అయినవన్నీ ఎన్నో చేసేశాక తన కన్నును ఏ వేలితో పొడుచుకోవాలో నిర్ణయించుకునే స్వేచ్ఛను హసన్‌కు ఇచ్చారు.

దేవాలయం మీద దాడి కేసా, రైలుబోగీలు తగలబడి కరసేవకులు మరణించిన కేసా, మెజారిటీ మతంవారిపై దాడి కేసా, ఇంకేదో బాంబ్ బ్లాస్ట్ కేసా...ఏదైనా ఫర్వాలేదు, నీ ఇష్టం అన్నారు. మొన్న 16వ లోక్‌సభ ఎన్నికలకు ముందు 'వోటు వేయండి' అని ఎక్కడపడితే అక్కడ ఎన్నికల కమిషన్ మొదలుకొని సినీస్టార్ల వరకూ, స్కూలు పిల్లలు మొదలుకొని సన్యాసుల వరకూ హోరెత్తిపోతుంటే కూడా నాకు మమ్మల్ని ఇలాగే అడిగినట్టు అనిపించింది – ముందు నుయ్యిలోకి దూకుతారా, వెనుక గొయ్యిలో కప్పెట్టబడతారా ఎన్నుకునే స్వేచ్ఛ మీదే అన్నట్టుగా.

ట్రాఫిక్ సిగ్నల్‌ను కూడా ఎన్నడూ ఉల్లంఘించి ఉండని హసన్‌కు, దుకాణంలో ఎలకలబోనులో పట్టిన ఎలుకను కూడా దూరంగా వదిలి వచ్చే హసన్‌కు ఏకంగా మనుషుల్ని చంపేసిన నేరాల్ని ఒప్పుకోవడం సాధ్యం కాలేదు. దాంతో గూండాలే రిగ్గింగ్ చేసేసి మన ఓట్లు వేసినట్టు పోలీసులే నిర్ణయించారు – దేవాలయ దాడి అయితే మంచిది, ఏడాదికి పైగా మీడియాలో తెగ బదనాం అయితున్నాం, కొత్త సార్‌కు తోసాఫాగా హసన్‌ను బకరాగా ఇస్తే సరిపోతుందని. అలా హసన్ దేవాలయ దాడి నిందితుడిగా, నెం.11045గా మారిపోయాడు.

ఈ పదకొండేళ్లలో హసన్ని నెం.11045గా మార్చినవాళ్లు ఢిల్లీని పట్టుకోవడానికి చేసే సన్నాహాల్లో, వ్యూహాల్లో, ఎత్తుగడల్లో మునిగితేలగా, అవే పదకొండేళ్లలో శరీరమూ, మనసూ, ఆశ, నమ్మకం అన్నీ ఛిద్రమైపోయి యావజ్జీవ శిక్షల/ఉరిశిక్షల తీర్పులను వింటూ తన పేరు ఏ సురేషో, రోహితో కాక హసనో, సలీమో కావడం వల్లే తనకీ గతి పట్టిందనే సత్యాన్ని గరళంలా మింగుతూ అతను ఖైదుగదికీ, కోర్టు గదులకూ మధ్య ఆశకూ, నిరాశకూ మధ్య పెండులంలా ఊగులాడుతూ గడిపాడు. అతని తమ్ముడు రజాక్ జైల్లో లేడన్న ఒక్క మాటే తప్ప అన్ని బాధలనూ అన్నతోపాటే పడ్డాడు, 'దో జిస్మ్ మగర్ ఏక్ దర్ద్ హై హం' అన్నట్టు.

16వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో ఆ పార్టీ, దాని నాయకత్వంలోని కూటమీ భూమ్యాకాశాలు దద్దరిల్లేలా, ఎన్నికల్లో చేసిన వేల కోట్ల రూపాయల ఖర్చుకు కొనసాగింపులాగా కోట్ల రూపాయలతో విజయోత్సవాలు నిర్వహించుకుంటూ ఉండగా, అదే రోజు ఎవరికీ తెలీకుండా నిశ్శబ్దంగా, మౌనంగా హసన్, మిగతా ముగ్గురు దేవాలయ దాడి నిందితులూ తమకు పూర్తిగా అన్‌జాన్‌గా మారిపోయిన మా ప్రపంచంలోకి ఆ పటాసుల పేలుళ్ల మిరిమిట్ల కిందనున్న చీకట్ల నుండి మెల్లగా కాళ్లీడ్చుకుంటూ తిరిగి వచ్చారు. దారిలో లడ్డూలు పంచేవాళ్లు మాదాకా వచ్చి మా బట్టలూ, గడ్డాలూ చూసి లడ్డూలు పంచకుండానే ముందుకు పోయారు. అసలు మావాళ్లు విడుదల అయ్యారా నిజంగానే అనే విషయాన్ని నమ్మడమా నమ్మకపోవడమా అనే మీమాంసలోనే కొట్టుకుంటూ నడుస్తున్న మాకు అవేం పట్టలేదు.

పదకొండేళ్లకు గానీ అత్యున్నత న్యాయస్థానం వారు నేరం చేశారనడానికి ఏ రుజువూ లేదని తీర్పు ఇవ్వకపోవడం వల్ల హసన్‌కు తన పేరు నెం.11045గానే గుర్తుండిపోయింది. పగలు తర్వాత రాత్రి వచ్చినంత సహజంగా ఈ దేశంలోని కోర్టుల్లో ఇలాంటి జీవితాల్ని కడతేర్చేసే అంతటి జాప్యాలు జరిగిపోతూ ఉంటాయనేది మాకు 1947 తర్వాత నుండీ అనుభవం అయిన విషయాలే.

16వ లోక్‌సభ ఫలితాలు వచ్చాయి. ముఖ్యమంత్రి ప్రధానమంత్రి అయిపోయాడు. రాష్ట్ర హోంమంత్రిగా ఉండిన వ్యక్తి ఆయన తర్వాత అత్యంత శక్తివంతమైన వ్యక్తిగా వాళ్ల పార్టీలో ఎదిగిపోయాడు. ఫలితాలు వచ్చి నాలుగు రోజులు కాలేదు. హసన్‌ను, అతని తోటివారినీ నానారకాల చిత్రహింసలకు, భయాలకు, బీభత్సానికీ, భీతావహానికీ, చంపేస్తామనే బెదిరింపులకూ గురిచేసిన, ఒక్కరోజులో 'దేవాలయ దాడి నిందితుల'ని పట్టుకున్న కుఖ్యాతికి సస్పెన్షన్ అనే తూతూమంత్రపు ముసుగు వేసుకున్న ఆ ప్రత్యేక పోలీసు అధికారి ఇక దాన్ని చించుకుని నూతన ముఖ్యమంత్రి ఆశీర్వాదాలతో బాజాప్తుగా బోరవిరుచుకుని పదవెక్కాడు. మా హసన్ వెన్నెముక ఇంకొంచెం వంగింది ఆ వార్త విన్నరోజు.

ఎన్నికల ఫలితాలకు ముందే 2002 కేసుల్లోనూ, దుర్గ అనో, సునీత అనో కాక హసీనా, సలీమా లాంటి పేర్లున్నందుకు బూటకపు ఎన్‌కౌంటర్లయిన వారి కేసుల్లోనూ అప్పటి ముఖ్యమంత్రి, రాష్ట్ర హోంమంత్రులకూ, పోలీసు అధికారులకూ కోర్టులూ, సిట్‌లూ ఒకదానితో ఒకటి పోటీపడ్తూ 'క్లీన్‌చిట్'లు ఇస్తూపోయాయి. కాబట్టి ఎన్నికల్లో అంత భారీ మెజారిటీ దొరికాక ఈ పోలీసు అధికారిని తిరిగి నియమించడం నాకేం కొత్తగా తోచలేదు. రాత్రి కాగానే ఆకాశాన చుక్కలు పొడిచినట్టుగా ఒక అత్యంత సహజమైన ప్రక్రియ ఏదో జరిగిపోతూ వున్నట్టుగా మాత్రమే నాకు తోచింది. అందుకని మా భయం నీడను వెంటేసుకుని మేం జీవితపు ముక్కల్ని ఏరుకోవడంలోనే నిమగ్నమై వున్నాం.

మా అందరికంటే విచిత్రమైన స్థితి మాత్రం నెం.11045దే. మాకు ఏరుకోవడానికి, కనీసం ఏరుకున్నట్టుగా భ్రమపడ్డానికి ఏవో జీవితపు ముక్కలు కనిపిస్తున్నాయి. నెం.11045కి అసలు ఏరుకోవడానికి ఏం కనిపించడం లేదు. అది అతనికి పెద్ద సమస్య అయిపోయింది. ఏం ఏరుకోవాలి, ఎలా ఏరుకోవాలి అనే ప్రశ్నకు అతనికి ఎంతకీ సమాధానం దొరకడం లేదు. అందుకని నెం.11045

మాత్రం జీవితం తిరిగి ఎక్కడ నుండి మొదలవ్వాలా అని ఇంకా అయోమయంగా ప్రశ్నించుకుంటూ, ప్రశ్నిస్తూ మా మొహల్లాల్లో ఏదో వెదుక్కుంటూ బెదురుచూపులు చూస్తూ తిరుగుతూనే ఉన్నాడు. 2003లోనే ఒక ఇంటివాడు కావల్సిన మా హసన్ కు ఇప్పుడు పిల్లనెవరు ఇస్తారు? ఏ ఆడపిల్ల ఇలాంటి వ్యక్తిని కోరుకుని వస్తుంది. కనుక అతనికి తాడూ, బొంగరం కూడా ఏం సమకూరలేదు.

నెం.11045 తల్లిదండ్రులు ఇప్పుడు లేరు. 2002, 2003 క్రమంగా వారిని మింగేశాయి. హసన్ బ్రదర్స్ దర్జీ దుకాణం లేదు. రజాక్ ఎలాగో ఎవరి దయవల్లనో సంపాదించుకున్న ఓ పాత డొక్కు కుట్టు మిషను మాత్రం ఉంది. జీవితపు ముక్కల్ని మా అందరివలే అతనూ ఇంకా ఏరుకుంటూనే వున్నాడు. చిన్న, చిన్న గుడ్డముక్కల్ని కూడా నేర్పుగా కత్తిరించి ఎక్కడా వృధా కాకుండా ఏవో దుస్తులుగా కుట్టగల నైపుణ్యం ఉన్న రజాక్ ఛిద్రమైన జీవితపు ముక్కల్ని ఎలా కుట్టాలో తెలీనట్టుగా వాటిని తిరగేసి, మరగేసి చూసుకుంటూ, వాటిని దుస్తుల్లాగా కనీసం కనిపించేలా ఎలా కుట్టాలో ప్రయోగాలు చేస్తూ రోజులు గడుపుతున్నాడు.

2002 తర్వాత వారి దర్జీ దుకాణం, ఇంకా అలాంటి చిన్న, చిన్న దుకాణాలు ఉండిన స్థానంలో హరగోవింద్ కాంప్లెక్స్ వెలిసింది. అందులో ఇప్పుడు ఒకటి కాదు శ్రీలక్ష్మి టేలర్స్, మోడీ బ్రదర్స్ అనే రెండు టేలర్ దుకాణాలు, శ్వేతాస్ కార్నర్ అనే ఫ్యాషన్ బొటీకూ వెలిశాయి. సాయంత్రం అయితే చాలు రంగురంగుల దీపాలతో దజన్ల కొద్దీ దుకాణాలతో ఆ కాంప్లెక్స్ మిరిమిట్లు గొలుపుతూ ఉండేది. సాయంత్రం అయితే చాలు నెం.11045 అక్కడే ఆ దీపాల కింద చీకట్లో దేన్నో వెదుకులాడుతూ తిరిగి, తిరిగి ఎప్పటికో, ఏ రోజుకో ఇల్లు చేరేవాడు.

ఒకరోజు ఎప్పట్లాగే సూర్యోదయం అయ్యింది గానీ సూర్యోదయంలాగే రోజూ లేచి మొహల్లాలో జీవితం ముక్కల్ని వెదుక్కుంటూ తిరిగే నెం.11045 మాత్రం కనిపించలేదు. హరగోవింద్ కాంప్లెక్స్ దగ్గరే ఎక్కడో తిరుగుతూ ఉండి ఉంటాడు అనుకున్నాం మొదట. కానీ ఎంతకీ రాకపోవడంతో వెతికాక అర్థం అయ్యింది మా నెం.11045 మాయమయ్యాడు అని.

పదకొండేళ్ల క్రితం అర్ధరాత్రి మాయం చేయబడ్డట్టుగా మళ్లీ మాయం కాలేదు కదా అనేది మాకందరికీ మొట్టమొదటిగా వచ్చిన సందేహం. కానీ అలా వాళ్లు తీసుకువెళ్లలేదని మాకు నమ్మకమైన లాయర్లు కనుక్కుని చెప్పారు. అయినా నెం.11045గా మారిపోయిన హసన్ వాళ్లకిప్పుడు అవసరం లేకపోవచ్చు. మరో అజంనో, అలీనో వాళ్లకు ఎప్పుడు కావాలంటే అప్పుడు దొరకకుంటే కదా. అయినా మా సందేహం, మా భయం మాది కనుక కనుక్కున్నాం అంతే.

అందరితో చెప్పలేదు గానీ మీకు చెప్తున్నా. 2002 తర్వాత దఫదఫాలుగా ఇలాగే హఠాత్తుగా మాయమైన నా కొడుకు, అతని ఈడు యువకులవలే హసన్ కూడా తనను తానే మాయం చేసుకోలేదు కదా అనే సందేహం నాకు క్షణకాలం కలిగింది. నేను 1948 నుండి కూడా సూర్యోదయం, సూర్యాస్తమయంలాగ ఈ దేశంలో సహజంగా జరిగే వాటికి అలవాటు పడుతూ జీవితంతోనే వాటిని ఎదుర్కొనే ప్రయత్నం చేయాలి అని నా తర్వాతి తరాలవారికి చెప్పేవాడిని. కానీ నా కొడుకు సహా ఆ యువకులు 'పిల్లిని గదిలో వేసి కొడితే అది కండ్లు పీకడం కూడా పున్నమి రోజు బంగారు చంద్రుడు ఉదయించడం అంత సహజం కదా' అని వాదించేవారు. నేను ఒప్పుకోకపోయేవాడిని. నా వెంట ఉండే భయం నీడ నన్ను ఒప్పుకోకుండా అడ్డుకునేది. వాళ్లు విసురుగా ఆ నీడను విదిలించుకుని దఫదఫాలుగా తమను తామే మాయం చేసుకునేవారు.

కానీ మా హసన్ అలా వెళ్లలేదు అని నా మనసుకు అన్పిస్తోంది. అతను ఈ పదకొండేళ్లలో అన్నీ కోల్పోయాడు. అతనికి మిగిలిందల్లా కొద్దిగా వంగిపోయిన ఒక వెన్నెముక మాత్రమే. కనుక అతను భయం నీడను విదిలించుకుని ఆ యువకుల్లా తనను తాను మాయం చేసుకుని ఉంటాడని నాకెందుకో అనిపించడం లేదు. అందుకనే మిమ్మల్ని అడుగుతున్నాను కనిపించాడా ఎక్కడైనా అని. జీవితం ముక్కల్ని వెదుక్కుంటూ అలా అలా తప్పిపోయి ఉంటాడని నా నమ్మకం. నాకెందుకు అంత బలంగా అనిపిస్తున్నదంటే, నేనెవరితో అనలేదు గానీ, తను విడుదలై రాగానే 'ఏ అమానుష గ్రహం నుండి తీసుకొచ్చి నన్ను మళ్లా ఈ మనుషుల ప్రపంచంలో పడేశారు?' అని పదేపదే ఆశ్చర్యంగా అడిగేవాడు. ఈమధ్య అలా అడగడం మానేశాడు.

తను వదిలివెళ్లిన ప్రపంచం చాలా మారిందనే భ్రమ అతనికి ఉండేది మా మొహల్లాలకు దూరంగా ఫ్లైఓవర్లూ, ఆకాశం అంతెత్తు భవనాలు, నాలుగు లేన్ల రోడ్లూ, వాటి మీద క్షణం తీరిక లేనట్టుగా పరుగులెత్తే వాహనాల వరుసలూ అన్నీ చూసి. కానీ క్రమంగా అతను తిరగడం ఎక్కువైన కొద్దీ అతనికి తను వదిలిన ప్రపంచం నిజమైన అర్థంలో పెద్దగా మారిందేమీ లేదని అతనికి అన్పించడం మొదలైంది.

ఇక తన జీవితం ముక్కల్ని వెదకడం కాసేపు ఆపి ఆ ఫ్లైఓవర్ల కిందా, నాలుగు లేన్ల రోడ్ల కిందా, ఆకాశాన్నంటే రాకాసి భవనాల కిందా ఒకప్పుడు బతుకుతుండిన తన చిన్ననాటి దోస్తుల గురించి వెదుకులాడ్డం మొదలెట్టాడు. కానీ అతనికి రామ్‌దీన్, కన్హయ్యా, మొహసీన్‌ల ఆచూకీ దొరకలేదు. జోగిందర్, పీటర్, మరియాల ఆచూకీ కూడా దొరకలేదు. వాళ్లు ఎప్పుడో వాటి కింద కప్పెట్టబడి మట్టిలో కలిసిపోయారు, లేదా వేరే చోట్లకు వెళిపోయారు, వెతికి లాభం లేదు అని మేం చెప్తే నమ్మలేనట్టుగా చూసేవాడు. మళ్లీ మళ్లీ వాటికింద తవ్వి చూసేవాడు. మరోవైపు తను విడుదల అయిన తేదీనుండి సాయంకాలాలు సహజంగా జరిగినట్టు మా భయం నీడల పొడవు పెరగడం అతని దృష్టిలో పడింది.

తన జీవితంలోకి 2002, 2003 తిరిగి వచ్చేస్తాయేమో అని అతనికి రోజురోజుకీ నమ్మకంగా అనిపించసాగింది. '2002 ఇంకెంత దూరంలో ఉందేం? ఆకాశంలో ఆ నల్లని మబ్బులు ఏంటి, 2003 వచ్చేసిందా?' అని నన్ను అడిగేవాడు. హఠాత్తుగా పరుగెత్తుకుంటూ వచ్చి, 'అబ్బా, చిన్నారి రెహానా ఎక్కడ, మీ ఇంటిపక్కనుండే కృష్ణ ఎటుపోయాడు, ఫ్లైఓవర్ వచ్చేస్తోంది, దాని కింద కప్పడిపోతారేమో, మంచం కింద దాచు పిల్లలందర్నీ' అని అరుచుకుంటూ పోయేవాడు.

అప్పటి నుండి అతనిలో అసహనం పెరిగినట్టుగా నాకు అనిపించేది. దీనికీ అతను హఠాత్తుగా కనిపించకుండా పోవడానికీ ఏమైనా సంబంధం ఉందేమో అని నాకు చాలా సందేహంగా ఉంది. ఎవరితోనూ ఈ మాట చెప్పలేదు. ఎందుకంటే అందరూ పొడవు పెరుగుతున్న తమ భయం నీడల్ని చూసుకుని బెదిరిపోతున్నారు. మళ్లీ వాళ్లను ఈ విషయం చెప్పి మరింత బాధించడం ఇష్టం లేక ఇక నేనే మా నెం.11045ను వెతుక్కుంటూ బయల్దేరాను.

రజాక్ కన్నీళ్లు పెట్టుకుంటూ తన జీవితం ముక్కలతో పాటు

వ్యాసం

ఆంధ్రా పెట్టుబడిదారులు, కార్పొరేట్ వర్గాల కోసం

ఆదివాసీలు ఎందుకు మునగాలి?

- బాసిత్

జూలై 3న చత్తీస్ గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నాలుగు రాష్ట్రాల మీదుగా ఆదివాసి మహాపాద యాత్ర పోలవరం ముంపు గ్రామం చింతూరు చేరుకుంటున్న సందర్భంగా కవులు, రచయితలు ప్రజా సంఘ నాయకత్వంతో కూడిన బృందం హైద్రాబాద్, వరంగల్ జిల్లాల నుండి బయలుదేరి అక్కడికి ఎదురువెళ్లి సంఘీభావం ప్రకటించింది. ఆ బృందంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకులు వేదకుమార్, గిరిజన జీవన మూలాలు శోధించే ప్రొఫెసర్ జయధీర్ తిరుమల రావులతో పాటు కవులు, రచయితలు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, హక్కుల కార్యకర్తలు ఉన్నారు. తెలంగాణ కోణం లోంచి సామాజిక, రాజకీయార్థిక విశ్లేషణ చేసే టంకశాల అశోక్ గారు కూడా మాతో పాటూ ఉన్నారు.

దీనికి నేపథ్యం తెలిసిందే. ఆదివాసులు ప్రజాస్వామికవాదులు ఎన్ని పోరాటాలు చేసినా, పోలవరం ముంపు గ్రామాలను ఆంధ్రాలో కలుపుతూ దుర్మార్గంగా మోడీ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. తదనంతరం కేంద్రప్రభుత్వం మొదటి కేబినెట్ సమావేశంలోనే దాన్ని ఆమోదింప జేసింది. దాంతో ఆంధ్రప్రదేశ్ పాలక వర్గాల్లో, కంట్రాక్టర్లలో హర్షాతిరేకం వెల్లువెత్తింది. అదే సమయంలో సహజంగానే పోలవరం ముంపు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వ్యతిరేకత పెల్లుబికింది.

భద్రాచలం, పాల్వంచ సబ్ డివిజన్లలోని ఏడు మండలాలు, ఆంధ్రాలో కూడా పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పోలవరం మండలం, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన దేవిపట్నం మండలం ప్రతిపాదిత పోలవరం ప్రాజెక్ట్ కింద ముంపుకు గురవుతున్నాయి. ఇవే కాక చత్తీస్ గఢ్ రాష్ట్రానికి చెందిన పద్దెనిమిది గ్రామాలు, ఒడిశా రాష్ట్రానికి చెందిన పద్నాలుగు గ్రామాలు కూడా మునిగి పోతున్నాయి. కనుకనే నాలుగు రాష్ట్రాలలో ఆందోళనలు రోజు, రోజుకు ఉధృతం అవుతున్నా కేంద్ర, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.

తన అన్నను వెతకడాన్నీ తన దినచర్యలో భాగం చేసుకున్నాడు. పదకొండేళ్లపాటు హసన్ జైలులో గడిపిన జీవితానికీ, పదకొండేళ్లు మా రజాక్ బైట గడిపిన జీవితానికీ పెద్ద తేడా ఏం లేదు నిజానికి. అది బంద్ జైలు అయితే ఇది బహిరంగ జైలు. 'అగో, అతనే టెర్రరిస్టు హసన్ తమ్ముడు' అనే ముద్రను మోసుకుని అందరి మధ్యా తిరగడం కంటే ఇవేవీ తెలీకుండా జైలులో బంధింపబడి ఉండడమే నయమేమో అనిపించేది ఒకోసారి మాకు అతను పడుతున్న క్షోభను చూస్తుంటే.

మా నస్రీన్, మా సలీం, మా చిన్నారి రెహానా సహా మా మొహల్లా పిల్లలందరూ నెం.11045 కనిపించకుండా పోయిన్నుండి ఏదో పోగొట్టుకున్నట్టే ఉంటున్నారు. ఆటలాడుకునే పేరుతో ఎటెటో తిరిగి వచ్చి వాళ్ల అమ్మీలతో, అబ్బాలతో 'ఇవాళ కూడా కనిపించలేదు నెం.11045' అని చెప్పడం వాళ్లకు రోజూ కడుపు నిండా రోటీలు తినలేకపోవడం అంత సహజ దినచర్యగా మారింది.

* * *

అమ్మలారా, అయ్యలారా, మీకు ఎక్కడైనా గల్లీల్లో అయోమయం చూపులతో ఏదో పోగొట్టుకున్నదాన్ని వెతుక్కుంటున్నట్టుగా ఎవరైనా బికారి లాంటి మనిషి కలిస్తే తప్పక అతని పేరు అడుగుతారనే ఆశతోనే ఇదంతా చెప్పుకొచ్చాను. అతను తన పేరు నెం.11045 అని చెప్తే అది మా హసన్ భాయే కచ్చితంగా అని గుర్తుపట్టండి సార్లూ. మా పతా చెప్పాను కదా. ఆచూకీ తెలిస్తే మాకు తప్పక తెలియజేయండి. ఎంతైనా మా మొహల్లావాడు, మా భాయి, మా భయ్యా, మా బేటా... ఎలా వదిలేస్తాం?

ఒకవేళ అలాంటి మనిషి కనిపించి మీరు పేరు అడిగితే ఇంకేదైనా నెంబర్ చెప్పినా మీరేం పరేషాన్ కావద్దు. ఎందుకంటే ఆ నెంబర్ మా అహమ్మదాబాద్‌ది కాకుంటే హైదరాబాద్‌ది కావచ్చు, ఆజంగఢ్‌ది కావచ్చు, తిరువనంతపురంది కావచ్చు, బారాముల్లాది, షోపియాన్‌ది లేదా భోపాల్, ఢిల్లీలది కూడా కావచ్చు. అది హసన్ భాయిది కాకుంటే, సలీం భాయ్‌ది కావచ్చు, యూసుఫ్ భయ్యాది కావచ్చు, మహమూద్‌ది కావచ్చు. వాళ్లు 11031, 20456, 10096, 11189 లాంటి పేర్లతోనే తమను తాము గుర్తుపెట్టుకున్నవాళ్లు కావచ్చు. ఎవరైనా గానీ మా హసన్ భాయిలాంటివాళ్లే కనుక కిందామీదా పడి మేం ఎలాగైనా సాదుకుంటాం. మీకు కనిపిస్తే తప్పక మాకు ఆచూకీ తెలియజేయండి. ఇన్షాఅల్లా, గుండెల్లో ఇంకా తడి మిగిలిన తల్లులూ, తండ్రులూ అందరూ పట్టుబట్టి వెదికితే మావాడు తప్పక దొరుకుతాడు అని నా ముసలి మనస్సు ఒకపక్క రోదిస్తూనే మరోపక్క నాకు విశ్వాసాన్నిస్తోంది.

అయ్యలారా, అమ్మలారా దయచేసి మా హసన్ బేటా ఉరఫ్ నెం.11045 ఎక్కడైనా కనిపిస్తే మాత్రం చూసీ చూడనట్టుగా వదిలేయకండి. ఎంతైనా ప్రకృతి తాపిన పాలు తాగిన ప్రాణులం. మృత్యుహేలల్ని జీవితంతో తప్ప ఎదుర్కోవడం తెలీనివాళ్లం. జీవితం మనల్ని వదిలేసిందా, మనం నెం.11045ని వదిలేయడానికి?

తల్లులారా, మా హసన్ బేటా కనిపిస్తే 2002లూ, 2003లూ తిరిగి రాకుండా మనమంతా ఒక చేయి వేద్దాం, ఫ్లైఓవర్ల కింద మన పిల్లలు కప్పడిపోకుండా మేమంతా కూడా కాపలా కాస్తాం, మేమంతా నీతో వున్నాం, మనమంతా కలిసే వున్నాం, నీకేం భయం లేదు అనే ఒక్క మాట అతని చెవిలో పడేలా చేయండి. మీరంతా ఆ ధైర్యం ఇస్తే మా నెం.11045 తప్పక తిరిగి వస్తాడని నాకు ఎందుకో నమ్మకంగా తోస్తోంది. ఆ ఒక్కమాట, ఆ ఒక్కమాట ఎలాగైనా అతని చెవిన పడేలా చేయండి సార్లూ, మా హసన్ బేటా మాకు, ఊహు, మనకు తప్పక దక్కుతాడు.

ఒక్క పలకరింపు, ఒక్కమాట, ఒక్క అడుగు మా మొహల్లాల వైపు....బస్....

పైగా ఆంధ్రా ప్రాంతానికి మేలు చేసే 'మహత్తర' ప్రాజెక్టుపై కొన్ని వర్గాలు అనవసరపు రగడ సృష్టిస్తున్నారని మీడియాను గుప్పిట్లో పెట్టుకున్న ఆంధ్రా పాలక వర్గాలు నోరు పెట్టుకొని ప్రజాందోళనను తప్పు పడుతున్నాయి. మరో వైపు, నాలుగు రాష్ట్రాల ఆదివాసి ప్రజల ప్రతినిధులు, బాధ్యులు సున్నం వెంకటరమణ, బంగారు వెంకటేశం, జంజర్ల రమేశ్, మైపతి అరుణ్, అరుణాంక్ తదితర ప్రజా సంఘ బాధ్యులు కార్పోరేట్ ప్రాయోజిత, ఆదివాసి హనన ప్రాజెక్టును నిరసిస్తు పోలవరం వ్యతిరేక మహాపాద యాత్రను ఒడిశా రాష్ట్ర పోడియా నుండి నాలుగు రాష్ట్రాల గుండా చేపట్టారు. ఆందోళనలు కొనసాగిస్తున్నారు.

ఆంధ్రా, కేంద్ర ప్రభుత్వాలు చెబుతున్నట్లు పోలవరం ఒక 'మహత్తర', 'బృహత్తర', బహుళార్థ సాధక ప్రాజెక్టు కనుక దీనిని వ్యతిరేకించ వలసిన అవసరం లేదా? ఏమిటా బహుళార్థకాలు? అవి ప్రజలకు బహుళార్థకాలు అవుతాయా? ఏ వర్గాలకు ఈ ప్రాజెక్టు వల్ల ప్రయోజనం చేకూరుతుంది? ఎందువలన ఈ ప్రాజెక్టును తెలంగాణ, ఒడిశా, చత్తీస్ గఢ్ రాష్ట్రాలు మొత్తంగా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, విశాఖ ఏజెన్సీ ప్రజలు కూడా వ్యతిరేకిస్తున్నారు. ఎందువల్ల ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కేంద్రంతో మిలాఖత్ అయి 'మా ప్రయోజనాల కోసం, ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రాంతాలను కూడా మా రాష్ట్రంలో కలుపుకుంటాం...' అని ఇంత నిస్సిగ్గుగా దురాక్రమణకు పాల్పడుతోంది? ప్రజల్ని పారద్రోలి ఎవర్ని ఉద్ధరించడానికి ఈ ప్రాజెక్టు కడుతున్నారు? ఎవర్నో ఉద్ధరించడానికి ఆదివాసుల నెందుకు ముంచుతున్నారు?

ఇటువంటి ప్రశ్నలకు ప్రభుత్వాల నుండి, వాటికి కొమ్ముకాసె పాలక వర్గాల నుండి సమాధానాలు ఎందుకు రావడం లేదు? వచ్చినా, అవి మునిగిపోతున్న ప్రజలకు ఎందుకు అర్థం కావడం లేదు? అవి అర్థం కాకపోవడమో, అర్థమైన మేరకు అవి తమ ప్రయోజనాలకు భంగకరమని అనిపించినందునో నెత్తి, నోరు బాదుకుంటూ ఆందోళనల్లో పాల్గొంటున్నారని అర్థం కావడం లేదా?

ముంపు గ్రామాల ప్రజలు ఏమనుకుంటున్నారు?

ఆర్డినెన్స్ ద్వారా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పోలవరం ముంపు గ్రామాలను ఆంధ్రాలో కలపడంతో ఆదివాసి ప్రాంతాల్లో కలవరం చెలరేగింది. ఈ నేపథ్యంలోనే భద్రాచలం , పాల్వంచ డివిజన్లకు చెందిన భద్రాచలం (రూరల్), కూనవరం, చింతూరు, వరరామచంద్రపురం (వి.ఆర్.పురం), వేలేరుపాడు, కుకునూరు,బూర్గంపాడ్ మండలాలకు చెందిన పలు గ్రామాలు సందర్శించి, అక్కడి ప్రజలతో జూన్ తొమ్మిది, పది తేదీలలో కలిసి మాట్లాడాం.

భద్రాచలం నుండి గుండాల, వెంకటిరెడ్డి పేట, నెల్లిపాక, బుట్టాయగూడెం, పోచవరం, సీతాపురం, తోటపల్లి, గన్నవరం,గౌరీదేవి పేట, నందిగామ, నందిగామపాడు, మురుమూరు, సోలిపాక, పోచవరం కాలనీ ఇన్ని ముంపు గ్రామాల మీదుగా ఒడ్డుగూడెం అనే గోదావరి ఒడ్డు గ్రామం వెళ్లడం జరిగింది. అక్కడి నుండి అధ్యయనాన్ని మొదలు పెట్టడం జరిగింది.

గోదావరి ఒడ్డున ఉన్నందుననే ఆ ఊరును ఒడ్డుగూడెం అంటారని ఆ ఊరికి బతక వచ్చిన సూరిబాబు చెప్పారు. ఒడ్డుదాక వచ్చి గోదావరిలోకి దిగకుండా ఉండలేం కదా? గోదావరికి అటువైపు కొండలు, కొండలపై విస్తరించిన పచ్చదనం, ఆ పైన అనంతాకాశం... ఇంత అందమైన పరిసరాల్లో ఒకవైపు లంగరు వేసిన పడవ , మరొక వైపు అల్లంత దూరాన నదిలోకి దిగిన ఆదివాసి మహిళలు కనిపించారు. అక్కడి నుంచి ఎటువైపు చూసినా, సుందర ప్రకృతి దృశ్యాలు... అటువంటి ప్రాకృతిక మనోహరత్వం ముందు ఇంకే కృత్రిమ అందాలైనా అల్పంగా అన్పిస్తాయి. ఒడ్డుకు చేరిన ఆదివాసి మహిళలతో అధ్యయన బృందం మాటలు కలిపింది. కొండలు ఎక్కి దిగిన అభ్యాసం వల్ల వాళ్ల ఒంటి మీద కాస్తంతైనా కండ లేదు. పక్కటెముకల్ని కప్పెడ్తున్నచర్మం తప్ప.అయితే కొత్త వాళ్లు కనిపించారన్న ఆనందం వాళ్ల కళ్లలో మెరిసింది.

వాళ్లేమన్నారు?

'ఇక్కడ దొరికే బతుకు దెరువు అక్కడ దొరకదు. గుట్టకు పోయి తెచ్చుకున్న కాయో పండో కడుపు నింపుద్ది. అక్కడేం దొరుకుద్ది? ఆంధ్రాలో కలపొద్దు. తెలంగాణలోనె ఉంటాం.' గోదావరి అలలను చేతితో తాకుతూ ముత్యాల బజారు అనే ఆదివాసి మహిళ దుఃఖశీల వదనంతో మాట్లాడింది.

'మునగటం మాకేం కొత్త కాదు. ప్రతి యేటా వరదలొచ్చి నపుడు మునగటమే. అదిగో, ఆ కొండ పైకి ఎక్కి పేనాలు కాపాడుకుంటాం. కాని ఈ సారి ఈ పోలవరం కడితే , ఆ కొండలు కూడా మునుగుతా యంటున్నారు.' వడ్డారపు సాంబలక్ష్మి మధ్య లోనె అందుకొని చెప్పింది.

'ఈ గోదాట్లో మునిగి చావనైనా చస్తాం, కాని ఆంధ్రాకు వెళ్లం, గాక వెళ్లం.' అని బీర్ల జ్యోతి స్పష్టం చేసింది.

'అదిగో, మా ఊరి మగాళ్లు, వాళ్లను కూడా అడగండి.' అంటూ, పడవకు ఏదో, మరమ్మత్తు చేసి ఇటు వైపు ఇసుకలో అడుగులు వేసుకుంటూ వస్తున్న కాసారపు శ్రీనివాస్, ముత్యాల బాబు, కాసారపు క్రిష్ణ వైపు వేలు చూపింది, లక్ష్మి.

'ఇక్కడ్నుంచి వెళ్తే, మాకు ఉపాధి ఎక్కడ్నుంచి వస్తుంది?' అన్నాడు, కాసారపు శ్రీనివాసు.

ఆంధ్రా ప్రాంతాల నుండి బతుక వచ్చిన వాళ్లే పడవ కిరాయకు నడపడం వంటివి చేస్తారు. ముంపు ఏర్పడి ఇక్కడి నుంచి తరలిస్తే, వలస వచ్చిన వారికి కూడా ఉపాధి లేకుండా పోతుంది. అట్లా, వలస వచ్చిన వాళ్లకి కూడా తెలంగాణలో ఉంటేనే ఉపాధి సమస్య తీరుతుంది. కనుక ఇక్కడ ఉండడానికే వాళ్లూ ఇష్టపడు తున్నారు. కనుక ముంపు వల్ల ఇక్కడికి వలస వచ్చిన వారు సైతం ఉపాధి కోల్పోతారు. ఆంధ్రాలో కలిపితే వాళ్లకి పోటీ ఏర్పడుతుంది. కనుక ముంపు గ్రామాలను ఆంధ్రాలో కలపడం వారికీ, ఇష్టం లేదన్న మాట.

ఆదివాసీలకైతే, తల్లి ఒడిని విడిచి ఉండలేని బేలతనమేదో వాళ్ల కళ్లలో స్పష్టం గానే కనబడుతోంది. గోదావరిని, ఆ తీరంలో లభించే ఉపాధిని వదులుకోలేని అశక్తత ఆదివాసేతరులది.

ఇదిలా ఉంటే, ఇక్కడ ప్రకృతి ఇంత మనోహరంగా ఎందుకు ఉంది?ఇది ఒక రకంగా, త్రివేణీ సంగమం వంటిది. ఒడ్డుగూడెం గ్రామం ఉన్న వి.ఆర్. పురం మండలానికి పొరుగు మండల కేంద్రమైన కూనవరం వద్ద శబరి నది, గోదావరి నదిని లంబంగా కలుస్తుంది. ఈ రెండు నదులను ఒడ్డుగూడెం వద్ద సీలేరు నది కూడా లంబంగానే వచ్చి కలుస్తుంది. దాంతో కొంత 'బ్యాక్ వాటర్ ఫ్లో' వంటిది ఏర్పడి ప్రకృతి సిద్ధ జలపాతంగా కనిపించడాన్ని మనం తిలకించవచ్చు. ఈ కారాణాలన్నింటి వల్లనే ఇక్కడ 'సీలేరు విద్యుత్ ఉత్పాదక కేంద్రం' ఏర్పాటు చేసారని అంటారు. కొండలు, గుట్టల్లో దాగి ఉన్న గొప్ప వనరుల ప్రాంతంగానే కాకుండా ప్రకృతి అందాలతో శోభిల్లుతుండడం

ఇక్కడి ప్రత్యేకత.

గోదావరి ఒడ్డుపైకి చేరగానే, ఒడ్డుగూడెం ఉపసర్పంచ్, బొర్రా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ,ఆంధ్రా ప్రాంతం వారితో మేం వేగలేం అన్నాడు. ఆయన మాట తీరు చూస్తుంటే, తను కూడా ఆంధ్రా ప్రాంతం నుండి వలస వచ్చిన వాడిలాగే ఉన్నాడు. అదే విషయాన్ని తను కూడా నిర్ధారిస్తూ, ' అవునూ, మేం ఆంధ్రా నుంచే వలస వచ్చాం. ఇక్కడి ప్రజలతో కలిసి పోయాం. ఇప్పుడిక ఆంధ్రా కాన్వెంటు చదువులతో, ఇక్కడి చదువులకు అలవాటు పడ్డ మా పిల్లలు పోటీ పడలేరు. తెలంగాణలోనైతే, మేం, మా పిల్లలకు అనువైన చదువు చెప్పించగలం.' అన్నారు. ఆయనే ఇంకా మాట్లాడుతూ, 'ఆంధ్రాలో, మాకు కూలి దొరకదు. ఇక్కడ తక్కువ డబ్బుతో నెలంతా బతుకొచ్చు. అక్కడ అట్లా బతుకలేం.' అన్నాడు.

'అక్కడ మాకు పని దొరకదు. అడవి, గుట్ట దొరకదు. అడవిలో సమస్తం దొరుకుతాయి. అక్కడికి విసిరేస్తే, అవన్నీ నష్ట పోతాం.' అని గొట్టారపు రమణమ్మ అన్నారు.

'తెలంగాణలో అయితే, వ్యవసాయం, వద్దెర కూలి దొరుకుతాయి.' అని ముత్యాల కన్నమ్మ అన్నారు.

'డిజైన్ మార్చినా, భూమి లేని మాకు ఏం లాభం? పేదలం, కూలీలం... పోలవరం కడితే మాకేం వస్తది?' పులిచింతల రాజారావు, కోట లక్ష్మణరావుతో పాటు అక్కడున్న ఆదివాసి సమూహమంతా ఒక్క పెట్టున గగ్గోలు పెట్టారు.

'ప్రాజెక్టు కింద భూమి పోయినా, ఇల్లు మునిగినా పునరావాసం కూడా పెద్దగా దక్కేదేమి ఉండదని, ఇక్కడింత ఇల్లు మునిగితే, అక్కడ కట్టుకోవడానికి కనీసంగా ఇరువై లక్షలు అవుతాయి. ఇస్తరా? అని కోట లక్ష్మణ రావు అన్నాడూ 'పోలవరం కడితే, మూడు లక్షల మంది నిరాశ్రయులవుతారు. వాళ్లందరికీ ఏ విధంగా పునరావాసం కల్పిస్తారు? నాగార్జున సాగర్ కింద మునిగిన ముప్పై యిదు గ్రామాలకు ఇప్పటీ దాకా దిక్కు లేదు. మూడు వందల గ్రామాలు పోలవరం కింద మునగ నున్నాయి. ఇంత మంది ముంపు బాధితులకు ఎలా న్యాయం జరుగుతుందని?' దుర్గాప్రసాద్ ఆవేదనగా అన్నారు.

ఇంతలో, ఒడ్డుకు చేరిన ఆదివాసి మహిళ ముత్యాల బజారు ఉన్నట్లుండి, 'మీ తెలుగుదేశమోళ్లే కదా, ఢిల్లీ పెద్దలతో కుమ్మక్కై అందర్నీ ముంచిందీ?' అనేసింది.

అవునూ, చంద్రబాబూ, వెంకయ్యనాయుడూ కలిసే ఇదంతా చేసారు. మరి, మిగతా పార్టీలు తక్కువ తిన్నాయా? జై రాం రమేశ్ అనే కాంగ్రెస్ పెద్దాయనే కదా, బాబుకు ఇవన్ని నేర్పించింది? దుర్గాప్రసాద్, ఆదివాసి మహిళకు రిటార్టిచ్చాడు, ఆవేశంగా.

స్వంత పార్టీ నేతలే తమ తల రాతల్ని ఆగం చేస్తున్నట్లు వ్యక్తావ్యతంగా బహిర్గతం చేస్తున్న సందర్భంలో, ముంపు గ్రామాల స్థానిక నాయకుల వైఖరి ఎలా ఉండ బోతోందో, అనే ఆసక్తి కలిగింది. అదే విషయాన్ని అతనితో అంటే, 'మరేటి సేయ మంటారు బాబూ, బతుకు ముఖ్యం కదా, ఆంధ్రాలో కలిపితే బతుకు లేదు. ఆంధ్రా, కేంద్ర ప్రభుత్వాలతో కొట్లాడతాం.' అంటూ, బంధనాలన్నీ తెంచుకొని చెప్పేశాడు.

అక్కడి నుంచి పక్కనే ఉన్న వి. ఆర్. పురం వెళ్లాం. 'వి.ఆర్. పురం' అంటే, 'వర రామచంద్ర పురం' అని ముత్యాల రామారావు విస్తరించి చెప్పారు. 'శబరి, సీలేరు రెండు నదులు గోదావరిలో కలిసే ప్రాంతం కావడాన వి. ఆర్. పురం, కూనవరం మండలాలకు చెందిన గ్రామాలు, ఒక దీవి లాంటి భూభాగంలో ఉన్నాయి. ఇంత సారవంతమైన భూములు ఈ చుట్టు పక్కల ఎక్కడా లేవని, ఇట్లాంటి నేలను వదలి వెళ్లడ మంటే, ప్రాణాల్ని వదలి వెళ్లడమేనని దుఃఖ స్వరంతో అన్నారు. అరవై ఏళ్ల క్రితం ఇక్కడికి బతక వచ్చింది నిజమే కాని, ఇప్పుడు బతుకు నిలదొక్కుకుంటున్న దశలో వదలి వెళ్లాలంటే, చెప్పలేని బాధ అని, బోటు ఎక్కి రాజమండ్రి బస్సు అందుకోవడానికి వెళ్లిన గతానికి తొంభై ఎనిమిదిలో శబరి బ్రిడ్జి వచ్చాక, పరిస్థితి మెరుగయ్యిందని, ఇక్కడి నుంచి వెళ్లాలంటే ఏదోలా ఉందని' రామారావు అన్నారు.

'పోలవరం ప్రాజెక్టు కడితే, ఇక్కడి గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు అంతరించి పోతాయి. ఇక్కడి ఆదివాసి ఆవాసాలు జలసమాధి అవుతాయి. వేలాది మత్స్యకారులు ఉపాధి అవకాశాలు కోల్పోతారు.' అక్కడే ఉన్న ఆదివాసి మహిళ అన్నారు. ఇక్కడి అడివి, గుట్టా, సమస్తమూ వదిలి వెళ్లాలంటే మనసొప్పటం లేదని, ఇవన్ని వదలి మైదాన ప్రాంతంలో బతకడం సాధ్యం కాదని, ఇక్కడి నుండి తరలిస్తామంటే కుదరదని' ఆమె అన్నారు.

'బలవంతం చేస్తే పునరావాసం తీసుకోం. శబరి, సీలేరు, తల్లి గోదారిలో మునిగి చస్తాం. కాని బతుకు తెరువు లేని ఆంధ్రా ప్రాంతం వెళ్లం. మునగడం మాకేం కొత్త కాదు. తొలకరి వర్షాలు గట్టిగా కొట్టినా మునుగుతాం. ఆ కొండెక్కి పేనాలు గట్టెక్కించుకుంటాం. కాని పోలవరం కడితే, ఆ కొండా మునిగి పోతుంది.అడివి మునిగి పోతుంది. అందులోని జీవాలు మునిగి పోతాయి. మేమూ మునిగి పోతాం.' ఒకావిడ చెప్పుకుంటూ పోతోంది.

'ఆంధ్రా రైతులకు నీళ్లివ్వడానికే అయితే, క్రిష్ణా నది మీద ఉన్న రక రకాల ప్రాజెక్టులతో క్రిష్ణా,గుంటూరు జిల్లాల వ్యవసాయ అవసరాలు తీర్చొచ్చు. గోదావరి మీద ధవళేశ్వరం వద్ద కట్టిన సర్ ఆర్థర్ కాటన్ ప్రాజెక్టు మిగతా గోదావరి జిల్లాలు, ఇతర ఆంధ్రా ప్రాంతంలో పంటలు పండుతాయని' ఇంకో తల నెరిసిన పెద్దాయన అన్నారు.

'ఇంత మంది వద్దంటున్నా పోలవరం ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయం ఆలోచించకుండా కట్టితే, తెలంగాణ, చత్తీస్ గఢ్, ఒడిశా రాష్ట్రాలతో పాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఆదివాసి ప్రాంతాలన్నీ మునిగి పోతాయని, అదే ఉపద్రవం వచ్చి, కట్ట తెగితే, ఆంధ్రా అంతా కొట్టుకు పోతుందని' ఆంధ్రా ప్రాంతానికే చెందిన ఇంజనీరింగ్ నిపుణులు హనుమంత రావు, ధర్మారావులు చెప్పిన విషయాన్ని ఆ పెద్దాయన గుర్తు చేసారు.

'మట్టితో తక్కువ ఎత్తులో బలిమెల ప్రాజెక్టు కడితేనే, కొండలు, గుట్టలు మునిగి పోయాయని, అపుడు అడివి జంతువులన్ని ఈదుకుంటూ కనబడ్డాయని, అదే అంత ఎత్తున కొండల్ని కలుపుతూ అంత భారీ ఎత్తున పోలవరం కడితే, ఇంకెంత నష్టం జరగాలని' తన కామన్ సెన్స్ ఉపయోగించి అన్నాడాయన.

'ఆంధ్రా నుంచే ఇప్పటికీ, బతుకు తెరువు కోసం వచ్చే వాళ్లున్నారని, అటువంటిది ఇక్కడే ఏదో పని చేసుకు బతికే వాళ్లకు, ఆంధ్రాలో ఎలా ఉపాధి కల్పిస్తారని' ఆయన సందేహం వ్యక్తం చేసారు. 'అందుకే, బతికి నన్నినాళ్లు ఇక్కడే, ఈ తెలంగాణ గడ్డ మీదనే హాయిగా చనిపోతామని' ఆయన ఒక్క చిత్తం చేసుకున్నాడు.

'ఇక్కడ ఏదైన అభివృద్ధి జరిగిందంటే, అది తుమ్మల నాగేశ్వరావు

బైక్ మీద తిరిగి చేసిందే.అది కూడా ఇపుడు పోలవరం కింద మునిగి పోతాఉంది. అందుకే ఆయన్నే అడిగాం, మీరు చెసిన అభివృద్ధిని మీరే పోలవరం కింద ఎందుకు ముంచుతారని. దానికాయనే మంటాడంటే, నేనూ వ్యతిరేకిస్తున్నాడంటాడు. 'నమ్మాలో, నమ్మకూడదో తెల్వదు. లీడర్లు ప్రజల్ని చులకనగా చూస్తున్నారని' ముత్యాల రామారావు ఏదో విరక్తి భావన దోబూచులాడుతుండగా అన్నాడు.

'నిజానికి కేంద్రంలో కాంగ్రెస్ అధికారం వెలగబెడుతున్నపుడే, కె.సి.ఆర్. కూడా కాంగ్రెస్‌తో కుమ్మక్కై మూడు వందల ఆదివాసి ముంపు గ్రామాలను, శబరి, సీలేరు, తల్లి గోదారిని, నాల్గు వందల యాభై మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టును ఆంధ్రా సర్కార్కు రాసిచ్చి తాను తెలంగాణకు ముఖ్యమంత్రి అయ్యాడని' అక్కడే ఉన్న ఆదివాసి విద్యార్థి అన్నాడు.

'అందరూ కలిసి మా నోట్లో మన్ను కొడుతున్నారు. గతంలో పోలవరం పేరు ఎత్తినందుకే, నెహ్రూ, ఇందిరా, బ్రహ్మానంద రెడ్డి, రాజశేఖర రెడ్డి లకు ఏదో విధంగా మూడింది. ఈ సర్కారుకు కూడా ఏదో ఒకటి జరిగి తీరుతుందని' ముత్యాల రమణ మూర్తి అన్నారు.

'పాపికొండల వద్ద గోదావరి లోతుగా ఉంటుందని, ఇక్కడి గట్టు పోచమ్మ చాలా పవర్ ఫుల్ అని, ఇక్కడి కొండ రెడ్లను అంతం చేసే పోలవరం కడితే ఆ తల్లి చూస్తూ ఊరుకోదని, వద్దన్న ఆంధ్రోడు వచ్చి వేధిస్తున్నాడు. కావాలన్నా, తెలంగాణోడు మేం మునిగినా పట్టించుకోవడం లేదు.మాకు దిక్కు లేకుండా అయ్యిందని' రమణ మూర్తి ఆవేదన వ్యక్తం చేశాడు.

'తెలంగాణ ఏర్పాటులో తెలంగాణ సమాజం అంతా పోరాడిందని, ఉద్యమంలో సకల జనులతో పాటు, తెలంగాణ రచయితల పాత్ర కూడా ఉందని, మీ అందరి అండ ఉంటే, పోలవరం ఆపడానికి ఎంతకైనా తెగిస్తాం' అని రామారావు ఆవేశంతో అన్నారు.

మరో ముంపు గ్రామం పోచవరంలో, 'మొత్తం 312 మంది జనాభాతో, 115 గడపలు ఉన్నాయని, ఆ ఊరి మాజి సర్పంచ్ వాల్ల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ఊరంతా కలిసి పొలవరం వ్యతిరేక కమిటీ ఏర్పాటు చేసుకున్నామని, తుడుందెబ్బ, తెలంగాణ జాయింట్ అక్షన్ కమిటీ నాయకులు కోదండరాం వంటి వారిని కలిసి, గోడు చెప్పు కున్నామని' ఆయన అన్నారు.

ఆయన ఇంకా చెప్పు, 'మేం కొండ రెడ్లం. పోచవరం, తుమ్మలేరు, కొండేపూడి, కొల్లూరు, గొందూరు ఊర్లలో మా కొండ రెడ్లు ఈ ప్రాంతంలో ఉన్నారు. కాని ఏం లాభం? పోలవరం వల్ల మేం అంతరించి పోయే ప్రమాదం ఏర్పడింది.' అని ఆయన అన్నారు. మేం అడివి, కొండలపై బతికే వాళ్లం. తెల్ల చొక్కాల వాళ్లను చూస్తే, మాకు భయం. మమ్మల్ని ఈ కొండలు గుట్టల నుండి వేరు చేస్తే, నీటి నుండి చేపను వేరు చేసినట్లే. ఇప్పటికే, కొండ రెడ్లు పద్నాలుగు వేల నుండి పది వేల వరకు అంతరించి పోయారని 'అగ్రికల్చరల్ సోషల్ డెవలప్‌మెంట్ సొసైటీ' ఎ.ఎస్. డి. ఎస్. అనే స్వచ్ఛంద సంస్థ సర్వే చేసింది. పెసా, 1/7 (వన్ ఆఫ్ సెవెంటీ), ఐదో షెడ్యూలు, వంటి అన్ని రకాల చట్టాలు ఉల్లంఘించి మా అడివిని, మా అటవీ భూముల్ని మైదాన ప్రాంతం వాళ్లు ఆక్రమించుకుంటున్నారని' వెంకటేశ్వర రెడ్డి అన్నారు.

'మా జాగల మేమున్టేనే, మమ్మల్ని బతుకనిస్త లేరు, ఆంధ్రాలో బతుకనిస్తారా? భూపతి పట్నం ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోయినోళ్లకు రంపచోడవరం దగ్గర స్వంత తెగ వాళ్ల నడుమ ఇండ్లు ఇచ్చినారు. ఏమైంది? వీళ్లను అక్కడి వాళ్లు తరిమి కొట్టిండ్లు. నిర్వాసితులైన ఆదివాసీలను 'నాగరీకం' చేస్తామంటున్నారు. ఇదేనా, 'నాగరీకం' అంటే? నాగరీకం అంటే తరిమి కొట్టడమేనా?' ఇంకొగాయన సందేహించారు.

అక్కడి నుండి చింతూరు పక్క గ్రామం చిడుమూరులో జన వికాస్ సొసైటీ బాధ్యులు వేంకటేశ్ కలిసారు.

'పోలవరం నిర్మాణం పూర్తవుతే, ఏడు లక్షల ఎకరాలకు మూడో పంటకు నీటి స్థిరీకరణ జరుగుతుందని అంటున్నారు. ఇన్ని వందల గ్రామాలు ముంచి పోలవరం నిర్మాణం చేపట్టడం కన్నా, ఇప్పటికే ఉన్న రెండు ఎత్తి పోతల పథకాలను పూర్తి చేస్తే ముంపు నష్టం లేకుండానే ఏడున్నర లక్షల ఎకరాలకు నీరు అందించ వచ్చని' వేంకటేశ్ అన్నారు.

'అయితే, వాళ్ల ఉద్దేశం ఆంధ్రా రైతాంగానికి నీళ్లివ్వడం కాదు. కోస్టల్ క్యారిడార్ పేరిట పారిశ్రామిక అవసరాలకు నీళ్లివ్వడానికే పోలవరం కదుతున్నారనేది బహిరంగ రహస్యం. ఆంధ్రా రైతాంగానికి నీళ్లు, విశాఖకు ఇరవై మూడు టీ. ఎం. సీ. ల నీరు, కొన్ని గ్రామాలకు తాగు నీరు అనేవి కేవలం సాకు మాత్రమే నని, అసలు విషయం కంట్రాక్టర్లకు, కార్పోరేట్లకు ప్రయోజనం చేకూర్చడమేనని' పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వేంకటేశ్ వివరించారు.

'తెలంగాణ ఉద్యమం లాగా పార్టీలకు అతీతంగా, ఒక నిర్మాణాత్మక ఉద్యమం వస్తే తప్ప, ఇక్కడి ఆదివాసీలకు వాళ్ల కాళ్ల కింది నేల వాళ్లకు దక్కదు. ఉన్న చట్టాలు అమలైనా చాలు. వాళ్ల నేల వాళ్లకు దక్కుతుంది. కాని, ఒక్క చట్టం అమలయ్యే పరిస్థితి లేదు.' అని వేంకటేశ్ చెప్పారు.

అక్కడి నుండి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ముకునూరులో గ్రామంలో పూజారి మల్లయ్య, వీరబోయిన రామయ్య, బుచ్చిరాములు, శివరాజు తదితర పదిహేను మంది గ్రామస్తులు జమ అయ్యారు. వాళ్లంతా పోలవరం కట్టడం వల్ల భూమి లేని వారికి ఉపాధి ప్రశ్నార్థకం అవుతుందని అన్నారు.

'ప్రభుత్వం భూమి ఉన్న వాళ్లకే, అది కూడా ఎంత భూమి మునిగినా, ఆరు ఎకరాల వరకే, పునరావాస నష్ట పరిహారానికి పరిగణన లోకి తీసుకుంటారు. ఒక్కో ఎకరానికి లక్షా పదిహేను వేలిస్తుంది. రెండు పంటలు పండే, చాలా మంచి భూములు అయితే లక్షా ముప్ఫై వేలిస్తుంది. భూమి లేని వారికి, ఇంటి జాగా పోయినందుకు నలభై వేలిస్తారు. వీటితో ఎక్కడికి పోయి బతకాలి? అదే ఇట్లాంటి భూమి లేని ఎనభై నాలుగు కుటుంబాలు, మా ఊళ్లో ఆసామి భూమి మీద అరక ఎవుసం చేసి, తాము పంట తీసుకొని, ఆసామికి భూమి అప్పగిస్తారు. ఆర్డినెన్స్ వల్ల ఆంధ్రాలో కలిస్తే, ఇవన్ని కోల్పోతామని' ముకునూరూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేసారు.

'గ్రామ పంచాయితీలో ప్రాజెక్టు కట్టొద్దని తీర్మానం చేసి పంపినా, పట్టించుకున్న నాధుడు లేదు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు నిజాం కాలం నుండి తెలంగాణలో భాగంగా ఉన్నాయి. అయినా, వీటిని కూడా ఆర్డినెన్స్ ద్వారా మిగతా మండలాలతో పాటు కలిపేశారు. కె.సి.ఆర్. పందొమ్మిది వందల యాభై యారు పూర్వపు తెలంగాణ అన్నందున మిగతా మండలాలను ఆంధ్రాలో కలిపి ఉండవచ్చునని, నిజాం కాలం నుండి తెలంగాణలో ఉన్న వాటిని ఆంధ్రాలో ఎలా కలుపుతారని?' సామల జగ్గయ్య ఆవేదనగా అన్నారు.

'పోలవరం వల్ల మూడొందల యాభై గ్రామాలు మునుగుతాయి. ప్రమాదం జరిగితే, మరో మూడొందల గ్రామాలు కొట్టుకు పోతాయని' సుందర్రావు అన్నారు.

పోలవరం వల్ల అన్ని కష్టాలేనని, 95 శాతం ఎవుసం ఈ ప్రాంతంలో కొట్టుకు పోతుందని, వేరే చోట ఇంకే, పని చేయలేమని ఉప్పేరు గ్రామ రైతు బచ్చలికూర నాగేశ్వర్ రావు అన్నారు.

కుక్కునూరులో గ్రామస్తుల్ని కలిసి నపుడు: 'రెండు వేల ఐదు నుండి పోలవరం వ్యతిరేక ఉద్యమాలు జరుగుతున్నాయి. ఇప్పటి ఎం. ఎల్. ఏ. సున్నం రాజయ్య ఇప్పుడైతే నిరాహార దీక్ష చేస్తున్నాడు. కాని ఆయన పార్టీ సి. పి. ఎం. రెండూ వేల నాలుగులో పోలవరం ప్రాజెక్టుకు అనుకూలంగా సంతకం చేసింది. కొందరు ధనిక రైతులు గిరిజన వ్యతిరేక వైఖరి కలిగి ఉన్నారు. వన్ ఆఫ్ సెవంటీ పీడ పోవాలంటే పోలవరం ప్రాజెక్టు కింద ఆదివాసులు మునిగి పోవాలని ఇరవై ఎకరాలకు పైగా భూమిని ఆక్రమించుకున్న రైతులు కోరుతున్నారు. వాళ్ల మనోభావాలకు అనుగుణంగానే కార్పోరేట్ వర్గాల, ప్రభుత్వాల వైఖరి కూడా ఉంటున్నది. నిరుపేద గిరిజనులు దిక్కులేని వారవుతున్నారని' కొన్నె లక్ష్మయ్య అన్నారు.

'చంద్రబాబు నాయుడుకు తెలియని దాన్ని జై రాం రమేశ్ నూరి పోశాడాని, వెంకయ్య నాయుడుకు కూడా జై రాం రమేశ్ పాఠాలు బాగా ఎక్కాయని, అందుకే, ఆర్డినెన్స్ వెంటనే తెప్పించాడ'ని పులి శ్రీనివాస రావు అన్నారు.

'పునరావాస ప్యాకేజీ కూడా ఆంధ్రాలో ఒక విధంగా, తెలంగాణలో ఇంకోలా అమలు అవుతోంది. ఆంధ్రాలో ఎకరాకు నాలుగు లక్షలు కాగా. తెలంగాణలో ఎకరాకు లక్ష పదిహేను వేలు మాత్రమే. పోలవరం వల్ల న్యాయం, ధర్మం మట్టిలో కలిసి పోతున్నాయి. పునరావాసం ఎక్కడా సవ్యంగా సాధ్యం కాలేదని, పునరావాసం ఇచ్చినా,ఇక్కడి అడివిని, శబరి, సీలేరు, గోదావరి నదులను, కొండల్ని వదలి వెళ్ల లేమని ఇక్కడి లాగా ఆంధ్రాలో ఊరుమ్మడీ భూములుండి, అరక ఎవుసం చేసుకోలేమని' అమరవరపు లక్ష్మి తులసి అన్నారు.

'ఆంధ్రా టీచర్లను ఇక్కడికి రానిస్తే, ఆర్డినెన్స్ అమలు జరిగి నట్లేనని, అందువల్ల వాళ్లను రానిచ్చేది లేదు. పునరావాసం, సంక్షేమ పథకాల నిలుపుదల చేసినా, ఏం ఇచ్చినా, ఇవ్వక పోయినా తెలంగాణను వదిలి, గోదావరి దాటి పోయేది లేద'ని అమరవరపు భాస్కర్, మల్యాల మల్లిఖార్జున రావు అన్నారు.

ఆంధ్రా సర్కారు ఎందుకింత దురహంకారంతో వ్యవహరిస్తోంది?

పోలవరం ఒక అభివృద్ధికర ప్రాజెక్ట్, అభివృద్ధి జరగాలంటే ఎంతో కొంత ప్రకృతి సంపద నష్ట పోవాల్సిందే, ఎందరో కొందరు నిర్శయులు కావాల్సిందే నని వాదించే వాళ్లు, వీళ్లందరి హృదయ ఘోషకు ఏమని సమాధానం చెప్తారు? 2006 లో రాజ శేఖర రెడ్డి అధికారంలో ఉన్నపుడు, 'తలకు తూటా... చేతిలో పునరావాసం మూటా' ప్రాణ భయంతో తీసుకున్నవారు సైతం 'తల తాకట్టు పెట్టైనా, ప్రభుత్వం ఇచ్చిన ప్యాకేజి ముఖాన కొడతాం, కాని ఆంధ్రాకు వెళ్లం' అని అంటున్నారు. వీరికి ఏం సమాధానం చెబుతారు? 'మా జాతి అంతరించి పోవాల్సిందేనా' అని ప్రశ్నిస్తున్న కొండరెడ్లకు, ఈ ప్రభుత్వాలు ఏం సమాధానం చెబుతాయి? సముద్రంలో వృధాగా పోతున్న నీళ్లకు అడ్డుకట్ట వేసుకొని ఆంధ్రా రైతాంగానికి నీళ్లు మళ్లించు కుంటామంటే, ఎందుకడ్డు పడుతున్నారనే వాళ్లు, ఆంధ్రా, తెలంగాణ ఆదివాసీలతో పాటు మూడు రాష్ట్రాల్లోని ఆదివాసులను ముంచడం న్యాయమేనంటారా? ప్రత్యామ్నాయాలున్నా ఎందుకు ఇంత పెద్ద ఎత్తున విధ్వంసక ప్రాజెక్టును కడుతున్నారు? దురాక్రమణ జరుగుతున్న విషయం, ఆదివాసులూ మనుషులేనన్న ఇంగితం ఆంధ్రా పాలకులకు ఎందుకు కలగడం లేదు? ఆంధ్రా రైతాంగానికి నీరు అందించాలనే సదాశయాన్ని ఎవరూ తప్పు పట్టలేదు. కాని ఆ పేరు మీద జరుగుతున్నది సామ్రాజ్యవాద బహుళ జాతి కంపెనీలకే నీటి మళ్లింపని ప్రజలకు అర్థం కావడం లేదనుకుంటున్నారా? పోలవరం ఇప్పుడు కడుతున్న తీరులో పర్యావరణ సమస్యలున్నాయని, ఇతర ప్రత్యామ్నాయాలు ఉన్నాయని హనుమంత రావు, ధర్మారావుల వంటి ఆంధ్రా ప్రాంతానికే చెందిన ఇంజనీరింగు మేధావులు చెప్తున్న విషయాన్ని ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు? ఆంధ్రాకార్పోరేట్ పెట్టుబడి దారులకు తొత్తులైన కొందరు, ప్రత్యామ్నాయ ఆలోచనలు చేసిన మేధావులను 'గొట్టాం గాళ్లు' అని ఫేస్ బుక్‌లో సంబోధించడం చూస్తే వాళ్లను ఏం అనాలో కూడా తోచడం లేదు.

ఆంధ్రా పాలకులకు, సంపన్న వర్గాలకు, కంట్రాక్టర్లకు ఎలాగూ పట్టింపు ఉండదనుకున్నా, మిగతా సభ్య, పౌర సమాజం ఎందుకు స్పందించటం లేదు? సోంపేట పంట పొలాల్లో థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో మాదిరిగా ఎందుకు పాల్గొనడం లేదు?మునిగేవి తెలంగాణ, చత్తీస్ గఢ్, ఒడీశా రాష్ట్రాల్లోని ఆదివాసి ప్రాంతాలు అయినందుకేనా?

కోస్టల్ కారిడార్ కోసం విశాఖ నుండి, నెల్లూరు నుండీ రాజమండ్రి దాకా పారిశ్రామిక అభివృద్ధి జరిగి ఆంధ్రా అంతా బాగుపడాలంటే, తెలంగాణ, చత్తీస్ గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని ఆదివాసులు మునిగి పోవాల్సిందేనా?ఆంధ్రా దళారుల ఎంగిలి మెతుకుల కోసం ఆదివాసుల కాళ్ల కింది నేల గర్భంలోని వేల కోట్ల వనరులు బహుళ జాతి కంపెనీలకు కట్టబెట్టాల్సిందేనా?

పారిశ్రామిక అభివృద్ధి జరిగి ఆంధ్రా అంతా బాగుపడుతూ ఉంటే, తెలంగాణ తదితర రాష్ట్రాల వాళ్లు కుళ్లుతో, ద్వేషంతోనే పోలవరం ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నారనే వాళ్లూ ఉన్నారు.

ఇప్పటి దాకా నాగార్జునసాగర్ మొదలుకొని కిష్టా, గోదావరి నదుల మీద ఎన్నెన్ని సార్లు తెలంగాణ గ్రామాల్ని ముంచి ఎన్నెన్ని ప్రాజెక్టులు కట్టుకున్నప్పటికీ ఆంధ్రా అభివృద్ధికి సరిపోక పోతే, ఏ ప్రాజెక్టులు లేని తెలంగాణ, ఒడీశా, చత్తీస్ గఢ్, రాయలసీమల పరిస్థితి ఏమిటి? అభివృద్ధి అంతా ఆంధ్రాకే జరిగి పక్క రాష్ట్రాల భూ, భౌతిక వనరులన్ని విధ్వంసం కావాల్సిందేనా?

పక్క రాష్ట్రాలను ముంచేసి ఆంధ్రా ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలను కొనే కోస్తాంధ్రా వాదాన్ని విశ్లేషిస్తే జర్మనీలో హిట్లర్ వారసులు యూదులను చంపేసి మిగిలిన జర్మన్లు సుఖంగా జీవించాలనుకొనే ఫాసిస్టు భావజాలాన్ని తలపిస్తున్నది. ఇక్కడే ఇంకో విషయాన్ని చెప్పుకోవాలి. విశాఖ ఎం.పి. హరిబాబు 'పోలవరం కింద మేం ముంచేదంతా మాకే కావాలండీ' అనడం దేనికి సూచిక? ఇదంతా చూస్తుంటే, యూరోపియన్ ఆర్యుల శ్వేతజాతి దురహంకారానికి, ఆంధ్రపాలక వర్గ ఆధిపత్య భావజాలానికి తేడా లేదనిపిస్తోంది. ఇందుకు గుజరాత్‌లోను, ముజఫర్ నగర్‌లోనూ ముస్లింలను ఊచ కోత కోసి హిందూ మార్వాడీలు, జాట్లు సుఖపడాలనుకొనే మోడీత్వగా పరిణామం చెందిన ముదిరిన హిందుత్వ ఎన్.డీ.ఎ. సర్కారు విధానాలు ఊతం ఇస్తున్నాయి. అందువల్లనే, చంద్ర బాబు, వెంకయ్య నాయుడ్ల జోడీ పెద్దగా ఒత్తిడి చేయకుండానే వాళ్ల మనోభావాలు ఏకం అయ్యి ఆ

మేడిపండు ప్రజాస్వామ్యం

- క్రాంతి

సెప్టెంబర్ 21 మధ్యాహ్నం ఖాకీ వనంగా మారిన నగరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ సాక్షిగా, తెలంగాణ విద్యార్థి జేఏసీ ఓ చారిత్రక ప్రకటన చేసింది. 'తెలంగాణ ఉద్యమానికి మద్దతు తెలిపిన విప్లవోద్యమానికి జేజేలు పలుకుతూ యూనివర్సిటీలో భారీ సభ నిర్వహిస్తామని ప్రకటించింది. ఏ విప్లవ పార్టీ తెలంగాణ ఉద్యమానికి అండగా నిలిచిందో ఆ పార్టీ వెంట మేముంటామంటూ నినదించింది. 'తెలంగాణ కోసం ఢిల్లీ పురవీథుల్లో మార్చ్ చేశాం. తెలంగాణ నినాదాన్ని మా గుండెలోతుల్లోంచి ఎత్తుకున్నాం. ప్రజాస్వామిక తెలంగాణ నినాదానికి గొంతునిచ్చింది ఇలాంటి రోజు చూడ్డానికి కాదు' అంటూ ఢిల్లీ జేఎన్‌యూ నాయకుడు సమర్‌ఖాన్ ఉద్వేగంతో మాట్లాడిన మాటలు కళ్లు చెమ్మగిల్చాయి. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు మద్దతు ప్రకటించిన ఎవరైనా రాష్ట్రం ఏర్పడితే ప్రజల కనీస హక్కులు కాపాడబడతాయని అనుకొని ఉంటారు. ప్రజాస్వామిక విలువలకు రక్షణ ఉంటుందని అనుకొని ఉంటారు. కానీ అది కేవలం భ్రమే అని, ప్రపంచబ్యాంకు జీతగాళ్లకు తానేమీ తీసిపోనని కేసీఆర్ మూడు నెలల్లోనే నిరూపించు కున్నాడు. ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక సభను అడ్డుకునేందుకు ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరే అందుకు నిదర్శనం.

పదేళ్ల భారత ఐక్య విప్లవోద్యమ పురోగతిపై చర్చించేందుకు ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక సెప్టెంబర్ 21న హైదరాబాద్‌లో సదస్సు - ర్యాలీ - బహిరంగసభను నిర్వహించాలని నిర్ణయించింది. నెల రోజుల ముందే ర్యాలీ - బహిరంగసభ అనుమతి కోరింది. కానీ చివరి క్షణం వరకూ తాత్సారం చేసిన పోలీసులు 20వ తేది సాయంత్రం అనుమతి నిరాకరిస్తున్నట్లు తెలిపారు. బహిరంగసభకు అనుమతి లేకున్నా ముందుగా రూపొందించుకున్న కార్యక్రమం ప్రకారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సదస్సు నిర్వాహించేందుకు సిద్ధమైంది వేదిక. కానీ హాల్ మీటింగ్‌కి కూడా అనుమతి లేదంటూ, ప్రజలెవరూ సభకు రావద్దంటూ పోలీసు అధికారులు మీడియా ద్వారా ప్రజలను హెచ్చరించేందుకు యత్నించారు. నిజానికి గడిచిన యాభై అరవై ఏళ్లలో దేశంలో ఎక్కడా హాల్ మీటింగ్‌కి అనుమతి తీసుకోవల్సిన అవసరం ఏర్పడిఉండదు. నిత్యం ఎన్నో సభలు, సమావేశాలు జరుగుతూనే ఉన్నాయి. తమకు నచ్చిన రాజకీయ విశ్వాసాల్ని కలిగి ఉండడంతో పాటు వాటిని స్వేచ్ఛగా ప్రకటించుకునే ప్రజాస్వామిక హక్కుల్ని రాజ్యాంగం సమర్థిస్తోంది. కానీ తెలంగాణలో మాత్రం రాజ్యాంగం హామీ ఇచ్చిన హక్కులు క్షూడా చెల్లవంటూ ప్రభుత్వం నిరంకుశ స్వభావాన్ని చాటుకుంది.

వెంటనే మానవ హనన ఆర్డినెన్స్‌గా సమీక్రుతమై, ఆదివాసులను మనుషులుగా కూడా గుర్తించకుండా కేబినెట్ లో వాళ్ల ప్రయోజనాలే కేంద్రంగా బిల్లును ఆమోదింప జేసుకున్నారు. సరే, వాళ్లకు మెజారిటీ ఉందని అనుకున్న విధంగా సాగించుకున్నారు. కానీ, 'మేం ముంచే దంతా మాదే అని అనుకోవడం ఏ సమాజ లక్షణం? ఇది, మధ్య యుగ ఫ్యూడల్ సమాజం లో రాజు గారి గుర్రం పరుగెత్తిన నేలంతా, రాజుగారి అధీనంలోకి వస్తుందన్నట్లు లేదూ? ఇట్లాగైతే, చట్ట బద్ధ పాలనకు కట్టుబడి పని చేస్తామని రాజ్యాంగం మీద చేసిన ప్రమాణాలకు విలువ ఏమిటి? చట్టబద్ధ హక్కులకే విలువ ఇవ్వని పాలకులు, ఇక ఇతర ప్రజాస్వామిక పోరాటాలకు ఎలాంటీ విలువ ఇస్తారో ఊహించు కోవచ్చు.

మన కర్తవ్యం?

ఆదివాసి చట్టబద్ధ హక్కుల్ని కాల రాసి, ప్రజల హక్కైన అటవీ, జల, భూ, ప్రక్రుతి వనరులను ప్రజలకు కాకుండా చేసి, సామ్రాజ్యవాద, బహుళ జాతి సంస్థలకు దోచి పెట్టడాన్ని ఏమనాలి? 'దేశభక్తి' అనాలా? 'మేం మిమ్ము ముంచుతాం, మేం ముంచేదీ, మేమే ఆక్రమించు కొంటాం' అని బరి తెగించి వాదించే ఆంధ్రా పాలక వర్గాన్ని ఎలా నిలువరించాలి? ఈ ఫ్యూడల్ అభిజాత్యాన్ని ప్రశ్నించక పోతే, ఈ సమాజం మళ్లీ పాత రాతి యుగంలోకి తిరోగమిస్తుందని పిస్తుంది.

ఇప్పటికే, ప్రజల మధ్య పెట్టి తెచ్చుకున్న ఓట్లతో ప్రజా ప్రతినిధులని అనిపించు కుంటున్న వీళ్లు, కార్పోరేట్ శక్తుల కీలు బొమ్మలై ప్రజల్ని బానిసల కంటె హీనంగా చూస్తున్న సంగతి మనకు తెలిసిందే. ఆదివాసుల నైతే పాలకులు కనీసం మనుషులుగా కూడా చూడడం లేదని అర్థం అవుతున్నదే. వన్య ప్రాణుల కోసం కవ్వాల్ ప్రాజెక్ట్, పక్షులు అంతరించి పక్షి సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. కుక్కను చంపితే అరెస్ట్ చేస్తారు. మూడు లక్షల మంది ఆదివాసుల్ని చంపుతాం అని ప్రకటిస్తున్న పాలకులను శిక్షించ లేని స్థితిలో మనం ఉన్నాం. పంచాయితీ రాజ్ షెడ్యూల్ విస్తరణ చట్టం, వన్ ఆఫ్ సెవెంటీ చట్టం, ఐదో షెడ్యూల్ వంటి వేవి అమలు కాని నేపథ్యంలో ఆ ప్రజల వైపు నిలబడక పోతే, రెడ్ ఇండియన్సును చంపి, యూరోపియన్ల విక్రుత సంస్క్రతీ ప్రతీకలా మిగిలిన అమెరికా వలె, మన సమాజం కూడా నిలిచిపోతుందా అనిపిస్తోంది!

రాజ్య దుర్మార్గాలన్నీ చవి చూసిన ఆదివాసి ప్రజలకు ఇంక పాటించ వలసిన మర్యాదలేవీ మిగిలి లేనందునే, ఇక పోరాడితే తప్ప ఏమీ దక్కించు కోలేని స్థితిలోనే వాళ్లు, విల్లంబులు ఎత్తి పోరాడుతున్నారు. వాళ్ల పోరాటానికి సంఘీభావం తెలిపే సంస్కారం మనకు ఉందా, లేదా అన్న ప్రశ్న మనం వేసుకోవాలి.

ప్రజల సమాధులపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు వల్ల జరుగనున్న అన్ని రకాల మానవీయ, నైతిక, పర్యావరణ, చట్టపరమైన ఉల్లంఘనలపై గొంతెత్తి, ఆ ప్రాజెక్టును నిర్ద్వందంగా నిలిపి వేయడం వల్ల మాత్రమే న్యాయం నిలుస్తుంది.

ఇదేనా ప్రజాస్వామ్యం

సభను అడ్డుకోవాలనే ఆరాటంలో పోలీసులు విచక్షణా రహితంగా వ్యవహరించారు. 20వ తేది అర్ధరాత్రి కాచిగూడలోని తుల్జాభవన్‌పై దాడి చేసి అక్కడ బస చేసిన ప్రజా కళాకారుడు జీతన్ మరాండి, అమరుల బంధు మిత్రుల సంఘం కార్యదర్శి పద్మకుమారి, విరసం కార్యదర్శి వరలక్ష్మి, పాణి సహా 43 మందిని పోలీసులు అరెస్టు చేశారు. బిర్సాముండా వారసత్వాన్ని అందుకొని తన పాటను ఆయుధంగా మలిచి ఉరికొయ్యలను సైతం తుత్తునియలు చేసిన ప్రజా వాగ్గేయకారుడు జీతన్‌మరాండి. దేశమంతా ఒక్కటై జీతన్‌ను ఉరిశిక్ష నుంచి కాపాడుకుంది. ఆదివాసీ పోరాటానికి గొంతుకనిచ్చిన ఆ కళాకారుడు తెలంగాణ సర్కార్‌కు మాత్రం ప్రమాదంగా కనిపించాడు కాబోలు. పోలీసుల ఆగడాలు అక్కడితో ఆగలేదు. అదే అర్ధరాత్రి అంబర్‌పేటలోని తెలంగాణ ప్రజా ఫ్రంట్ కార్యదర్శి దేవేంద్ర ఇంటిపై పాతికమంది మగపోలీసులు దాడి చేసి 8 మంది మహిళా కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ఇక 21వ తేది తెల్లవారు జామున ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక కన్వీనర్ వరవరరావును తన ఇంట్లోంచి అరెస్టు చేసి కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇలా మొదలైన అరెస్టుల పర్వంలో... బస్‌స్టేషన్‌లు, రైల్వేస్టేషన్‌లు, విశ్వవిద్యాలయాలు తేడాలేకుండా తెలంగాణ వ్యాప్తంగా వందలాది మందిని అదుపులోకి తీసుకున్నారు. విరసం మొదలు టీపీఎఫ్, పీడీఎం, పీకేఎం, సీఎల్‌సీ, సీఎంఎస్ ఇలా అన్ని ప్రజా సంఘాల నేతలనూ అరెస్టు చేశారు. ఆదిలాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, వరంగల్ ప్రతి చోటా సభకు హాజరవుతున్న ప్రజల్ని అడ్డుకున్నారు. పోలీసుల ఆంక్షల్ని లెక్కచేయక సభా ప్రాంగణానికి చేరుకున్న విరసం నేతలు రవిచంద్ర, రివేరా, గీతాంజలి, మంజుల, అరసవెల్లి కృష్ణ తదితరులను సైతం అరెస్టు చేశారు. ప్రకాశం నుంచి వస్తున్న జి. కళ్యాణరావును, గుంటూరు నుంచి వస్తున్న సీఎల్‌సీ నాయకులు చిలుకా చంద్రశేఖర్‌లను మార్గ మధ్యంలోనే అదుపులోకి తీసుకున్నారు. చివరకు ముఖ్యమంత్రి చొరవ చేసుకోవాలని కోరేందుకు సీఎం క్యాంప్‌ఆఫీసుకు వెళ్తున్న ప్రొఫెసర్ హరగోపాల్‌ని సైతం అదుపులోకి తీసుకుని మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు పోలీసులు. ఇదీ తెలంగాణలో అమలవుతున్న ప్రజాస్వామ్యం. ఎక్కడా మాట్లాడానికి అవకాశం లేని వాతావరణం. నాకు తెలిసి తెలంగాణ ఉద్యమ సందర్భంలో సమైక్య ప్రభుత్వాలు కూడా హరగోపాల్ వంటి ప్రజాస్వామిక వాదులు, విద్యావేత్తలను అరెస్టు చేసిన దాఖలాలు కనిపించలేదు.

ఎందుకు ఇంతటి నిర్బంధాన్ని ప్రయోగించాల్సి వచ్చింది అంటే? ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక మావోయిస్టు అనుబంధ సంస్థ అని, మావోయిస్టు పార్టీ ఆవిర్భవించి దశాబ్దం పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సభకు అజ్ఞాత నాయకులు హాజరవుతారనేది పోలీసుల వాదన. నిజానికి ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కేఆర్ చౌదరి, ప్రముఖ కవి కె.శివారెడ్డి, రంగస్థల, సినీనటులు కాకరాల, ఆర్.నారాయణ మూర్తి, బెంగాల్‌కు చెందిన అరుణ్ చక్రవర్తి, కంచన్ కుమార్, అమిత్ భట్టాచార్య వంటి విద్యావేత్తలు, కవులు, కళాకారులు, న్యాయవాదులు కలిసి ఏర్పాటు చేసుకున్న వేదిక ఇది. ఈ వేదిక వర్తమాన సమాజంలో పరిణామాలు, ప్రజా పోరాటాలు మొదలు పాలక విధానాల వరకు అన్నింటిని గురించి అకడమిక్‌గా చర్చించనుంది. అందులో భాగంగానే 21నాటి సదస్సుకు రూపకల్పన చేశారు. పోలీసుల వాదన ప్రకారం వేదికలో ఉన్న ప్రజాస్వామికవాదులంతా మావోయిస్టులన్నట్లా? ప్రత్యామ్నాయ రాజకీయాల్ని మాట్లాడితే మావోయిస్టులవుతారా? ప్రజలు కోరుకుంటున్న ప్రత్యామ్నాయాన్ని, ప్రజలు ఆచరిస్తున్న ప్రత్యామ్నాయాన్ని నిరాకరించేందుకు మావోయిస్టు ముద్ర వేసిన పోలీసులు తెలంగాణ సమాజానికి ఎలాంటి సంకేతాలివ్వదలుచుకున్నారు?

ఎందుకింత భయం?

నిజానికి ఏం మాట్లాడాలనుకుంది వేదిక? అమెరికా సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో పాలకవర్గాలు అమలు చేస్తున్న అభివృద్ధి నమూనాను ఎండగట్టి మధ్యభారతంలో ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను అమలు చేస్తున్నారు ఆదివాసీలు. విప్లవకర వర్గాల ఐక్య సంఘటన అద్దాల మేడల, భారీ ప్రాజెక్టుల విధ్వంసకర అభివృద్ధికి ప్రత్యామ్నాయంగా సమిష్టి వ్యవసాయ క్షేత్రాల, గురుకులాల, ప్రజా న్యాయ వ్యవస్థల అభివృద్ధి నమూనాను అమలు చేస్తోంది. ఈ విషయాల్ని గురించి వేదిక చర్చించాలనుకుంది. ప్రత్యామ్నాయ అభివృద్ధి అంటేనే పాలకులకెందుకింత భయం. పెట్టుబడిదారుల సేవనే పరమావధిగా భావించే అభివృద్ధి నిరోధక పాలకులు దేశ సహజ వనరులను బహుళజాతి సంస్థలకు దోచి పెడుతూ, దాన్ని ప్రతిఘటిస్తున్న ప్రజలపై యుద్ధాన్ని ప్రయోగిస్తున్నారు. సహజ వనరుల్ని పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం కాక, ప్రజల మౌలికావసరాలు తీర్చేందుకు వినియోగించాలంటున్న రాజకీయాల్ని కట్టడి చేయడానికి రాజ్యం ప్రయోగిస్తున్న నిర్బంధమిది. అది దండకారణ్యంలో గ్రీన్‌హంట్ ఆపరేషన్ కావచ్చు. తెలంగాణలో వాక్ సభా స్వాతంత్ర్యాలపై ఆంక్షలు కావచ్చు. అమెరికా మెప్పుపొందడమే పాలకుల కర్తవ్యంగా మారింది. అందుకే తెలంగాణ ప్రభుత్వం పది మందిని కలవనీయకుండా, ప్రత్యామ్నాయ రాజకీయాల ప్రస్తావన రాకుండా కట్టడి చేయాలనుకుంది.

ప్రజల ఆకాంక్షల ముందు పాలకుల కుట్రలు కుప్పకూలక తప్పదని మరోమారు రుజువుచేశారు పోరాట ప్రజలు. అరెస్టులు చేసినా, నిర్బంధాన్ని ప్రయోగించినా ప్రజలు భయపడలేదు. వేలాది మంది నగరానికి రానే వచ్చారు. సభాస్థలిలో నినాదనాలు కురిపించారు. తెలంగాణ నేలకు ఓ వారసత్వం ఉంది. రాజ్యాన్ని దిక్కరించి నిలబడిన స్వభావముంది. అందుకే.. భయంతో ప్రజా చైతన్యానికి అడ్డుకట్ట వేయాలనుకున్న ప్రభుత్వం తన అసలు స్వభావాన్ని భయటపెట్టుకుందే తప్ప అనుకున్నది సాధించలేకపోయింది. సభను భగ్నం చేశామని ప్రకటించుకున్న పోలీసులు.. ఒకచోట అడ్డుకొని నాలుగు చోట్ల నిర్వహించుకునే అవకాశం కల్పించారు. జీతన్ మరాండి సహా అరెస్టయిన 43 మంది కామ్రేడ్స్ బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో విజయవంతంగా ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక సభను నిర్వహించారు. కళాకారుల ఆట పాటలతో, ఉపన్యాసాలతో సభ ఉద్వేగభరితంగా రోజంతా సాగింది. మలక్‌పేట, గోషామహల్ పోలీస్‌స్టేషన్‌లు సైతం ప్రత్యామ్నాయ రాజకీయాల చర్చకు వేదికయ్యాయి. ఉస్మానియా విద్యార్థులు విప్లవోద్యమానికి జేజేలు పలికారు. ఢిల్లీ విద్యార్థులు గొంతుకలిపారు. ఇది చాలు.. ప్రజల గొంతునొక్కాలనుకున్న ప్రభుత్వ వైఫల్యాన్ని గుర్తుచేయడానికి.

ఏ సోపానాలకీ మౌనం?

అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే తెలంగాణ ప్రభుత్వం

వ్యాసం

భగ్నసభ ఇచ్చిన సందేశం

- వరలక్ష్మి

ఎవరు చెప్పారు ప్రత్యమ్నాయ రాజకీయ వేదిక సభ జరగలేదని? సుందరయ్య విజ్ఞాన కేంద్రం చుట్టూ ముళ్ళకంచెలు మొలుచుకొచ్చిన మాట నిజమే. వందలాదిగా ప్రజా సంఘాల కార్యకర్తలను 20వతేదీ అర్ధరాత్రి నుండే ముందస్తు అరెస్టులు చేసింది నిజమే. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు 'సమైక్యంగా' ఉక్కు పాదం మోపిందీ నిజమే.

అయినా నాతోసహా 43 మందిని సికింద్రాబాదుకు సుదూరంగా అక్రమంగా నిర్బంధించిన బొల్లారం పోలీస్ స్టేషన్ వేదికగా ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక సభ జరిగింది. ఒక సభను భగ్నం చేస్తే పది సభలు జరుగుతాయి. నలుగురు కూడిన చోటల్లా సభ జరిగినట్టే. అట్లా ఒక వేదిక పదుల వేదికలైంది. మావోయిస్టులకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో బలం లేదని చేస్తూ వచ్చిన ప్రచారం ఈ భగ్న సభ ద్వారా భగ్నమైనది. సభ ఎంతగా విజయవంత మవుతందోనని ప్రభుత్వం ఎట్ల భయపడింది! అంటే ప్రత్యామ్నాయ రాజకీయాలకు అంత బలముందన్న మాట. నిర్బంధ సభలో వక్తలు ఈ విషయాన్ని ఒకటికి నాలుగు సార్లు గుర్తుచేస్తూ మాట్లాడారు.

మావోయిస్టు రాజకీయాలతో ఏ మాత్రం పరిచయం లేని విద్యార్థి ఒకరు యుద్ధభూమిగా మారిన సుందరయ్య విజ్ఞాన కేంద్రం పరిసరాలను చూసి 'మళ్లీ సభ ఎప్పుడుపెడుతున్నారో చెప్పండి, నేనూ వస్తా'నని అడిగాడని విడుదలైన తర్వాత ఒక మిత్రుడు చెప్పాడు. ఉద్యమం పుణ్యమా అని ముఖ్యమంత్రి అయిన చంద్రశేఖర రావు తెలుసుకోలేని విషయాన్ని, అతను తెలుసుకున్నాడు. భగ్నం చేస్తే మరిన్ని సభలు జరుగుతాయని, ఉద్యమం విస్తరిస్తుందని. భావాలు ప్రసరించరాదని కదా సభలు జరగనివ్వనిది? నిజానికి భగ్న సభలు భావాలను ఎన్నోరెట్లు ప్రసిరింపజేస్తాయి. వందల సంఖ్యలో అరెస్టులు, ఏకంగా రైళ్ళు రద్దు చేయడం, నగరం నడిబొడ్డు పోలీసు క్యాంపు కావడం చూస్తే పదేళ్ళ ఐక్య ఉద్యమ సందర్భం ప్రజల్లో విప్లవ కాంక్ష ఎంతగా ఉన్నదో తెలియజేసింది. సెప్టెంబరు 21 ఆ రకంగా కూడా విప్లవాభిమానులకు గొప్ప భరోసానిచ్చింది.

మదినిండా ఆ భరోసా నింపుకొని సెప్టెంబరు 21 ఉదయం 11గంటలకు బొల్లారం పోలీస్ స్టేషన్ లో మమ్మల్ని బంధించిన గదిలో పోలీసు పహారా నడుమ సభ ప్రారంభించుకున్నాం. ఉదయం సెషన్ కు ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక బాధ్యులు, అమరుల బంధుమిత్రుల సంఘం కార్యదర్శి కా.పద్మకుమారి అధ్యక్షత వహించారు. అంతకు ముందు అర్ధరాత్రి మమ్మల్ని అరెస్టు చేసి కుక్కేసిన పోలీసు వ్యానులోనే మా గుండెల్లో అమరుల స్థూపాన్ని, మా కళ్ళలో ఎర్ర జెండాను ఆవిష్కరించుకున్నం. కళాకారులు సుత్తీ కొడవలి గురుతుగ ఉన్న ఎర్రని జెండా ఎగురుతున్నది అని, ఓ అరుణపతాకమా అని పాటలు పాడగా మమ్మల్ని నగర శివారు దాటిస్తున్న వాహనంలోనే కోరస్ ఇచ్చాం. ఝార్ఖండ్ కళాకారులు ఝార్ఖండీలో పాడారు. 'హమర షాన్ దేఖ్కే హమర సత్తా దేఖ్కే షోషక్ శాషక్ ఘబరాతి రే. మొహే ఉగ్రవాదీ బులాతీ రే' (పదాలు అచ్చంగా ఇవే కాకపోవచ్చు). నిశిరాత్రి నిర్బంధంలో చక్కర్లు కొట్టిన ఈ పాటలు ప్రదర్శన కోసం కాదు. చప్పట్ల కోసం కాదు. ఇవి మాకోసం మేమే పాడుకుంటున్నాం అన్నట్లుగా ఉన్నాయి.

మధ్యాహ్నం సెషన్ అమరుల బంధుమిత్రుల సంఘం అధ్యక్షురాలు కా.అంజమ్మ అధ్యక్షతలో కొనసాగింది. కా.పాణి (విరసం), కా.వరలక్ష్మి (విరసం), కా.కనకయ్య (సి.ఆర్.పి.పి), అన్నపూర్ణ (పౌరహక్కుల సంఘం), కా.దేవేంద్ర (చైతన్య మహిళా సంఘం), కా.జీతన్ మరాండీ (ఝార్ఖండ్ అభేన్), కా.ఉత్పల్ (ఝార్ఖండ్) ప్రసంగించారు.

భారతదేశంలో అసలైన విప్లవపార్టీ నిర్మాణం కోసం రివిజనిజంతో రాజీలేని పోరాటం చేసి స్పష్టమైన విప్లవ పంథానిచ్చిన తొలి తరం నక్సల్బరీ నాయకులు కా.చారుమజుందార్, కా.కనాయ్ చటర్జీలకు సభ జోహార్లు అర్పించింది. నక్సల్బరీ తరానికే చెందిన నాయకులు, విప్లవ పార్టీల ఐక్యత కోసం ఎంతగానో కృషి చేసిన కా.రవూఫ్, కా.సుషీల్ రాయ్‌ల రాజకీయ సైద్ధంతిక నిర్మాణపరమైన పాత్రను గుర్తుచేసుకుంది. అటు వంటి కృషే చేసి, బహిరంగ ప్రజా జీవితంలో, మన మధ్యే ఒరిగిపోయిన కా.గంటి ప్రసాదంను గుర్తుచేసుకుంది. విప్లవకారుల తన అసలు స్వభావాన్ని బయటపెట్టుకుంది. అధికారంలోకి రావడానికి ముందు ఎన్‌టీఆర్, వైఎస్‌ఆర్ పలికిన మాటల్నే కేసీఆర్ పలికాడు. అధికారంలోకి వచ్చాక వలస పాలకులు ఆచరించిన పద్ధతుల్నే తాను ఆచరిస్తున్నాడు. నక్సలైట్లే దేశభక్తులన్న ఎన్‌టీఆర్, మొదలు నక్సలిజాన్ని సామాజిక- ఆర్థిక - రాజకీయ సమస్యగా చూస్తామన్న వైఎస్ఆర్, నక్సలైట్ల ఎజెండాయే మా ఎజెండా అన్న కేసీఆర్ వరకు అంతా అధికారం చేజిక్కగానే అణచివేతను ఆయుధంగా మలుచుకున్నవారే. ఏ ఆకాంక్షల కోసమైతే తెలంగాణ ప్రజలు ఉద్యమాన్ని నడిపారో, ఆ ఆకాంక్షలు భౌగోళిక రాష్ట్ర సాధనతో తీరవని ఈ మూడునెలలలోనే రుజువయ్యింది. వలస పాలనలో వాక్ సభా స్వాతంత్ర్యాలు కరువయ్యాని ఏకరువు పెట్టిన మధ్యతరగతి మేధావులంతా ఇవాల్టి సందర్భంలో ఏమైనట్లు? ఏ ప్రజలు పోరాటాలు చేసి తమకు వేదికలిచ్చారో? ఉద్యమ నేతల్ని చేశారో? ఆ ప్రజా పోరాటాల గొంతునొక్కుతుంటే ఈ మేధావులంతా ఎక్కడికెళ్లినట్లు? నోరులేని ప్రజల గొంతుకై ఊరేగిన 'పాట', గుండె శబ్దమై మోగిన 'మాట', ప్రశ్నల కొడవళ్లైన 'అక్షరం' ఇవాళ పదవుల బాట పట్టినందుకే కదా... ఈ మౌనం. నిన్నా మొన్నటి దాకా ప్రజాస్వామిక హక్కులకు ప్రతీకగా చలామణి అయిన గొంతులన్నీ ఇవాళ ఎందుకు మూగబోయినట్లు? తెలంగాణ సమాజం సంధిస్తున్న ప్రశ్నలివి. ఈ మౌనం ఏ సోపానాల కోసమో? ప్రజల పక్షమో? పాలక పక్షమో తేల్చుకోక తప్పదు.

ఐక్యత సాధ్యాసాధ్యాలను గురించి ఆందోళన చెందినవారికీ, వెటకరించిన వారికీ, అందరికీ సమాధానంగా 2004 సెప్టెంబర్ 21 వచ్చింది. ఒక సందర్భంలో సాయుధ ఘర్షణలకు కూడా దిగిన పార్టీలు అన్ని భేషజాలూ పక్కకు పెట్టి ప్రజల కోసం, గతాన్ని సమీక్షించుకుని ఐక్యమయ్యాయి. దేశంలోని రెండు ప్రధాన విప్లవపార్టీలు సీపీఐ (ఎంఎల్) (పీపుల్స్ వార్), ఎం.సి.సి.ఐ.ల మధ్య జరిగిన సుదీర్ఘ చర్చలు ఫలవంతమై దేశ చరిత్రలో అతి పెద్ద విప్లవ పార్టీ సీపీఐ (మావోయిస్టు) ఏర్పడి పదేళ్ళయింది. బూర్జువా వ్యవస్థలు ఘోరంగా విఫలమైనా, పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం లేదు అని పాలకపక్ష మేధావులు ఢంకా బజాయిస్తున్న తరుణంలో ప్రత్యామ్నాయం సాధ్యమే అని చాటుతూ భారతదేశంలో ఒక బోల్షివిక్ పార్టీ ఆవిర్భవించింది. ఈ సందర్భాన్ని మరింత అర్థవంతం చేస్తూ, భవిషత్ విప్లవోద్యమానికి గొప్ప భరోసానిస్తూ ఈ ఏడాది మేడే మరో ఐక్యతా ప్రయత్నాలను ఫలవంతం చేసింది. సి.పి.ఐ. (మావోయిస్టు) పార్టీలో సి.పి.ఐ. ఎంఎల్ (నక్సల్బరీ) విలీనమైంది. ఈ పరిణామాలు సహజంగానే పాలకవర్గాల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. నిదర్శనం ఆపరేషన్ గ్రీన్ హంట్, అందులో భాగంగా నేడు ఈ సభను అడ్డుకొని ప్రజలను టెర్రరైజ్ చేయడం. ఈ చర్య మరింత స్ఫూర్తిని నింపుతుందే కాని విప్లవాభిమానుల్ని నీరుగార్చదు. అట్లా మొదలైన మా నిర్బంధ సభ పదేళ్ళఐక్య విప్లవోద్యమం సాధించిన విజయాలు, జనతన సర్కార్ రూపంలో మొలకలెత్తిన ప్రజా రాజ్యాధికారం, ప్రజా సైన్యం, ఐక్య సంఘటనలు... పొందిన వైఫల్యాలు - నల్లమల, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉద్యమాలను విశ్లేషించింది.

సభలో 15 పుస్తకాలను, ఒక సీడిని ఆవిష్కరించుకున్నం. అవి దగ్గర లేకపోయినా ముందురోజు మధ్యాహ్నం రాసుకున్న జాబితా అనుకోకుండా మా వద్ద ఉంది. ఆ లిస్టును సభలో ప్రదర్శించి అందులో ఉన్నవాటిని పరిచయం చేసారొకరు. అందులో ఆదర్శ కమ్యూనిస్టు ఎం.టి. ఖాన్ పై డాక్యుమెంటరీ సీడీ, మావో రచనలు, చారు మజుందార్ డాక్యుమెంట్లు, రవూఫ్, సుశీల్ రాయ్ లతోపాటు ఇటీవల అమరులైన విప్లకారులపై నివాళి వ్యాసాలు, జీవిత చరిత్రలు, సామ్రాజ్యవాదంపై జేమ్స్ పెట్రాస్ వ్యాసాల తెలుగు అనువాదం, సమకాలీన సామాజిక రాజకీయార్థిక విశ్లేషణలు, కవిత్వం వగైరాలు ఉన్నాయి.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఝార్ఖండ్ కళాకారులు పాటలు పాడారు. మెడచుట్టూ హారం ఆకారంలో పచ్చబొట్లు ధరించిన ఝార్ఖండ్ ఆదివాసీ అమ్మాయిల రాగాలు సహజ నదీ ప్రవాహంలాగా పరవళ్ళుతొక్కాయి. ఝార్ఖండీ యాసలో హిందీ మాట్లాడే ఆ ఆదివాసులు ఎక్కడినుండో వచ్చి ఇక్కడ చిక్కుకుపోయామే అనే చీకు చింత లేకుండా, ఇంట్లో ఉన్నట్లుగానే ఉండటం చూస్తే ముచ్చటైంది.

మాలో సగానికి పైగా ఉన్న ఝార్ఖండ్ మిత్రుల కోసం హిందీ పదాలు కూడబలుక్కొని అనువాదం చేసాము. ఈ సభలో పాల్గొన్న గొప్ప అనుభూతిని ఉరికొయ్యను ధిక్కరించి వచ్చిన ప్రజా గాయకుడు జీతన్ మరాండీ పంచుకున్నారు.

ఈ సభ ప్రత్యేకత ఇందులో వక్తలు, కళాకారులు, శ్రోతలు విడివిడిగా లేకుండా కలగలిసిపోవడం. మూడేళ్ళ కల్పన (ఝార్ఖండ్) ప్రత్యేక ఆకర్షణ. జ్వరపడి కూడా కాస్తంత స్థిమిత పడగానే అందరితో కొత్తా, పాతా తేడాలేకుండా, భాషా బేధాలు లేకుండా కేరింతలు కొడుతూ ఆటలాడిన చిన్నారి కల్పన మాకేదో సందేశం ఇస్తున్నట్లుగా అనిపించింది. ఇక నినాదాలు, దప్పులు మమ్మల్ని విడుదల చేసేదాకా ఆగలేదు. ఇట్లాగే కాకపోయినా ఏదో విధంగా మరెన్నో సభలు జరిగి ఉంటాయి. ఇక ముందు కూడా జరుగుతాయి. భావాలను బంధించడం ఎవరి తరం?

('భావాలు బంధీలవుతాయా' శీర్షికతో సెప్టెంబరు 25న ఆంధ్రజ్యోతి దినపత్రికలో అచ్చయిన వ్యాసం పూర్తి పాఠం)

చదవండి
చదివించండి

వెల : రు. 170/-
పేజీలు : 448



చదవండి
చదివించండి

వెల : రు. 220/-
పేజీలు : 584

మావో రచనలు
మొదటి సంపుటి
&
మావో రచనలు
రెండవ సంపుటి

ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం

ప్రతులకు :
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో లభించును.

www.virasam.in
Email : arunatara1977@gmail.com

సంస్మరణ

సాహిత్యలోకంలో ఒక చేరా ఎప్పుడూ ఉండాలి!

- వి. చెంచయ్య

మరణం సహజమే అయినా, చేరా మరణవార్త ఒకింత ఆశ్చర్యం కలిగించింది. అప్పుడే వెళ్ళిపోయారా అనిపించింది. ఎనభైయేళ్ళ జీవితం నిండు జీవితమే అనాలి. సాధించాల్సింది సాధించడానికి ఈ జీవితం సరిపోతుంది. చేరా విషయంలో ఈపని డెబ్భైయేళ్ళలోపే పూర్తయి నట్టుంది. కాబట్టి చాలామంది అనుకుంటున్నట్టు చేరా మరణం తీరని లోటు కాదు, తీరినలోటే. చేరా ఇక లేరన్న బాధ వల్ల, ఆయనతో ఉన్న అనుబంధం వల్ల, తెలుగు భాషాసాహిత్య రంగాలలో ఆయన చేసిన కృషివల్ల అలా అనిపించడం సహజమే గాని, అలా అనడం మాత్రం శాస్త్రీయం కాదు. ఈ 'తీరనిలోటు' ఎలాంటి వాళ్ళ విషయంలోనైనా అందరూ వాడుతున్న మాటే. ఉచితానుచితాలతో సంబంధం లేకుండా విచ్చలవిడిగా వాడుతున్న ఈ మాట చేరాలాంటి వాళ్ళ విషయంలో కూడా ఉపయోగించడం అంత సమంజసంగా అనిపించదు. పైగా చేరా భాషాశాస్త్రవేత్త. ఒక పడికట్టు పదంగా మారిపోయిన దాన్ని తనపట్ల ప్రయోగించడాన్ని ఆయనా ఒప్పుకోకపోవచ్చు. ఇలా అన్నందుకు చేరా నావైపు చూసి ఒక చిరునవ్వు విసిరినట్టు అనిపిస్తోంది. ఆ చిరునవ్వుతో కూడిన చూపులో ఇంకో విషయం కూడా ధ్వనిస్తోంది – 'తీరనిలోటు' అనే మాట అకాలమరణం పొందిన వారికి వర్తిస్తుంది గాని నాలాంటి నిండుజీవితం గడిపినవాళ్ళకు కాదు గదాఅని.

విమర్శనా రంగంలో ఉండి కూడా చేరా అజాత శత్రువు అనిపించుకున్నారు. స్నేహం విషయంల్లోనూ, వ్యక్తిగత గౌరవ మర్యాదల విషయంలోనూ అయితే చేరాకు ఈమాట తిరుగులేనిది. భాషా సాహిత్యాలకు సంబంధించిన అభిప్రాయ భేదాలు ఎంత తీవ్రస్థాయిలో ఉన్నా, అది స్నేహపూర్వక వైరమేగాని శత్రుపూరితం కాదు. చేరా విషయంలో స్నేహపూర్వక వైరం అనడం కూడా సరైంది కాదు. స్నేహపూర్వక అభిప్రాయం భేదం అనాల్సిందే. వచన కవితా లక్షణాల గురించీ, వచన కవితా చరణాలలో భావ గణాల గురించీ చేరా, సంపత్కుమారల మధ్య చర్చలోతుగా జరిగింది. ఆ చర్చనంతా ఇద్దరూ కలిసి ఒకే పుస్తకంగా వెయ్యడం ఆదర్శ ప్రాయమైన మిత్ర వైరుధ్యానికి మంచి ఉదాహరణ.

తెలుగులో 'బడు' ప్రయోగించేవాళ్ళు బడుద్ధాయిలని రంగనాయకమ్మగారు నిందాపూర్వక పద ప్రయోగం చేసినా, చేరా హద్దుమీర లేదు. మామూలు వ్యవహారంలో, రచనల్లో బడుప్రయోగం అనవసరమే అయినా, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అరుదుగానైనా దాని అవసరం ఉంటుందన్న చేరా అభిప్రాయం సరైనదే. అలాంటి అరుదైనా సందర్భం కవిత్వంలో వచ్చే అవకాశం ఉంది. 'సత్యం చావలేదు, చంపబడ్డాడు' అన్నప్పుడు కలిగే అనుభూతి తీవ్రత, 'సత్యం చావలేదు, పోలీసులు చంపారు' అన్నప్పుడు ఉండదు.

చేరాకూ కోపం వస్తుంది. అలాంటి సందర్భాలు కొన్ని ఉంటాయి. ఆయనా మనిషే కదా! అంటే దేవుళ్ళకయితే కోపం రాదన్న అర్థం వస్తున్నట్టుంది. అసలు దేవుళ్ళకొచ్చినంత కోపం మనుషుల కెక్కడొచ్చింది? అది వేరే కథ. ప్రస్తుతానికి దాన్నలా ఉంచుదాం. సాంప్రదాయికులకూ, మార్క్సిస్టులకూ సమస్యలుంటాయిగాని సందేహాలుండవనీ, ఇద్దరూ ఎవరి పద్ధతిలో వాళ్ళు రెడీమేడ్ సమాధానాలు చెబుతుంటారనీ చేరా అన్నప్పుడు చేరా కోపం మార్క్సిస్టులపైనే గాని, సాంప్రదాయికుల పైన కాదు. సాంప్రదాయికులు ప్రతిదానికీ విధినీ, దైవాన్నీ, కర్మనీ, స్వర్గనరకాల్నీ, మోక్షాన్నీ, అడ్డం పెడతారు. మార్క్సిస్టులు వర్గవ్యవస్థ అనీ, వర్గ స్వభావం అనీ, విప్లవం అనీ, సోషలిస్టు కమ్యూనిస్టు వ్యవస్థలనీ ఎదుటివాళ్ళ నోళ్ళు మూయిస్తారు. ఆపత్సమయంలో ఇద్దరూ ఈ 'బ్రహ్మాస్త్రాన్ని' ప్రయోగించి శత్రు సంహారం చేస్తారనీ, ఈ పడికట్టు పదప్రయోగాల మాటున దాగి తప్పుకుంటారనీ, అందువల్ల వారిద్దరికీ సమస్యలూ, పరిష్కారాలూ ఉంటాయేగాని, సందేహాలుండవనీ చేరా అభిప్రాయపడ్డట్టు తెలుస్తుంది. ఇక్కడ చేరాకు సాంప్రదాయికుల రెడీమేడ్ పరిష్కారాలు గురించి చెప్పడం అప్రస్తుత విషయం. ఆయనకు అది ముఖ్యం కాదు. మార్క్సిస్టుల రెడీమేడ్ పరిష్కారాలు గురించి మాట్లాడ్డమే ప్రస్తుతం, ప్రధానం. కోపం ఉన్నచోట ప్రేమ కూడా ఉంటుందనుకునే సందర్భం అయితే చేరాకు మార్క్సిస్టులపైన కోపంతో పాటు ప్రేమ కూడా ఉందనే అనుకోవాలి. సాంప్రదాయికుల్ని మార్చడం కష్టం. మార్క్సిజంలో మర్చుకున్న ప్రాధాన్యాన్ని బట్టి మార్క్సిస్టులు మారతారనే నమ్మకం చేరాకు ఉండడం న్యాయమే. అయితే చేరా చెప్పినవన్నీ మార్క్సిస్టులకు అంగీకారయోగ్యం కాకపోవచ్చు.

విభిన్న ధోరణులకు సంబంధించిన ఆసక్తి, చేరాలో ఉంది. ప్రాచీనం, ఆధునికం అనే తేడా లేకుండా ఎక్కడయినా నైపుణ్యం ఉంటే అభిమానించి ప్రోత్సహించే స్వభావం ఆయనది. ఆధునిక భాషాశాస్త్రం ఆయన వృత్తిగా, సాహిత్య విశ్లేషణ ఆయన ప్రవృత్తిగా కనిపించినా, వృత్తి ప్రవృత్తుల మధ్య తేడా లేనంతగా ఆసక్తి, శక్తి పెనవేసుకుపోయాయి. ఆధునిక భాషా శాస్త్రవేత్తకు చిన్నయసూరి బాలవ్యాకరణం అంటే అమిత యిష్టంగా ఉండడం ఆశ్చర్యకరమే. ఆయన స్వభావం అర్థం అయితే ఈ ఆశ్చర్యం అవిరైపోతుంది. బాలవ్యాకరణ సూత్ర నిర్మాణంలోని అద్భుతమైన కూర్పు, మిత్రలాభం, మిత్రభేదం కథల్లోని వినసొంపైన వాక్యనిర్మాణం, భాషగ్రాంథికం అయినా అందులోని ఒడుపైన వ్యావహారిక శైలి ఎవర్నయినా ఆకట్టుకునే అంశాలేగాని, ఇలాంటివి చేరాను సమ్మోహన పరుస్తాయి. ఈ పారవశ్యంలో ఆయన మరిచిపోయే విషయం ఒకటుంది. అది బాలవ్యాకరణంగానీ, నీతిచంద్రికగానీ భాషాపరంగా నిర్వర్తించిన ప్రతికూల పాత్ర. రాయవాచకం మొదలుకాని 17,18 శతాబ్దాలలో ప్రారంభమైన వ్యావహారిక భాషా ధోరణికి చిన్నయసూరి రచనలు అడ్డుకట్ట వేశాయి. గ్రాంథిక భాషకు వ్యాకరణం రాస్తే అది పరమ ప్రామాణికం అయింది. గ్రాంథిక పండితలోకం దాన్ని ఆకాశానికి ఎత్తింది. దానికి ప్రధాన కారణం చిన్నయసూరి సూత్రనిర్మాణ, నైపుణ్యం. 'ఏకమాత్రాలాఘవేన పుత్రోత్సవం మన్యంతే

వైయాకరణాః' అని సంస్కృత వ్యాకరణ సంప్రదాయం. అంటే సూత్ర రచనలో ఒక్క అక్షరం తగ్గించగలిగినా వ్యాకరణ పండితులు పుత్రుడు పుట్టినంతగా సంతోషిస్తారట! ఈ పద్ధతిలో సంస్కృతభాషకు వ్యాకరణం రాసినవాడు పాణిని. అచ్చులేని దశలో, కనీసం కాగితం కలం లేని దశలో - అంటే లేఖనానికి ఇవాళ ఉన్నట్టుగా సౌకర్యాలు లేని దశలో పాణిని ఈ పద్ధతిని ఎంచుకున్నాడు. 19వ శతాబ్దంలో కాగితం కలంతోబాటు అచ్చుకూడా సిద్ధంగా ఉంది. అయినా చిన్నయసూరి వ్యాకరణం రాయడానికి పటిష్టనిర్మాణం గల సూత్ర పద్ధతినే ఎంచుకున్నాడు. కాబట్టి రచనా పద్ధతిలోగాని, వస్తువు విషయంలోగాని, భాష విషయంలోగాని చిన్నయసూరిలో ఆధునికత లేదు. రచనా శిల్పం విషయంలో మాత్రమే గొప్పదనం ఉంది. ఈ శిల్పం చేరాను ఆకర్షించింది. చిన్నతనంలో ఊరి ఏటి ఒడ్డున కూర్చొని తోటలను, సూర్యోదయాన్నీ చూసి ఆనందించే వాడట. తనలో సౌందర్యదృష్టి ఏర్పడడానికి ఈ సుందర వాతావరణమే కారణం కావచ్చునని చేరాయే ఒకచోట రాసుకున్నాడు.

ఇలాంటిదే మరొక విషయం చేరాకు పద్యం అంటే ఇష్టం ఉండడం. వచన కవితను ఎంత ఇష్టపడతాడో పద్యాన్నీ అంత ఇష్టపడతాడు. చేరాతల్లో ఎక్కువభాగం యువ వచన కవుల్నీ, కవయిత్రుల్నీ, వారి కవితా శిల్పాన్నీ విశ్లేషించి ప్రోత్సహిస్తూ రాసినవే. తెలుగు సాహిత్యంలో పద్యాన్ని ఎలా చూడాలి అన్నదానిపై సరైన అవగాహన ఉండడం అవరరం. యతిప్రాసలతో, గణబద్ధ ఛందస్సులతో ఉన్న తెలుగు పద్యం లాంటిది ఇతర భాషల్లో లేదనీ, అది తెలుగుకు మాత్రమే ప్రత్యేకం అనీ ఒక అభిప్రాయం ఉంది. అది చాలావరకు వాస్తవమే. అయితే? తెలుగు భాషలో లేని ప్రత్యేకతలు కొన్ని ఇతర భాషలలో ఉండవా? సమస్య అదికాదు. ఆధునిక కాలంలో పద్యానికున్న పాత్ర, అవసరం ఏవిటన్నది ముఖ్యం. పద్యం రాయలేక పద్యాన్ని వ్యతిరేకిస్తారనేది శుష్కవాదం. శ్రీశ్రీ అద్భుతంగా పద్యాలు రాశాడు. అది తనమార్గం కాదని వదిలేశాడు. మహాకవి, యుగకర్త అయ్యాడు. శ్రీశ్రీ 'ప్రభవ'లో ఉన్నవన్నీ పద్యాలే. శ్రీశ్రీ రామాయణాన్ని పద్యకావ్యంగా రాసి ఉంటే గొప్పగా ఉండేదని కొందరు పండితులు అనడం నేను విన్నాను. పద్యరచనలో ఇంత ప్రతిభ ఉండీ 20వ శతాబ్దంలో అది పనికివచ్చే ప్రక్రియ కాదని శ్రీశ్రీ నిర్ణయించుకున్నాడు. తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకోవడం వల్ల శ్రీరంగంశ్రీనివాసరావు శ్రీశ్రీ అయ్యాడు. లేకపోతే విశ్వనాథను మించిన మరో విశ్వనాథ అయ్యేవాడు. పద్యాన్ని వదిలెయ్యడం వల్లనే శ్రీశ్రీ మహాకవి కాలేదు. తన మస్తువుకు తగిన రూపం పద్యం కాదని తెలుసుకొని, వస్తువుకు తగ్గ రూపాన్ని ఎంచుకోవడం వల్ల మహాకవి అయ్యాడు. అంతేకాదు, కాలానికి తగిన వస్తువును ఎంచుకోవడం కూడా అందుకు ప్రధాన కారణం.

పద్యం విప్లవ భావాలకు వాహిక కాలేదని గతంలో నేను 'అరుణతార'లో ఒక వ్యాసం రాశాను. ఈ విషయం అందులో వివరంగా చర్చించాను. ఆధునిక భావాలకు వచన కవిత, గేయం, పాట సరిపోయినట్టుగా పద్యం ఒదగదు. ఈనాడు పద్యం పనికిరాదంటే ప్రాచీన పద్యసాహిత్యన్నంతా వ్యతిరేకించినట్టు కాదు. ప్రాచీన కాలంలో కూడా పద్యం ప్రజలకు అందుబాటులో ఉన్న రూపం కాదు. కొన్ని చాటు పద్యాలూ, వేమన పద్యాలు లాంటివి అపవాదాలు. చాటు పద్యాలూ, కొంతవరకు శతక పద్యాలూ ఆసు సంప్రదాయం కలిగినవి. అంటే ఇంట్లో కూర్చోని పకడ్బందీ లక్షణాలతో కూర్చిన పద్యకావ్యాలు కావవి. దేశాటన చేస్తూ సందర్భానుసారంగా అనుభవాన్ని రంగరించి చెప్పిన పద్యాలు సరళంగా ఉండి ప్రజలకు ఆస్వాదయోగ్యంగా ఉంటాయి. ఈ లక్షణాలు పద్యకావ్యాలకుండవు. కవికి తన పాండిత్య ప్రదర్శన చేసుకోడానికి పద్య నిర్మాణంలో ఎంతైనా అవకాశం ఉంటుంది. పండితుల మెప్పు దొరక్కపోతే అది గొప్ప కావ్యం కాదన్న అభిప్రాయం కవుల కుండేది. ఈ పాండిత్య ప్రకర్ష ఎక్కువై ఒక దశలో చిత్రకవిత్వాలూ, బంధ కవిత్వాలూ కూడా వచ్చాయి. రెండర్థాలు గల ద్వ్యర్థి కావ్యాలూ, మూడర్థాలు గల త్ర్యర్థి కావ్యాలూ ఈ కోవకు చెందినవే.

ప్రాచీన కాలంలో కూడా జానపద గీతాలూ, అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగయ్య, రామదాసు తదితర పదకవుల కీర్తనలూ మొదలైన పద్యేతర సాహిత్యం లేకపోలేదు. ఈ కవిత్వం అంతా రాజస్థానాల బయట వచ్చిందే. ఈ సాహిత్యానికి రాజుల పోషణ ఉండేది కాదు. ఆ కవులు రాజపోషణ కోరుకున్నవారూ కాదు. అందుకే వారు పద్యాన్ని స్వీకరించ లేదు. కొంతవరకైనా ప్రజా సాహిత్య లక్షణాలు ఆ సాహిత్యంలో కనిపిస్తాయి.

అయితే ప్రాచీన పద్య కావ్యాలన్నీ పనికిరావా? వాటిని చదవడం అవసరం కాదా? ఆ కావ్యాలలోని కథా వస్తువు పురాణాలకు చెందిందే అయినా, ఆయా సామాజిక దశల్లోని మార్పుల్ని గ్రహించటానికి ఆ సాహిత్యాన్ని అధ్యయనం చెయ్యడం, విశ్లేషించడం అవసరమే. త్రిపురనేని మధుసూదనరావు, కాత్యాయనీ విద్మహే లాంటివాళ్ళు ప్రాచీన సాహిత్యాన్ని కొత్త చూపుతో పరిశీలించి విశ్లేషించిన తీరు ఉపయోగకరమైనది. ఇవన్నీ పట్టించుకోకుండా చేరా పద్యాన్ని ఇష్టపడడం, పద్యం ద్వారా కూడా ఆధునిక భావాన్ని చెప్పొచ్చనడం, పద్యశిల్పాన్ని వివరించడం అంత ప్రయోజనకరం కాదు. అభ్యుదయ సాహిత్యంగానీ, విప్లవసాహిత్యంగానీ సాహిత్య విమర్శలో శిల్పం జోలికి పోలేదన్న కొరత చేరాలో ఉండడం వల్ల ఆయన శిల్పం వైపు మొగ్గు చూపారనడం కూడా సరైంది కాదు. శిల్పం గురించి ఎవరైనా పట్టించుకోవచ్చు, అయితే వస్తువు నుండి శిల్పాన్ని వేరు చేసి కాదు. చేరా వస్తుశిల్పాల సమన్వయంతో సాహిత్య విమర్శ కొనసాగించి ఉంటే ఇంకా బాగుండేది. ఈ ఒక్క అంశాన్ని పక్కన పెడితే చేరా చేసిన శిల్పచర్చలో నేర్చుకోవలసిన విషయాలు చాలానే ఉన్నాయి. 'కొండలు పగలేసినం, బండలనూ పిండినం, మా నెత్తురె కరంకరగా ప్రాజెక్టులు కట్టినం' అని సాగిన చెరబండ రాజు గేయంలో 'మేడెవడిదిరో, గుడిసెవడిదిరో' అనే చరణాల్ని 'మేడెవడిదిరో, గూడెవడిదిరో' అని మారిస్తే బాగుండేదన్న చేరా సూచన తిరుగులేనిది. భాషాశాస్త్రవేత్త సాహిత్య విమర్శకుడైతే కలిగే అదనపు ప్రయోజనం చేరాకు కలిసొచ్చింది. ఈ రెండిటిని సమన్వయించడంలో చేరా చూపిన నేర్పు గొప్పది.

శిల్పం పట్ల ఎంత మోజు ఉన్నా, ఆలంకారికత, ఆవేశం, ఉద్వేగం ఉన్న వచన రచన చేరాకు ఇష్టం లేదు. ఇవన్నీ కవిత్వంలో ఉండవలసిన లక్షణాలు. వచనం వచనంగానే ఉండాలన్నది ఆయన అభిప్రాయం. అందుకని వచనం నిస్సారంగా, నిస్తేజంగా ఉండాలని కాదు. వచనంలో కూడా అక్కడక్కడా విషయ సంబంధమైన చురకలు, హాస్యప్రియత్వం (Sense of Humour) ఉంటూ, విషయ వివరణకు ప్రాధాన్యం ఇస్తూ సాఫీగా సాగిపోయే వచన రచన ఆయనకిష్టం. ఆయన తన వచనంలో ఈ నియమాల్ని పాటించారు. విప్లవ రచయితలకు సమస్యలేగాని సందేహాలుండవని అనడం విప్లవ రచయితలపైన వేసిన చురకే. నేను పద్యం గురించి రాసిన వ్యాసంలో చేరా పైన వేసిన చురకలోని

హాస్యప్రియత్వాన్ని ఆయన కూడా చాలా ఆనందించాడు. పద్యం అంటే బేరా (బేతావోలు రామబ్రహ్మం) చెవి కోసుకుంటాడనీ, చేరా రెండు చెవులూ కోసుకుంటాడనీ నేనన్న మాటకు చాలా సంతోషించి 'Keep it up' అని నాకు కార్డు రాశారు. అప్పట్లో తనను కలిసిన వాళ్ళందరితో ఈ విషయాన్ని చెప్పి మరీ ఆనందించారు. వ్యంగ్యం ఇతరులపైన విసరడంతో బాటు, ఇతరులు తనపై విసిరిన వ్యంగ్యాన్ని ఆనందించడం ఉత్తమ వ్యక్తిత్వానికీ, అభిరుచికీ నిదర్శనం.

భాష గురించి చేరా ప్రతిపాదనలన్నీ శాస్త్రీయమైనవిగానే కనిపిస్తాయి. రాసేభాషకీ, మాట్లాడే భాషకీ తేడా ఉంటుందన్నారు చేరా. మాట్లాడే భాషే రాస్తున్నామా అని ప్రశ్నించారు రంగనాయకమ్మగారు. ఇద్దరి అభిప్రాయాలూ ఒకటిగానే ఉన్నట్టు కనిపిస్తున్నా కొంచెం తేడా ఉంది. మాట్లాడే భాషను యథాతథంగా రాయలేమని, అది సాధ్యం కాదని చేరా అభిప్రాయం. వాడుక భాషలోనే రాస్తున్నామా అని ప్రశ్నించడంలో వాడుక భాషలోనే రాయాలి అని అభిప్రాయపడుతున్నట్టుంది రంగనాయకమ్మగారు. మాట్లాడే భాష, వాడుకభాష, వ్యావహారికభాష - ఈ మూడు మాటల్నీ ఒకే అర్థంలో ఉపయోగిస్తున్నాం. వ్యావహారికం అంటే మన వ్యవహారంలో ఉన్న భాష అని అర్థం. ఇది రెండు రకాలుగా కనిపిస్తుంది - శిష్టవ్యావహారికం, మాండలికం. విద్యావంతులు ఇతర విద్యావంతులతో మాట్లాడేటప్పుడూ, ఉపన్యాలిచ్చేటప్పుడూ మాట్లాడేది శిష్టవ్యావహారిక భాష. సాధారణ ప్రజలు తమ వ్యవహారంలో ఉపయోగించేది మాండలిక భాష. ఇవాళ కథలూ, నవలలూ శిష్టవ్యావహారికంలోనూ, మాండలికంలోనూ రాస్తున్నారు. వ్యావహారికంలో రాస్తున్నది పూర్తి వ్యావహారికమూ కాదు, మాండకలికంలో రాస్తున్నది పూర్తి మాండలికమూ కాదు. అంటే శిష్టవ్యావహారికమైనా, మాండలికమైనా మాట్లాడింది మాట్లాడినట్టు రాయడం లేదని అర్థం. అలా రాయలేక పోవడం రచయితల తప్పు కాదు. లిపిలో ఉన్న పరిమితులే. ప్రపంచంలోని ఏ భాషకు సంబంధించిన లిపి అయిన కొన్ని పరిమితులకు లోబడే ఉంటుంది. ఏదీ సమగ్రమైన లిపి కాదు. సమగ్రమైన లిపి అంటే మాట్లాడింది మాట్లాడినట్టు రాయడానికి వీలయ్యే లిపి. అలాంటి లిపి ఇంతవరకు ఏ భాషకూ లేదు. అందుకే ప్రపంచంలోని భాషా శాస్త్రజ్ఞులు కలిసి భాషలకు సంబంధించి మానవులుచ్చరించే ప్రతిధ్వనికీ ఒక లిపి సంకేతం ఉండే విధంగా International Phonetic Alphabet (IPA) పేరుతో లిపి సంకేతాల చార్టునొకదాన్ని తయారు చేశారు. ప్రపంచంలోని ఏ భాషనైనా మాట్లాడింది మాట్లాడినట్టుగా ఈ లిపిలో రాయవచ్చు. భాషాశాస్త్ర అభివృద్ధిలో ఇదొక మైలురాయి. లిపి ఉన్న భాషలను గానీ, లిపి లేని భాషలనుగానీ శాస్త్రీయంగా పరిశీలించడానికి ఆయా భాషల్ని ఈ లిపిలో రికార్డు చెయ్యడానికి I.P.A. చార్టు ఉపకరిస్తుంది. 99 శాతం మానవుల ఉచ్చారణను రికార్డు చెయ్యడానికి ఈ లిపి పనికొస్తుంది. బహుశా నూటికి నూరు శాతం ఈ లిపి కూడా ఉచ్చారణని యథాతథంగా రికార్డు చెయ్యడానికి పనికిరాక పోవచ్చు. ఎంత శాస్త్రీయమైనా ఇది కూడా ఒక లిపే కాబట్టి దీనికీ కొన్నియినా పరిమితులుంటాయి. కాబట్టి ఏ భాషలోనైనా వాడుక భాషను యథాతథంగా రాయడానికి వీల్లేదు. ఇది తెలుసు కాబట్టే చేరా గారు రాసే భాషకి, మాట్లాడే భాషకి తేడా ఉంటుందన్నారు.

చేరాతల్లో 'స్త్రీశక్తి' అనే పత్రికగురించి రాస్తూ అందులో సిద్ధాంత రాద్ధాంతాలుండవని అన్నారు. అందువల్ల అది ఆదర్శప్రతిక అని పొగిడారు. సిద్ధాంతాలు మాట్లాడేవాళ్ళు ప్రధానంగా మార్క్సిస్టులే కాబట్టి చేరాపై మార్క్సిస్టులకు కోపం రావడానికి ఇలాంటి మాటలు కారణమయ్యాయి. సాహిత్యం సిద్ధాంతాలకతీతంగా ఉండాలని మాట్లాడేవాళ్ళు చాలామంది మార్క్సిజాన్ని దృష్టిలో పెట్టుకునే ఈమాట అంటుంటారు. చేరాకూడా ఇలాంటి సందర్భాల్లో ఈ 'చాలా మంది'లో చేరి పోయినట్టు కనిపిస్తారు. నిజానికీ మాట మార్క్సిజానికి కాంప్లిమెంటే అనిపిస్తుంది. ఎందుకంటే వీళ్ళు మార్క్సిజాన్నే సిద్ధాంతంగా గుర్తించినట్టయింది కాబట్టి.

ఇంతకూ సిద్ధాంత విషయాలు సాహిత్య విమర్శలో ఉండొచ్చా, ఉండకూడదా? సందర్భం, అవసరాల్ని బట్టి తప్పక ఉండాలి. ప్రపంచీకరణ గాలి సోకింతర్వాత సిద్ధాంత వ్యతిరేకత, నిర్మాణ వ్యతిరేకత ఎక్కువయ్యాయి. అవి ఎక్కువయ్యే కొద్దీ మార్క్సిస్టులు ఈ విషయాలకు అనివార్యంగా ప్రాధాన్యం ఇవ్వాల్సివస్తుంది. వస్తువు గురించి మాట్లాడేటప్పుడు సిద్ధాంతం రాక తప్పదు, అది రాద్ధాంతానికి దారితీసినా సరే. సిద్ధాంతం వల్ల ఒక ప్రాపంచిక దృక్పథం ఏర్పడుతుంది. సాహిత్య విమర్శకుడు ఏ విషయాన్నయినా తన ప్రాపంచిక దృక్పథం నుండే పరిశీలిస్తాడు, పరిశీలించాలి. మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథం ప్రపంచాన్ని సరిగ్గా అర్థం చేసుకోడానికి ఉపకరిస్తుంది కాబట్టి సాహిత్య విమర్శలో కూడా ఇది అనివార్యంగా ప్రవేశిస్తుంది. చేరా సాహిత్య విమర్శలో ఇదే ప్రధానమైన లోటు.

'మార్క్సిజం నాకు నిషిద్ధం కాదు, తెలిసినంతవరకు మార్క్సిజం మీద నాకు గౌరవమే' అని చేరా తప్పుకుంటారు. నిషిద్ధం కాదు, గౌరవమే లాంటి మాటలే సరైనవి కావు. నిషిద్ధం కాదంటే అర్థం ఏమిటి? మార్క్సిజాన్ని అంగీకరిస్తున్నారనా? ఇతర సిద్ధాంతాలతో పాటు మార్క్సిజం కూడా నిషిద్ధం కాదనా? గౌరవం ఏమిటి? ఒక వ్యక్తిని గౌరవిస్తున్నామంటే అతని వ్యక్తిత్వాన్ని గౌరవిస్తున్నామని అర్థం. అంతమాత్రం చేత అతని అభిప్రాయాల్ని అంగీకరించాల్సిన అవసరం లేకపోవచ్చు. అసలు ఒక సిద్ధాంతాన్ని గౌరవించడానికీ, అంగీకరించడానికీ తేడా ఉంది. ఒక ప్రజాస్వామ్య దృక్పథం కలిగిన వ్యక్తిగా ఏ సిద్ధాంతాన్నైనా గౌరవించవచ్చు. విభేదాలున్నా ఎదుటి వ్యక్తుల భావప్రకటన హక్కును గౌరవించవచ్చు. కాబట్టి గౌరవించే ప్రతిదాన్ని అంగీకరించాల్సిన అవరం లేదనేది స్పష్టమే. మార్క్సిజం నిషిద్ధం కాదు అని నెగటివ్ పద్ధతిలో చెప్పినప్పుడు కొంత నిషిద్ధం అనికూడా అర్థం వచ్చే అవకాశం ఉంది. ఒకే విషయాన్ని పాజిటివ్‌గా చెప్పినదానికీ, నెగటివ్‌గా చెప్పినదానికీ కొద్దిగా అర్థభేదం ఉంటుంది. గ్లాసులో సగం నీళ్ళున్నాయి అనేదానికీ, సగం ఖాళీగా ఉంది అనేదానికీ సూక్ష్మ అర్థభేదం ఉంది. ఉన్న పదార్థం మోతాదులో తేడా లేకపోయినా ఆ మాట అనే వ్యక్తి ఉద్దేశంలో తేడా ఉంది. సగం నీళ్ళున్నాయి అనడంలో ఒక తృప్తి ఉంది. సగం ఖాళీగా ఉందనడంలో కొంత అసంతృప్తి ఉంది. ఇది కూడా అర్థభేదమే. భాషా శాస్త్రంలో ఒక అంశమైన అర్థభేదక శక్తి గురించి మాట్లాడుతున్నానంటే బహుశ భాషాశాస్త్రవేత్త చేరానన్నావేశించారేమో!

వస్తువుతో ఏకీభావం ఉన్నప్పుడు విమర్శించవలసింది రూపాన్నే గదా అని అంటారుగాని, వస్తువుతో ఏకీభావం లేనప్పుడు విమర్శించవలసింది వస్తువునే గదా అనే విషయాన్ని పట్టించుకోరు చేరా. దీనికి కారణం శిల్పచర్చపైన ఉన్న ఆసక్తి వస్తుచర్చపైన లేకపోవడం. వస్తుచర్చ చెయ్యాలంటే సిద్ధాంతం అవసరం ఉంటుంది.

సంస్మరణ

చేరా లేరు, కానీ ఆయన సాహిత్యం ఉంది, ఉంటుంది!

- పిన్నిబోయిన కోటయ్య

'చేరా' అని రెండక్షరాల్లో సంక్షిప్తంగా పిలుచుకొనే చేకూరి రామారావుగారు ఆధునిక తెలుగు భాషా శాస్త్రానికి, రూపురేఖలద్దిన భాషా శాస్త్రవేత్త. భాషా శాస్త్రవేత్తగా పండిత లోకానికీ, 'చేరాతలు' ద్వారా సాహిత్య పాఠక లోకానికి బాగా పరిచితుడు. ఆయన పొట్టి పేరు 'చేరా' సులువుగా, పలకడానికి తేలిగ్గా ఉన్నా, ఆయన వ్యాస, సంకలనాలు 'రించోళీ', 'స్మృతికిణాంకం' అనే పేర్లు కఠినంగా బరువుగా ఉంటాయి. మీరు వ్యవహారిక భాషావాదులుగదా! ఇలాంటి పేర్లు ఎందుకు ఎంచుకున్నారని ఒక మిత్రుడడిగితే అదో సరదా అన్నారట చేరాగారు. చేకూరి రామారావుగారు భాషా శాస్త్రంలో విశేష కృషి చేసారు. భాషా శాస్త్రంలో ఆయన రాసిన గ్రంథాలు భాషానువర్తనం, భాషా పరివేషం, భాషాంత రంగం, తెలుగులో వెలుగు, తెలుగు వాక్యం ప్రామాణికాలు ఇవే గాక దాదాపు 13 సాహిత్య విమర్శ గ్రంథాలు ప్రచురించారు.

చేకూరు రామారావుగారిని మార్క్సిస్టు సాహిత్య విమర్శకుడని కొందరంటారు. కొంతమంది ఆయనను ఉదార ప్రజాస్వామ్య వాదిగా చూస్తారు. ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారిగారయితే అమెరికాలోని ప్రొఫెసర్ చామ్‌స్కీ ప్రభావం 'చేరా'గారిపై ఉందనీ, అందువల్లే ఆయనకు హేతువాద దృక్పథం, వామపక్ష భావజాలం కలిగాయని అంటారు. కానీ 'చేరా' బాల్యాన్ని మనం ఒకసారి పరిశీలిస్తే ఆయన రాజకీయ బీజాలు, సాహిత్య బీజాలు బీజరూపంలో మనకవగతమవుతాయి.

చేకూరి రామారావుగారిది ఖమ్మం జిల్లా. ఇల్లిందలపాడు గ్రామం. మధిరకు 3 కి.మీ. దూరంలో ఉంది. ఆయన చిన్నప్పుడు స్నేహితులతో అల్లరి చిల్లరగా తిరుగుతూ పాఠశాలపై శ్రద్ధ పెట్టేవాడు కాదు. అందుకని ఆయన తల్లిగారు బాధపడి ఆయనను స్నేహితులనుంచి దూరం చెయ్యడానికి గుంటూరు దగ్గర్లో ఉంటున్న తన సోదరుని ఇంటి వద్ద వదిలింది.

ఆయన పాఠశాల విద్యాభ్యాసం కొంత స్వగ్రామంలోను, సత్తెనపల్లిలోను, నరసరావుపేటలోనూ జరిగింది. 1946-50 మధ్య నరసరావుపేటలోని తన మేనబావగారింట్లో ఉండి, ఉన్నత పాఠశాలలో చదువుకొనేవారు. తెలంగాణ సాయుధ పోరాట రోజులవి. ఆ రోజుల్లో నరసారావుపేట ఏరియాలో కమ్యూనిస్టు పార్టీ బలంగా ఉండేది. వాళ్ళ మేనబావగారు కమ్యూనిస్టు కాకపోయినా ఎవరి ప్రోద్బలం వల్లనో 'ప్రజాశక్తి' పేపరు వేయించుకొనేవాడు.

చదివేవాడు కాదు. పైగా కాంగ్రెసువాది; ఎన్.జి. రంగా భక్తుడు. కానీ చేకూరి రామారావు కాకతాళీయంగా ప్రజాశక్తి పాఠకుడయ్యాడు. అప్పటి వరకు ఆయనకు కమ్యూనిస్టులపై దురభిప్రాయాలుండేవి. ప్రజాశక్తి చదివేకొద్దీ అభిప్రాయాలు మారుతూ వచ్చాయి. పైగా ఇంటికి పాఠశాలకు మధ్య దారిలో కమ్యూనిస్టు పార్టీ ఆఫీసు ఉండేది. తరచూ అక్కడికి వెళ్ళడం, పెద్దలతో పరిచయాలు ప్రారంభమయ్యాయి.

ఆ రోజుల్లో దండా నారాయణ స్వామిగారని ఆ ప్రాంతం వ్యక్తి. కమ్యూనిస్టు పార్టీలో పని చేస్తూ అజ్ఞాతంలో ఉండేవారు. ఆయన బోధించిన గతితార్కిక చారిత్రక భౌతికవాదం హేతువాదం తనపై గొప్ప

మార్క్సిజం నిషిద్ధం అయినవారికి మరో సిద్ధాంతం అవసరం ఉంటుంది. సిద్ధాంతపరమైన విభేదాల నేపథ్యంలో సాహిత్యవస్తుచర్చ చెయ్యడం తన పని కాదనుకున్నారు చేరా. అందుకే ఆయన ఎక్కువగా శిల్పాన్ని పట్టించుకుంటారు. ఈ స్వభావం కారణంగానే రాజకీయాలు కవిత్వానికి బరువేనన్న అభిప్రాయం క్రమంగా బలపడుతోందని చేరా ఒక దశలో అన్నారు.

చేరా ఒక్కోసారి వినూత్నమైన ఆలోచనలు చేస్తారు. భాషా వైద్యశాలల్ని ఏర్పాటు చెయ్యాలనడం భాషా సంబంధమైన కొత్త ఆలోచన. శారీరక అనారోగ్యం, మానసిక అనారోగ్యం మనకు తెలిసనవే. భాషా సంబంధమైన అనారోగ్యం ఉన్నా దాన్నుంచి మనల్ని మనం కాపాడుకోడానికి ప్రయత్నించడం. ఇతరులతో మాట్లాడేటప్పుడు మాట్లాడే పద్ధతి తెలియక పోవడమే ఈ అనారోగ్యం. దీన్ని నేర్పేదే భాషా వైద్యశాల. ఈ ఆరోగ్యాన్ని మనం కాపాడుకోగలిగితే చాలా సమస్యల్నించి మనం బయట పడగలమని చేరా అభిప్రాయం.

అలాగే చేరా చెప్పిన శతక లక్షణాలు కూడా వినూత్నమైన ఆలోచనకు తార్కాణాలే. సాధారణంగా నూరు పద్యాలుండాలనే సంఖ్యానియమం, మకుటం ఉండడం (విశ్వదాభిరామ వినురవేమ - లాంటివి), ఒక్కో భావాన్ని ఒక్కో పద్యంలో చెప్పడం మొదలైన వాటిని శతక లక్షణాలుగా చెబుతారు. కానీ చేరా చెప్పిన శతక లక్షణాలు సంబుద్ధి, భావధార అనేవి. సంబుద్ధి అంటే సంబోధన. అంటే పాఠకులతో మాట్లాడినట్టుండడం. భావధార అంటే అప్రయత్నంగా ఉన్నట్టు కనిపిస్తూ సహజ పద్ధతిలో భావప్రకటన ఉండడం. కృత్రిమత్వం లేకపోవడం. ముందు పేర్కొన్న శతకలక్షణాలు శరీరం లాంటివైతే, చేరా చెప్పిన లక్షణాలు ప్రాణం లాంటివి.

చేరా మార్క్సిస్టులపై అప్పుడప్పుడూ విసుర్లు విసిరినా, కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని తీవ్రవాదం అనలేదు. ఈ రకమైన సంయమనం చేరాలో ఉంది. ఇతరులతో ఎంతగా విభేదించినా చర్చల్లో ఎక్కడా ప్రజాస్వామ్య స్వభావాన్ని కోల్పోలేదు. సాహిత్య విమర్శలో చేరా ఒక డెమోక్రాటే. ఎస్.ఎస్.ఎల్.సి. నుండి బి.ఎ. దాకా ఏ పరీక్షలోనూ మొదటిసారి పాస్ కాకపోయినా, సాహిత్య విమర్శకుడిగా, భాషా శాస్త్రవేత్తగా ప్రథమ శ్రేణిలోనో, డిస్టింక్షన్‌లోనో పాసై బూర్జువా చదువులలోని డొల్లతనాన్ని చేరా రుజువు చేశారు. చేరా ఒక మంచి విద్యార్థీ, ఉపాధ్యాయుడూ. సాహిత్యలోకంలో ఒక చేరా ఎప్పుడూ ఉండాలి.

ప్రభావం చూపించాయని చేరా గారే స్వయంగా తన బాల్యస్మృతుల్లో చెప్పుకొన్నాడు. నారాయణ స్వామిగారు అజ్ఞాతంలో ఉండగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన్ని కాల్చి చంపింది. 'నా భౌతిక వాద దృక్పధానికి, మార్క్సిస్టు ఆలోచనా విధానానికి, వామపక్ష రాజకీయాలతో సంబంధాలకూ బీజాలు నరసరావుపేటలోనే పడ్డాయంటారు' చేరా గారు.

చేకూరి రామారావుగారు భవిష్యత్తులో సాహిత్య పిపాసి కావడానికి కూడా అంకురార్పణ జరిగింది నరసరావుపేటేనంటారు. ఆయన హైస్కూలులో పై క్లాసులు చదివేటప్పుడు తెలుగు భాష బోధించిన లంకా సీతారామశాస్త్రిగారు, భాగవతుల సుబ్బారావుగారు గొప్ప పండితులనీ, వారిద్దరి ప్రభావం వల్లే తెలుగు సాహిత్యంపై ప్రేమ, శబ్ద సౌష్టవంపై గౌరవం నాలో కలిగాయని చేరా గారు స్వయంగా చెప్పుకొనేవారు. పాఠశాల దశలోనే తేటగీత పద్యాలు అల్లడానికి ప్రయత్నించాడట. తన మొదటి సారి అల్లిన పద్యపాదంలో మకుటం మాత్రమే ఆయనకు గుర్తుందిలా 'సరస సద్గుణ శీల సుశీలయనియె' మరియా సుశీలయెవరో?

ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో తాను ధరించిన ఫ్యాన్సీ డ్రస్‌కు బహుమతిగా తనకిచ్చిన తిక్కన నిర్వచనోత్తర రామాయణం పూర్తిగా చదవడం వల్ల ప్రాచీన సాహిత్యంపై ప్రేమ కలిగిందంటాడు. అలాగే 1949లో అచ్చయిన 'అగ్ని వీణత్వమేవాహం, వజ్రాయుధం కొనుక్కొని చదివాడట ఆ రోజుల్లోనే. ఆధునిక సాహిత్యంతో అదే నా పరిచయం. దాన్ని అభిమానించడం ప్రారంభించాను' అని అంటారు చేరాగారు. ఆయన బాల్యాన్ని ఇంత దూరం చర్చించడం ప్రధానంగా ఇదే ఆలోచనాధోరణి చివరి దశ వరకూ పడుగు పేకల్లా ప్రాచీన సాహిత్యంపై అనురక్తి, ఆధునిక సాహిత్యంపై ప్రేమ వామపక్ష భావజాలం తనతో పాటు ఎదుగుతూ జీవితంలో భాగమైపోయాయి.

చేకూరి రామారావుగారు దాదాపు అర్ధ శతాబ్దం సాహిత్య వ్యవసాయంలో రాటుదేలిన సాహితీ కృషీవలుడు. ప్రాచీన సాహిత్యాన్ని, ఆధునిక సాహిత్యాన్ని విశ్లేషించిన వ్యక్తి. ఆయనకు ప్రాచీన సాహిత్యం ఆహారమయితే, ఆధునిక సాహిత్యం ప్రాణ వాయువు. ప్రాచీన సాహిత్యమంటేనే పద్య రూపం. పద్యమంటే ఆయనకు ప్రీతి. చెంచయ్యగారన్నట్లు 'పద్యమంటే బేతవోలు రామబ్రహ్మం గారు ఒక చెవి కోసుకుంటే, చేరా గారు రెండు చెవులూ కోసుకుంటారు' అన్న సెటైర్ అక్షరాలా నిజం. ఆయనే స్వయంగా చెంచయ్యగారి చమత్కారాన్ని తన మిత్రులతో చెప్పుకొనే వాడట.

చేరాగారు పద్యం మీద ప్రేమతో అనేక మంది పద్య కవుల మీద వారి కావ్యాల పైన వ్యాసాలు రాశారు. శ్రీశ్రీ మీద కూడా 'పద్యంలో శ్రీశ్రీ – శ్రీశ్రీ ప్రథమ దశాకవితా తత్త్వ విశ్లేషణ' అనే వ్యాసం. ఇందులో శ్రీశ్రీలో మొదటి దశ 'పద్య కవిత్వ దశ' అని, ఇంకో రకంగా 'భావ కవిత్వ దశ'గా కూడా అంటూ, ఇది 1926–32 మధ్య కాలంగా వర్గీకరిస్తాడు. ఈ కాలాన్నే మహా ప్రస్థాన పూర్వ దశ అని కూడా అన్నారు. ఈ కాలంలో వచ్చిన శ్రీశ్రీ పద్య కావ్యం ఆయన తొలి సంపుటి 'ప్రభవ'లోని ప్రతి పద్యాన్ని తత్త్వ విశ్లేషణ చేసాడు. శ్రీశ్రీ 'సిరిసిరిమువ్వ' శతకం, రుక్కుటేశ్వర శతకంపై సాధికారికంగా చర్చించారు. కందం, తేటగీత, శార్దూలం శ్రీశ్రీ వాడుకొన్న రీతులపై లోతైన విశ్లేషణ చేసారంటే చేరాకు శ్రీశ్రీ మీద కన్నా పద్యంపై మక్కువ తెలియజేస్తుంది.

అంతేగాకుండా శ్రీశ్రీ తొలిదశ పద్య కవిత్వాన్ని ఇంకా అధ్యయనం చేయాల్సి ఉందని, దాన్ని విస్మరించడం తగదని సూచన గూడా చేస్తాడు. అయితే తమాషా శ్రీశ్రీ పద్య కవిత్వాన్ని ముఫ్ఫైల్లోనే వదిలేసి వచన కవిత్వం వైపు పరుగులు తీసాడు.

చేరాగారు ప్రాచీన సాహిత్యానికి ఆధునిక ప్రతినిధి అయిన విశ్వనాథ సత్యనారాయణ మొదలు ప్రముఖ ప్రసిద్ధ కవి, పండితులందరిని తనదైన శైలితో పరిశీలించి రాసారు. నాయని సుబ్బారావు, దువ్వూరి రామిరెడ్డి, పఠాభి, భద్రిరాజు కృష్ణమూర్తి ఎందరెందరో ప్రముఖుల్ని తన కలం వదలలేదు. ప్రముఖుల్నే కాదు, అప్పుడే కవిత్వంలో ఎదిగి వస్తున్న ఎందరో కవులను, కవయిత్రులను, రచయితలను తను నిర్వహిస్తుండిన 'చేరాతలు' కాలమ్ ద్వారా ఆంధ్ర దేశానికి పరిచయం చేసారు. వారిలో ఈనాడు చాలా మంది ప్రసిద్ధులుగా ఉన్నారు. ఎవర్ని గురించి రాసినా సున్నితమే. కటువుగా ఉండాల్సిన చోట కూడా సుతిమెత్తగా తాకడమే ఆయన విమర్శ నైజం.

చేకూరి రామారావుగారు తన కాలంలో తెలుగునాట పరిఢవెల్లిన సాహిత్య ఉద్యమాలన్నింటితో అనుబంధాన్ని పెంచుకొన్నాడు. ఇంచుమించు అన్ని ఉద్యమాలను ఆహ్వానించినవాడే! తెలుగు సాహిత్యం స్తబ్దతలోకి జారుకొన్నప్పుడు, మగతగా నిద్రిస్తున్నప్పుడు, కవులు, రచయితలు, వ్యాపార, క్షుద్ర, కాలక్షేప సాహిత్యంలో విహరిస్తున్నప్పుడు 1964–67 మధ్యకాలంలో బద్దలయిన దిగంబర కవిత్వోద్యమం తెలుగు కవిత్వానికి ఒక షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చింది. చేరా మాటల్లో అయితే 'కవులందరినీ దిగంబర కవులు చొక్కా పట్టుకొని బజార్లో నిలబెట్టి అడిగినట్టుగా కొంత మొరటుదనం, బహుశా కొంత రౌడీయిజం కలగలిపి తెలుగు సాహిత్యకులను ప్రశ్నించారు. ఉత్తమ విలువలను మాయం చేసే వ్యవస్థను ధ్వంసం చేయాలని దిగంబర కవులు ప్రచారం చేసారు' అంటారు.

ఇంకా 'దిగంబర కవిత్వం తాను చరిత్ర గర్భంలో కలిసిపోయినా తెలుగు సాహిత్యానికి తాను కొంత మంచి వారసత్వాన్ని అందించింది. మొరటుదనాన్ని ఒక కావ్య గుణంగా అందించి తరువాత వచ్చిన స్త్రీవాద, దళితవాద కవిత్వంలో సున్నితతత్వాన్ని బద్దలు చేసే ఆయుధాన్ని అందించింది' అంటారు. చేరా శ్రీశ్రీలాగా దిగంబర సాహిత్యాన్ని సొంతం చేసుకోకపోయినా, దాన్ని స్వాగతించాడనడంలో సందేహం లేదు. ఆ కాలానికి అది అవసరంగానే భావించాడు. సాహిత్యంలో మొరటుదనం కావ్య వస్తువుగా ప్రతిక్షేపించాడు.

1968–69లలో శ్రీ కాకుళ సాయుధ పోరాటం కవులు, కళాకారులు, రచయితల్ని ఆలోచింపజేసింది. సుబ్బారావు పాణిగ్రాహి, వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం పెన్నూ గన్నూ పట్టి ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఆ ప్రేరణతోనే మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానంతో 1970 జూలై 4వ తేదీన విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. సాహిత్యంలో నూతన ఒరవడి ఏర్పడింది. కవులు పోరాటాన్ని ఎత్తిపట్టారు. ఇక్కడ కూడా 'చేరా' మాటల్ని ఉటంకించాలి. '70వ దశకంలో విప్లవ కవిత్వం రాయని కవి లేడంటే అతిశయోక్తి కాదు.'

చేకూరి రామారావుగారు మొదటి నుండి విరసం పట్ల సానుభూతితోనే ఉండేవారు. విరసం సభలకు హాజరయ్యేవారు. విరసం ఏదైనా ఇబ్బందులకు గురైనప్పుడు నేనున్నానంటూ అండదండలందించే వాడు.

(మిగతా 41వ పేజీలో...)

సంస్మరణ

ద్వారాలు తెరిచి ఉంచుకున్న కవి

- అరసవిల్లి కృష్ణ

కవి చనిపోయాడు
నలుపు తెలుపు ఓటమి గెలుపుల మధ్య
వంతెనలా పరుచుకున్న నిలువెత్తు వర్ణచిత్రం
ఆరడుగుల గొయ్యిలో కప్పెట్ట బడింది.

పైడి తెరేష్‌బాబుతో వ్యక్తిగత పరిచయం లేదు. రెండు దశాబ్దాలుగా తెరేష్‌బాబు కవిత్వంతో దగ్గరతనముంది. కవి భౌతికంగా ఎంత దూరమయిన అతని హృదయం నుండి జారిన కవితాపంక్తులు సరాసరి పఠిత హృదయంలోకి ప్రవహిస్తాయి. హృదయానికి దగ్గరగా వచ్చే కవి తెరేష్‌బాబు. తెలుగుసాహిత్యంలో 90ల తర్వాత విస్తృతంగా వచ్చిన దళితకవిత్వంలో తెరేష్‌బాబుది ఓ విలక్షణస్వరం. దళిత కవిత్వంలో ఎన్నదగినది గమనించాల్సిన అంశం దళిత సౌందర్యభాష. కవిత్వమంటే బ్రాహ్మణీయ భావజాలపు వ్యక్తీకరణగా ఉన్నప్పుడు కవిత్వం అగ్రవర్ణాల సృజనగా మాత్రమే విచలితమవుతున్నప్పుడు, అంటరాని నేలల నుండి, కసువు నేలల నుండి వెలివాడల నుండి ఒక సౌందర్యాత్మక వ్యక్తీకరణతో దళిత కవిత్వం ఓ వెల్లువలా వచ్చింది. తమ జీవన అనుభవాల నుండి సంఘర్షణల నుండి తమదయిన పరాయికరణ నుండి దళిత కవిత్వం చిక్కనయింది. బుద్ధిజీవులలో ఆలోచన అయింది. దళితభాష దానియొక్క సౌందర్యం తెలుగు కవిత్వంలో ప్రతిఫలించింది. తెలుగు కవిత్వానికి ఓ చేర్పు అయింది. దళిత కవితా వికాసపు ప్రతిమూల మలుపులోనూ తనదయిన ముద్రను వేసిన కవి పైడి తెరేష్‌బాబు.

తెరేష్‌బాబు కవితాసృజనలో, వ్యక్తీకరణలో తనదయిన భావజాలం మాత్రమే కాదు, దళిత ఆత్మగౌరవ నినాదం మాత్రమేకాదు, సమాజం చలనశీలతపై అవగాహన, బాధ్యత ఉన్న కవి. ఈ దేశంలో ప్రధానంగా 90ల తర్వాత ఆర్థిక సంస్కరణల యుగం ఆరంభమయ్యింది. ప్రపంచం కుగ్రామం అనేది బహుళప్రచారం పొందుతున్న కాలమొకటి నడిచింది. ఒకే ప్రపంచంలో భిన్న ప్రపంచాల భిన్న అస్తిత్వాలు ఉండవా? అనే ఆలోచనలు సంఘర్షించిన కాలంకూడా దానికి సమాంతరంగా ఉంది. ఆర్థిక అసమానతలు సమాజాన్ని ఓ భావోద్వేషపు దశకు తీసుకెళ్ళాయి. మనిషి సామూహిక ఏకాకితనంగా మిగిలిన కాలమది.

మనిషి శకలాలుగా మిగులుతున్న కాలసందర్భంలో, ఓ అస్తిత్వ వేదనగా వచ్చిన దళిత కవిత్వంలో తెరేష్‌బాబు మనిషిని ఆవాహన చేసుకున్నాడు. దళిత కవితావికాసాన్ని, దాని మూలాలను, మరువకుండా కవిగా విస్తరించడం మాత్రమే కాక ధ్వంసమవుతున్న విలువలకు మానవీయ సంబంధాల విచ్ఛిన్నతకు కారణాలు అన్వేషించే క్రమంలో ఓ చైతన్యవంతమైన భూమికను నిర్వహించిన కవి. ఈ రేఖ దగ్గర నిలబడి తెరేష్‌బాబుని అంచనా వేయవలసి ఉన్నది. మనిషి వస్తువుగా మారుతున్న సందర్భమొకటి. దళిత వ్యక్తీకరణగా ముందుకు వచ్చిన కవి, తను నిలబడిన చోటునుండి తనదయిన జీవితానుభవాల నుండి ప్రపంచాన్ని వ్యాఖ్యానించడం, భాగమవుతున్న ప్రపంచంతో విభేదించడం, ధిక్కరించడం, కవి కోరుకున్న, ఆశించిన జీవితం అనేక శకలాలుగా ధ్వంసం కావడం, ఈ మొత్తం వాతావరణాన్ని జీర్ణించుకోలేని తెరేష్‌బాబు, దళిత కవితాభూమిక నుండి అనేక పాయలుగా విస్తరించడం తెరేష్‌బాబులో గమనించాల్సిన పార్శ్వం. రెండు దశాబ్దాలుగా ముఖ్యంగా తెలుగు ప్రజల సామాజిక, రాజకీయ, ఆర్థిక సంబంధాలలో వచ్చిన మార్పులు, మధ్యతరగతి భద్రజీవితం, కులం మరింత ఆధిపత్యభావనను సంతరించుకోవడం, కులనిర్మూలన ఆశించనంతగా ఆచరణలో సాధ్యం కాకపోవడం, అగ్రకుల ఏకీకరణ మరింత బలం పుంజుకోవడం, అణగారిన, అంటరాని కవితా గొంతుల స్వరం మారడం, మొత్తం ఈ కూడిక నుండి తెరేష్‌బాబు కవిత్వాన్ని చూడవలిసి ఉన్నది. మారుతున్న సమాజ చలనసూత్రాలను గమనిస్తూ తనలోని కవి హృదయాన్ని అత్యంత సున్నితంగా ఆవిష్కరించిన కవి.

నిజానికి దళిత ఆత్మగౌరవ ప్రతీకలు కలిగిన కవి, తనచూపును విశాలం చేసుకోవడం, రెండు దశాబ్దాలలో వ్యవసాయ, దాని అనుబంధ చేతివృత్తులలో వచ్చిన మార్పులు, పత్తిరైతుల ఆత్మహత్యల నుండి రైతులు, వ్యవసాయ కూలీల, చేతివృత్తిదారుల ఆత్మహత్యల వరకు కొనసాగిన వాణిజ్య దోపిడిని, దానివెనుక దాగిన మార్కెట్ శక్తులను, మనిషి సకల అనుభూతులను వశ పర్చుకునే యంత్ర నాగరికతను, దాని సాంస్కృతిక రూపాన్ని తెరలు తెరలుగా ఆవిష్కరించిన కవి తెరేష్‌బాబు.

కవిగా, ఆలోచనాపరుడిగా తెరేష్‌బాబు జీవితం ఏభైఏళ్ళకు ముగింపుకు రావడం విచారకరం. అతని కవితాతాత్వికత, మనిషిపట్ల చూపిన కరుణాత్మక కవితా వాక్యం మనల్ని వెంటాడతాయి. జీవితం ఎవరి ఆజ్ఞలలోను, ఎవరి కనుసన్నలలోనూ ఇమడదు. జీవితప్రవాహం, కవితాప్రవాహంలా ఉండదు. అయినా జీవితాన్ని, కవిత్వాన్ని ప్రగతిశీల ఆలోచనలవైపు మళ్ళించి, దళితుల, అణగారిన ప్రజలపక్షాన నిలిచిన కవి తెరేష్‌బాబు. 90ల నుండి విరివిగా వచ్చిన దళితకవిత్వం, దాని వ్యక్తీకరణ నిర్మాణం గురించి లోతుగా గమనిస్తే, కేవలం వచనంగా దళితకవిత్వం తేలిపోలేదు. దళితకవిత్వం నినాదాలుగా వస్తున్నదనే విమర్శ కూడా ఉంది. ఈ విమర్శలన్నిటికి, ఈ పండిత చర్చలన్నిటికీ తెరేష్‌బాబు కవిత్వం జవాబుగా ఉంటుంది. తను కవిత్వం చేయదల్చుకున్న ఏ వస్తువు అయినా కవితాత్మకంగా చెప్పడం తెరేష్‌బాబు శైలి. ఈనాటికి ఆర్థిక అసమానతలున్నాయి. సాంఘిక అసమానతలు ఉన్నాయి. ఈ రెండూ నాణానికి బొమ్మాబొరుసు లాంటివి. కారంచేడు, చుండూరు, లక్ష్మింపేటలు పునారావృతమైన ప్రతిసారి ఆత్మగౌరవ నినాదంగొంతు నులిమేవే! తెరేష్‌బాబు కవితాసృజనలో ఈ అమానుష, ఆధిపత్య, హత్యాకాండల వెనుక దాగిన కుట్రలను నిరసించిన కవి.

హిందూ మహాసముద్రం, నేను నా వింతలమారి ప్రపంచం, కావడికుండలు, నాలుగోప్రపంచం ద్వారా తెలుగు కవిత్వానికి చేర్పు అయిన తెరేష్‌బాబు ద్వారాలు తెరిచిఉంచుకున్న కవి. దళిత అస్థిత్వం నుండి భిన్న అస్తిత్వాలను వాటియొక్క ఘర్షణలను తన కవిత్వానికి అనువదించుకున్న కవి. తెరేష్ కవితా తాత్వికతలో ఆగ్రహం, ధిక్కారం

ఉన్న కవితా వాక్యాన్ని ఏనాడు దుర్వినియోగం చేయని కవి. అన్ని వాదాల గురించి, వాటి తాత్వికతను గురించి, తనని తాను వ్యక్తీకరించుకున్న కవి. తెలంగాణ అస్తిత్వ, ఆత్మగౌరవ పోరాటానికి, తెలంగాణ వెలుపలి కవిగా చూపిన సంఘీభావం, చొరవ తెలంగాణ వెలుపల కవులకు ఓ తోవ అయింది. తెరేష్‌బాబు లాంటి కవుల సంఘీభావన లేకుంటే, సమైక్యాంధ్ర ప్రతిఘాతుక ఉద్యమానికి చాలామంది కవులు మద్దతు ప్రకటించేవారు. 'కావడి కుండలు' కవితాసంకలనం తెలంగాణకు మద్దతుగా నిలవకపోతే, ఆంధ్ర, తెలంగాణ పోరాటరూపం వేరుగా ఉండేది. అత్యంత నిబద్ధతో తాను నడిచివచ్చిన దారి నుండి తాను ఎటువైపు నిలబడాలో ఎరుక ఉన్న కవి తెరేష్‌బాబు.

'పదిరికుప్పంలో గాని, చుండూరులో గాని,
భారతదేశంలోగాని, భూగోళం మీదగాని
పునస్సృష్టి మృత్యువుతోనే సాధ్యం' అనే ఎరుక కలిగిన తెరేష్‌బాబు, వెలివాడల ముసురుతో తడిసిన తాటాకు గుడిసెల అంటరానితనాల మధ్య మొలకెత్తిన కవి. తన పరిసరాల పరిమళం నుండి ప్రపంచాన్ని ఆవాహన చేసుకున్నాడు. ఎలాంటి పరిమితులూ లేని కవి. అన్ని ఉద్యమాల తీరు తెన్నులను తడి నయనాలతో చూసాడు. నలుపుని ప్రేమించాడు. నలుపు చుట్టూ దడిలా ఉన్న కుట్రలను కవిత్వం ద్వారా నిరసించాడు. తన నిరాశలను ఇతరులపై మోపి నిందించలేదు. కారణాలను వెతికాడు. కవిత్వమై ప్రపంచంలో వొదిగిపోయాడు.

కవుల చావరు, చంపబడతారు, కారణాలు అనేకం. మద్దూరు నగేష్‌బాబు మరణించినప్పుడు స్మృతి కవితగా ప్రకటించిన తెరేష్‌బాబు, తానే ఓ జ్ఞాపకంగా మిగలడం ఓ విషాదం!

(39వ పేజీ తరువాయి...)

2005 ఆగస్టులో విప్లవ రచయితల సంఘంపై ప్రభుత్వం నిషేధం విధించింది. వరవరరావు, కల్యాణరావులను అరెస్టు చేసింది. అప్పుడు ఆంధ్రదేశంలోని అనేక మంది కవులు, రచయితలు, కళాకారులు ప్రభుత్వ చర్యను నిరసించారు. ప్రకటనలిచ్చారు. ఆ సందర్భంలో చేకూరి రామారావుగారు తేది 22-08-2005 ఒక ప్రకటన చేసారిలా. 'మావోయిస్టులతో సంబంధాలున్నాయంటు కవుల్ని, రచయితల్ని అరెస్టు చేయడం సమంజసం కాదు. రచయితల సంఘాల మీద నిషేధం విధించడం కళాకారుల్ని బెదిరించడానికే! ఆయా సంస్థల్ని నిర్వీర్యం చేసేందుకే ఇలాంటి నిషేధాలు విధిస్తున్నారు. బెదిరించి పోలీసు రాజ్యం తీసుకు రావాలనుకొంటున్నారు. అరెస్టయిన వారి దగ్గర తుపాకులున్నాయా? గొడ్డళ్ళున్నాయా? నిషేధం విధించి ఎవరూ మాట్లాడకుండా చేయాలనుకోవడం పొరపాటు చర్య. ఇలా చేసినంత మాత్రాన కవులు గొంతు విప్పకుండా ఉండరు'. విరసం పట్ల ఆయనకున్న నిబద్ధత అలాంటిది.

విరసంపైనే కాదు - విప్లవోద్యమానికి బాసటగా ఉన్నవారే వరిమీదైనా ప్రభుత్వం, పోలీసులు దాష్టీకం ప్రదర్శిస్తే వ్యతిరేకించారు. గద్దర్‌పై మఫ్టీ పోలీసులు కాల్పులు జరిపినప్పుడు కవులు, రచయితలు దీన్ని నిరసిస్తూ ఊరేగింపు తీసిన సందర్భంలో కూడా పోలీసు స్టేషన్ వరకూ ఊరేగింపులో పాల్గొనిన వ్యక్తి చేరా! ప్రజల పక్షాన ప్రభుత్వానికి సమర్పించే విజ్ఞాపన పత్రాల్లో మొదటి సంతకం 'చేరా'దే!

ఆంధ్ర దేశంలో ఉధృతంగా వచ్చిన మరో సాహిత్య ఉద్యమం స్త్రీవాద కవిత్వోద్యమం. చేరాగారు స్త్రీవాద ధోరణినీ, తద్వారా వచ్చిన సాహిత్యాన్ని మనస్ఫూర్తిగా బలపరిచారు. వారికి తన 'చేరాతలు' ద్వారా పూర్తి అండదండలందించారు. అనేక మంది స్త్రీవాదులు కొత్తగా కవిత్వం రాస్తున్న వాళ్ళైనా, వారి గురించీ, వారి కవిత్వాన్ని గురించి పారక లోకానికి పరిచయం చేసారు. 'ఇవాళ తెలుగు సాహిత్యంలో స్త్రీవాద కవిత్వ ధోరణికి సావిత్రి 'బందిపోట్లు' ఒక మైలురాయి వంటిది' అంటారు చేరా! అలాగే ఇరవయ్యో శతాబ్దంలో రెండు మంచి సంకలనాలను చెప్పమంటే ఒకటి 'వైతాళికులు' రెండు 'నీలిమేఘాలు' అంటారు చేరా! ఇంకా 'దిగంబర కవులు తెచ్చిన భాషా స్వేచ్ఛ ఆహ్వానించదగినదే! ఈ స్వేచ్ఛను మరికొంత ముందుకు తీసుకుపోయారు స్త్రీవాద కవయిత్రులు'. ఇలా స్త్రీవాద సాహిత్యాన్ని మనః పూర్వకంగా స్వాగతించారు చేరా గారు.

'స్త్రీవాద కవిత్వంలాగే దళితవాద కవిత్వం కూడా మరో దగా పడిన ప్రపంచాన్ని ఆవిష్కరిస్తున్నది'.

స్త్రీవాదుల్లాగే దళిత వాదులు కూడా భాషా సంకోచాలను వదిలేశారు. దళిత కవిత్వం ఇంకా పదును దేరాల్సి ఉందని అంటారు చేరా! దళిత సాహిత్యం పట్ల కూడా చేరాగారికి సాఫ్ట్‌కార్నరే ఉంది.

కొత్త శతాబ్దంలోకి అడుగిడిన మరో కవిత్వ ధోరణి ముస్లింవాద కవిత్వం. దీన్నే మైనారిటీ కవిత్వం అంటున్నాం. 'ఇది తెలుగు ముస్లిం కవుల ఆత్మఘోష' అంటారు చేరా! 'ఖాదర్ పుట్టుమచ్చ ఒక తీవ్రమైన సంచలనం. ఖాజా ఇక్బాల్ చంద్ వంటి తీవ్ర స్వరాలు ఇంకా ముందు ముందు బలమైన కవిత్వాన్ని అందిస్తాయి'. ఇవి చేరా మాటలే!

20వ శతాబ్దం రెండో అర్ధ భాగంలో వచ్చిన కవిత్వ ధోరణులన్నిటినీ 'చేరా' స్వాగతించారు. అయితే వాటిలోని లిమిటేషన్స్‌ని కూడా వదల్లేదు. కవిత్వంలో తిట్లని ఆయన తిరస్కరించారు. సందర్భానుసారంగా భావావేశంలో వాడిన పదజాలంగా వాటిని ఆయన అంగీకరించలేకపోయారు.

చేరా కవిత్వ విమర్శలో అనుకూల ధోరణులున్నట్లే ప్రతికూల అంశాలున్నాయి. ఆయనలాంటి ఆధునికుడు, మార్క్సిస్టు అవగాహన ఉన్నవారు, పద్యాన్ని శ్లాఘించడం చాలా మందికి జీర్ణం కాని విషయం. స్త్రీవాద కవిత్వంపై ఈగవాలకుండానే కాపాడుకొచ్చారు. ఇది కొంత విమర్శకు దారి తీసింది. చేరా గారు ఒక సందర్భంలో 'స్త్రీవాద కవిత్వంపై నోరు పారేసుకున్నవారు సాహిత్యంలో భూతద్దంతో మాత్రమే చూస్తే కనిపించే సూక్ష్మజీవులు' అంటారు. తనకిష్టమైన వారిని ఆకాశానికెత్తడం, తక్కినవారు ప్రముఖులైన పట్టించుకోకపోవడం చేరా గారికి అలవాటే అని ఆయనపై అపవాదుంది'.

మొత్తం మీద చేరా గారు తన సాహిత్య జీవితంలో పెద్దగా వాద వివాదాల్లోకి దిగలేదు. తనపై విసుర్లు, కసుర్లు, ఛలోక్తులు వేసిన వారికి సైతం చిరునవ్వే సమాధానం. అభిప్రాయాల్లో, ఆలోచనల్లో పూర్తిగా విభేదించే వారితో సైతం మంచి స్నేహం నెరపగల్గిన సుగణశీలి. మృధుభాషి, మితభాషి, భాషా చతురుడు, విరసానికి ఆప్తుడు. చేరా మరి లేరు. కానీ ఆయన సాహిత్యం ఉంది. ఉంటుంది!

పుస్తక పరిచయం



యదార్థ పోరాట ఘటనలు - దండకారణ్య కథలు

- కవిని

2014 ఆగస్టు 15న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారతదేశ మంతటా ఘనంగా స్వాతంత్ర్య వేడుకలను జరుపుకున్నాయి. ప్రధాని నరేంద్ర మోది గంటకు పైగా సాగిన తన ఉపన్యాసంలో భారత దేశాన్ని తొలుత 'మేక్ ఇన్ ఇండియా' తదుపరి 'మేడ్ ఇన్ ఇండియా'గా మార్చాలని యువతకు పిలుపునిచ్చాడు. కానీ స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడచినా భారతదేశంలో భాగమైన ఆదివాసీ బిడ్డలను ఏ ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు లేవు సరికదా గత, ప్రస్తుత ప్రభుత్వాలు తమ పాశవికమైన దమననీతిని ఆదివాసీలపై ప్రయోగిస్తూనే ఉన్నాయి. ఐతే గమనించవలసిన విషయం ఏమిటంటే స్వచ్ఛతకు మారుపేరైన వేలాదిగా ఉన్న ఆదివాసీ ప్రజలు 'జల్ జంగల్ జమీన్' కోసం పోరాడుతూ ముందుకు కదులుతున్నారు.

పాలకులు చెప్పుకునే అభివృద్ధికి, నాగరికతకు ఆమడ దూరంలో - విద్య, వైద్యంలాంటి కనీస సౌకర్యాలు కూడా అందని ఆదివాసీలు పాలకుల విధ్వంసకర అభివృద్ధికి ధీటుగా, సవాలుగా మావోయిస్టు పార్టీ విప్లవ జనతన సర్కార్ల ఆధ్వర్యంలో విద్య, ప్రజారోగ్యం, న్యాయ, రక్షణ, వ్యవసాయ క్షేత్రాలను, సాంస్కృతిక, శాఖలను ఏర్పరచుకుని ఒక వినూత్న ప్రయోగాన్ని, నూతన ప్రజాస్వామిక వ్యవస్థను, ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని నెలకొల్పుకున్నారు. మితిమీరిన సల్వాజుడుం ఆగడాలను, గ్రీన్‌హంట్ ఆపరేషన్ పేరిట ప్రభుత్వం కొనసాగిస్తున్న దుర్మార్గమైన, క్రూరమైన, పాశవికమైన దమన నీతిని ప్రజా విముక్తి గెరిల్లా సైన్య నేతృత్వంలో ఎదిరించి, ఎదురొడ్డి, సాహసోపేతంగా నిలబడి పోరాడుతున్నారు. మహత్తర త్యాగాలను చేస్తున్నారు. విజయాలను సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే దండకారణ్య సాహిత్యాన్ని విప్లవ రచయితల సంఘం ప్రచురించింది. దండకారణ్య సాహిత్యంలో భాగంగా 2005 నుండి 2012 దాకా అరుణతారలో వచ్చిన దండకారణ్య నేపథ్య కథలను 'దండకారణ్య కథలు' పుస్తకంగా వెలువరించారు.

దండకారణ్య కథల పుస్తకంలో కొన్ని కథలుగా, మరికొన్ని కథనాలుగా ఉన్నాయి. ఆదివాసీ ప్రజల జీవన విధానాన్ని, సంస్కృతిని, పోరాట పటిమను కళ్ళకు కట్టినట్టుగా చిత్రించారు కథకులు. అల్లం రాజయ్యగారి ముందుమాట 'దండకారణ్య యుద్ధ కథల పరిచయం' విశ్లేషణాత్మకంగా ఉండి, ఈ పుస్తకానికి ఒక ప్రత్యేకతనూ, విశిష్టతనూ చాటింది. ఈ కథలను కేవలం కథల రూపంలోనే కాకుండా వీటి వెనుక ఉన్న బలమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలతో సహా విశ్లేషించుకోవల్సిన అవసరం ఉంది. దండకారణ్య కథలన్నీ అమూల్యమైనవే. ఏ కథకు ఆ కథ తన ప్రత్యేకతను చాటుకుంది. లోతైన విషయ వస్తువు ఉండటాన చాలా సహజంగా, సజీవంగా ఉన్నాయి. అల్లం రాజయ్యగారి ముందుమాటలో చెప్పినట్టుగా ఈ కథలన్నీ యదార్థ యుద్ధ గాథలు. ఐతే, కొన్ని కథల కథాంశాలు ఒకే విధంగా అనిపించినప్పటికీ వైవిధ్యం స్పష్టంగా కనపడుతోంది. కథలన్నీ ఎక్కువ శాతం స్వానుభవాలుగా ఉన్నాయి. అడవి జీవితాన్నీ, దళ జీవితాన్నీ అద్భుతంగా ఆవిష్కరించారు కథకులు.

'చాయ్ గ్లాసు' 'లక్ష్మణరేఖ' ఇవి రెండూ నిత్య రాసిన కథలు. 'చాయ్‌గ్లాసు' కథలో 'బుడతడి' పాత్ర ద్వారా సమాజంలో బలంగా వేళ్లూనుకొని ఉన్న పితృస్వామ్య భావజాలాన్ని అతి సూక్ష్మంగా చిత్రించారు. అంతేకాకుండా విప్లవ ప్రజా సమితులు, భూంకాల్ స్కూళ్ళు 'బుడతడి' భావాలలో తెచ్చిన మార్పును చక్కగా వివరించారు. 'లక్ష్మణరేఖ' కథలో భారత ప్రభుత్వం తన ప్రజలపై తానే యుద్ధాన్ని ప్రకటించి హెలికాప్టర్ల నిఘాల మధ్య గ్రీన్‌హంట్ దాడుల ద్వారా విప్లవోద్యమాన్ని నిర్మూలించాలనే యుద్ధ వాతావరణంలో - పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ రక్షణలో వందేళ్ళ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను మహిళా సబ్‌కమిటీ నిర్వహించిన తీరు సాహసోపేతంగా ఉంది.

'శిక్ష', 'తల్లిప్రేమ', 'మూసుకున్న హృదయం' ఈ కథలను మిడ్కో రాశారు. 'శిక్ష' కథలో ప్రభుత్వం సల్వాజుడుంను ఏర్పరచి చేయిస్తున్న దురాగతాలనూ, అరాచకాలను అద్దం పట్టినట్టు వివరించడమే కాకుండా, బలవంతంగా ఆదివాసీలను ఎస్.పి.ఓ.లుగా మారుస్తున్న వైనాన్ని చెప్పారు. 'న్యాయశాఖ బాధ్యురాలు జైని పాత్ర ద్వారా' మన జనతన సర్కారు హింసకు తావులేని ప్రపంచం కోసం ఏర్పడింది. ఉన్నత విలువల కోసం పని చేస్తున్నదని స్పష్టపరుస్తూ, శత్రువును చంపడానికి సమిష్టి నిర్ణయం అవుసరమన్న ఆచరణాత్మక విషయాన్ని, ప్రతి చర్యలో భాగంగా శత్రువు అనుసరించిన పద్ధతులను యథాప్రకారం అనుసరించవద్దనీ, గతితార్కిక భౌతికవాదాన్నీ, కమ్యూనిస్టు సిద్ధాంతాన్నీ ఆచరణలో చూపించగలగాలని వివరించారు మిడ్కో. 'తల్లిప్రేమ' కథలో సల్వాజుడుం మితిమీరిన ఆగడాల వలన అస్తవ్యస్తమైన ఆదివాసీ ప్రజా జీవనాన్నీ, ఆదివాసీలను సల్వాజుడుం నుండి రక్షించడానికి తమ పిల్లలను స్వయంగా ప్రజా సైన్యంలోకి పంపే తల్లుల త్యాగాలను గొప్పగా వర్ణించారు. 'మూసుకున్న హృదయం' కథలో సల్వాజుడుం మనిషైన మల్లే భర్త తన పిల్లలను కూడా అందులోనే చేర్చాలనుకుంటాడు. మల్లే భర్తలోని ప్రజా వ్యతిరేక, ప్రజా కంటక భావజాలాన్ని అడుగడుగునా వ్యతిరేకిస్తుంది. భర్తను మార్చటానికీ ప్రయత్నిస్తుంది. చివరకు అత్యంత కఠినమైన నిర్ణయం తీసుకుంటుంది. ఇది ఒక అపురూప ఘటన. మహిళల త్యాగాలకు నిలువెత్తు నిదర్శనం.

టుంబ్రి రాసిన చిన్న కథ 'నందే'లో 'నందే' పాత్రధారి ఒక అమాయకపు, స్వచ్ఛత, పట్టుదల కలగలసిన ఒక ఆదివాసీ మహిళ. 'నందే' చూపిన తెగువ, సాహసం, ప్రేమ, పట్టుదలకు నక్సలైట్లు ఉత్తేజితులవుతారు. ఈ కథ ద్వారా ప్రజల అండదండలుంటే ఎంతటి నిర్బంధాన్నైనా చేపల్లాగా ఈదగలరన్న వాస్తవాన్ని వ్యక్తపరుస్తాడు టుంబ్రి. 'గొడ్డును కాను' కథలో డాక్టర్లుగా, టీచర్లుగా అన్నలు ప్రజలకు దగ్గరవటాన్ని చిత్రించారు తాయమ్మ కరుణ. భర్త పోయాక ఆదివాసీ ఆచారం ప్రకారం ఇద్దరు మరదులూ వదినను వివాహం

వ్యాసం

ప్రపంచ సినిమా చరిత్రను అద్దంలో చూపిన 'సినిమాగా సినిమా'

- పి. వి. రమణ

వందేళ్లు పూర్తి చేసుకున్న భారతీయ సినిమా గురించే కాకుండా, ప్రపంచపు సినిమా పుట్టుక నుండి, దాని ఎదుగుదల, మంచి చెడులు గురించి 'సినిమాగా సినిమా' లో రచయిత నందగోపాల్ చాలా విస్తృతంగా వివరించారు. నందగోపాల్ సీనియర్ జర్నలిస్ట్. సినిమా పత్రికలైన 'కినిమా,' తెలుగు తెర' లాంటి పత్రికలు నడిపారు. సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా కూడా పనిచేసారు. అనేక అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల్లో సభ్యుడిగా పాల్గొన్న అనుభవం ఉంది. సినిమా తయారవడానికి పాటుపడే అన్ని విభాగాల గురించి లోతైన అవగాహనతో, 37 అధ్యాయాలలో చాలా మందికి తెలియని అనేక విషయాలపై అనుభవపూర్వకమైన జ్ఞానాన్ని అందించారు. 1981 ఢిల్లీలో జాతీయ సినిమా అభివృద్ధి సంస్థ మొదటి అధ్యక్షుడైన డి.వి.ఎస్. రాజు 'ఉత్తమ ప్రేక్షకుడు' అనే అవార్డు ఒకటి ఉంటే అది తప్పక నందగోపాల్‌కే ఇవ్వాలి' అనడం రచయితకు సినిమాల పట్ల ఎంత సీరియస్‌నెస్ ఉందో అర్థమౌతుంది. ఈ సంవత్సరం జాతీయ చలనచిత్ర సంస్థ నందగోపాల్' సినిమాగా సినిమా'కు ఉత్తమ సినిమా గ్రంథంగా అవార్డునిచ్చి గౌరవించింది.

ప్రపంచ సినిమాలో సామ్యవాద సినిమాలకు మార్గదర్శకంగా చెప్పుకునే 'బాటిల్ షిప్ పొటంకిన్', 'అక్టోబర్', 'స్ట్రైక్' లు తీసిన రష్యన్ దర్శకుడు సెర్గీయ్ ఐజెన్‌స్టీన్ తో కలసి తిరిగి ఆయన సినిమాలు యూరప్‌లో నిషేధానికి గురైనప్పుడు, వాటి ప్రదర్శన కోసం ఉద్యమం నడిపిన బ్రిటన్ జర్నలిస్ట్ మేరీ సెటన్. ఆమె చొరవ వల్లనే సత్యజిత్‌రే 'పథేర్ పాంచాలి' 1956లో కేన్స్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో గుర్తింపు పొందింది. అమెరికాలో ప్రజా గాయకుడైన పాల్ రాబ్సన్ పై ప్రభుత్వం దాడి చేసినప్పుడు దానికి వ్యతిరేకంగా పోరాడడమే కాకుండా పాల్ రాబ్సన్ పై ఒక పుస్తకం కూడా రాసింది. 1956లో భారతదేశం వచ్చినప్పుడు ఇక్కడి ఫిల్మ్ సొసైటీ ఉద్యమానికి చేయూతనివ్వడమే కాకుండా, భారతీయ సినిమా ఏ మేరకైనా సామాజిక అంశాలను పట్టించుకునేటట్లు చేసిన ఘనత ఆమెది. 1967లో ఆమె ఆధ్వర్యంలో పూనా ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ దేశంలోనే మొట్టమొదటి సారి ఏర్పాటు చేసిన 'ఫిల్మ్ అప్రిషియేషన్ కోర్స్' జరిగింది. దానిలో పాల్గొన్న నందగోపాల్‌లో సినిమాల పట్ల ఉన్న తీవ్రతను గుర్తించిన మేరీ సెటన్ ఆయనతో అనేక చర్చలు జరిపింది. వాటి ప్రభావం నందగోపాల్‌పై ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. రచయిత సంపాదకత్వం వహించిన సినిమా పత్రిక కినిమాకు అక్టోబర్ 10, 1997న లండన్ నుండి తన అతిథి సంపాదకీయం రాస్తూ మేరీ సెటన్ 'మంచి పత్రికలు లేని మంచి సినిమాలను ఊహించలేము'. 'చులకన భావంతో చూడబడుతున్న సినిమా, సృజనాత్మక కళారూపంగా ఉన్నత గౌరవాన్ని సంతరించుకుంది ఈ పత్రికల కృషిద్వారానే' అని చెప్పారంటే రచయిత పట్ల ఆయన కృషి పట్ల ఆ ప్రపంచ ప్రసిద్ధ చలన చిత్ర చరిత్ర కారిణికి ఎంత అభిమానముందో తెలుస్తుంది.

కోట్లాది ప్రజల మీద ప్రభావం చూపుతున్న సినిమా గురించి, వాటి మంచి చెడులు గురించి సామాజిక బాధ్యతతో వివరించవలసిన

చేసుకోవాలనుకుంటే దానికి విరుద్ధంగా తాను మనసుపడ్డ మనిషి దగ్గర ఉండాలనుకున్న తన నిర్ణయాన్ని ప్రకటిస్తుంది పాయకీ. ఇది ఒక ఆదివాసీ మహిళ అస్తిత్వాన్ని తెలిపే కథ.

ఆదివాసీ సమాజంలో తెగ పెద్దల పెత్తనానికి బలవుతున్న ఆదివాసీ స్త్రీలకు అండగా నిలుస్తారు అన్నలు. దళాలు మహిళల సమస్యల మీదే అనేక సార్లు పంచాయితీ పెట్టేవారు. వ్యక్తుల లోపాల్ని పోగొట్టి పార్టీ సభ్యులుగా ఎదగనిచ్చేవారంటారు ఎన్.డి. 'ఓ పగ్ని కథ'లో. అమాయక ఆదివాసీ మహిళైన పగ్నీ చుట్టుపక్కల గ్రామాలన్నింటిలోనూ ఒక ప్రముఖ వ్యక్తిగా ఎదగడం మనల్ని అబ్బురపరుస్తుంది. ఒక వ్యక్తితో వివాహం జీవితంలో ఎంతటి ప్రాముఖ్యతను సంతరించుకుంటుందో? పగ్ని కథ తెలుపుతుంది 'ఓ పగ్ని కథ' చదువుతుంటే ఉద్యమాన్ని అమితంగా, ప్రాణపదంగా ప్రేమించి, కార్యకర్తలుగా అనేక సవాళ్ళను ఎదుర్కొని నిలబడి తాను ఎంచుకున్న జంట మూలకంగా, తనలోని స్త్రీ బానిసత్వ భావజాల కారణంగా ఉద్యమానికి దూరమై దారుణ కుటుంబ హింసకు, వివక్షకు గురై తమ అస్తిత్వాల్ని, ఉనికినీ కోల్పోయిన మహిళా కామ్రేడ్స్ జీవితాలు ఒక్కసారిగా కళ్ళముందు మెదిలాయి. అత్యాచారం చేసి, గొంతు నులిమి చంపిన మహిళల హత్యలన్నీ గ్రీన్‌హంట్‌లో భాగమేనని, చైతేలాంటి మహిళలను హతమార్చగలరు గాని చైతన్యాన్ని హతమార్చలేరనె 'చైతే' కథ ద్వారా తెలియపరుస్తారు ఎన్.డి. ఎన్.డి. రాసిన మరొక కథ 'ఇద్దరు శాస్త్రకారులు' కథలో ఆత్మవిశ్వాసం మెండుగ గల ఆదివాసీ మహిళా గెరిల్లా చాకచక్యతకు యుద్ధ శిబిరంలోని గెరిల్లా డాక్టర్లే కాదు పాఠకులు కూడా అబ్బుర పడవలసిందే! బి. భానుమతి రాసిన 'కొత్త చదువు' యామిని రాసిన 'నిరీమిల', 'బాలగెరిల్లాలు', లక్ష్యాల్ని సాధించడంలో ఏ కథకు ఆ కథే మహత్తరమైనవిగా ఉన్నాయి.

'సాధన' రాసిన 'గ్రీన్‌హంట్ ఉత్పాతాలు', 'ప్రజా యుద్ధంలో మట్టివాసనలు' కథనాలలాగా ఉన్నాయి. ఒక రకంగా చెప్పాలంటే ఇవి రేఖాచిత్రాలు. రాహే దళ ఉద్యమానుభావలే ఈ కథానికలు. వీటిని చదువుతుంటే నిరంతర ఘర్షణ, పోరాటం... అనుక్షణం అత్యంత అప్రమత్తతతో శత్రువును ఎదుర్కొంటూ. విప్లవోద్య నిర్మాణంలో భాగస్వాములవుతూ... ఎంతటి అననుకూల పరిస్థితులనైనా అనుకూలంగా మార్చుకోగల విప్లవకారుల నిబద్ధతకు, పట్టుదలకు ఇవి గొప్ప తార్కాణాలనిపిస్తుంది.

'దండకారణ్య కథల'ను సమీక్షించేటంతటి స్థాయి నాకు లేదు. ఈ కథలను చదవడమే కాదు మనందరం వీటిని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. మహా సముద్రంలాంటి అత్యున్నత, మహోన్నత త్యాగాలను నాలుగు వాక్యాలలో బంధించి చెప్పగలగడం ఎలా సాధ్యం?

గురుతర బాధ్యత గుర్తించి కొడవటిగంటి కుటుంబరావు 1951లో ప్రారంభించి 1980ల వరకూ రాసిన 342 వ్యాసాలను ఎంత మంది గుర్తుపెట్టుకున్నారో తెలియదు గాని సినిమాగా సినిమా రచయిత నందగోపాల్ కొ.కు. ను 'ఫిల్మ్ క్రిటిక్ గానే కాదు జర్నలిస్టు గాను ఆదర్శ ప్రాయుడు, చిరస్మరణీయుడు' అని ప్రశంసించడం చాలా సంతోషం.

సమాజంపై అత్యంత తీవ్రమైన ప్రభావం చూపే సినిమాల గురించి సామాజిక మార్పు కోరే శ్రేణులు అత్యంత నిర్లక్ష్యం వహించడం నేటికీ కొనసాగుతున్న విచారకరమైన విషయం. హరిపురుషోత్తమరావు ప్రజా సాహితిలో రాసిన ఒక వ్యాసంలో 'ఆ మధ్యన జాన్ మిర్డాల్ మన దేశం వచ్చినప్పుడు, ఒక చిన్న విశేషం జరిగింది. ఆయనతోపాటు ప్రొఫెసర్ హరగోపాల్ వరంగల్ వీధుల గుండా కాకతీయ యూనివర్సిటీకి నడుస్తున్నారు. దారిలో ఒక సినిమా హాలు, దాని ముందున బారులు తీరిన జనాన్ని చూసి వాళ్లు అలా ఎందుకు గుంపులుగా నిలబడి ఉన్నారు అని ఎంతో ఆసక్తిగా అడిగారు మిర్డాల్. దానికి ఆ 'ఏదో ఉంది లెండి. బహుశా చెత్త సినిమా అయిఉండవచ్చు. మనం చూడలేం లెండి 'అని హరగోపాల్ జవాబిచ్చారు. మిర్డాల్ ఆశ్చర్యపోయి 'ఏమిటి ఇంతమంది పడిగాపులు కాస్తూ టికెట్‌లు సంపాదించుకుని చూసే సినిమాలంటే మీరంత చులకనగా లెక్కించవచ్చా? కనీసం ఆ చెత్త సినిమాల ద్వారా ఎంత విషం జనానికి సరఫరా అవుతుందో తెలుసుకోవడం మన బాధ్యత కాదా' అని అడిగారు. ఇవే మాటలు కాకపోవచ్చు. కాదు కూడానూ. కానీ తాత్పర్యం, సారాంశం మాత్రం అదే' అని 1987లో రాసిన పరిస్థితే నేటికీ కొనసాగుతుంది.

ఆయనే రాసిన మరో వ్యాసంలో 'సినిమా, టీవీ, వీడియో ఇవన్నీ ప్రేక్షకుడి మీద గాఢమైన ముద్ర వేస్తాయి. అందుకు మాటలు, పాటలు, వాద్య సంగీతం, చిత్రితమైన ప్రదేశాలు, పాత్రలు, పాత్ర ధారులు, సాంకేతిక నిపుణులు సామూహికంగా దోహద వస్తువులవుతాయి. ఒక పత్రిక కంటే ఒక సినిమా బలమైన ప్రచార సాధనంగా ఉపయోగ పడడం అనేక సార్లు గమనిస్తాం. కాని గుర్తుంచుకోకపోవడం మన మేధావులు చేసే పొరపాటు. అన్ని ప్రచార సాధనాలలాగే సినిమా కూడా యధా తథ స్థితినీ, వీలైతే ఇంకా వెనుకబాటు తనాన్ని మన భావజాలం లోకి, మనకు తెలియకుండానే చొప్పిస్తుంది. అందుకే సినిమా చూడడానికీ, దానిని విమర్శించడానికి ఒక సంస్కారం, ఒక క్రమ శిక్షణా అవసరం. సంస్కారం అంటే అదేదో పులుముకోవడానికి పనికివచ్చే వస్తువుగా తీసుకోనక్కర్లేదు' అని సినిమాల గురించి రాయవలసిన అవసరాన్ని ఎత్తి చూపారు.

ప్రజల అభిప్రాయం మీద సినిమాల ప్రభావం గురించి కొ.కు. రాస్తూ 'ప్రపంచాన్ని ఏకం చేసే ప్రభావం ఏదైనా మంచిదే. సినిమాకు మించిన ప్రచార సాధనం లేదు. సాంఘిక దృష్ట్యా చూస్తే ప్రజాసామాన్యం యొక్క నిత్య జీవితంలోకి కళలు ప్రవేశించడమే ఒక గొప్ప విషయం. వారిలో విమర్శనా దృష్టీ, విచక్షణా జ్ఞానమూ తలెత్తినయ్. వారి జీవితాల్లోకి ఇంత వెలుగు ప్రవేశించింది' అని అన్నా, 'మంచి చిత్రాల గురించి నాలుగు మంచి మాటలు చెప్పగల వారు అల్ప సంఖ్యాకులైన మధ్య తరగతి రసజ్ఞులు. తమకు అభిమాన పాత్రమైన చిత్రాలను ప్రజలు ఆదరించేటట్లు చేయవలసిన బాధ్యత వారిపై ఉంది' అని అన్నా, 'స్టంటులు, డ్యూయెట్‌లు, రేప్ సీనులు వగైరాలు ఉంటేనే గాని సినిమా చూడని వాణ్ణి పథేర్‌పాంచాలి చూసి ఆనందించ గలిగేటట్లు చేయగల విమర్శ అత్యున్నతమైనది. చిత్రాలు చూసిన తరువాత ప్రేక్షకునికి తన జీవితం మరింత అర్థం కావాలి. దానితో పోరాడే శక్తి రావాలి' అని అన్నా మొత్తంగా సినిమాల గురించి పట్టించుకోవలసిన అవసరాన్ని గుర్తు చేస్తాయి.

'ప్రపంచీకరణ యుగంలో అన్నిటితో పాటు సినిమా కూడా మానవ సంబంధాలతో పాటు వినిమయ వస్తువుగా మారిపోయింది' అని ప్రారంభించి ' నీవు ఉన్న చోట నేలలోకి ఎంత బలంగా, ఎంత లోతుగా నీ కాలి వ్రేళ్లు గుచ్చగలిగితే అంతగా విశ్వ జనీన మైన విలువలకు నీవు ప్రాతినిధ్యం వహించగలవు' అన్న మావో సూక్తిని ఉటంకిస్తూ రచయిత ఇది అన్ని కళలకు ప్రధానంగా సినిమాకు కూడా వర్తిస్తుందని సూటిగానే చెప్పారు. రావి శాస్త్రి చెప్పిన 'రచయిత ఏమి రాసినా, అది ఏ మంచికి చెడు చేస్తుందో, ఏ చెడుకు మేలు చేస్తుందో ఆలోచించి రాయాలి' అన్న మాటలు ఆజ్ఞగా శిరసా వహించి రాసానని రచయిత అన్నారు.

బెర్నార్డ్ షా లాంటి మేధావి 'సినిమా రంగం సృష్టించిన ఏకైక మేధావి చాప్లిన్' అన్న ప్రశంసను గుర్తు చేస్తూ సినిమాకు మాటలు నేర్పితే సృజనకూ, అభినయ విన్యాసానికీ ప్రాధాన్యత తగ్గుతుందని నమ్మిన చాప్లిన్, తన గ్రేట్ డిక్టేటర్ సినిమా చివరి సీన్‌లో 'సైనికులారా ఈ దుర్మార్గులకు తల వంచకండి. మీ గుండెల నిండా మమతానురాగాలు నింపుకోండి. పగా ద్వేషం వద్దు' అన్న సుదీర్ఘమైన ప్రసంగాన్ని వివరిస్తూ దీనిని పూర్తి మూకీ సినిమాగా చాప్లిన్ సహితం పండించలేడు. తీయలేడు. ఇక్కడ మాట అవసరం అంటూ మూకీల నుండి టాకీల కు మారడంలో చారిత్రక సందర్భాన్ని రచయిత చక్కగా వివరించారు.

'ఓ నాటికి ఈ భూమండలం నాగరికతా ముఖ చిత్రాన్ని మార్చేయగల శక్తివంతమైన నవకల్పన సినిమా. తుపాకి తూటా, విద్యుత్ శక్తి, నూతన ఖండాలు కనుగొనడం కన్నా ప్రధానమైన ఆవిష్కరణ సినిమా. ఈ భూమిపై మానవాళి ఒకరినొకరు తెలుసుకోవడానికి, ఒకరికొకరు చేరువ కావడానికి, ఒకరినొకరు ప్రేమించడానికి అవకాశాలను కల్పిస్తుంది సినిమా. సినిమాకు సముచిత ప్రాధాన్యత ఇద్దాం. ప్రేమిద్దాం. గౌరవిద్దాం' అన్న ముస్తఫా కమల్ అటాటర్క్ వ్యాఖ్యతో ప్రారంభించి ప్రపంచ సినిమాను మన ముందు పరుస్తారు రచయిత. బర్త్ ఆఫ్ సినిమాగా కీర్తించబడిన డి.డబ్ల్యూ. గ్రిఫిత్ 'బర్త్ ఆఫ్ ఎ నేషన్ (1915)' ను గురించి రాస్తూ చిత్రంలో జాతి వివక్షత చోటుచేసుకుంది అనే విమర్శ వెంటాడడం గురించి, 1920లో రష్యాలో నూతనంగా ఏర్పాటుచేసిన ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌కు సారధ్యం వహించమని లెనిన్ గ్రిఫిత్‌ను ఆహ్వానించినట్లు మనకు తెలుస్తుంది.

రష్యా అక్టోబర్ విప్లవంలో విభిన్న జాతులు, భాషల ప్రజలను చైతన్య పరచడానికి సినిమాకు మించిన కళ మరొకటి లేదని మొదటి ఫిల్మ్ స్కూల్‌ను ప్రారంభించారు. దాని కార్యదర్శి లెనిన్ సహచరి కృపస్కయా. కులెషోవ్ అధ్యాపకుడు. ఈయన శిష్యులే సామ్యవాద సినిమాకు పునాదులేసిన సెర్గీయ్ ఐజెనీస్టీన్, డావ్ జెంకో, పుడోవ్‌కిన్‌లు. పుడోవ్‌కిన్ 'మదర్' సినిమాను 1916లో తీసారు. 1925లో ఐజెనిస్టీన్ 'బాటిల్ షిప్ పొటంకిన్' తీసారు. దీని గురించి 'ఇది కళా విస్ఫోటనం. దాని ప్రకంపనలు ప్రపంచమంతా వ్యాపించాయి. చిత్రాన్ని బెర్లిన్ నిషేదించింది. లండన్‌లో అడుగుపెట్టడానికి చోటివ్వలేదు. న్యూయార్క్

కొన్ని భాగాలను కత్తిరించి, శుద్ధి చేసి మరీ తీసుకున్నారు' అన్న బి.డి.గార్గ్ వ్యాఖ్యానం చూస్తాం. 'గుర్రపు బగ్గీకి ఎన్ని మందులు వేసినా అది లోకో మోటివ్ రైలు ఇంజన్ కాలేదు. రెండిరటి లోనూ మౌలికంగా ఉన్న చోదక శక్తికి ఎలాంటి పోలికా లేదు. నూతన చలనశీల శక్తి రైలును నడుపుతుంది. ఆ డైనమిజం సినిమాకు కావాలి. ఆ మార్పునకు అడ్డువచ్చే ఎలాంటి పాత సాంప్రదాయాల్నైనా వదులుకోక తప్పదు' అన్న 27 ఏళ్ల ఐజెన్‌స్టీన్ ప్రపంచ సినిమాకు 'మాంటేజ్' విధానాన్ని అందజేసిన వివరాలు చూస్తాం. తరువాత అమెరికన్ రచయిత జాన్ రీడ్ రష్యా విప్లవం గురించి రాసిన 'ప్రపంచాన్ని కుదిపేసిన ఆ 10 రోజులు' ఆధారంగా 1927లో 'అక్టోబర్'ను ఐజెనిస్టీన్ తీసారు.

మాంటేజ్‌తో మరో ప్రయోగం చేసి మూకీ చిత్రంలో ధ్వనిని సృష్టించడం గ్గురించి రచయిత వివరిస్తారు. మిషిన్ గన్‌లు గర్జిస్తూ ఉంటే, రాజ భవనం గజగజ వణుకుతుంది. అందుకు ప్రపంచ సినిమాలో అక్టోబర్ రెవల్యూషన్‌గా ఐజెన్‌స్టీన్ 'అక్టోబర్'ను గుర్తించినట్లు తెలుసుకుంటాం.

తొలి తరం సోవియట్ సినిమా దర్శకులలో మరొకరు డావ్‌జెంకో. 1930లో ఈయన తీసిన 'ఎర్త్' నేటికీ ఓ మధుర కావ్యంగా, ఆకుపచ్చని జ్ఞాపకంగా నిలుస్తుందని చెప్తారు రచయిత. నాడు ఉక్రెయిన్‌లో కులక్‌లు, భూస్వాములు రైతులకు మధ్య జరుగుతున్న నిత్య ఘర్షణలో 'వాసిలీ' వీర మరణం పొందుతాడు. మృత వీరుని భౌతిక కాయాన్ని రైతులు ఇంటికి తీసుకొస్తున్నారు. దారి పొడుగునా చేలల్లో ఎత్తుగా ఏపుగా పెరిగిన పూల మొక్కలు గాలి వాటుకు వంగి తలలు వాల్చి అమర జీవికి పుష్పాంజలి ఘటించాయి అన్న భావన కలిగే రీతిలో సాగుతుంది. ప్రేయసి అతని మృత దేహాన్ని చూసి చలించి, ఆభరణాలను, అలంకరణను అన్నీ తీసి పారవేస్తూ నగ్నంగా పరిగెత్తి వాసిలీ మీద వొరిగిపోతుంది. వయసులో ఉన్న పిల్లను పూర్తిగా నగ్నంగా తెరమీద చూస్తున్నా, ఆ క్షణంలో ప్రేక్షకులు సెక్సు పరమైన మానసిక వికారానికి లోను కాలేదు. వారిలో కరుణ రసం చిప్పిల్లింది'. అంటూ అద్భుతంగా వివరిస్తారు రచయిత. యుద్ధ వ్యతిరేక చిత్రాలుగా ప్రపంచ ఖ్యాతి గాంచిన ఇతర రష్యన్ చిత్రాలు మైఖేల్ కొలటోజోవ్ 'ద క్రేన్స్ ఆర్ ఫ్లైయింగ్', గ్రెగరీ చుక్రాయ్ 'ద ఫార్టీ ఫస్ట్', 'బలాడ్ ఆఫ్ సోల్జర్' లాంటి చిత్రాలు గురించి కూడా వివరించారు.

జర్మని 'ఎక్స్‌ప్రెసనిజం' లో భాగంగా వచ్చిన రాబర్ట్ వీన్ సినిమా 'ద కేబినెట్ ఆఫ్ కాలిగిరి'లో 1918లో వెర్సైల్స్ సంధితో యుద్ధం ముగియడం, యుద్ధంలో ఓడిపోయి అవమాన భారతంలో జర్మన్ యువత కుమిలిపోవడం, వర్తమానం కళ్ళముందు కనపడడం లాంటి అంశాలతో సినిమా అంతా భయం, మృత్యు నీడ పరుచుకుంటుంది. నాటి జర్మన్ జాతి ఆలోచనా ధోరణిని వ్యక్తపరచింది ఈ సినిమా అంటారు రచయిత.

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఇటలీ ఫాసిస్ట్ నియంత ముసోలిని 'సినిమాలలో హింస చూపకూడదు, చెడును చూపకూడదు. అంతా మంచినే చూపాలి. అవి ఇటలీ ప్రతిష్టను పెంచాలి' అంటూ విధి నిషేధాలు జారీ చేసాడు. దానికి వ్యతిరేకంగా నిరసన గళం వినిపించడానికి లూచినో విస్కాంచి 1942లో 'అబ్సెషన్స్' తీసారు. దానిని ఇటలీలో ప్రారంభమైన 'నియో రియలిజం' సినిమా తొలి అడుగుగా గుర్తించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన విట్టోరియా డెసికా తీసిన 'బై సైకిల్ థీఫ్' (1948) నియో రియలిస్ట్ సినిమాలకు ప్రతీకగా నిలబడుతుంది. ప్రపంచంలో అనేక దేశాల దర్శకులకు డెసికా సినిమా మార్గదర్శకంగా నిలబడిరది. మన దేశంలో సత్యజిత్‌రే తీసిన 'పథేర్ పాంచాలి', బిమల్ రాయ్ తీసిన 'దో బీఘా జమీన్' లాంటి వాస్తవిక సినిమాలు దీనికి నిదర్శనం. ఈ నియో రియలిస్ట్ సినిమాలను కమ్యూనిస్ట్ సినిమాలుగా ప్రకటించి, అవి ఇటలీ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నాయని వాటిపై ఇటలీ ప్రభుత్వం ఆంక్షలు విధించింది.

ఫ్రాన్స్ న్యూ వేవ్ చిత్రాల గురించి రాస్తూ 'మనం మార్క్స్, కోకోకోలా బిడ్డలం' అన్న గొడార్డ్, న్యూ వేవ్ సినిమా అంటే దర్శకుడు నేరుగా తన ప్రేక్షకులతో సంభాషించడం అన్న లక్ష్యంతో 1959లో 'బ్రీత్ లెస్' అనే సినిమా తీసారని రచయిత వివరిస్తారు. జర్మనీలో కొత్త వెల్లువలో భాగంగా 1962లో 64 మంది యువ సినిమా దర్శకులు, నటీ నటులు, సాంకేతిక నిపుణులు 'పాత సినిమా చచ్చిపోయింది. మేం నవతను నమ్ముతున్నాం. కోరుతున్నాం'. అని ప్రకటించారు. వారు తీసిన సినిమాలలో రెయినర్ ఫాస్ బైండర్ 'ఫియర్ ఈట్స్ ద సోల్' (1974), విమ్ విండర్స్ 'వింగ్స్ ఆఫ్ డిజైర్' (1987) ముఖ్యమైనవి.

బ్రిటిష్ సినిమా ప్రపంచంలో 1950లో 'ఫ్రీ బ్రిటిష్ సినిమా' ఉద్యమానికి శ్రీకారం చుట్టిన వారిలో ఒకరైన టోనీ రిచర్డ్ సన్ 'లుక్ బ్యాక్ ఇన్ ఏంగర్ '(1959), 'టామ్ జోన్స్' (1965) సినిమాలు తీసారు. డేవిడ్ లీన్ 'బ్రీఫ్ ఎన్‌కౌంటర్స్' నాటికీ నేటికీ బ్రిటిష్ సినిమాలో అత్యుత్తమ ప్రేమ కథా చిత్రంగా ఎంపిక చేసారని రచయిత వివరిస్తారు.

అమెరికన్ సినిమా అంటే హాలీవుడ్ స్టుడియోల చరిత్రగానే మనం గుర్తించాలని రచయిత చెప్పారు. స్టుడియో అధినేతలకు తమ వ్యక్తిత్వాన్ని బలివ్వకుండా, తలా తోకా లేని వారి ఆంక్షలకు తల వంచకుండా క్లాసిక్ హాలీవుడ్ చిత్రాలు రూపొందించిన వారిలో ఫ్రాంక్ కాప్రా, జార్జ్ కకోర్, జాన్ ఫోర్డ్, హోవార్డ్ హాక్స్, ఎలియా కజాన్, ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్, ఆర్సన్ వెల్స్, డేవిడ్ లీన్, బిల్లీ వైల్డర్, విలియం వైలర్ లాంటి వారున్నారని వివరిస్తారు.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసాక, అమెరికా తన దేశంలో కమ్యూనిస్టులు, వారి సానుభూతి పరుల ఏరివేతను ప్రారంభించింది. ప్రత్యేకించి సినిమారంగంలో అమెరికన్ విలువలు, గౌరవాన్ని కాపాడడానికి 'హౌస్ ఆఫ్ అన్‌అమెరికన్ యాక్టివిటీస్ (హెచ్.యు.ఎ.సి) 1947లో ప్రారంభించింది. దీనికి సెక్రటరీ ఆఫ్ స్టేట్ మెకార్థీ నాయకత్వం వహించి, విచారణ ప్రారంభించాడు. 212 మందిని విచారించారు. వీరిలో చార్లీ చాప్లిన్, గ్రెగరీ పెక్, కాథరీన్‌హెప్‌బర్న్, జీన్ కెర్ప్, డెన్నీ కేయీ, ఫెడరిక్ మార్చ్, ఫ్రాంక్ సినాత్రా, ఆర్సన్ వెల్స్ లాంటి ప్రముఖులను కమ్యూనిస్ట్ అనుకూలురుగా విచారించారు. వీరిపై 'స్టాలిన్ స్టార్స్' అన్న ముద్ర వేసారు. ఈ దాడికి తట్టుకోలేక అనేక మంది సినీ ప్రముఖులు వలస వెళ్లిపోయారు. చాప్లిన్ అమెరికా పౌరసత్వం వదులుకుని వెళ్లిపోయాడు. ఆర్సన్ వెల్స్ ప్రవాసంలోకి వెళ్లిపోయారు. నిత్య వేధింపులతో జాన్ గ్యారీ ఫీల్డ్ గుండె పోటుతో మరణించారు. న్యూయార్క్‌లో జరిగిన ఒక సమావేశంలో నిర్మాతలు 'భయం నీడలో సృజనాత్మకత మనజాలదు' అని తీర్మానించారు.

అమెరికాలో 1950ల తరువాత 'అండర్ గ్రౌండ్ సినిమా' వేగం అందుకుందని చెబుతూ 'మాకు హాలివుడ్ మీద నమ్మకం లేదు. హాలివుడ్‌లో సినిమాలంటే డాలర్లు. సినిమా మా జీవితం. మేం

సెన్సార్‌ను కూడా ధిక్కరించి వారి అనుమతి లేకుండానే జనం ముందుకు మా సినిమాలను తీసుకెళ్తాం. కష్టాలను భరిస్తాం. మా డబ్బులతోనే, పరిమిత వనరులతోనే సినిమాలు తీస్తాం. నష్టాలను భరిస్తాం. ప్రపంచాన్ని మా సినిమాలతో నింపుతాం', 'మా జీవ నాడుల, మా హృదయ స్పందనల, మా నేత్రాల, చివరికి మా చేతి వ్రేళ్ల విస్తరణయే మా సినిమా' అన్న వారి ఆశయాలను వివరించారు. 1959లో డెన్నిస్ హాప్పర్ తీసిన 'ఈజీ రైడర్', 1972లో జార్జిలుకాస్ 'మీన్ స్ట్రీట్స్', 1976లో మార్టిన్ స్కోరేస్కీ 'టాక్సి డ్రైవర్', 1971లో పీటర్ బొగ్డా నివిచ్ 'ద లాస్ట్ పిక్చర్ షో' లాంటి హాలీవుడ్ ఉత్తమ చిత్రాల గురించి పరిచయం చేస్తారు.

లాటిన్ అమెరికా సినిమాల గురించి వివరిస్తూ, 1979లో న్యూఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి జూరీ సభ్యునిగా వచ్చిన చిలీ దర్శకుడు మిగ్వేల్ లిట్టిన్ 'లాటిన్ అమెరికా మాప్ వంక చూస్తే, చరిత్ర గమనిస్తే చాలా దేశాలు సామ్రాజ్యవాదులు మా నెత్తిన రుద్దిన నియంతల పద ఘట్టనలలో నలిగిపోతుండడం మీరు గమనిస్తారు. నా జన్మభూమి చిలీలో వాస్తవ సినిమా తీయడం నేరం. అలా తీయడానికి సాహసించిన వాళ్లను కాల్చిపారేయడమో, జైళ్లలో పెట్టి చిత్ర హింసల పాలు చేయడమో చేస్తున్నారు' అన్న మాటలు వివరిస్తారు. లిట్టిన్ తీసిన 'ప్రామిస్‌డ్ లాండ్' లో నటించిన కార్మన్ జూనోను రహస్యపోలీసులు చిత్ర హింసలు పెట్టడం, మెహన్స్ హెర్మన్ అనే కెమెరా మాన్ ను, ఛార్లెస్ అనే నటుడ్ని పోలీసులు కాల్చి చంపడం లాంటి అనేక లాటిన్ అమెరికన్ దేశాలలో పరిస్థితులను కూడా వివరిస్తారు.

బ్రెజిల్‌లో 1954లో 'సినిమా నోవా' అనే విప్లవ వాద సినిమా నిర్మాణ సంస్థ స్థాపించారు. ప్రపంచ క్లాసిక్ సినిమాలకు నిలయమైన మోడరన్ ఆర్ట్ మ్యూజియంను ఆ దేశ పోలీసులు నాశనం చేయడం, టెలివిజన్ దర్శకుడు వ్లాడిమర్ హెర్జోగ్ ను కాల్చి చంపడం, 'విప్లవానికి ప్రేలుడు పదార్థాల్లా ఉపయోగపడే చిత్రాలు తీస్తున్నాం' అన్న గ్లోబర్ రోచాను దేశ బహిష్కరణకు గురి చేయడం లాంటి మిలటరీ పాలన దురాగతాలను గుర్తు చేస్తారు.

అర్జెంటీనాలో ఒక్టావా గెటినో తీసిన 'ద హవర్ ఆఫ్ ఫర్నేసెస్' లో, అర్జెంటీనా గత చరిత్ర, వర్తమాన జన జీవితంలో వైరుధ్యాలు, అక్రమార్కుల విలాస జీవితం, శిధిల జీవితాల మూగ వేదన, మిలటరీ పాలకుల పైశాచిక క్రీడను కళ్లకు కట్టి, వీర మరణం పొందిన గువేరాను చూపిస్తూ 'ప్రతీకారమో, ప్రాణ త్యాగమో' అన్న నినాదం వినిపిస్తుంది. చీకటిలో వేనవేల విప్లవ జ్యోతులు భగ భగ మండమని జనాన్ని ఉత్తేజపరుస్తాయి. ఈ చిత్రం నిషేధానికి గురైనా, రహస్యంగా ప్రదర్శనలిస్తూ అర్జెంటీనా అంతా కలయదిరగడం, జనంలో మమేకమై గెరిల్లా సినిమాకు బాటలు వేయడం గురించి రచయిత వివరించారు.

బొలీవియాలో జార్జ్ సాంజనీస్ తీసిన 'బ్లడ్ ఆఫ్ కండోర్' కెమెరా మాన్ ఫిలిక్స్ గోమెజ్ జైలుపాలవడం, మరో డాక్యుమెంటరీ కెమెరా మాన్‌ను కాల్చి చంపడం గురించి మనకు తెలుస్తుంది. ఉరుగ్వే, కొలంబియా దేశాలలో కూడా అటువంటి పరిస్థితులే కొనసాగాయి.

1961లో ఆఫ్రికన్ మొదటి సినిమా ఉస్మాన్ సింబిని 'ఛారమ్', తరువాత 'బ్లాక్ గర్ల్', 'సెడ్డో' (1971) లను తీసారు. సెడ్డోను ప్రభుత్వం నిషేధించింది.

చైనాలో 6 తరాల సినిమాల గురించి వివరించారు. 1913లో తీసిన మూకీ 'డిఫికల్ట్ పీపుల్' తో పాటు 'గాడెస్', ఈ దశాబ్దపు ఉత్తమ చిత్రంగా గుర్తించబడిన ఝూంగ్ జునీ 'ద స్ప్రింగ్ రివర్ ఫ్లోస్ ఈస్ట్', ఝూంగ్ ఇమోవ్ 'వన్ అండ్ ఎయిట్', 'రెడ్ సోర్గమ్', ఛెన్ కాగె 'ఎల్లో ఎర్త్' లాంటి ఉత్తమ చిత్రాల గురించి వివరించారు.

జపాన్‌లో అకిరా కురుసోవా సినిమాలు 'రషోమన్' (1950), దాస్తో విస్కీ రచన ఆధారంగా వచ్చిన 'ఇడియట్' (1951), గోర్కీ రచన ఆధారంగా వచ్చిన 'లోయర్ డెప్త్స్' (1957), 'సెవెన్ సమురాయ్', 'ద థ్రోన్ ఆఫ్ బ్లడ్' లాంటి అనేక గొప్ప సినిమాలతో పాటు ఇతర ప్రముఖ దర్శకులైన మిజోగుచి 'లైఫ్ ఆఫ్ ఒహారు' (1952), 'స్ట్రీట్ ఆఫ్ షేమ్' (1956), 'ద ప్రిన్సెస్ యాంగ్' (1955), యసుజురో ఒజు 'టోక్యో స్టోరీ' (1953), 'ఫ్లోటింగ్ వీడ్స్' (1959), కెన్ ఇచికావా 'ద బర్మీస్ హార్ప్' (1956) లాంటి జపాన్ అత్యుత్తమ చిత్రాల గురించి తెలుసుకుంటాం.

భారతీయ సినిమాల ప్రారంభ చరిత్రతో చిత్ర భారతి మొదలౌతుంది. 1896లో ముంబాయిలో లూమియర్ బ్రదర్స్ తీసిన ఒక్క నిమిషం నిడివి చిత్రాలతో ప్రారంభం కావడం, భారతీయ సినిమాకు పునాదులు వేసిన సఖారాం భట్వాడే కర్, బాబురావు పెయింటర్, దాదాసాహెబ్ ఫాల్కే, దక్షణ భారతదేశంలో మూకీ చిత్రాలు ప్రారంభించిన నటరాజ్ మొదలియార్, రఘుపతి వెంకయ్య, రఘుపతి ప్రకాష్ ల గురించి, 1931లో దేశంలో మొదటి టాకీ అర్దేషిర్ ఇరానీ 'ఆలం ఆరా' గురించి అనేక చారిత్రక విషయాలు వివరిస్తారు. నందగోపాల్ భారతీయ సినిమాకు కీర్తి తెచ్చిన అనేక మంది ప్రముఖ దర్శకుల్ని, నటుల్ని, సాంకేతిక నిపుణుల్ని అందించిన మూడు స్టుడియోల గురించి వివరిస్తారు. కొల్హాపూర్‌లో 1929లో వి.శాంతారాం ప్రారంభించిన 'ప్రభాత్ ఫిల్మ్ కంపెనీ', 1931లో కలకత్తాలో బి.ఎన్. సర్కార్ నెలకొల్పిన 'న్యూ థియేటర్స్', 1934లో ప్రారంభమైన 'బోంబే టాకీస్' ల గురించి అద్భుతమైన చారిత్రక వివరాలను తెలుసుకుంటాం. శాంతారాం 'దునియా న మానే' (1937), 'ఆద్మీ' (1939), 'కొట్నీస్ కి అమర్ కహానీ' (1943), ఉదయ శంకర్ 'కల్పన' (1948), భారతీయ సినిమాలో నవశకానికి నాంది పలికిన సినిమా ఖ్వాజా అహ్మద్ అబ్బాస్ 'ధర్తీ కె లాల్' (1946), 'షెహర్ ఔర్ సప్నా', 'సాత్ హిందుస్థానీ', చేతనానంద్ 'నీచె నగర్' (1948), మెహబూబ్ ఖాన్ 'మదర్ ఇండియా' (1957), సొహారాబ్ మోడి 'సికందర్', 'మీర్జాగాలిబ్', 'ఝాన్సీకి రాణీ', కె ఆసిఫ్ 'మొఘల్ ఎ ఆజామ్' లాంటి అనేక గొప్ప హిందీ సినిమాల గురించి వివరించారు.

కాశ్మీర్, పంజాబి, రాజస్థాని, గుజరాత్, భోజ్‌పురి, ఒడియా, మరాఠి, కన్నడ, మలయాళం, తమిళం భాషా చిత్రాల గురించి అనేక వివరాలిచ్చారు.

నిర్మాతల విభాగంలో పాత తరం నాటి హెచ్.ఎమ్.రెడ్డి, పి.వి. దాసు, గూడవల్లి రామబ్రహ్మం, బి. ఎన్. రెడ్డి, కె.వి. రెడ్డి, వి. నాగయ్య లతో పాటు నేటి తరానికి చెందిన డి. రామానాయుడు, రామోజీరావు, వి.బి. రాజేంద్రప్రసాద్, సి. అశ్వని దత్, కె. ఎస్. రామారావు లాంటి వారి గురించి వివరిస్తూ '1973 తరువాత సినిమాని సృజనాత్మక కళగా, నిర్మాణాత్మక వ్యాపారంగా గౌరవించని సాహసికుల తాకిడి పెరిగింది. 20 సంవత్సరాల క్రితం 200 మంది సభ్యులుగా ఉన్న ఫిల్మ్ ఛాంబర్‌లో

నేడు 2000 మంది సభ్యులున్నారు. పరిశ్రమలోని నటీ, నటులు, సాంకేతిక సిబ్బందికి గొడుగు లాంటి స్టూడియో వ్యవస్థ కూలిపోయింది. స్టార్ చుట్టూ కథలు తిరిగాయి. బేర సారాలు జరిగాయి. అప్పటి వరకూ నిర్మాత, పంపిణీ దారుడు, ప్రదర్శకుడు చిత్ర నిర్మాణంలో లాభ నష్టాలు పంచుకున్నారు. డిస్ట్రిబ్యూటర్ స్థానంలో నేడు బయ్యర్‌లు రంగ ప్రవేశం చేసారు. బ్లైండ్ డీల్స్, చిత్ర ముహూర్తం నాడే కొనుగోళ్లు జరగడం ప్రారంభమయ్యాయి' అంటూ తెలుగు సినిమా ఆర్థిక సంబంధాలలో వచ్చిన మార్పుల గురించి విశ్లేషణ చేసారు.

దర్శకుల విభాగంలో గూడవల్లి రాంబ్రహ్మం, బి.ఎన్.రెడ్డి, కె.వి. రెడ్డి, ఎల్.వి. ప్రసాద్, కె. ప్రత్యగాత్మ, కె. విశ్వనాథ్‌ల గురించి వివరించారు. కొ.కు. రైతు బిడ్డపై రాస్తూ రామ బ్రహ్మాన్ని అభినందిస్తూనే 'డైరెక్టర్‌కు సృజనాత్మక శక్తి ఉండాలనేది రామబ్రహ్మంకు తెలియదేమో అనుకోవాలి' అని చేసిన విమర్శపై నందగోపాల్ తీవ్రంగా స్పందించి జవాబు కూడా చెప్పారు. 'సినిమా షూటింగ్ నాలుగు గోడలు దాటని రోజుల్లో గూడవల్లి సినిమా కెమెరా వాస్తవ జీవితంలోకి వెళ్లింది. పూరిపాకలు, మేక పిల్లలు, నిత్య దరిద్రపు గడ్డు బ్రతుకులకు అద్దం పట్టాయి. పొలాలు, గేదెలు, గుడి ముందు ఆడుకునే పిల్లలు, నీళ్ల కావిడితో బిరబిరా సాగిపోయే రైతన్న, చెరువు, చెరువు గట్టున నుయ్యి, దాని చుట్టూ బిందెలతో పల్లె పడుచులూ, కంది చేలు, మూర్పిళ్లు, ఏతాము, పిడకలు కొట్టిన గోడలు, రైతు మండువా లోగిలిలో రవివర్మ లక్ష్మి, సరస్వతి పటాలు, గోడకు వేళాడుతూ నెమలి ఈకల విసెన కర్ర, ఇంటి సింహద్వారం ముందు వేళ్లాడుతూ వరి కంకుల గుత్తి, సంక్రాంతి సంబరాలు, బాకా ఊదుళ్లు, గంగిరెద్దులతో పాటు బైండ్ల వాడు, అప్పు భారంతో నడ్డి విరుగుతున్నా దోసిళ్లతో బియ్యం దానం చేసే ధర్మ దాత నర్సి రెడ్డి, ఈ సుందర గ్రామీణ దృశ్యాలు, ఇంతకు ముందు ఏ సినిమాలో చూసాం. వాస్తవాన్ని పునర్నిర్మించడానికి కూడా సృజన అవసరం లేదా? అని కొ.కు. కు జవాబు చెప్పారు. క్రాంత దర్శి, మానవతా మూర్తి, గూడవల్లి ప్రగతి శీల సినిమా ఉద్యమ నేతగా చరిత్రలో నిలిచిపోయారని రచయిత నొక్కి చెప్పారు.

కెమెరా విభాగంలో 1935లో బి.ఎన్. సర్కార్ తీసిన 'దేవదాస్' కెమెరామాన్ బిమల్ రాయ్ గురించి, ఇతర భారతీయ ప్రముఖ సినిమాటోగ్రాఫర్లు కె. రామనాథ్, ఎ.కె. బీర్, ఇషాన్ ఆర్యా, మార్కస్ బార్‌ట్లే, సుబ్రతో మిత్రా, గురుదత్ సినిమాలన్నింటితో పాటు అనేక ఉత్తమ చిత్రాలకు పనిచేసిన వి.కె. మూర్తిల గురించి అద్భుతమైన చారిత్రకాంశాలతో వారి వృత్తిలో ప్రత్యేకతల గురించి వివరించారు.

సినిమాలో భాగమైన నటన, మాటలు, పాటలు, సంగీతం, దుస్తులు, మేకప్, ధ్వని, ఎడిటింగ్ ల గురించి, నవలలు, నాటకాలకు సినిమాలతో ఉన్న సంబంధం గురించి, సినిమాలలో సెక్స్, హింస, స్త్రీలు, హీరోల గురించి, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీలు, సినిమా విమర్శ, మీడియా, ప్రేక్షకులు, రేపటి సినిమా లాంటి అనేక అంశాల గురించి ' సినిమాగా సినిమా ' లోని వివిధ అధ్యాయాలలో ఈ తరానికి తెలియని ఎన్నో విషయాలు తెలుసుకుంటాం.

స్టీవెన్ స్పీల్ బర్గ్, మహా భారతాన్ని సినిమాగా తీయమని సత్యజిత్‌రే ను కోరడం, దాన్ని 'రే' సున్నితంగా తిరస్కరించడం, 'పెద్ద మనుషులు' విడుదలైన 15 సంవత్సరాల తరువాత మళ్లీ ఆ సినిమాని చూసి చలించిన రేలంగి కొ.కు. తో 'ఇలాంటి సినిమాలు ఇంక రావు, చూడలేం బాబూ' అన్న విషయం రచయిత వివరిస్తారు. ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) నుండి వచ్చిన కె.ఎ. అబ్బాస్ తీసిన తొలి చిత్రం 'ధర్తీ కె లాల్' బెంగాల్ కరువు గురించి తీసారు. ఈ సినిమాలో బలరాజ్ సహానీ, ఆయన భార్య దమయంతి నటించారు. బీహార్‌లో షూటింగ్ జరుగుతుండగా దాహంతో మురికి గుంటలో నీళ్లు తాగడం వలన ఆమె ఆరోగ్యం పాడయి తరువాత బొంబాయిలో మరణించారు. పేరున్న నటి అయినా బస్సులోనే ప్రయాణించడం, నెల నెలా 'ఐ.పి.టి.ఎ.'కు విరాళం ఇవ్వడం చేసేవారు ఆమె. ఇప్టా కార్యాలయానికి కైఫి ఆజ్మి, భీష్మ సహానీ లాంటి ప్రముఖులు రిహార్సల్స్‌కు తరుచూ వచ్చేవారు. అప్పటికే ఇప్టాలో సభ్యుడిగా ఉన్న పరుచూరి హనుమంతరావుతో, భార్య చనిపోయిన బలరాజ్ సహానీ 'దమూ (దమయంతి) ని మర్చిపోవడానికి మీ మధ్యకు వస్తున్నాను' అన్న మనసు కదిలించే మాటలు లాంటి అనేక విషయాలు రచయిత మనతో పంచుకుంటారు.

ప్రజా నాట్యమండలి కార్యక్రమాలలో డా. రాజారావు, పరుచూరి హనుమంతరావుల పాత్ర, సుంకర, వాసిరెడ్డి, అనిసెట్టి, కె. ప్రత్యగాత్మ, ఆత్రేయల రచనల ఆధారంగా వచ్చిన మా భూమి, ముందడుగు, అపనింద, పరివర్తన, విశ్వశాంతి, ఎవడు దొంగ, శాంతి, జయ భేరి లాంటి నాటికలు, నాటకాలు లక్షలాది మంది ప్రజల్లో తీసుకొచ్చిన చైతన్యం గురించి, కేవలం ఒక సంవత్సరంలో మా భూమి నాటకాన్ని దాదాపు 125 దళాలు, 10 వేల ప్రదర్శనలివ్వడం లాంటి గొప్ప చారిత్రక అంశాలు మనకు తెలుస్తాయి.

స్త్రీలను వ్యాపార వస్తువుగా వాడుకోవడం ప్రపంచానికి నేర్పిన హాలీవుడ్ గురించి రాస్తూ 'ప్రేక్షకుల సెక్సు బలహీనతను సొమ్ము చేసుకోవడానికి తారల శారీరక సౌందర్యాన్ని వాపార వినిమయ వస్తువుగా మార్చింది. మే వెస్ట్ నుండి షరోన్ స్టోన్ వరకూ, గ్లోరియా స్వాన్సన్, గ్రేటా గార్బో, మెర్లిన్ మన్‌రో, మెర్లిన్ దే ట్రిచ్, జీన్ రస్సెల్, రీటా హేవర్త్, గినా లోలా బ్రిగిడా, సోఫియా లారెన్, రాఖేల్ వెల్ష్, జూలియా రాబర్ట్స్ లాంటి వారు నటనతో పాటు కవ్వించే అందాల ఆరబోతను ప్రదర్శించారని' చెబుతూ అమెరికాలో ఫోర్నోగ్రఫీ వ్యాపారం ఎలా విజృంభించిందో రచయిత తెలియజేస్తారు.

బాలల చిత్రాల నిర్మాణంలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందుతున్న దేశాల గురించి వివరిస్తూ 'ఇరాన్‌లో సగటున ఏడాదికి 70 - 80 చిత్రాలు వస్తున్నాయి. అందులో 5 - 8 వరకూ బాలల చిత్రాలు విధిగా ఉంటున్నాయి. అవి అంతర్జాతీయంగా ఇరాన్ గర్వపడేలా అవార్డులు సాధిస్తున్నాయి. మనకన్నా వెనుక బయలుదేరిన ఇరాన్, చైనా, ఇజ్రాయిల్ బాలల చిత్ర నిర్మాణంలో ముందంజలో ఉండడం గమనించి మనం ఆత్మ పరిశీలన చేసుకోవలసి ఉంది' అని విమర్శిస్తారు.

తొమ్మిదిన్నర సంవత్సరాలు సెన్సార్ బోర్డ్ సభ్యునిగా కొనసాగిన రచయిత ఎదుర్కొన్న సెన్సార్ సాధక బాధలెన్నిటినో వివరిస్తూ 'నీలి దర్పణ్' (నాటకం), మిల్ మజ్దూర్, రాత్ లాంటి సినిమాల నిషేధం గురించి వివరిస్తారు. దేశ విభజన కాలంలో జరిగిన మారణకాండపై భీష్మ సహానీ తీసిన 'తమస్' టెలీ సీరియల్‌పై ఎదుర్కొన్న సమస్యల గురించి వివరించారు.

సినిమా చరిత్రను వివరించిన ఇంత విలువైన గ్రంథంలో

అచ్చుతప్పులు విపరీతంగా ఉన్నాయి. ప్రపంచ సినిమాలో ముఖ్యమైన పేర్లు తారుమారయ్యాయి. పేజి 53లో జపాన్ సినిమా '24 ఐస్' బదులు 24 ఇయర్స్ అని ఉంది. పేజి 31లో రష్యా దర్శకుని పేరు 'డావ్ రె%బి%ంకో' బదులు డావ్ంకో అని ఉంది. పేజి 49లో ఆఫ్రికా సినిమా 'చారమ్ సారెట్' అని, పేజి 50లో 'బారమ్ సారెట్' అని ఉంది. పేజి 334లో దర్టీ పిక్చర్‌లో నటి 'విద్యా బాలన్' కి బదులు విమలా బాలన్ అని ఉంది. పేజి 135లో మా భూమి సినిమాకి మూలం కిషన్ చందర్ నవల 'జబ్ ఖేత్ జాగే' కు బదులు జబ్ ఖైతే జాగో అని ఉంది. 48 పేజిలో లాటిన్ అమెరికా సినిమా 'ద హవర్ ఆఫ్ ఫర్నేసెస్' కు బదులు ద అవర్ ఆఫ్ ఫర్నేస్ అని ఉంది.

భారత దేశంలో ప్రగతి శీల సినిమాలకు చిరునామా అయిన దర్శకులు శ్యామ్ బెనెగల్, గోవింద్ నిహలాని, కేతన్ మెహతా, మహేష్ భట్, హృషికేశ్ ముఖర్జీ, ఎమ్.ఎస్. సత్యూ, సయ్యద్ అక్తర్ మీర్జా, జాన్ అబ్రహం, అరవిందన్, షాజీ ఎన్ కరుణ్, జయరాజ్, బాలు మహేంద్ర,బుద్ధదేవ్ దాస్ గుప్తా, గౌతమ్ ఘోష్, అపర్ణా సేన్, రితుపర్నో ఘోష్, గుర్తింపు తెచ్చిన నటులు నశీరుద్దీన్ షా, ఓం పురి, అమల్ పాలేకర్, స్మితా పాటిల్, షబనా ఆజ్మీ, ఫరూఖ్ షేక్, ఉత్పల్ దత్, మమ్ముట్టి, మోహన్‌లాల్ లాంటి వారి గురించి ప్రస్తావన లేకపోవడం నిరాశను కలిగించింది. ఒక మిత్రుడు తెలుగు సినిమా నటులలో ప్రముఖుడైన గుమ్మడి గురించి లేకపోవడం గుర్తు చేసారు. బిమల్ రాయ్ 1944లో తీసిన ఉదయేర్ పథే గురించి రాసిన రచయిత దో భీగా జమీన్ గురించి వదిలేసారు. ప్రపంచ చిత్రాల పరిచయంలో ఇరాన్, టర్కీ లతో పాటు మత ఛాందస వాదానికి, అమెరికా సామ్రాజ్యవాద విధానానికి వ్యతిరేకంగా వచ్చిన పాకిస్తాన్ సినిమాల గురించి కూడా ఉంటే బాగుండేది. విదేశీ నటులు, దర్శకులు, మేధావుల అద్భుతమైన, విలువైన కొటేషన్లు చాలా ఇచ్చారు. కాని అవి చాలా చోట్ల వాక్యాలలో కలిసిపోవడం వల్ల ఏది కొటేషనో, ఏది రచయిత వ్యాఖ్యో తెలుసుకోవడానికి ఇబ్బంది కలిగిస్తుంది.

మంచి సినిమాల కోసం ఉద్యమిద్దాం. అని చెప్పిన రచయిత ఫిల్మ్ సొసైటీ ఉద్యమం గురించి ఏ మాత్రం రాయకపోవడం పెద్ద లోటు. 'రాను రాను ప్రేక్షకుని నియంతృత్వం పెరిగిపోతుంది', 'ఏ సినిమాలో ఏది ఎలా చూపించాలో నిర్దేశించే స్థాయికి, నియంత్రించే దశకు ప్రేక్షక ప్రభువు ఎదిగిపోయాడు' అని అన్యాయంగా ప్రేక్షకుల మీద నింద వేసిన రచయితే తరువాత పేజీలో 'ప్రేక్షకులు కోరుకున్నది ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్న వారు ప్రజల అభిరుచి స్థాయిని తక్కువ అంచనా వేయడంతో ప్రారంభించి వారి అభిప్రాయాలను భ్రష్టు పట్టిస్తారు' అన్న టి.ఎస్.ఎలియట్ కోట్ ఇచ్చారు. ఇందులో ప్రేక్షకులు కోరుకున్నది ఇవ్వడం అన్నది పెద్ద అబద్ధమని మనకు తెలుసు. ఇండోనేషియా అధ్యక్షుడు 1954లో హాలీవుడ్ సందర్శించిన సందర్భంలో 'మీరు మా దేశ ప్రజలలో విప్లవ జ్వాలలను రగిలించారు. మీ సినిమాలను చూసి, వాటిలో విలాస వంతమైన పొడవాటి కార్లు చూసి, ఆకాశాన్ని తాకుతున్న భవనాలను చూసి జీవితంలో తాము ఏమి కోల్పోతున్నామో తెలుసుకున్నారు. చిరకాలపు దోపిడీ మీద తిరగబడ్డారు. ఇప్పుడు మా జీవితం మా చేతుల్లో ఉంది. మెరుగ్గా ఉంది. మా విప్లవ వీరులకు స్ఫూర్తి ప్రధాతలు మీరు' అన్న అద్భుతమైన చారిత్రక సందర్భాన్ని కూడా రచయితే వివరించడం విశేషం. థియేటర్లో కూర్చున్న ప్రేక్షకులు గృహ నిర్బంధంలో ఉన్న కేప్టివ్ ఆడియన్స్ లాంటి వారని రచయితే చెప్పినప్పుడు ప్రేక్షకులు నియంతలు ఎలా అవుతారు?

'నా గుండె గుడిలో ఇద్దరు దేవతా మూర్తులు' అని రచయిత అక్కినేని నాగేశ్వరరావు, ఎన్టీ రామారావు ల పట్ల చూపిన వీరాభిమానం కొంచెం ఇబ్బంది అనిపించింది. వాళ్లు గొప్ప నటులుగా మనందరం అంగీకరించినా వాళ్లు వయసు ఉడిగిన తరువాత కూడా చర్మం ముడతలు పడిపోయినా హీరోలుగా జుగుప్సాకరంగా నటించి వారు సృష్టించుకున్న చరిత్రను వారే రద్దు చేసుకున్న సంగతి, కోట్లాది రూపాయల ఆస్తులు పోగుచేసుకున్న సంగతి మనకు తెలుసు. వీరి మార్గంలోనే నేటి ముసిలి యువ నటులు ప్రయాణిస్తున్నారు. కళాత్మక విషయాలలో 'సామ్రాట్ అశోక్' సినిమాలో ఎన్.టి.ఆర్‌కు, సత్యజిత్ రే కు, భావ సమైక్యత కనబడడం విశేషం అన్న రచయిత విశ్లేషణ అతిశయోక్తి అనిపిస్తుంది. ఎన్.టి.ఆర్ తుఫాన్ బాధితుల కోసం చేసిన విరాళాల సేకరణ గురించి 287, 376 పేజీలలో రెండుసార్లు ఇచ్చారు. అన్నపూర్ణా స్టుడియోలో వ్యాపార ఎత్తుగడగా, అక్కినేని పాత్రికేయుల సమావేశాల కోసం ప్రత్యేకంగా నిర్మించిన 'ఓ అద్దాల అందాల నెలవంక' లాంటి మందిరం గురించి, అది జర్నలిస్టుల పట్ల ఆయనకు గల అచంచల విశ్వాసానికీ, గౌరవానికీ సంకేతమనీ రాయడం ఆశ్చర్యం కలిగిస్తుంది. నాగార్జున, చిరంజీవి, కృష్ణ, మహేష్‌బాబు, బాలకృష్ణ, వెంకటేష్ లాంటి నటులు తమ పరిధిలో, పరిమిత వనరుల్లో ఉడతా భక్తిగా సామాజిక సేవ చేస్తున్నారనడం కూడా ఆశ్చర్యం కలిగిస్తుంది.

సినిమాల మీద కొ.కు. 378 వ్యాసాలు రాసారని రచయిత పేర్కొన్నారు. కాని ఆయన సినిమా వ్యాసాలు 2 సంపుటాలలో 342 వ్యాసాలు మాత్రమే ఉన్నాయి. మరి మిగిలిన 36 వ్యాసాలు ఎక్కడ ఉన్నాయో సేకరించాల్సిన బాధ్యత మనందరిమీదా ఉంది. భారత దేశపు సినిమాతో పాటు ప్రపంచ సినిమా చరిత్ర మీద ఇంత విలువైన సమాచారంతో వచ్చిన ఇటువంటి గొప్ప గ్రంథంపై అభిప్రాయం చెప్పగలిగిన శక్తి సామర్థ్యాలు నాకు లేవు. కాని తుమ్మల వేణుగోపాల రావు గారి లాంటి ప్రగతి శీల వ్యక్తుల ఆధ్వర్యంలో నడిచిన ఫిల్మ్ సొసైటీ ఉద్యమంలో ప్రేక్షకునిగా మొదలై తరువాతి కాలంలో కార్యకర్తగా సినిమాల మీద నాకున్న కొద్ది పాటి అనుభవంతో తెలిసిన విషయాలు మీతో పంచుకుంటున్నాను. ఇటువంటి సామాజిక చరిత్రను ప్రతిఫలించే సినిమాల విశ్లేషణ నేటి సామాజిక అవసరం. ఈ మార్గంలో కొ.కు , సి.వి. సుబ్బారావు, హరిపురుషోత్తమరావు, కాకరాల ఎన్.వేణుగోపాల్,షహీదా, వారాల ఆనంద్ లాంటివారు చేసిన కృషి మరింత చేయాల్సిఉంది. ఈ చారిత్రక కర్తవ్యాన్ని నిర్వహించగల శక్తి, సామర్థ్యాలు వున్నవారు చాలా మంది వున్నారు. కాని వారు రాయకపోవడం బాధ్యతారాహిత్యంగానే గుర్తించాలి. 1986లో సి.వి. సుబ్బారావు ఆధ్వర్యంలో వచ్చిన 'విభాత సంధ్యలు' తెలుగు సాహిత్యంలో సమాజ ప్రతిఫలం కోసం పరిశీలించినట్లే, సినిమాలలో కూడా సామాజిక చరిత్రను పరిశీలించవలసిన బాధ్యతను గుర్తించాల్సిన అవసరం ఎంతైనాఉంది. చివరిగా కొ.కు. మాటలతోనే ముగిస్తాను 'ప్రజలకు సన్నిహితంగా ఉండే కళల వెంట ఏదో ఒక ఉద్యమం ఉండి తీరాలి', 'దేశంలో తయారయ్యే ప్రతి చిత్రమూ సరైన విమర్శకూ, మేధావుల చర్చకు వచ్చిన నాడే సినిమా కళకు గౌరవ స్థానం లభిస్తుంది, అంతే గాని ఏ వినోదమూ లేని అనంత కోటి భారతీయ ప్రజలు కొత్త సినిమా కోసం క్యూలో నిలబడినంత మాత్రాన సినిమా కళలో మార్పు రాదు'.

పంజా విసిరిన కార్పొరేటు ఉగ్రవాదం

- విశ్వం

మనిషి తన అవసరాలను ప్రకృతితో సంఘర్షించడం ద్వారానే పొందగలుగుతాడు. ఎక్కడైతే ప్రకృతి వనరులకు, మానవ వనరులకు మధ్యన సమతుల్యత లోపిస్తుందో, అక్కడ అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. అలాంటప్పుడు ఉత్పత్తులను కొత్తకొత్త పద్ధతుల ద్వారానైనా పెంచుకోగలగాలి. లేదా జన సంఖ్య నియంత్రణకైనా తగిన చర్యలు తీసుకోవాలి. అలాగాక ప్రకృతి వనరులు పుష్కలంగా ఉండి, జనసంఖ్య అతి పలుచగా ఉన్న ప్రాంతాల్లో జనసంఖ్య ఇంకా ఇంకా తగ్గిపోతూ ఉండడం అంటే, అక్కడ సహజ పరిణామ క్రమమనేది కొరవడి, ఆ జాతుల అస్తిత్వం ప్రమాదంలో ఇరుక్కు పోయిందని భావించాలి.

జనసంఖ్య అనేది ఆ దేశం లేదా ఆ ప్రాంతం యొక్క ఆర్థిక రాజకీయ సామాజిక వ్యవస్థలను ప్రభావితం చేస్తుంది. చత్తీస్‌గఢ్‌లో మూడింట ఒక వంతు జనాభా ఆదివాసులదే. అవిభజిత బస్తర్, సర్‌గుజా, కోర్బా జిల్లా లాంటి అత్యధికంగా ఆదివాసులు నివసించే ప్రాంతాలలో రోజు రోజుకు జనాభా తగ్గిపోతూ ఉండడం వెనుక దేశవిదేశ కంపెనీల, మతాధిపతుల,రాజకీయ నాయకుల బృహత్ కుట్ర దాగి ఉందనేది ఎవరూ కాదనడానికి వీల్లేదు.

చత్తీస్‌గడ్‌లో 2011 జనాభా లెక్కల ప్రకారం గైర్ ఆదివాసులతో పోలిస్తే, ఆదివాసుల జనాభా నిష్పత్తి గతంలో కంటే 1.21 శాతం తక్కువగా నమోదయింది. 1991లో 35.77 శాతంగా ఉన్న ఆదివాసీ జనాభా 2001-2011 మధ్యలో 31.81 నుండి 30.6 శాతానికి పడిపోయింది. ప్రస్తుతం ఏడు జిల్లాలుగా విభజితమై ఉన్న బస్తర్‌లో కూడా ఇలాంటి గణాంకాలే ముందుకు వచ్చాయి. 1991లో బస్తర్‌లో ఆదివాసులు 68 శాతం ఉండగా, అది క్రమంగా 2001లో 67.1 శాతానికి 2011 నాటికి 66 శాతానికి పడిపోయింది. 2001 లో మొత్తం రాష్ట్ర జనాభా 2,08,33,803 ఉండగా, అందులో ఆదివాసులు 66 లక్షల 17 వేలు. 2011లో 2,55,40,196 మంది గల జనాభాలో ఆదివాసులు 78 లక్షల 22 వేలు. అలాగే 2001లో బస్తర్ జనాభా 26,77,097 కాగా అందులో ఆదివాసులు 17,96,450 మంది. 2011లో 30,90,828 మంది గల బస్తర్ జనాభాలో ఆదివాసుల సంఖ్య 20,69,155. బస్తర్‌లో ఆదివాసీ జనాభాలో స్వల్ప పెరుగుదల కనిపించినప్పటికీ, మిగతా వారితో పోలిస్తే వారి నిష్పత్తిలో తగ్గుదలతో పాటు, వృద్ధి రేటు కూడా విపరీతంగా పడిపోయింది. ఇది ఆందోళన కలిగించే విషయం. ఒకవైపు దేశంలో ఆదివాసుల జనాభా 23.75 శాతం వృద్ధితో దేశ జనాభాలో 8.21 శాతం నుండి 8.62 శాతానికి పెరిగితే, చత్తీస్‌గడ్‌లో మరీ ముఖ్యంగా బస్తర్ పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉంది. 2001-11 లో రాష్ట్ర జనాభా వృద్ధి 22.59 శాతంగా నమోదయింది. ఈ పెరుగుదలలో గైర్ ఆదివాసులు 24.92 శాతం ఉండగా, ఆదివాసుల వృద్ధి మాత్రం 18.22 శాతానికే పరిమితమయింది. ఈ ఒక్క దశాబ్ద కాలంలోనే రాయపూర్‌లో 19.20 శాతం నుండి 34.65 శాతానికి, బిలాస్‌పూర్‌లో 17.91 నుండి 33.21 శాతానికి జానాభా పెరిగితే, అదే బస్తర్ సంబాగ్‌లోని అన్ని ఆదివాసీ జిల్లాలో మాత్రం కిందికి దిగజారడం కనిపిస్తుంది. నారాయణపూర్‌లో 2001లో 23.42 శాతం నమోదయిన జనాభా వృద్ధి 2011 వచ్చే నాటికి 19.49 శాతానికి, బస్తర్ జిల్లాలో 18.18 నుండి 17.83కు, కాంకేర్‌లో 18.68 నుండి 15.01 కి, దంతేవాడ లో 14.09 నుండి 8.01కి, బీజాపూర్‌లో 19.30 నుండి 8.73 శాతానికి జనాభా వృద్ధిరేటు ఘోరంగా పడిపోయింది. రాష్ట్రంలోని మిగతా ఆదివాసీ జిల్లాలలో కూడా పరిస్థితి ఏమాత్రం మెరుగ్గా లేదు. జనాభా వృద్ధి అంటే నిశ్శంకోచంగా మానవవనరుల అభివృద్ధే. పెరగుతున్న జనాభాకు విద్యా నైపుణ్యాలను, ఉపాధి అవకాశాలను విరివిగా కల్పిస్తే, మానవ వనరుల అభివృద్ధితో పాటు సమాజాభివృద్ధి కూడా వేగవంతమవుతుంది. కానీ, తగ్గిపోతున్న జనాభాతో బస్తర్ పరిస్థితి మరోలా ఉంది.

బస్తర్‌లో జనాభా వృద్ధిరేటు పడిపోవడానికి గాను, మావోయిస్టుల-పోలీసుల నడుమ అమాయకులైన ఆదివాసులు హింస, ప్రతిహింసలతో నలిగిపోవడమే ప్రధాన కారణాలంటూ కార్పొరేటు వర్గాలకు వత్తాసు పలికే మీడియాలు పెద్ద ఎత్తున ప్రచారాన్ని లంఘించుకున్నాయి. కార్పొరేటు కుటుంబాలకు సేవకులుగా పనిచేసే విశ్లేషకులతో పేపర్లలో పెద్ద ఎత్తున సమీక్షలను రాయిస్తున్నాయి. ఆదివాసీ మహాసభ నేత మనిషి కుంజాం మొదలు స్వాభిమాన్ మంచ్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి అయిన అరవింద్ నేతాం వరకు పత్రికలలో ఇటువంటి ప్రకటనలనే గుప్పిస్తున్నారు. ఎటుగూడి ప్రచార సాధనాలు తమ గుప్పిట్లోనే ఉన్నాయి గదా అని, తమకు తోచిందల్లా రాసి పడేస్తే ప్రజలు గుడ్డిగా నమ్మేస్తారనీ ఇండియా టుడే, దైనిక్ భాస్కర్ లాంటి కార్పొరేటు ప్రింటు మీడియాలు, బస్తర్‌లో ఆదివాసుల జనాభా తగ్గుదలకు మావోయిస్టులనే దోషులుగా నిలబెట్టేందుకు నానా తంటాలు పడుతున్నాయి. ఇదంతా ఉత్తుత్తి అబద్ధపు ప్రచారం మాత్రమే. జల్ జంగల్ జమీన్ కోసం, అడివిపై సర్వాధికారాల కోసం గత ముప్పయి సంవత్సరాలుగా పోరాడుతున్న బస్తర్ ఆదివాసులకు మావోయిస్టు పార్టీ అండగా నిలిచిన మాట వాస్తవమే. వారికండగా ఉండడమే గాదు, వారిని సంఘాలలో సంఘటిత పరిచి, చైతన్యవంతులను చేసింది. అడివి భూములను నరికి సాగు చేసుకుంటూ, జనతన సర్కార్లను ఏర్పాటు చేసుకుని తమదైన శైలిలో ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా పురోగమించడం బహుళజాతి, కార్పొరేటు సంస్థల కంటకాగే రమణ్‌సింగ్ ప్రభుత్వానికి మింగుడు పడడంలేదు. పిచ్చెత్తిన రమణ్‌సింగ్ ప్రభుత్వం దిక్కుతోచని స్థితిలో ప్రతి దాడికి దిగి, అభివృద్ధికి మావోయిస్టులు పెద్ద అడ్డంకిగా తయారయ్యారని, వారిని తుడిచి పారేసే పేరుతో అమాయక ఆదివాసులను అడవి నుండి వెళ్ళగొట్టేందుకు సల్వాజుడుం అనే కార్పొరేటు ప్రాయోజిత యుద్ధాన్ని రుద్దింది.

చత్తీస్‌గడ్ సర్వసంపదలతో కూడిన రాష్ట్రం. రాష్ట్రంలో 44 శాతం

ఛత్తీస్‌గడ్‌లో జనసంఖ్య - భౌగోళిక విస్తీర్ణం

	జిల్లాలు/రాష్ట్రం	విస్తీర్ణం చ.కి.మీ	అడవి శాతం	జనసంఖ్య (2011)	జనాభావృద్ధి (%) 2001-11	1991-01	ఆదివాసులు (శాతంలో)	జనసాంద్రత చ.కి.మీ
1.	బస్తర్	6638	57	8,34,873	18.83	19.98	65.9	125
2.	కొండగావ్	3688	62	5,78,326	16.82	18.45	72.3	156
3.	దంతేవాడ	4065	55.5	2,83,798	8.01	19.87	77.0	69
4.	సుక్మా	5000	52.5	2,49,840	8.11	19.81	76.1	50
5.	బీజాపూర్	6555	72.1	2,55,180	8.76	19.30	80.0	38
6.	కాంకేర్	6474	53.8	7,48,941	15.1	17.48	55.5	116
7.	నారాయణపూర్	6640	78.2	1,39,820	19.49	23.42	77.4	21
8.	కోరియా	5978	67	6,59,039	12.40	17.09	69.0	110
9.	సర్‌గుజా	16034	59	23,61,329	19.32	23.87	70.1	147
10.	రాయపూర్	13455	30.3	40,62,160	34.65	19.29	24.4	301
11.	బిలాస్‌పూర్	8569	40.2	26,62,077	33.21	17.19	31.3	310
12.	జాంజ్‌గిర్-చాంపా	4467	12.8	16,20,632	28.55	18.55	22.8	362
13.	ఛత్తీస్‌గడ్	136045	44	2,55,40,196	22.59	18.27	30.6	189

గమనిక - ఛత్తీస్‌గడ్‌లో మొత్తం 27 జిల్లాలున్నాయి. నూతనంగా ఏర్పడిన గరియాబాద్, బలోదా బజార్‌ల గణాంకాలు రాయపూర్ జిల్లాలో, బలరాంపూర్, సూరజ్‌పూర్‌ల గణాంకాలు సర్‌గుజా జిల్లాలో కలిసున్నాయి.

అడవి ఉంది. దేశం మొత్తం మీద జరిగే ఖనిజ ఉత్పత్తిలో రాష్ట్రం వాటా 17 శాతం. మొత్తం బొగ్గు బండారంలోని 17.24 శాతం ఛత్తీస్‌గడ్‌లోనే ఉంది. మొత్తం బొగ్గు ఉత్పత్తిలో 21.34 శాతం ఛత్తీస్‌గడ్‌లోనే ఉత్పత్తవుతున్నది. సరిగుజాలో దేశంలోనే అతి పెద్దదయిన బొగ్గు నిల్వలున్నాయి. ఇనుప ఖనిజపు బండారం 18.76 శాతం రాష్ట్రంలోనే ఉంది. ఛత్తీస్‌గడ్ ఇప్పటికే 14.02 శాతం ఇనుప ఖనిజాన్ని ఉత్పత్తి చేస్తున్నది. బస్తర్‌లో లభించే ఇనుప ఖనిజం 60-70 శాతం గల హెమెటాయిట్‌కు చెందినది. బైలదిల్లా మొదలు రావ్‌గాట్ వరకు గల విశాలమైన క్షేత్రంలో ఇనుప ఖనిజపు బండారముంది. మాడ్ ప్రాంతంలోని అముదాయిమెట్ట, తులార్ మెట్టల్లో ఇనుప ఖనిజపు బండారాలున్నాయి. టిన్ ఖనిజపు బండారం 37.69 శాతం రాష్ట్రంలోనే ఉంది. ఇవేగాక దండకారణ్యంలో దక్షిణ తూర్పున గల శబరినది దగ్గర్లోని కెర్లాపాల్‌లో గ్రాఫైట్ బీజాపూర్ జిల్లాలోని బోపాలపట్నం, కిరియపాల్, చిక్కుడుపల్లి, సామ్‌సెట్టి, మాప్‌లాల్లో కోరండం, జగ్దల్‌పూర్-సుక్మాం దారిలో గల దర్భఘాటి, గొల్లపల్లిలో అభ్రకం, బస్తర్ జిల్లాలోని తోకపాల్‌లో వజ్రపు నిల్వలు, దంతేవాడలోని కెరియాపాల్, సమరతి, చింతగుప్పలో అల్యూమినియం సిలికట్‌గా పనిచేసే సిలిమెనైట్ ఖనిజం, బస్తర్ లోని కొలబా నది ఒడ్డున ఇంకా తాపోదరే అనే గ్రామం దగ్గర డోలమైట్‌తో పాటు బాక్సైట్, సున్నపురాయి ఉన్నాయి. కొండగావ్ జిల్లాలోని పావ్‌రాస్-కచోరా ప్రాంతంలో తక్కువ రకానికి చెందిన సుమారు 5 మి. టన్నుల ఇనుప ఖనిజ బండారమున్నట్టు తేలింది. కాంకేర్-కెసకల్ క్షేత్రంలో 28 లక్షల ఘనపు మీటర్ల గ్రానైట్ ఖనిజం, గరియాబాంద్ జిల్లాలోని ఛురా-పరసూలి ప్రాంతాలలో మాంగనీసు ఖనిజపు నిల్వలున్నట్టు సర్వేలో వెల్లడయింది. సర్‌గుజా డాండ్ కెసరాలో 4 లక్షల టన్నులు, కబీర్‌ధామ్ జిల్లాలోని దరాయిలో 3.5 లక్షల టన్నుల బాక్సైట్ బండారముంది. రాష్ట్రంలో ఇంకా బంగారం, ఎలక్జాండ్రయిట్, ఫ్లూరోయిట్ ఖనిజాలు కూడా ఉన్నాయి. 67 నుండి 58 శాతం వరకు గల బస్తర్ అడవిలోని అపార ఖనిజ సంపదలు ఉన్న ఈ సువిశాలమైన ప్రాంతమంతటా ఆదివాసీ సమూహాలు నివాసముండడంతో దేశ, విదేశీ కంపెనీల ఖనిజ దోపడీకి పెద్ద అటంకం ఏర్పడింది. ఆదివాసులను అక్కడి నుండి వెళ్ళగొట్టకుండా అక్కడి ఖనిజ సంపదలను దోపిడి చేయడం, వాటిని తరలించుకు పోవడం వాటికి సాధ్యం గావడంలేదు.

అందుకే, ఇంతటి అటవీ, ఖనిజ సంపదలున్న బస్తర్‌లోని ప్రకృతి వనరులపై కార్పొరేట్, బహుళ జాతి సంస్థల దేగ కన్ను పడింది. టాటా, ఎస్సార్, సీకో, వేదాంత లాంటి కంపెనీలు, మహేంద్ర కర్మ లాంటి సాయుధ గూండాలతో చేతులు కలిపిన రమణ్‌సింగ్ ప్రభుత్వం, సల్వాజుడుమనే పంజాను విసిరి తెల్ల బీభత్సాన్ని సృష్టించింది. 2005 నుండి సర్వం విధ్వంసం అనే సైనిక అభియాన్ కొనసాగుతున్నది. వేలాది సాయుధ బలగాలతో సైనిక వేట మొదలయ్యింది. బస్తర్ నిర్బంధ సైనిక శిబిరంగా మారిపోయింది. ప్రభుత్వ, ప్రైవేటు గూండాలు చేసిన పాశవికమైన హత్యలకు లెక్కేలేదు. ఈ గూండాలు అమాయక ప్రజలను, వారి నాయకులను హత్యలు గావించి, చనిపోయిన శవాల నుండి వారి గుండెకాయలను వేరుచేసి, చేతబూని చిందులేసారు. గర్భవతుల దగ్గర నుండి బాలింతల వరకు వీరి అత్యాచారాలకు గురికాని మహిళలు లేకుండాపోయారు. తల్లి,పిల్ల అనే భేదం లేకుండా చెరిచారు. ఒక తరం యువతులు మొత్తంగానే వీరి రాక్షసకాండ నుండి తప్పించుకోవడానికి గానూ, ఊర్లు విడిచి పారిపోవడమో, లేక అడవుల్లోకి అదృశ్యం కావడమో జరిగింది. ముందే ప్లాను ప్రకారం ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాహత్ శిబిరాలలో, అడవులలో వేలాది మంది ఊర్లు, ఇల్లు విడిచి తల దాచుకోవాల్సి వచ్చింది. సల్వాజుడుం సృష్టించిన భయోత్పాతానికి భయపడి లక్షల సంఖ్య ఆదదివాసులు ఇతర ప్రాంతాలకో, రాష్ట్రాలకో పారిపోక తప్పలేదు. 650 గ్రామాలలో ఇళ్ళు

కాలి బూడిదయ్యాయి. ప్రైవేటు గూండాలు, కార్పొరేటు సమూహం, ప్రభుత్వం, ప్రణాళికాబద్ధంగా నడిపిన కార్పొరేటు యుద్ధపు (సల్వాజుడుం) తెల్ల బీభత్సంతో ఊర్లకు ఊర్లు ఖాళీ చేయించడంలో ఎంతోకొంత సఫలమయ్యాయనే చెప్పుకోవాలి. నేటికీ యాభైవేల మందికి పైగా తమ ఊరు, గూడు విడిచి ఆంధ్ర లోనే శరణార్థులుగా తలదాచుకుంటున్నారు. ఇంతటి ఉద్రిక్త వాతావరణంలో అడవుల్లో, రాహత్ శిబిరాల్లో తలదాచు కుంటున్న దంపతులు శారీరక సంబంధాలను కొనసాగించడం, పిల్లలను కనడం అసాధ్యమైన విషయం. జనగణన జరిపే అధికారులే బీజాపూర్‌లో 30, దంతేవాడలోని 70 గ్రామాలలో జనగణన సేకరణకై వెళ్ళలేకపోయామని తెలిపారంటే, ఇప్పుడా గ్రామాలు ఉన్నాయా! లేవా? అనేది ప్రశ్నార్థకమైన విషయం. ఈ ఏకపక్షపు కార్పొరేటు ఉగ్రవాద యుద్ధ ఘోరాలను మరుగుపరుస్తూ, బస్తర్ ఆదివాసుల జనాభా తరుగుదలకు మావోయిస్టులనే దోషులుగా నిలబెట్టేందుకు పాలకవర్గాలు కుటిల పన్నాగాలను పన్నాయి. ఒకవేళ అదే నిజమయితే మావోయిస్టుల ప్రభావం అంతగా లేని కోరియా జిల్లాలో జనాభా వృద్ధి 17.09 నుండి 12.40 శాతానికి ఎందుకు పడిపోయినట్టు? ఆదివాసీ జిల్లాల్లో జనాభా వృద్ధి తగ్గిపోవడానికి సల్వాజుడుం లాంటి కార్పొరేటు ఉగ్రవాద ఘాతుకాలే కారణాలనే విషయం ఎవరూ కాదనలేరు. మావోయిస్టులను దోషులుగా చిత్రించేందుకు ప్రభుత్వం, మీడియాలు చేస్తున్నదంతా అసత్యపు ప్రచారం మాత్రమే. దొంగే, 'దొంగ,దొంగ' అంటూ అరచినట్టుంది. నిజానికి నిరాయుధులైన నిరాశ్రయులైన బస్తర్ ఆదివాసులకు మావోయిస్టు పార్టీయే అండగా లేకుండా ఉంటే, నేడు బస్తర్‌లో శ్మశాన శాంతి నెలకొనబడేదేమో. తమ మాతృగడ్డ నుండి తరిమికొట్టబడిన అమెరికాలోని రెడ్ ఇండియన్లల మారిపోయేది వీరి పరిస్థతి. మావోయిస్టు పార్టీ అండతో సుసంఘటితమైన ఆదివాసీ రైతాంగం, ఫాసిస్టు సల్వాజుడుం ను మట్టి కరిపించారు. రమణ్‌సింగ్ చెబుతున్నట్టుగా బస్తర్‌లో జరుగుతున్నది అభివృద్ధి కానేకాదు. అది విధ్వంసకాండయే. అదే ఆదివాసీ జన సమూహపు నిర్మూలనకు కారణమైంది. సల్వాజుడుం అనే కార్పొరేటు ఉగ్రవాదం కేవలం ఆదివాసులనే బలిగొనలేదు. అది అన్ని వర్గాల ప్రజలను ప్రభావితం చేసింది. సాధారణ వ్యాపారస్తులు, గురూజీలు, పత్రకారులను సైతం ఎవరిని అది విడిచిపెట్టలేదు. ఇందుకు గానూ ఈ కింది గణాంకాలు బాగా ఉపయోగపడతాయి. మొత్తం రాష్ట్రంలో జనాభా వృద్ధి సగటున 22.59 శాతం ఉంటే, బస్తర్ జనాభా వృద్ధి రేటు 15.45 శాతం మాత్రమే. అందులో ఆదివాసులు 15.2 శాతం కాగా, గైర్ ఆదివాసుల వృద్ధి 16 శాతం. అదే బీజాపూర్‌లో ఆదివాసుల, గైరు ఆదివాసుల మొత్తం జనాభా వృద్ధి 2011లో కేవలం 8.76 శాతం మాత్రమే. దంతేవాడ జిల్లాలో దశాబ్ద కాలంలో జనాభా 8 శాతం కూడా పెరగలేదు.

సల్వాజుడుం సృష్టించిన విధ్వంసంతో పాటు పాలకుల చేత రూపొందించబడిన బృహత్ పథకాలెన్నో, బస్తర్‌లోని ఆదివాసీ జిల్లాల్లో జనాభా నియంత్రణకై అమలు పరచబడుతున్నాయి. తరతరాల నుండి అడవిపై సర్వాధికారాలను అనుభవిస్తున్న ఆదివాసులను మూలవాసులు కాదని ప్రకటించడం, లేదా వారి జనసంఖ్యను నియంత్రించడం, అది కాదనుకుంటే వాళ్ళ భూముల నుండి వారిని తరిమేయడం లేదా పూర్తిగా నిర్మూలించడం అనే త్రిదండ సూత్రాన్ని రమణ్‌సింగ్ ప్రభుత్వం అమలు జరుపుతున్నది. బస్తర్‌లో ఆదివాసులను మత మార్పిడి గావించే కుట్ర పెద్ద ఎత్తున సాగుతున్నది. మూడోసారి అధికారాన్ని చేజిక్కించుకున్న మతోన్మాద బిజెపి ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసింది. మాడ్‌లో మాడియా ఆదివాసీ పిల్లలకు చదువులు నేర్పే పేరుతో రామకృష్ణ మిషన్ మాడ్ గుట్టలపై తిష్ట వేసి, పిల్లలను హిందూమతంలోకి మారేలా ప్రోత్సహిస్తున్నది. కుతుల్, ఇర్కుబట్టి, కచ్చపాల్, ఆకబేడల్లో స్కూల్ పిల్లల కోసం ఆశ్రమాలు నెలకొల్పి, ఆ ఆశ్రమాలలో భోజనం చేసేముందు సరస్వతీ ప్రార్థన, గణపతి ప్రార్థనలు చేయిస్తూ పిల్లల మెదళ్ళలోకి హిందూ మతాన్ని చొప్పిస్తున్నది. కొండగావ్ జిల్లాలోని భానుపురిలో ఆశ్రమాన్ని నెలకొల్పిన బీహారీబాబా ఆదివాసులను మతమార్పిడులు గావించేందుకు పెద్ద క్యాంపెయిన్ నడిపాడు. భక్తి ఉద్యమం పేరుతో కొన్ని ఆదివాసీ గ్రామాల్లో మతమార్పిడులను గావించి, మిగిలిన ఆదివాసులను అంటరాని వాళ్ళుగా, గొడ్డు మాంసం తినేవారిగా విభజించి వారి మధ్య వారికే కలహాలను సృష్టించాడు. ఆదివాసుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న క్రైస్తవ మిషనరీలు గత యాభై ఏళ్ళుగా ఆదివాసులను మత మార్పిడులు చేస్తూ తమ కార్యకలాపాలను చాపకింద నీరులా కొనసాగిస్తున్నాయి. మతం మార్చుకున్న వారిని రమణ్‌సింగ్ ప్రభుత్వం ఆదివాసులుగా గుర్తించడం లేదు. ఆదిమజాతి అనుసంధాన్ - శిక్షణా సంస్థ రాయపూర్ ద్వారా ప్రచురించిన పుస్తకంలో (రచయిత-కె.వైష్ణవ్) ఎవరయితే హిందూ వర్ణధర్మానికి బయట ఉన్నారో, వారినే ఆదివాసులుగా పేర్కొంది. అంటే మతం మార్చుకున్న ఆదివాసులను హిందువులుగా ప్రకటించడం, క్రైస్తవ మతం తీసుకున్న వారిని మత మైనారిటీలుగా గుర్తించి, వారిని ఆదివాసుల జాబితా నుండి తొలగించి సామాన్య పౌరుల కేటగిరీలో ఉంచడం జరుగుతున్నది. చత్తీస్‌గడ్‌లో మూలవాసులైన ఆదివాసులను ఇప్పుడు వనవాసులుగా మారుస్తూ కొత్త రెవిన్యూ రికార్డులు తయారు చేయబడుతున్నాయి. అంతేగాదు, అడవిపైనే పూర్తిగా ఆధారపడి జీవించడం, అడవిలో భాగమై అడవిని కాపాడుతూ రావడమో తెలుసు తప్ప, ఏ కాగితపు ముక్కల రికార్డులనెరుగని మూలవాసులు ఇప్పుడు ప్రభుత్వం దగ్గర గుర్తింపు పత్రాల కోసం, తమకు తాముగా, తాము ఆదివాసులమేననే గుర్తింపును నిరూపించుకోవాల్సి వస్తున్నది. ఈ ప్రక్రియ ఇలాగే కొనసాగితే అత్యంత వెనుకబడ్డ తెగలుగా భారత ప్రభుత్వంచే గుర్తింపబడ్డ మాడియా, కమార్, కోర్బాలాంటి ఆదిమ తెగలు అదృశ్యం కావడానికి సమయమెంతో దూరం లేదు.

బస్తర్‌లో మొదటికే జనాభా అతి పలుచగా ఉంది. ఎనిమియా, కుపోషణ్, ప్రీమెచ్చురిటీ లాంటి సమస్యలతో మాతా శిశు మరణాల సంఖ్య బాగానే ఉంది. ప్రభుత్వాలు వీటన్నింటికీ పేదరికం, జనాభా పెరుగుదల లాంటి కారణాలను చూపుతున్నాయి. వైద్య సౌకర్యాలకు ఏ మాత్రం నోచుకోని ఆదివాసీ గ్రామీణ కుటుంబాల్లో పుట్టిన అయిదారుగురు పిల్లల్లో చివరకు ఇద్దరు,ముగ్గురు మిగలడం కూడా కష్టమే. ప్రసవ సమయంలో సరైన వైద్య సేవలు దొరకక శిశు మరణాలు సంభవిస్తున్నాయి. మొదటి ఒకటి , రెండు కాన్పుల్లో గర్భం నిలువకపోవడమో లేక పుట్టగానే శిశువు మరణించడమో ఆదివాసీ కుటుంబాల్లో సాధారణమయిన విషయం. గత సంవత్సరం బస్తర్ ప్రభుత్వాసుపత్రులలో ప్రసవ సమయంలోనే 1467 మంది శిశువులు ప్రాణాలు విడిచారు. అయిదేళ్ళ లోపు పిల్లలు కూడా 412 గురు చనిపోయారు. ఆసుపత్రులలో మరణాలే ఇలా ఉంటే, ఏ మాత్రం వైద్య సదుపాయాలు లేని గ్రామాల్లో మరణాల సంఖ్యను లెక్కించలేం.

పరిస్థితి ఇంత ఘోరంగా ఉంటే ప్రభుత్వమేమో ఈ మరణాలకు జనాభా, పేదరికం కారణాలంటూ బుకాయిస్తున్నది. రాష్ట్ర కుటుంబ నియంత్రణ, పర్యవేక్షక అధికారి అయిన సచీంద్ర చౌదరీ అనే అధికారి 2013 నవంబరు 13న నారాయణపూర్‌లో ఓ కుటుంబ నియంత్రణ చేతనా శిబిరాన్ని ప్రారంభిస్తూ, జనాభా పెరుగుదలనేది, దేశాన్ని అనేక సమస్యలతో పట్టి పీడిస్తున్నదని, దేశాన్ని దారిద్ర్యంలోకి నెట్టివేస్తున్నదని, జనాభా రోజు రోజుకూ ఇలాగే పెరుగుతూ ఉంటే, రేపు రేపు మనుషులకు తిండి దొరకడం కష్టమయి పోతుందని, ఆఖరికి చనిపోయిన మనిషిని పూడ్చడానికి కూడా స్థలం దొరకడం కష్టమైపోతుందని, దీని నివారణకు బస్తర్‌లోని ప్రజలంతా ముందు జాగరుకతతో ఒకరికి మించి సంతానాన్ని కనకుండా ఉండడానికి, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకోవాలని ఆదివాసులకు హితబోధ చేశాడు. దేశంలో దారిద్ర్యం పెరిగిపోవడానికి సామ్రాజ్యవాదుల, దళారీల, భూస్వాముల నిలువుదోపిడియే కారణమనే విషయాన్ని ఈ ప్రబుద్ధుడు ఇష్టపూర్వకంగానే మరుగుపరిచి అబద్ధపు ప్రచారానికి దిగాడు. ఈ అధికారి మూర్ఖత్వం శిఖరాగ్రాన్ని చేరి ఉంటుంది. జన సాంద్రత అధికంగా గల ప్రాంతాలలో ఈ ప్రవచనాలు పనికి వస్తాయేమో గాని, అతి తక్కువ జనాభా గల బహుళ ఆదివాసీ ప్రాంతాలలో వినవస్తున్న ఈ ప్రవచనాల వెనుక పాలకుల కుట్ర దాగి ఉందనేది స్పష్టం. అరుణాచల్ ప్రదేశ్, బస్తర్, నారాయణపూర్, బీజాపూర్ లాంటి ప్రాంతాల్లో ఇటువంటి హితబోధలు చేయడం ఘోరమైన నేరంగానే పరిగణించాలి. దేశంలో జన సాంద్రత సగటున చదరపు కిలో మీటరుకి 382 మందయితే ఛత్తీస్‌గఢ్‌లో 189 మంది, బస్తర్‌లో జగ్దల్‌పూర్ నగర జనాభాను కూడా కలుపుకుంటే 125 మంది నివసిస్తున్నారు. ఇక దంతేవాడలో చ.కి.మీ 69 మంది, బీజాపూర్‌లో 38, నారాయణపూర్‌లో 21 మంది నివసిస్తున్నారు. నారాయణపూర్ జిల్లాలోని మాడ్ ప్రాంతం లోనయితే ఒక చదరపు కిలోమీటరుకు ఆరుగురికి మించిలేరు. జనాభా ఇంత పలుచనయినా కూడా రమణ్‌సింగ్ ప్రభుత్వం గత ఏడాది బీజాపూర్‌కు 2189, బస్తర్ జిల్లాకు 4200, నారాయణపూర్‌కు 1050 చొప్పున కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల టార్గెట్లను నిర్ణయించి, కేంద్ర ప్రభుత్వపు నిధులతో, దళారీల ప్రోత్సాహకాలతో అమాయకులైన ఆదివాసులను లోబరిచి బలవంతంగా నస్‌బందీ ఆపరేషన్లు చేస్తున్నది. పలుచనైన జనాభా గల ప్రాంతాలలో జనాభా నియంత్రణ కోసం టార్గెట్లను నిర్ణయించి వాటిని నిర్బంధంగా అమలు జరపడం పాశవికమైన చర్యగానే భావించి దాన్ని అందరూ ఖండించాలి.

నేడే ఒక్క బస్తరే కాదు, దేశ వ్యాప్తంగా ఉన్న ఆదివాసుల పరిస్థితి ఇదే. వీరిపై దేశ విదేశీ కంపెనీల, ప్రభుత్వాల, మతాధిపతుల ముప్పేట దాడి కొనసాగుతున్నది. ప్రకృతి వనరులతో గూడిన పచ్చని అడవిపై, భూ లోపలి పొరల్లోని ఖనిజ సంపదలపై సామ్రాజ్యవాదుల, కార్పొరేటు సంస్థల కన్ను పడింది. ప్రకృతి వనరులు విస్తారంగా ఉన్న ప్రాంతాల్లో నివాసముంటున్న ఆదివాసులు నేడు దేశ విదేశీ కంపెనీల నిలువుదోపిడీకి గురవుతున్నారు. భూములు కోల్పోయిన ఆదివాసుల నష్టపరిహారాల కోసం రాజకీయ నాయకుల, అధికారుల కాళ్ళావేళ్ళా పడాల్సి వస్తున్నది. వారి మొర వినే నాథుడే లేడు. తాత ముత్తాతల కాలం నుండి మూలవాసులుగా ఉండి కూడా, భూముల నుండి బేదఖల్‌కు గురికావల్సి వస్తున్నది. అధికారంలోకి వచ్చిన అన్ని పార్టీలు కూడా ఆదివాసుల నుండి భూములు సేకరించడం సరైనదిగానే పేర్కొంటూ, నిర్బంధంగా భూములను లాక్కొంటున్నాయి. గత రెండు దశాబ్దాలుగా దేశం మొత్తం మీద ఆరు కోట్ల మంది నిర్వాసితులయ్యి, 2.5 కోట్ల హెక్టార్ల వారి భూములు లాక్కోబడ్డాయి. ఇందులో 70 లక్షల హెక్టార్ల అడవి భూమి కూడా ఉంది. భూములు కోల్పోయిన మొత్తం జనాభాలో 50 శాతం మేర ఆదివాసులున్నారు. అన్నింటి కంటే ఎక్కువగా వన్య ప్రాణుల సంరక్షణ పేరిట ఆదివాసుల బేదఖల్ కొనసాగుతున్నది. దేశం మొత్తంగా ఈ పేరుతో ఇప్పటికే 45 లక్షల మంది ఆదివాసులు నిర్వాసితులైనారు. గనుల తవ్వకాలలో 13 లక్షల మంది నిర్వాసితులైతే అందులో 52.2 శాతం ఆదివాసులు భూములు కోల్పోయారు. చిన్న,పెద్ద నీటి ప్రాజెక్టుల పేరిట నిర్వాసితులైన దాంట్లో 62.2 లక్షల మంది ఆదివాసులున్నారు. మొత్తంలో వీరి శాతం 38.5 ఉంది. పెద్ద పెద్ద కంపెనీలు రోడ్లు, రైలు మార్గాలు వంటి వాటిలో 1.3 లక్షల మంది ఆదివాసులు నిర్వాసితులవ్వగా, ఆదివాసులు 25 శాతంగా ఉన్నారు. అది ప్రభుత్వ ప్రాజెక్టా లేక ప్రైవేటు ప్రాజెక్టా అనే దాంతో సంబంధం లేకుండా ఏ ప్రాజెక్టుకయినా ముందుగా బలి కావల్సింది ఆదివాసులే. భూసేకరణలో ఎక్కువ కెక్కువగా ఆదివాసులే భూములు కోల్పోయి నిర్వాసితులు కావల్సివస్తున్నది. తాజాగా రమణ్‌సింగ్ ప్రభుత్వం ముందర, పెట్టుబడిదార్లతో కుదుర్చుకున్న 1,92,000 కోట్ల రూపాయల విలువగల 121 ఎంఓయు లున్నాయి. వీటన్నింటినీ అమలు చేయడానికి ప్రభుత్వం మరెంతమంది ఆదివాసులను బలిగొంటుందో చూడాలి.

దేశంలో ఇంత పెద్ద ఎత్తున విస్థాపనలు జరుగుతుంటే మిన్నకుండిన మీడియా వర్గాలు బస్తర్‌లో మాత్రం జనాభా తగ్గుదలకు మావోయిస్టులను టార్గెట్ చేస్తూ నిందిస్తున్నాయి. నిజానికి, బస్తర్‌లో మావోయిస్టుల ఉనికియే అసలు లేకుండా ఉంటే పరిస్థితి ఇంతకంటే ఘోరంగా ఉండేది. మావోయిస్టుల అండతో బస్తర్ ఆదివాసీ రైతాంగం సంఘటితంగా ఇచ్చిన ప్రతిఘటనతో చివరకు సల్వాజుడుం తోక ముడుచుకోక తప్పలేదు. ప్రతిఘటనతో ఊరట లభించడంతో చాలా వరకు పలాయనాలు ఆగిపోయాయి. మావోయిస్టుల పిలుపుతో రాహత్ శిబిరాలలో తలదాచుకున్న అమాయకులు చాలామంది తిరిగి తమ తమ గూళ్ళకు చేరుకోగల్గారు. వాస్తవమేమిటంటే, దేశంలోని కోట్లాది రైతాంగం, ఆదివాసులు నిర్వాసితులయ్యారంటే లేదా నేడు అవుతున్నారంటే ఆ సంక్షోభిత ప్రాంతాలలో మావోయిస్టు శక్తులు ఉనికిలో లేకపోవడమే ఒక కారణంగా చెప్పుకోవాలి.

నేటి ఆధునిక మానవుడి జీవన విధానం- అతడి అవసరాలు తీరేందుకుగానూ ప్రకృతిపై తీవ్ర వత్తిడిని పెంచిన మాట వాస్తవం. అయినా కూడా ఆదివాసులు పరిస్థితులకు, వాతావరణంకు తగినట్టుగా సహజసిద్ధమైన సమన్వయాన్ని పాటిస్తున్నారు. వారు తమ అవసరాలను తీర్చుకునేందుకు గాను ప్రకృతితో ఒక నియమబద్ధమయిన పద్ధతిని అనుసరిస్తున్నారు. ప్రకృతి ఒక కాలచక్రంలో (సంవత్సరంలో) ఎంతయితే ఫలాన్నందిస్తుందో అంతే స్వీకరించడం ఆదివాసుల ప్రత్యేకత. ఈ ప్రత్యేకతయే ఆదివాసులను మిగతావారి నుండి వేరు చేసి చూపిస్తుంది. అంతేగాదు, ఒక కాలచక్రంలో అందించిన ఫలాన్ని కూడా మొత్తానికి మొత్తంగా స్వీకరించి సంపదలా పోగేయడం కాకుండా, తమకెంత అవసరమో ఆ పరిమితమైన మొత్తాన్ని మాత్రమే స్వీకరించి మిగతాదంతా మిగతా జీవజాలపు వంతుగా వదిలేస్తారు. తాతలదండ్రుల కాలం నుండి కొనసాగుతూ వచ్చిన ఈ సాంప్రదాయమే ప్రకృతిలోని జీవ వైవిధ్యాన్ని,

(సెప్టెంబర్ 5న ఆంధ్రజ్యోతిలో కంచ ఐలయ్యగారు రాసిన వ్యాసానికి ఎన్. రవి రాసిన జవాబు పూర్తి పాఠం - సం.)

ఈ నిర్హేతుక దాడి ఎందుకోసం?

- ఎన్. రవి

కంచ ఐలయ్యగారు ఆంధ్రజ్యోతిలో సెప్టెంబర్ 5వ తేదీన తమ కుల సిద్ధాంత ప్రాతిపదికన తెలంగాణ ఉద్యమాన్ని, తెలంగాణలో కులాల బలాబలాల మార్పులను విశ్లేషిస్తూ ఒక వ్యాసం రాశారు. అందులో భాగంగా మావోయిస్టు ఉద్యమనాయకత్వాన్ని కూడా కుల చట్రంలో బంధించి, విశ్లేషించే ప్రయత్నం చేశారు. ఆర్.ఎస్.ఎస్. వాళ్ళు ఎట్లాగైతే సర్వం హిందూమత కోణం నుండి విశ్లేషించే స్వేచ్ఛను కలిగి ఉన్నారో అట్లా ఐలయ్యకు కులం కోణం నుండి విశ్లేషించే స్వేచ్ఛ ఉంది. అయితే కుల నిర్మూలన కోసం, ఆర్థిక సామాజిక, సాంఘిక, రాజకీయ సమానత్వం కోసం పోరాడే శక్తులన్నీ (అవి మావోయిస్టు శక్తులు కావచ్చు, మరెవరైనా కావచ్చు) మాత్రం ఈ దృక్పథానికి ఉన్న పరిమితిని అర్థం చేసుకోవటం అవసరం.

ఐలయ్య రాసిన కొన్ని విషయాలు చూద్దాం. 'ముప్పాళ లక్ష్మణరావు తన హిందూ ఐడెంటిటీని 'గణపతి' అనే పేరు ద్వారా చాలా జాగ్రత్తగా కాపాడుకొన్నాడు. ఒక విప్లవకారుడు తానై తాను ఎన్నుకొన్న పేరు ఎత్తుగడను మాత్రమే సూచించదు. అతని/ఆమె ఆధ్యాత్మిక పంథాను కూడా సూచిస్తుంది.' తగిన కారణాలు ఉండటం వల్ల విమర్శ/దాడికి పూనుకొనే పద్ధతి కాక, దాడి చేయాలని నిర్ణయించుకొని ఏవో కారణాలు వెతకాలని చూస్తే ఇటువంటి వ్యాసాలే రాయగలుగుతారు.

విప్లవకవులో, రచయితలో తమ కలం పేరుపెట్టుకొన్నట్టు అన్నిసార్లూ విప్లవకారులు ప్రత్యేకంగా ఎంచుకొని పేరు పెట్టుకోరు. కొంతమంది కొన్నిసార్లు అట్లా చేయవచ్చు, చేయకపోనూవచ్చు. ఉదాహరణకు మల్లోజుల కోటేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా పని చేసినంత కాలం ప్రహ్లాద్‌గానే తెలుసు. ప్రహ్లాద్ పేరుకు ఏ ప్రాముఖ్యతా లేదు. (హిరణ్యకశ్యపుడని పెట్టుకోవాల్సిందని మీరు విమర్శిస్తే మాత్రం నా వద్ద జవాబేమి లేదనుకోండి.) దండకారణ్యంలో పనిచేయడానికి వెళ్లినప్పుడు 'రాంజీ' అనేపేరు పెట్టుకొన్నాడు. అది మీరనుకొంటున్నట్టు రామభక్తితో కాదండీ, గోండు విప్లవకారుడు రాంజీ గోండు పేరుతో పెట్టుకొన్నాడు. దండకారణ్యం నుండి ఉత్తర భారత దేశంలో పనిచేయడానికి వెళ్ళాక విమల్ అనీ, ప్రదీప్ అనీ ఇంకా ఎన్నో పేర్లతో పనిచేశాడు. బెంగాల్‌లో ఆయన పేరు స్థానికంగా కిషన్. మీడియాలో ఆ ప్రాంతంలో ఇంటర్వ్యూలు ఇవ్వడంతో కిషన్ జీగా దేశమంతా పరిచయ మయ్యాడు. అమరుడయ్యేనాటికి కిషన్ జీగా ప్రసిద్ధుడు. కాబట్టి మీలాంటి వారు ఆయనను హిందూ ఆధ్యాత్మిక పథకుడు అనవచ్చు. దండకారణ్యంలో రాంజీగానే అమరుడై ఉంటే అప్పుడు మరి గిరిజన మతావలంబికుడు అనేవారేమో చెప్పలేము. మరి మార్క్సిస్టు ఎప్పుడవుతాడో! మార్క్స్ పేరు పెట్టుకొంటేనా?

అట్లాగే ముప్పాళ లక్ష్మణ రావు ఒక్క పేరుతో పనిచెయ్యలేదు. అవసరాలను బట్టి పేర్లు. గణపతి అంటే మాత్రం విఘ్నేశ్వరుడి మీద భక్తితో పెట్టుకొన్నది కాదండీ. గణపతి జగిత్యాల తాలూకా ఉప్పుమడిగే గ్రామయువకుడు. జగిత్యాల భూస్వామ్య వ్యతిరేక పోరాట ముద్దుబిడ్డ. విప్లవోద్యమాన్ని విస్తరింపజేయడానికి బస్తర్ కు తరలివెళ్ళి అక్కడి దళంలో పనిచేస్తూ 1984 లో పోలీసుల చేతిలో అసువులు బాసాడు. 'దాదా, ఓ దాదా ! గణపతి ఓ దాదా అని ఆ అమరుడి పేరు మీద పాట కూడా ఉంది. బస్తర్ లో బహుశా మొదటి అమరుడు. ముప్పాళ లక్ష్మణరావు స్వయంగా జగిత్యాలలో, కరీంనగర్లో పనిచేసినప్పుడు

వాతావరణ సమతుల్యాన్ని కాపాడుతూ వచ్చింది. దీనికి పూర్తి భిన్నంగా బస్తర్‌లో నేడు పెద్ద ఎత్తున విధ్వంసకాండ కొనసాగుతున్నది. ప్రకృతిని పర్యావరణాన్ని ఏ మాత్రం ఖాతరు చేయని దోపిడి స్వభావం గల దేశవిదేశీ కంపెనీల సంకుచిత పెట్టుబడిదారీ వర్గం, అడవిని, అడవిలోని ఖనిజ సంపదను, జల వనరులను మొత్తంగా కొల్లగొట్టి, కోట్లకొద్దీ డాలర్ల సంపదను పోగేసుకోవడానికి ఎంతటి మానవ హననానికైనా తెగించక మానదు అనే వాస్తవం. అది చేపట్టిన కార్పొరేటు ఉగ్రవాదం (సల్వాజుడుం), గ్రీన్‌హంట్ (అడివివేట) లాంటి ఆపరేషన్లతో తేలిపోయింది. నేడు బస్తర్‌లో సాగుతున్నది వర్గ యుద్ధం.

ఆదివాసీ సంస్కృలకు చత్తీస్‌గడ్ గుర్తింపుగా నిలిచింది. దేశంలోని అత్యధిక గోండు ఆదివాసులతో పాటు కోర్బా, ఓరావ్, బతరా, బైగా, హల్బీ, కమార్, కవార్ లాంటి 35కు పైగా ఆదివాసీ జాతులున్నాయిక్కడ. అడవిలోని ఆదివాసులు తమ మనుగడ కోసం నిత్యం జీవన సమరం సాగించాల్సిందే. వారు తమ జీవన మనుగడ కోసం ప్రకృతి శక్తులతో సహా అడవిలోని క్రూర మృగాలతో సైతం పోరాడిన అనుభవం వారికుంది. బ్రిటిష్ కాలం నుండి తమపై కొనసాగిన అన్ని రకాల జులుంలకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్రతో పాటు, 1910లో ఆదివాసీ రాజ్యస్థాపన కోసం గుండాదుర్‌ై నాయకత్వంలో వీరోచితంగా పోరాడిన చరిత్ర కూడా వీరికుంది. వీరికి మృత్యువంటే ఏ మాత్రం భయంలేదు. ప్రశాంతంగా జీవనం కొనసాగిస్తున్న ఆదివాసులను, సల్వాజుడుమనేది తేనెతుట్టను కదిపిన విధంగా కదిపింది. ఇప్పుడు వారు కోల్పోతున్న భూముల కోసం, విస్థాపనకు వ్యతిరేకంగా ఆత్మరక్షణాయుత పోరాటంలో నిమగ్నమై ఉన్నారు. రానున్న కాలాలలో ప్రభుత్వాలనే ఆత్మ రక్షణలో పడేసే విధంగా, ఆదివాసీ రైతాంగం తమ కవసరమయ్యేంత మేర భూములను స్వాధీనం చేసుకుంటూ ప్రభుత్వంపై ఆక్రమణ పూరితమైన పోరాటాలు చేపట్టాల్సి ఉంది. భూ పోరాటాలతో పాటు అడవిలోని జల, వృక్ష, ఖనిజ సంపదలపై సర్వాధికారాలు పొందేలా, ఆ వనరులను తమ ఇష్టానుసారం వినియోగించుకునేలా, తామే క్రయ విక్రయాలు జరిపేలా స్వపరిపాలన కోసం, స్వయం ప్రతిపత్తి కోసం అన్ని ఆదివాసీ సమూహాలు ముందుకు వచ్చి పోరాడాల్సిన సమయ మాసన్నమయింది. స్వయం పరిపాలన, స్వయం ప్రతిపత్తి సాధించిన నాడే ఆదివాసులకు సంపూర్ణ స్వేచ్ఛ, విముక్తి, స్వాతంత్ర్యాలు లభిస్తాయి.

ఆయనే బస్తర్ కు పంపిన యువకులలో ఒకరు కూడా కావచ్చు. ఇది ఖచ్చితంగా చెప్పలేను. మరి గణపతి పేరు ఎంచుకోవడంలో ఏదైనా అధ్యాత్మిక పంథా పనిచేసిందో లేక విప్లవ సాంప్రదాయముందో ఐలయ్య విజ్ఞతకు వదిలేయ్యాలో లేదో తెలియదు కానీ, పాఠకుల విజ్ఞతకు వదిలెయ్యవచ్చు.

ఇక ఈ వాదనని ఆయన ఎంత దూరం తీసుకుపోయారంటే – – 'ఈ మొత్తం క్రమంలో లక్ష్మణరావు మావోయిజం , హిందూయిజం తో ఎక్కడా సంఘర్షణ పడకుండా చూశాడు. ఈ పంథాలో భాగంగానే ఈరోజు మావోయిజం బలంగా ఉన్న చత్తీస్ ఘడ్ లో కాంగ్రెసు క్యాంపు లోని ఆదివాసీ నాయకత్వమంతా చంపబడి, బీజేపీ తిరుగులేని ఎన్నికల శక్తిగా ఎదిగింది.'

'కాంగ్రెసు క్యాంపులోని ఆదివాసీ నాయకత్వమంతా....' అని ఏ నాయకత్వం గురించి ఐలయ్య మాట్లాడుతున్నారో అని ఆశ్చర్యంగా ఉంది. కాంగ్రెస్ చత్తీస్ ఘడ్ అధ్యక్షుడి గురించా, లేక విద్యాచరణ్ శుక్లా గురించా? వీళ్ళిద్దరైతే ఆదివాసీలు కాదు. ఐలయ్య ఒలకబోస్తున్న ఆదివాసీ నాయకత్వ ప్రేమంతా బహుశా మహేంద్ర కర్మ గురించి కావచ్చు. ఐలయ్య గారూ, బస్తర్ ప్రాంతంలో 2005 నుండి అయిదారేళ్ళ పాటు సల్వాజుడుమ్ అనే 'నరమేధా' కార్యక్రమం జరిగింది. ఆ 'నరమేధం'లో ఊచకోత జరిగింది ఆదివాసీ ప్రజలపైనే. వందలాది ఆదివాసీ గూడాలనూ తగులబెట్టి, వందలాదిమందిని హత్యచేశారు. మహిళలపై జరిగిన అత్యాచారాలు వర్ణణాతీతం. ఈ దారుణ కృత్యాలన్నిటికీ అగ్రభాగాన నిలబడి జుడుమ్ మందలతో దాడి చేయించిందీ, చేసిందీ మాసా కర్మాల్ అలియాస్ మహేంద్రకర్మ అనబడే ఈ సోకాల్డ్ ఆదివాసీ నాయకుడేనండీ! తెలుగు పత్రికల్లో ఈ హత్యాకాండలు అత్యాచారాల గురించి చాలానే రాశారు. మీరు చూడదలుచుకోనట్టుంది. ఇందులో కాంగ్రెసుకు చెందిన మహేంద్ర కర్మ, బిజెపికి చెందిన రమణ్ సింగ్ ఈ ఇద్దరిదీ చెట్టాపట్టాలేసుకొన్న పాత్ర.! ఆదివాసీ భూస్వామ్య వంశానికి చెందిన మహేంద్రకర్మ, అగ్రకుల రాజ్ పుట్ భూస్వామి, బడా దళారీ పెట్టుబడి దారుల ప్రయోజనాలు కాపాడే రమణ్ సింగ్ ఇద్దరూ ఒకరికొకరు తీసిపోరు. 'వర్గాలు ఇంకా రూపుదిద్దుకోలేదు' అని సామాజిక శాస్త్రవేత్తగా మీ నిశితమైన పరిశోధనకు, పరిశీలనకు అనిపించవచ్చెమో కానీ ఆ అత్యాచారాల బారిన పడిన ఆదివాసీలను అడగండి మహేంద్రకర్మ, ఆదివాసీల పక్షాన నిలబడ్డవాడా లేక 'అగ్రకుల' రాజపుత్రుడైన రమణ్ సింగ్ కు సరిజోడుగా నిలబడ్డవాడా అనేది.

మరి ఈ మహేంద్ర కర్మ గురించేనా ఐలయ్య 'ఆదివాసీ నాయకత్వం' అని వర్ణించింది? మహేంద్రకర్మ ఆదివాసీ కాబట్టి ఆదివాసీలపై ఏ జులుం అత్యాచారాలు చేసినా విప్లవోద్యమం ఏమీ చేయకుండా ఉండాలనా ఐలయ్య చెప్పేది? ఇదే ఐలయ్య గారి వాదం అయితే దీనికి మనువాదానికి సారాంశం లో ఏం తేడా ఉన్నట్టు? మహేంద్రకర్మను చంపిన ఘటనలోనే కుంట ఎమ్మెల్యే కూడా అయిన మరో ఆదివాసీ నాయకుడిని పట్టుకొని కూడా వదిలేశారు కదా! అయితే, మహేంద్రకర్మ వంటి ముఖ్యులైన ప్రజాద్రోహులను తప్ప పటేల్ తో సహా ఇతరులు చాలా మందిని అంత పెద్ద సంఖ్యలో చంపడం సరైంది కాదని కూడా దండకారణ్య కార్యదర్శి రామన్న ఆ కమిటీ తరపున జారీ చేసిన ప్రకటనలో అన్నాడు. ఈ విషయాలన్నీ పత్రికల్లో పెద్ద ఎత్తునే వచ్చాయి. అయినా సరే నిర్హేతుకంగా ఎట్లాపడితే అట్లా మావోయిస్టు ఉద్యమంపై దాడి చేస్తూ రాయటం ఐలయ్య గారు ఒక కళ గానే మెరుగులు దిద్దుకుంటున్నారు.

చత్తీస్ఘడ్లో బిజెపి గెలవడానికి ఈ సంఘటనే కారణమనటం వాస్తవ విశ్లేణకు సుదూరమైన విషయం. అంతెందుకు 1980ల నుండే మహేంద్రకర్మ మావోయిస్టు ఉద్యమానికి ఒక శత్రువుగా నిలబడ్డాడు. అయినా బస్తర్ నుండి ఎన్నికల్లో అప్పుడప్పుడూ గెలుస్తూ వచ్చాడు. మరి మహేంద్రకర్మను కూడా మావోయిస్టు పార్టీనే గెలిపించుకొంటూ వచ్చిందని ఐలయ్యగారు ఆరోపించగలరా? మావోయిస్టు ఉద్యమ ప్రాంతాల్లో ఓట్ల సరళి గురించి రాయటం ఈ వ్యాస పరిధిలోనిది కాదు.

తెలంగాణ ఉద్యమం పట్ల మావోయిస్టు వైఖరి కొత్తగా లక్ష్మణరావు చేపట్టింది కాదు. 1969 నాటి తెలంగాణ ఉద్యమకాలం నుండీ కామ్రేడ్ కొండపల్లి సీతారామయ్య నాయకత్వంలోనే తెలంగాణ ఉద్యమానికి మావోయిస్టు పార్టీ మద్దతు పలుకుతూనే వచ్చింది. కొత్తగా 1998 లోమొదలు పెట్టలేదు. ఒక్క తెలంగాణే కాదు, ప్రాంతీయ అసమానతల కారణంగా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ డిమాండు ఎక్కడ న్యాయమైనదిగా తలెత్తినా – అది ఉత్తరాఖండ్ కావచ్చు, జార్ఖండ్ కావచ్చు, ఘూర్ఖా ల్యాండ్ కావచ్చు, విదర్భ కావచ్చు, మావోయిస్టు పార్టీ మద్దతు తెలిపింది, అలాంటి ఉద్యమాల్లో పాలుపంచుకొంది. అట్లాగే విడిపోయే హక్కుతో సహా జాతుల స్వయం నిర్ణయాధికారాన్ని సమర్ధిస్తుంది. అందులో భాగంగానే కాశ్మీర్ ఉద్యమాన్ని, ఈశాన్య జాతుల పోరాటాలను, సమర్ధిస్తూ వస్తోంది. మార్క్సిస్టు– లెనినిస్టు సిద్ధాంతానికి అణుగుణంగానే జాతుల ఉత్పీడనకు వ్యతిరేకంగా పోరాడుతూ వస్తోంది. తెల్లదొరల స్థానంలో నల్ల దొరలే అధికారంలోకి రాబోతున్నారని తెలిసినా కమ్యూనిస్టులు స్వాతంత్రం కోసం ఆంగ్లేయుల పాలన అంతం కోసం పోరాడడం మానంది ఎందుకంటే అది ప్రజలపై దోపిడిలోని ఒక పార్శ్వాన్ని అయినా తగ్గిస్తుందని. అంటే సమానత్వం వైపు, సమసమాజం వైపు ఒకడుగు ముందుకు వేస్తుందని. ఏ రకమైన అసమానతలనైనా తొలగించేందుకు అంశికంగా తోడ్పడే ఏ చిన్న పోరాటానికైనా మావోయిస్టులు మద్దతు తెలుపుతూనే ఉంటారు. తెలంగాణ ఏర్పడంగానే తెలంగాణలో సకల దోపిడీలు అంతమయిపోతాయనే అవగాహన మార్క్సిస్టులెవ్వరికీ ఉండదు. అందుకోసం పోరాడవలిసిందే.

కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి అంటే ఒక్కరే విధివిధానాలు నిర్ణయించరు. కేంద్రకమిటీ, పార్టీ కాంగ్రెస్ రూపొందించిన పాలసీలకు అనుగుణంగా పార్టీని గైడ్ చేస్తూ నాయకత్వం వహిస్తారు. పైగా ఒకప్పుడు చారుమజుందార్ ను విప్లవ ఆథారిటీగా ప్రకటించిన కాలమో, లేదా కొండపల్లి సీతారామయ్యకు ఆయన తదుపరి నాయకత్వానికి సైద్ధాంతికంగా, రాజకీయంగా స్థాయిలో చాలా అంతరం ఉన్నటువంటి కాలమో కాదిది. ఈనాటి మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ కోటేశ్వరరావు , ఆదిరెడ్డి, చెరుకూరి రాజకుమార్ తదితర ఇంచుమించు సమాన సైద్ధాంతిక, రాజకీయ జ్ఞానం, అనుభవాలున్న కామ్రేడ్ లతో కూడుకొన్నది. ఇవన్నీ గుర్తిస్తే ఐలయ్య తాను వక్రీకరించే విధంగా సిద్ధాంతం రూపొందించడం కష్టం కాబట్టి విషయాలు తెలిసినా చూడ నిరాకరిస్తున్నారు. దీని అర్థం కార్యదర్శి నిమిత్త మాత్రుడని కాదు. కానీ సర్వం తానేగా కూడా మావోయిస్టు పార్టీలో ఉండదు.

సరే లక్ష్మణరావు గురించిన చర్చ వచ్చింది కాబట్టి ఐలయ్యగారికి

గుర్తు చేసేది ఏమిటంటే ఇదే లక్ష్మణరావు నాయకత్వంలోని కేంద్రకమిటీయే మావోయిస్టు పార్టీలో మొదటిసారిగా 1995 లో 'భారతదేశంలో కుల సమన్య'పై స్పష్టమైన పాలసీ పత్రం రూపొందించింది. అంతేకాక 2007 లో జరిగిన పార్టీ కాంగ్రెస్ లో ప్రత్యేకంగా ఈ విషయంపై చర్చించి తన అవగాహనను మరింత సంపద్వంతం చేసుకొంది. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగేది కానీ ఆగేది కాదు. ఐలయ్య బాధ్యతగా సదుద్దేశంతో ఆ పత్రాలపై, ఆచరణపై సద్విమర్శ చేస్తే అది మావోయిస్టు ఉద్యమానికైనా, కులనిర్మూలనకైనా తోడ్పడగలదు. అంతేకానీ ప్రస్తుత తరహా దాడి వల్ల ఉపయోగం లేదు.

ఇక మళ్ళీ ఒకసారి తెలంగాణ విషయానికి వద్దాం. తెలంగాణ తొలి ఉద్యమం నాటి నుండి కూడా మావోయిస్టు పార్టీ నిలకడగానే ఉద్యమ సమర్ధనలో ఉంది. కొన్ని నక్సలైట్ పార్టీలు మాత్రం ఈ మలి ఉద్యమ కాలం నుండే సమర్థించడం మొదలుపెట్టాయి. సి.పి.ఐ లాగా ఇందుకు కారణం పోటీ కాదు. తెలంగాణ ప్రజలలో పెరుగుతున్న ఆకాంక్షను మొదలు మావోయిస్టు పార్టీ పట్టుకోగలిగింది, గుర్తించగలిగింది. తదనుగుణమైన ఆచరణను రూపొందించుకొంది. తెలంగాణ ప్రజలలో పెరుగుతున్న ఆకాంక్షను నిరాకరించి ప్రజలకు దూరం కాలేని పరిస్థితుల్లో కొన్ని పార్టీలు తమ వైఖరిని మార్చుకొని తెలంగాణకు మద్ధతు పలికాయి.

ముందే అన్నట్టు తెలంగాణ ఏర్పడితే కొన్ని ప్రాంతీయ అసమానతలు దూరం కావడానికి పరిస్థితులు ఏర్పడతాయి తప్ప వర్గ దోపిడీ అంతం కాదు. కొందరు అంబేద్కర్ వాదులు ఆశించినట్టు బి.సి.లు, ఎస్.సి.లు రాజకీయ అధికారం చేపట్టడానికి చేరువవుతారనేది కూడా అనుమానాస్పదమే. కె.సి.ఆర్ అవలంబిస్తున్న విధానాలు చూస్తే తెలంగాణ అంటే హైదరాబాదు మాత్రమేనేమో అన్నట్టు ఉంటున్నాయి. ఏ ప్రాంతీయ అసమానతలు రూపు మాపటంలో ఒక అడుగు లాగా తెలంగాణ ఏర్పాటుకోసం తెలంగాణ ప్రజలు ఉద్యమించారో, ఆ ప్రాంతీయ అసమానతలను ఇప్పుడు హైదరాబాదుకు, ఇతర వెనుకబడిన తెలంగాణ జిల్లాలకూ మధ్య మరింత పెంపొందించే విధంగానే ఉన్నాయి. ఎం.ఎన్.సీలకు, భారత బడా దళారీ పెట్టుబడిదారులకు రాయితీలపై రాయితీలు ప్రకటిస్తున్నాడు. వీటన్నిటికీ వ్యతిరేకంగా పోరాడవలిసిందే. అందులో మావోయిస్టులకు ఎటువంటి అస్పష్టతా లేదు.

ఈ సైద్ధాంతిక నేపథ్యమూ చరిత్ర అంతా వదిలేసి ఐలయ్య బట్టతలకూ మోకాలికీ ముడిపెట్టే సిద్ధాంతం చేస్తున్నారు. ఇట్లా ముడిపెట్టే సిద్ధాంతంతోనే 'టి.ఆర్.ఎస్. పెరిగిన మోతాదుల్లో మావోయిస్టు పార్టీ తరుక్కొంటూ పోయింద'నీ అందుకు మావోయిస్టు పార్టీ టీ.ఆర్.ఎస్ కు అండనీయడమేనని, పైగా 'అది అందరికీ తెలిసిన విషయమే'నని అన్నారు.

మావోయిస్టు పార్టీ వెనుకంజ వేయడంలో వేలాది కార్యకర్తలను, నాయకులను దారుణమైన పోలీసుల దాడుల్లో, బూటకపు ఎన్ కౌంటర్లలో, కోవర్టు హత్యలలో చంపివేయడం అతిప్రధానమైన కారణమనేది తెలంగాణ ప్రజానీకానికి, తెలియని విషయం కాదు. దానికితోడు నల్లదండుల దాడుల్లో బెల్లి లలిత, పురుషోత్తమ్, ఆజమ్ అలీల నుంచి మొన్న గంటి ప్రసాదం వరకు ఎంతోమంది ప్రజాసంఘాల కార్యకర్తలను, నాయకులను చంపివేశారో తెలియనట్టు రాస్తే తెలుగుపాఠకులు అంత వెర్రివాళ్ళని ఐలయ్యగారి నమ్మకమా? అయితే

ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ఆహ్వానం

ఐక్య విప్లవోద్యమానికి పదేళ్లు నిండిన సందర్భంగా నిర్వహిస్తున్న సదస్సుకు, బహిరంగ సభకు తప్పక రండి

ప్రజాస్వామికవాదులకు, రచయితలకు..

నక్సల్బరీ శ్రీకాకుళ పోరాటాలు మొదలయ్యాక ప్రత్యామ్నాయ రాజకీయాలు దేశ చిత్రపటం మీదికి వచ్చాయి. పార్లమెంటరీ పంథాను వ్యతిరేకిస్తూ దీర్ఘకాలిక సాయుధ పోరాట మార్గంలో నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేయడానికి 1969 ఏప్రిల్ 22న సీపీఐ ఎంఎల్ ఏర్పడ్డ విషయం మీ అందరికీ తెలిసిందే. అయితే అనేక కారణాల వల్ల అప్పట్లో ఉద్యమం వెనుకతట్టుపట్టింది. పార్టీ చీలికలకు గురైంది. 1974 నుంచి మొదలైన పునర్నిర్మాణ ప్రయత్నాలు ఎమర్జెన్సీ ఎత్తేసేనాటికి 'విప్లవానికి బాట'గా మారాయి. జగిత్యాల జైత్రయాత్ర(సెప్టెంబర్8, 1978)గా, ఆదిలాబాద్, కరీంనగర్ పోరాటాలుగా పెల్లుబికాయి. ఈ పోరాటాలు ఒక నిర్మాణ రూపం తీసుకొని 1980 ఏప్రిల్22న సీపీఐ ఎంఎల్(పీపుల్స్‌వార్)గా ఏర్పడి దేశ వ్యాప్తంగా విస్తరించడం మొదలైంది. విప్లవోద్యమం దండకారణ్యం తదితర ప్రాంతాలకు చేరుకున్నది. ఈ క్రమంలో వేర్వేరు స్రవంతులుగా కొనసాగుతూ వచ్చిన విప్లవ పార్టీల ఐక్యతా చర్చలు మొదలయ్యాయి. సుదీర్ఘకాలం జరిగిన ఈ ప్రయత్నాలు ఫలించి మొదట మునపటి సీపీఐ ఎంఎల్ పార్టీ యూనిటీ-సీపీఐ ఎంఎల్ పీపుల్స్‌వార్ ఐక్యమయ్యాయి. మనపటి మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఎంసీసీఐగా అవతరించి పీపుల్స్‌వార్‌తో ఐక్యతా చర్చలు ఫలించి 2004 సెప్టెంబర్21న సీపీఐ(మావోయిస్టు) ఏర్పడింది. ఈ విషయాన్ని అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో జరిగిన చర్చల సందర్భంలో విప్లవోద్యమ నాయకత్వం హైదరాబాదు నగరంలో ప్రకటించింది. ఏ ఏడాది మేడే రోజు సీపీఐ ఎంఎల్ నక్సల్బరీ.. మావోయిస్టుపార్టీలో విలీనమైన ప్రకటన వెలుబడింది.

ఈ నేపథ్యంలో ఐక్య మావోయిస్టు విప్లవోద్యమానికి పదేళ్లయిన సందర్భంగా ప్రత్యామ్నాయ రాజకీయాల ప్రచారం కోసం దేశవ్యాప్తంగా విప్లవాభిమానులతో ఈ వేదిక ఏర్పడింది. దీని ఆధ్వర్యంలో మావోయిస్టు పార్టీ ఆవిర్భావ ప్రకటన జరిగిన హైదరాబాదు నగరంలో ఈ నెల 21న సదస్సు, బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నాం. దీనికి మిమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

వరవరరావు

కన్వీనర్,

ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక

2, సెప్టెంబర్ 2014, హైదరాబాదు.

సభ్యులు: బొజ్జాతారకం, ప్రొ. హరగోపాల్, ప్రొ. కేఆర్ చౌదరి, కంచన్‌కుమార్(పశ్చిమ బెంగాల్), అరుణ్ చక్రవర్తి(పశ్చిమ బెంగాల్), డాక్టర్ బిడి శర్మ, అర్ నారాయణమూర్తి, రాజ్‌కిషోర్(బీహార్), చలసాని ప్రసాద్, కళ్యాణరావు, సిఎస్ఆర్ ప్రసాద్, కెఎం పండిట్(ఝార్ఖండ్), జి. పద్మకుమారి, కె. శివారెడ్డి, పాణి, టి. కృష్ణాబాయి, కాకరాల తదితరులు

ఈ నిర్బంధానికి తోడు 'తక్కువ స్థాయి యుద్ధతంత్రం' లో భాగంగా వేలాది కోట్ల రూపాయలను గుమ్మరించి ప్రభుత్వాలు వెలువరించిన లొంగుబాటు పథకాలు, కొన్ని రకాలైన సంక్షేమ పథకాలు, మానసిక యుద్ధం కోసం చేపట్టిన పథకాలను ధీటుగా, సకాలంలో ఎదుర్కొనే ఎత్తుగడలు చేపట్టకపోవడం, సరి అయిన సమయంలో సైనికపరంగా కొన్ని ఎత్తుగడలను రూపొందించుకోక పోవటం, మూడు దశాబ్దాల విప్లవోద్యమం కారణంగాను, ఇతర కారణాలవల్లనూ సామాజిక సంబంధాల్లో చోటుచేసుకొంటున్న మార్పుల కనుగుణంగా రాజకీయ, పోరాట ఎత్తుగడలను చేపట్టకపోవడం కారణాలనీ 2001 నాటికే ఉత్తర తెలంగాణలో ఉద్యమం వెనుకంజ వేసిందని, ఆ తరవాత 2005, 2006 నాటికి మొత్తం ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమం సెట్ బ్యాక్ కు గురయ్యిందనీ సమీక్ష చేసుకొందని మావోయిస్టు నాయకులు ఇంటర్వ్యూలలో చెప్పారు. ఇవేవీ ఐలయ్య గారికి పట్టవు.

ఐలయ్య గారిది ఒకటే బాట. ఒకటే దృక్పథం. ఆయన ప్రకారం భారత దేశంలో మనుషులు కులాలకు అతీతంగా ఆలోచించలేరు.. సమానత్వం, సమసమాజం; ఆర్థిక, సాంఘిక, సామాజిక, రాజకీయ, కుల, లైంగిక అసమానతలు, దోపిడీలేని ఆదర్శవంతమైన సమాజంకోసం స్వప్నించగలరనీ, ఆ స్వప్నాలను సాకారం చెయ్యడం కోసం ఏ కులంలో పుట్టిన మనుషులైనా కులాతీతంగా, ప్రయత్న పూర్వకంగా, చైతన్యవంతంగా ఆలోచించగలరనీ అందుకోసం తమ కుటుంబాలను, భద్రమైన జీవితాలను, శ్రామిక వర్గానికి చెందిన వారైతే భద్రం కాని జీవితాలను, ఉన్నత విద్యలను, ఉద్యోగాలను వదిలి పీడితులతో పాటు, పీడితులకోసం కలో, గంజో తాగుతూ అయినా జీవిత పర్యంతం పాటుపడగలరనీ, జీవితాలను కూడా త్యాగం చెయ్యడానికి సిద్ధమవుతారనీ, అందుకు తెలుగు సమాజంలోనే వేలాది ఉదాహరణలున్నాయనీ అనటం, అనుకోవటం ఐలయ్య గారి ప్రకారం కల్ల. ఆయన ప్రకారం ఎవ్వరైనా సరే తమ కులం కోసమే కొట్లాడతారు. ఒక మల్లోజుల కోటేశ్వరరావో, ఒక పురుషోత్తమో, తమ ప్రాణాలను లెక్కజేయ్యకుండా విప్లవోద్యమానికో, పౌరహక్కుల ఉద్యమానికో, అంకితమయ్యారంటే అది బ్రాహ్మణ రాజ్య స్థాపన కోసమే. ఒక ఆదిరెడ్డి, ఒక సంతోష్ రెడ్డి, ఒక పటేల్ సుధాకర్ రెడ్డి తమ జీవిత పర్యంతం, శ్రమజీవుల రాజ్యం కోసం, శ్రమ దోపిడీ అంతంకోసం, కులాతీత సమాజం గురించి స్వప్నించి, పాటుపడి, ప్రాణాలర్పించారన్నా అది కల్లే సుమా! వాళ్ళు చేసిందంతా రెడ్డిరాజ్య స్థాపనకోసమే, అదేబాటలో ముప్పాళ లక్ష్మణరావు పయనిస్తున్నా అదంతా వట్టి స్వార్థమే., వెలమ దొరల రాజ్యస్థాపనకే! ఇదీ సామాజిక శాస్త్రవేత్త ఐలయ్యగారి సిద్ధాంతం. దీనిప్రకారం కులం అజరామర మైంది. మనువాదానికి, ఈవాదానికీ తేడా ఏమిటీ? ఇదే సిద్ధాంతం ప్రకారం అయితే బి.సి.లకు 'అచ్చేదిన్ ఆయేహై'! తనను తాను చాయ్ అమ్ముకొనే పేదవర్గం నుంచి, వెనుకబడిన కులం నుండి వచ్చిన వాణ్ణని చెప్పుకొనే మోడీ ఈ దేశానికే ప్రధాన మంత్రి అయ్యాడు. ఇంకేం మరి!

కుల స్వార్థం తప్ప మనుషులకు మరేమీ ఉండదన్న మీ ఈ సిద్ధాంత ప్రచారంలో దాగి ఉన్న ప్రమాదం గురించి ఒక్కసారైనా ఆగి ఆలోచిన్తున్నారా? మార్పు సాధ్యమనే నమ్మకాన్నే మీరు చంపేయదలుచుకొన్నారా? సమ సమాజ స్వప్నాన్ని, ఆదర్శాన్ని, అసాధ్యమైనవిగా మీరు నిలబెడుతున్నారా? ఈ నమ్మకాలు, స్వప్నాలు, ఆదర్శాలు అందుకోసం పనిచేయడాలు, ఉద్యమించడాలు, లేని నాడు మీరు అంటున్న సాంఘిక సంస్కరణ సాధ్యమే కాదు.

గత రెండు, మూడు దశాబ్దాల్లో మీరు, ఇతర అంబేడ్కర్ వాదులు ప్రచారం చేస్తున్న సిద్ధాంతం వల్ల తొలినాళ్లలో కుల దోపిడీగురించి లోతైన అవగాహన పెంపొందించడంలో, విభిన్నకోణాల్లో కుల అసమానతలను గురించి అర్థం చేసుకోవడంలో, ఒక్క మాటలో చెప్పాలంటే కులనమన్యకు, నంబంధించిన చైతన్యం పెంపొందించడంలో, మావోయిస్టు పార్టీతో సహా నక్సలైటు పార్టీలన్నీ కులం పట్ల తమ సైద్ధాంతిక దృక్పథాన్ని మెరుగు పరచుకోవడంలో సహాయపడింది. ఇందులో 'నలుపు' పాత్ర కూడా ఉందనడం నిస్సందేహం. అయితే ఈ సిద్ధాంతానికున్న పరిమితిని మాత్రం గుర్తించడంలేదు. ప్రతిదాంట్లో కులాన్నే వెతికితే కుల వ్యవస్థను కాపాడే శక్తుల్లో మీకు ఇష్టమున్నా, లేకున్నా, అసంకల్పితంగానైనా మీరు ఒక ప్రబల శక్తే అవుతారు.

విప్లవోద్యమానికి కేంద్రస్థాయిలో ఈనాటికీ కూడా బి.సి.లు, దళితులు, ఆదివాసీలు, మహిళలనుండి, తగు మాత్రంలో నాయకత్వ స్థాయిలో లేనిమాట కూడా ఒక వాస్తవం. విప్లవోద్యమం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లలో ఇది కూడా ఒకటి. అయితే రాష్ట్రస్థాయిల్లో, జిల్లా స్థాయిల్లో ఎన్నో చోట్ల ఈ సామాజిక వర్గాల నుండి వచ్చిన వారే మెజారిటీగా కూడా వున్నారు. దానికి తోడు అట్లా నాయకత్వ స్థాయికి ఎదగగల ఎందరో రాజ్య నిర్బంధానికి బలయ్యారు. ఎందరు వెంకటస్వాములు, గోపగాని ఐలయ్యలు, దగ్గురాయలింగులు, పద్మలు, లలితలు, పులి అంజన్నలు, మాధవ్ లు, దివాకర్ లు, విజయ్ కుమార్లూ, గజ్జెల గంగారంలు, కట్ల మల్లేశ్ లని..! ఇప్పటికే కేంద్ర నాయకత్వంలో ఉన్నవాళ్లని వదిలేసి కొందరు అమరుల పేర్లు మాత్రమే ఉదహరించా.

సాంఘిక సంస్కరణను పక్కన పెట్టి ఏ ఉద్యమమైనా అగ్రకులాలకే అధికారాన్ని ఇస్తుంది. ఇది వాస్తవం. అయితే ఇంతకంటే ప్రబలమైన వాస్తవమేమిటంటే మావోయిస్టు ఉద్యమం సాంఘిక సంస్కరణను పక్కనపెట్టదు. అయితే ప్రస్తుత వ్యాసపరిధిలో దీన్ని విపులంగా చర్చించలేం.

సాంఘిక సంస్కరణ కోణం నుంచికానీ, మరేదైనా కోణం నుంచికానీ మావోయిస్టు ఉద్యమంపై సహేతుకంగా ఉండే దాడికైతే జవాబు చెప్పగలం కానీ నిర్హేతుకమైన దాడులకు ఏం జవాబు చెప్పగలం? చెప్పినా ఒప్పించలేం. గణపతి మీద ఐలయ్య దాడి అట్లాంటిదే. 'తక్కువ స్థాయి యుద్ధతంత్రం' లో అతి ముఖ్యమైన మానసిక యుద్ధం (సైకలాజికల్ వార్ఫేర్) లో భాగంగా పాలక వర్గాలు, పోలీసులు, ఉద్యమ నాయకత్వంపై, నిరంతరం బురదజల్లాలనీ అవాకులూ చెవాకులూ అబద్ధాలైనా సరే పదే,పదే ప్రచారం చేయాలనే పథకాన్ని కావాలనే అమలుచేస్తారు. అందుకోసమే వందలాది కోట్లరూపాయలు వెచ్చిస్తారు. అది సరేగానీ, ఐలయ్య ఈ మానసిక యుద్ధానికి, ఎందుకు పాల్పడుతున్నట్టు? ఐలయ్య లాంటి వాళ్ళు మావోయిస్టు ఉద్యమంతో సంభాషిస్తే ఉపయోగం. నిర్హేతుకమైన దాడివల్ల ఏ ఉద్యమానికీ ఎటువంటి ప్రయోజనం ఉండదు. ఇట్లాంటి దాడుల వల్ల సంబరపడేది 'పాలక కులాల్లోని' పాలకవర్గాలు మాత్రమే.

(ఈ వ్యాసంలోని కొంత భాగం 20-09-2014 నాటి ఆంధ్రజ్యోతి దినపత్రిక లో అచ్చయ్యింది.)

దండకారణ్య జనతన సర్కార్ గురించి చర్చించుకుందాం!

- వరలక్ష్మి

ప్రియమైన మిత్రులకు!

సకల ప్రజాస్వామిక వ్యవస్థలను పాలకవర్గాలు ధ్వంసం చేస్తున్న తరుణంలో పీడిత సమూహాల ఆర్తిని, సంక్షోభాలను, పోరాటాలను సాహిత్యకారులుగా మన రచనల్లో చిత్రిస్తున్నాం, విశ్లేషిస్తున్నాం. తరతరాలుగా ప్రజలు ఉద్యమాల ద్వారా సాధించిన విలువలను, సంస్కృతిని పరిరక్షించడంలో మన వంతు పాత్ర నిర్వహిస్తున్నాం. మధ్య తరగతి బుద్ధిజీవులుగా, సృజనకారులుగా మనం ఎంచుకున్న చైతన్యయుతమైన బాధ్యత ఇది. అందువల్లనే తెలుగు సాహిత్య సాంస్కృతిక, మేధో రంగాలు గతంతో పోల్చుకుంటే చాలా విస్తరించాయి. అనేక ప్రజాస్వామిక జీవన విలువలకు, దృక్పథాలకు వాహికగా నిలబడ్డాయి. ఎన్నికల ద్వారా ప్రభుత్వాలు మారినా పాలకవర్గ విధానాలు మారడం లేదని, సారాంశంలో అవి విధ్వంసాన్నే సృష్టిస్తున్నాయని మనం అనేక వైపుల నుంచి చిత్రించి, వివరిస్తున్నాం.

ఇంత విధ్వంసపూరిత వాతావరణంలో కూడా ప్రజలు తమ పోరాటాల ద్వారా సామాజిక, రాజకీయార్థిక రంగాల్లో కొత్త వ్యవస్థ కోసం ప్రయత్నిస్తున్నారు. మౌలికంగా ప్రజలు సృజనజీవులనే మన తాత్విక విశ్వాసాన్ని చుట్టూ జరుగుతున్న అనేక పోరాటాలు నిరూపిస్తున్నాయి. వాటిలో దండకారణ్య ఆదివాసీ పోరాటం ముఖ్యమైనది. ముప్పై ఏళ్లకుపైగా మధ్య భారత దేశంలో మావోయిస్టుల నాయకత్వంలో అక్కడ ఒక సామాజిక రాజకీయార్థిక ప్రయోగం జరుగుతున్నదని మనం చదువుకుంటున్నాం. ప్రపంచ విప్లవోద్యమాల చరిత్రలోనే ఇది విలక్షణమైనది. ఈ దేశ పీడిత ప్రజలు ఇంత వరకూ సాధించనిది ఇప్పుడు దండకారణ్య ఆదివాసులు సాధిస్తున్నారు. లక్ష మంది మహిళలు సభ్యులుగా ఉన్న క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్, పది వేల మంది సాంస్కృతిక కార్యకర్తల చేతనా నాట్య మంచ్ వంటి ఉద్యమ సంస్థలు దండకారణ్య విప్లవోద్యమం నిర్మాణం చేసింది. ఒక ఆదివాసీ స్త్రీ నాగలి దున్నుతుంటే వెనక పురుషుడు విత్తనాలు వేసే తొలకరి దృశ్యం అక్కడ కనపడుతుంది. 'అమ్మ పొలం దున్నుతుంది, నాన్న ఊయల ఊపుతాడు, రాము అన్నం వడ్డిస్తుంది, పెదనాన్న బియ్యం చెరుగుతాడు' అంటూ పిల్లలు చదివే పాఠాలు అక్కడ వినిపిస్తాయి. మార్పు కోసం, విముక్తి కోసం చేసే పోరాటంలో నూతన మానవ ఆవిష్కారం గురించి విరసం మాట్లాడుతున్నది. ప్రముఖ రచయితలు అరుంధతీరాయ్, సత్నాం, వంటి వాళ్లు దండకారణ్యంలో కొంత కాలం గడిపి అక్కడ ఆదివాసుల ఉద్యమాన్ని మనకు పరిచయం చేశారు. తెలుగు జర్నలిస్టులు తమ ఇంటర్వ్యూలలో, కథనాల్లో అక్కడి వాస్తవాలను వెలుగులోకి తెచ్చారు. సుప్రసిద్ధ స్వీడన్ రచయిత, రాజకీయవేత్త యాన్ మిర్డాల్ తన ఎనభై నాలుగేళ్ళ వయసులో దండకారణ్యం వెళ్లి భారత్‌పై అరుణతార అనే పుస్తకం రాశారు. ప్రపంచ వ్యాప్తంగా ఆ పుస్తకం దండకారణ్య ఆదివాసీ విప్లవోద్యమం పట్ల ఆసక్తిని పెంచినట్లు తెలుస్తోంది. ఇవేగాక ఆ ఉద్యమంలో ఉన్న రచయితలు గత దశాబ్దంలో డజన్ల సంఖ్యలో పుస్తకాలు రాశారు. ముఖ్యంగా దండకారణ్య రచయితలు రాస్తున్న కథలు విశేషమైన గుర్తింపు సంపాదించుకున్నాయి. దండకారణ్య ఉద్యమంపై తెలుగులో కొన్ని స్వతంత్ర్య రచనలు కూడా వచ్చాయి.

ఇవన్నీ దండకారణ్య ప్రయోగం ఒక ప్రజా ప్రత్యామ్నాయమని చాటి చెప్తున్నాయి. భారత పాలకవర్గాలు అన్ని ప్రజా వ్యవస్థలను ధ్వంసం చేస్తోంటే దండకారణ్య ఆదివాసులు తమ పోరాటం ద్వారా ప్రత్యామ్నాయ ప్రజా వ్యవస్థలను నిర్మిస్తున్నారని వివరిస్తున్నాయి. ఆ ప్రత్యామ్నాయాన్ని ఆదివాసులు క్రాంతికారీ జనతన సర్కార్ అని పిలుస్తున్నారు. అట్టడుగు నుంచి ప్రజా పాలన ఎలా ఉండాలో వాళ్లు నిరూపిస్తున్నారని పత్రికలు, మీడియా కూడా చెప్తున్నాయి. ప్రపంచంలోనే అత్యంత విలువైన ఖనిజ సంపద ఉన్న దండకారణ్యాన్ని దోచుకోడానికి బహుళజాతి కంపెనీలు అడవిలోకి చొరబడుతున్నాయి. ఈ దేశ ప్రజా సంపదను వాటికి ధారాదత్తం చేయడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ దోపిడీని ఆదివాసులు ఎదిరిస్తున్నందున అమెరికా కనుసన్నల్లో భారత ప్రభుత్వం మూడు లక్షల సైనిక, అర్ధ సైనిక బలగాలను ఆదివాసుల మీదికి యుద్ధానికి పంపించాయి. ఐదేళ్లుగా ఆపరేషన్ గ్రీన్‌హంట్ అనే ఈ యుద్ధం కొనసాగుతున్న విషయం మన అందరికీ తెలుసు. ప్రజలపై జరుగుతున్న ఈ యుద్ధాన్ని సహజంగానే తెలుగు ప్రజాస్వామికవాదులు, రచయితలు ముందు భాగాన ఉండి నిరసిస్తున్నారు.

ఇంత తీవ్ర యుద్ధం మధ్యనే ఆదివాసులు తమ తరతరాల స్వయంపాలనా కాంక్షను మావోయిస్టుల నేతృత్వంలో జనతన సర్కారుగా నడుపుతున్నారు. దండకారణ్యం వెళ్లి వచ్చిన ప్రముఖులందరూ ఈ దేశానికి అసలైన ప్రజాస్వామ్యం దండకారణ్యంలో నిర్మాణమవుతున్నదని అభిప్రాయపడ్డారు. ఊహించినట్లుగానే హిందుత్వ, అభివృద్ధి నమూనా మిలాఖత్ అయ్యి వచ్చిన మోడీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ తరహాలో ఒరిస్సా, చత్తీస్‌ఘడ్‌లలో ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక నిధులు అందిస్తోంది. విప్లవోద్యమంలోకి కోవర్టులను ప్రవేశపెట్టే విషయాన్ని బహిరంగంగానే కేంద్ర హోంమంత్రి ప్రకటించారు. మూడు రాష్ట్రాలు, దండకారణ్యంలోని అత్యంత విలువైన ఖనిజ సంపదపై కన్నేసి అక్కడి ఆదివాసులపై యుద్ధానికి దిగుతున్నాయి. భౌగోళికంగా తెలుగు సమాజానికి దండకారణ్యం సరిహద్దుల్లో ఉండటమేగాక భావజాల పరంగా మన ప్రగతిశీల రచయితలకు, కళాకారులకు, బుద్ధిజీవులకు అక్కడి ఉద్యమంతో సాన్నిత్యం ఉన్నది. వేర్వేరు తాత్విక, భావజాలాల వెలుగులో సాహిత్య సాంస్కృతిక మేధో రంగాల్లో పని చేస్తున్న మనం ఇప్పటికే వివిధ సందర్భాల్లో దండకారణ్యానికి మద్దతుగా నిలబడ్డాం. ఈ ప్రయత్నాన్ని మరింత ముందుకు తీసుకపోవడానికి కలిసి మాట్లాడుకుందాం. దండకారణ్యంలో నడుస్తున్న జనతన సర్కారు గురించి చర్చించుకుందాం. అక్కడి ఆదివాసులకు మనం ఇంకా ఏ ఏ రూపాల్లో సంఘీభావం ప్రకటించగలమో ఆలోచిద్దాం.

ఇందుకోసమే ఆగస్టు 24 ఆదివారం హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఈ చర్చకు దోహదపడతాయని దండకారణ్యం గురించి వచ్చిన కొన్ని పుస్తకాలు మీకు అందిస్తున్నాం.

మీ అందరికీ ఇదే ఆహ్వానం.

తేది: 28.07.2014

నివేదిక

దండకారణ్య సంభాషణ - ప్రత్యామ్నాయ సహాన్వేషణ

- బాసిత్

హైదరాబాద్, సుందరయ్య భవన్ సెల్లార్ హాలులో ఆగష్టు 24, 2014 ఆదివారం రోజు ఉదయం పది గంటల నుండి సాయంకాలం 5.30 గంటల వరకు 'దండకారణ్యంలో జనతన సర్కార్' పై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఉదయం సెషన్‌కు విప్లవ రచయితల సంఘం, కార్యదర్శి కా.వరలక్ష్మి అధ్యక్షత వహించగా భోజన విరామానంతర సెషన్‌కు సీనియర్ సభ్యులు కా.సి.ఎస్.ఆర్.ప్రసాద్ అధ్యక్షత వహించారు.

ఉదయం సెషనులో విరసం కార్యవర్గ సభ్యుడు కా.పాణి దండకారణ్య భౌగోళిక సామాజిక ఆవరణలో జరుగుతున్న ప్రయోగాన్ని సోదాహరణంగా వివరించారు. ఆ ప్రయోగం గురించి బయటి సమాజం ఏమనుకుంటున్నదో సంభాషణ జరపాలనే ఉద్దేశంతోనే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

శ్రీకాకుళ పోరాటం గురించి అప్పట్లో చాలా సమాచారం తెలుగు రచయితలకు, మేధావులకు అందింది. ఆ స్ఫూర్తిని కూడా సొంతం చేసుకున్నారు. ఇప్పుడు సమాచారం చాలా అందుబాటులో ఉన్నా దండకారణ్యంలో ఏం జరుగుతున్నదో సరిగా అందరికీ తెలియడం లేదు. నిజానికి అక్కడ ఏం జరుగుతున్నదో దండకారణ్య రచయితలు చాలా వివరంగా రాస్తున్నారు. అవన్నీ చదువుతూ, ప్రచురిస్తూ, ప్రచారంలో పెడుతున్నందు వల్ల విరసంకు కొంచెం ఎక్కువగా తెలిసే అవకాశం ఉంది. అందువల్ల అందరం కలిసి దండకాణ్య జనతన సర్కారు గురించిన సహాన్వేషణ చేయాల్సి ఉంది. ఈ ప్రయత్నాన్ని మూడు కోణాల్లో చేయడం బాగుంటుంది. విప్లవకారులు వెళ్లడానికి ముందు దండకారణ్య పరిస్థతి ఏమిటి? విప్లవోద్యమం మొదలయ్యాక వచ్చిన మార్పులు ఏమిటి? దండకారణ్య ప్రయోగం గురించి మాట్లాడుకునేటప్పుడు ఎలాంటి ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉందో ఊహించి వాటికి సమాధానాలు ఏమిటి? అనే వైపుల నుంచి స్థూలంగానైనా పరిశీలించడం బాగుంటుంది.

విప్లవోద్యమం అక్కడికి వెళ్లేనాటికి పూర్తిగా పోడు వ్యవసాయం ఉండేది. ప్రాచీన సాంఘిక నియమాలు పటిష్టంగా ఉండేవి. ఆదివాసులకు ప్రకృతిలో స్వేచ్ఛ ఉండేదేగాని సామాజిక స్వేచ్ఛ లేదు. తెగలుగా తరతరాల నుంచి ఉన్న కట్టుబాట్లు వాళ్ల సాంఘిక జీవితాన్ని నిర్దేశించేవి. పితృస్వామిక భావజాలం వల్ల దండకారణ్య మహిళల పరిస్థితి పురుషులకన్నా మరీ దుర్భరంగా ఉండేది. మైదాన ప్రాంత వ్యాపారుల దోపిడి, భారత ప్రభుత్వ, అటవీశాఖ అధికారుల వేధింపులు నిత్యం ఎదుర్కోవాల్సి ఉండేది. అడవిలో ఒక పుల్ల విరవాలంటే అక్కడి ఆదివాసులకు భయం ఉండేది. ఈ విషయాలు విప్లవోద్యమ ప్రారంభ దినాల్లో అక్కడి నుంచి వచ్చిన కథల్లో మనం చదువుకున్నాం. వాస్తవానికి ఆదివాసులు ప్రకృతిలో స్వేచ్ఛగా జీవించి ఉండవచ్చుగాని, దాని మర్మం వాళ్లకు తెలియదు. అందువల్లే అనేక విశ్వాసాలు, భయాందోళనలు ఉండేవి. ప్రకృతిని ఆరాధించడమేగాని, అర్థం చేసుకోవడం సాధారణంగా ఏ ఆదివాసులకూ తెలియదు. దండకారణ్య ఆదివాసులకు కూడా.

దండకారణ్యం కొందరు భావిస్తున్నట్లు వర్గాలు లేని సమాజం కాదు. అది వర్గ సమాజమే. విప్లవోద్యమ ప్రారంభ దినాల్లో ఉద్యమ కారుల మధ్య ఈ చర్చలు చాలా జరిగేవని వాళ్ల రచనలనుబట్టి తెలుస్తోంది. మైదాన ప్రాంతాల్లాగా వర్గాలు వ్యక్తం కాకపోయినా దండకారణ్యం కూడా వర్గ సమాజమే. సాంఘిక గుర్తింపుతో ఉండే అంతరాలు సారాంశంలో వర్గాలే అని విప్లవకారులు నిర్ధారించారు. మార్క్స్ చెప్పినట్లు అన్ని సమాజాలు వర్గ సమాజాలే అనే మాట 1980 నాటి దండకారణ్యానికి కూడా వర్తిస్తుంది.

అటవీ అధికారుల, పోలీసుల దాష్టీకాలకు వ్యతిరేకంగా ఆదివాసులు విప్లవకారుల నాయకత్వంలో పోరాటం మొదలు పెట్టారు. 1980లలో గోదావరి తీరం దాటిన విప్లవకారలు మహారాష్ట్రలోని గడ్చిరోలి మీదుగా చత్తీస్‌గడ్ దండకారణ్యంలోకి విస్తరించారు. 1995 నాటికి గ్రామారాజ్య కమిటీలు ఏర్పడ్డాయి. ఇవి జనతన సర్కారుకు పూర్వం రూపం. 2003 దాకా ఇవి పని చేశాయి.

ఎక్కువ మంది ప్రజలు భూమిలేని కూలీలు. ఈ భూమిలేని వారి కేంద్రంగానే విప్లవోద్యమం పురోగమించి తొలి ప్రజారాజ్య రూపంగా గ్రామరాజ్య కమిటీలు ఏర్పడ్డాయి. తద్వారా ఆదివాసులు భూ యజమానులుగా మారారు. ఇదంతా వర్గపోరాటం ద్వారానే సాధ్యమైంది. దాని అభివృద్ధికర రూపంగా క్రాంతికారీ జనతన సర్కారు 2003లో ప్రారంభమై 2005 నాటికి దండకారణ్యంలోని వివిధ ప్రాంతాలకు తరతమస్థాయి అభివృద్ధి తేడాలతో విస్తరించింది. ఎనిమిది , తొమ్మిది శాఖలతో ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకోవడం మొదలైంది. జనతన సర్కారు కార్యక్రమాన్ని విధాన పత్రం మార్గదర్శకంలో అమలు చేసే వారు మాత్రమే నాయకత్వంలో ఉంటారు. దానికి భిన్నంగా వ్యవహరించేవారిని ప్రజలు గ్రామసభల ద్వారా వెనక్కి పిలిచే పద్ధతి కూడా ఉంది.

దండకారణ్య విప్లవోద్యమ అవగాహనకు మూడు పత్రాలు కీలకమైనవి. బస్తర్ వర్గ విశ్లేషణ, విప్లవకర భూ సంస్కరణలు, జనతన సర్కార్ విధాన పత్రం. వీటి వెలుగులో అక్కడి ప్రయోగం జరుగుతున్నది. భూ సంస్కరణలు నిరంతరం.. ప్రతి ఏటా జరుగుతూ ఉంటాయి. వర్షాధారం, నీటి పారుదల, నేల స్వభావం, కుటుంబ సభ్యులు, అమర వీరుల కుటుంబాలు.. వంటి ఎన్నో ప్రమాణాల మీద ఆధారపడి నేల చదును చేయడం మళ్లీ మళ్లీ భూమి పంచడం జరుగుతూ ఉంటుంది. దీని ఉద్దేశం ఉత్పత్తి పెంచడం. ప్రజలందరినీ ఉత్పత్తిలో భాగం చేయ ఎడం. భూ యాజమాన్యంలో అసమానతలు లేకుండా చూడటం. ప్రతి గ్రామంలో సహకార పద్ధతిలో, సమిష్టి పద్ధతిలో వ్యవసాయం జరుగుతోంది.

అనేక సాంఘిక ఉద్యమాలు వచ్చాక, వర్గాలను పూర్వపక్షం చేసే

ధోరణి ప్రబలింది. దండకారణ్యం వర్గసమాజం కావడం, అక్కడ వర్గ పోరాటం సునిశితంగా జరగడం వల్లే ఉత్పత్తిలో ఈ అభివృద్ధి సాధ్యమైంది. 'రాగో' నవలలోగా సాంఘిక విముక్తి వర్గపోరాటంలో మాత్రమే సాధ్యం అవుతుందనేది విషయం ఇప్పుడు మరింతగా దండకారణ్యంలో రుజువు అవుతోంది. అయితే సాంఘిక విముక్తి దానికదిగా ఆర్థిక సమస్యలపై పోరాడుతూ పోతే అయ్యేది కాదు. సాంఘిక విషయాలపై కేంద్రీకరణ చాలా అవసరం అని కూడా ఇవాళ అక్కడి మహిళా ప్రాతినిధ్యం రుజువు చేస్తోంది. ఆదివాసీ మహిళ అసలు పురుషుని ముందు లెక్కేకాదు. అట్లాంటి ఆదివాసీ మహిళను 'రాగో'లాగా ఈ ముప్పయ్యేళ్ల కాలంలో విప్లవోద్యమం సాధించిన విజయాల్లో ఒకటి. వర్గాన్ని నమ్మే వాళ్లు కూడా దండకారణ్యం వంటి ఆదివాసీ సమాజంలో సాధ్యమైన పరివర్తన మిగతా సమాజంలో సాధ్యమేనా? అనే సందేహం వ్యక్తం చేయవచ్చు. రాజ్యం ప్రభావం నేరుగా లేని సమాజం కాబట్టి, మైదాన ప్రాంతాల్లో వలె వర్గాలు లేని సమాజం కాబట్టి, ఆదివాసులు 'అమాయకులు కాబట్టి ఈ ప్రయోగం సాధ్యమైందనే అభిప్రాయం ఉండవచ్చు. ఎంతో సంక్లిష్టంగా ఉండే, అనేక ఆధిపత్యాలు ఉండే మైదాన ప్రాంతంలో ఇది సాధ్యమా?' అనే ప్రశ్నలు తలెత్తే అవకాశం ఉంది. ఇలాంటి ప్రశ్నలు వేసుకొని .. వాటికి దండకారణ్య విప్లవాచరణ నుంచి, అవగాహన నుంచి ఎలాంటి సమాధానాలు వెతకవచ్చో అన్వేషించడమే మంచిది. ఏ ప్రశ్నలు, సందేహాలు లేకుండా సంఘీభావం ప్రకటించడంలో ఇబ్బందులు ఉంటాయి. అంతకుమించి దండకారణ్యాన్ని దాని ప్రత్యేకతల నుంచి, విశిష్టతల నుంచి సిద్ధాంత దృష్టితో విశ్లేషించుకోవడమే అవసరం.

అట్లాగే 4 లక్షల అర్ధ సైనిక, సైనిక బలగాలను భారత ప్రభుత్వం మోహరించి అక్కడ యుద్ధం చేస్తోంది. ఒక ఆదివాసీ గెరిల్లాకి 50 మంది చొప్పున అనగా 1:50 భారత ప్రభుత్వ బలగాలు మోహరించి ఉన్నాయి. ఈ యుద్ధం మరింత తీవ్రమైతే విప్లవోద్యమం చేపట్టిన ప్రయోగం నిలబడుతుందా? అనే ప్రశ్న కూడా ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే

1980ల నుంచి ప్రజా యుద్ధం చేస్తూనే ప్రజా ప్రత్యామ్నాయం ఇక్కడిదాకా పురోగమించిందనే విషయం మర్చిపోవడానికి వీల్లేదు. అప్పట్లో జనజాగరణ మంచ్ అణచివేత కాంపెయిన్ చేపట్టింది. 2005 నుంచి సల్వాజుడుం నడిచింది. 2009 నుంచి ఆపరేషన్ గ్రీన్‌హంట్ మొదలై తొలి దశ పూర్తై రెండో దశ ఇప్పుడు నడుస్తోంది. ఇప్పుడు ఆల్‌ఔట్ వార్ నడుస్తోంది. అయినా ఈ యుద్ధం మధ్యనే ప్రజా యుద్ధం పురోగమిస్తోందనే వాస్తవం నుంచి భారత ప్రభుత్వానికి ఉన్న భారీ సైనిక బలగాలను, ఆయుధ సంపత్తిని, అవన్నీ కలిసి దాడి చేస్తే జరిగే పరిణామాలను అర్థం చేసుకోవచ్చు. ప్రజాయుద్ధం పురోగమించడానికి ఉన్న అవకాశాలు అప్పుడు తెలుస్తాయి.

అట్లాగే సర్కార్ బీజరూపంలో ఏర్పడిందని అంటున్నామంటే దాన్ని 'స్టేట్' అనొచ్చా?" అనే ఇంకో ముఖ్యమైన ప్రశ్న కూడా ఎదురవుతుంది. ఇది తప్పక లోతుగా ఆలోచించాల్సిందే. ఉత్పత్తిలో మిగులు ఉందా? అని ఆలోచించాలి. ఒకప్పుడు పోడు వ్యవసాయం, విప్పపూల సేకరణ వంటి వాటిపై ఆధారపడి ఉండేవారు. తిండికి కూడా ఇబ్బందిగా ఉండేది. ఇప్పటికీ అక్కడక్కడ పోడు వ్యవసాయం ఉన్నప్పటికీ స్థిర వ్యవసాయం దిశగా పరివర్తన జరుగుతున్నది. ప్రజలకు, సైన్యానికి ఆహార సమస్య లేకుండా ఉత్పత్తి చేయగలుగుతున్నారు. నీటిపారుదల వ్యవస్థలు, నాట్లు వేసి పండించే పద్ధతులు అలవాటు చేసుకుంటున్నారు. గతంలో అలవాటు లేని పంటలు పండించడం కూడా నేర్చుకుంటున్నారు. వీటి వల్ల ఆహార అవసరాలు తీరగా విద్య, వైద్యం వంటి వాటికి వ్యవసాయ ఉత్పత్తి నుంచి సపోర్టు ఉంది. ఉత్పత్తిని పెంచుదాం.. జనతన సర్కార్‌ను బలోపేతం చేద్దాం అనే నినాదం వర్గపోరాట ఆచరణలో ఉన్నందున భవిష్యత్తులో మిగులు గురించి, దాన్ని ప్రజల పరం చేయగల పటిష్ట నిర్మాణం గురించి నమ్మకం పెట్టుకోవచ్చు. దీనితోటు రాజ్యానికి ఉండాల్సిన సైన్యం, నూతన భావజాల ఉపరితలం కూడా రూపొందుతున్నాయి అని చర్చకు అవసరమైన ప్రాతిపదికలను ముందుకు తెచ్చారు. ఇలాంటి ప్రశ్నలు ఇంకా ఎన్నో వేసుకొని సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందని అన్నారు.

ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక నుంచి కాత్యాయని విద్మహే మాట్లాడుతూ దండకారణ్య సాహిత్యంతో ఉన్న పరిచయం వల్ల అక్కడి ప్రత్యామ్నాయాన్ని కొంత వరకు తెలుసుకోగలిగానని అన్నారు. ముఖ్యంగా అక్కడి రచయిత్రులు రాసే కథలు... వాటిలో వాళ్లు చిత్రించిన అభివృద్ధి కోసం పడుతున్న శ్రమ గురించి తెలుసుకున్నాక ఆ క్రమంలో చాలా దండకారణ్యం సాహిత్యాన్ని చూస్తున్నానని ఆమె అన్నారు. ఇక్కడి అభివృద్ధి ఎలా ఉందో చూస్తున్నాం. తాజాగా కె.సి.ఆర్. కూడా రింగ్‌రోడ్ల గురించే మాట్లాతున్నడు. వ్యవసాయం గురించి ఇప్పటికి ఆయన ఏమీ స్పష్టంగా మాట్లాడటం లేదు. దండకారణ్యంలో జరుగుతున్న వ్యవసాయం, విద్య, వైద్యం తదితర విభాగాల్లో జరుగుతున్న వికాసాన్ని, అక్కడి మనుషులు పొందుతున్న సంస్కారాన్ని మన సమాజంలోకి ఎట్లా తెచ్చుకోవాలో ఆలోచించాలి. అందు కోసమైనా ఈ సమాజం గురించి ఆలోచిస్తున్న మనం దండకారణ్య ప్రయోగాన్ని పట్టించుకోవాలి. అయితే నేను సాహిత్య విద్యార్థిగా దండకారణ్య సాహిత్యానికి మొత్తం తెలుగు సాహిత్య చరిత్రలో చోటు లేకపోవడం వెలితి. అసలు బైటి సమాజ సాహిత్య చరిత్రలే సరిగ్గా లేవు. దండకారణ్య సాహిత్యం గురించి అధ్యయనం చేయడం, దాని విశిష్టత రాయడం ఒక బాధ్యతగా నేను ఎంచుకుంటాను. ఇది అనేక మంది కలిసి చేయాల్సిన పనే. అయినా ఎక్కడో ఒక చోట మొదలు పెట్టాలి..అని ఆమె ముగించారు.

కథా రచయిత పగడాల నాగేందర్ మాట్లాడుతూ, 'దండకారణ్య కథలు' చదివాక ఇక అస్తిత్వ ఉద్యమాల పని అయిపోయిందనిపించింది. వేటగాడిపని అయిపోయిందని ఇక సింహమే మాట్లాడుతుందని అనిపించింది. 'చేపలు నీళ్లు తాగితే చెరువు ఎండిపోతుందా?' 'ఆదివాసులు చెట్టుకొమ్మలు కొట్టుకుంటే అడవి అంతం అయిపోతుందా?' దండకారణ్య రచయిత రాసిన 'ఓ పగ్నికథ' నచ్చింది. నిజమైన రచయితలు దండాకారణ్య రచయతలే. 'చాయ్‌గ్లాసు', 'లక్ష్మణరేఖ' వంటి కథలు ఏ గ్లోరిపై లేకుండా ఎంతో స్వచ్ఛంగా ఉన్నాయి. భద్రజీవులు విస్మరించిన సాహిత్యం అరుణతారలో వస్తోంది. 'రాగో' ముందు మాటలో బాలగోపాల్ లేవనెత్తిన సందేహాలకు జనతన సర్కారు జవాబు చెప్తోంది అన్నారు.

ఆదివాసి విద్యార్థి నాయకుడు మైపతి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో ఇప్పటి సోకాల్డ్ ప్రజాస్వామిక వ్యవస్థ లేనపుడే ఆదివాసీ ప్రాంతంలో స్వపరిపాలన ఉండింది. అయితే 'స్వతంత్ర్యం' వచ్చిన తర్వాత భారతప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు చూస్తుంటే జనతన సర్కారు సఫలం అవుతుందనిపిస్తుంది. బ్రిటిష్ పాలన కాలంలోనే ఆదివాసీ ప్రాంతాల్లో వనరుల దోపిడీకి వ్యతిరేకంగా 1947కు ముందు

కూడా పోరాటాలు జరిగాయి. స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంలో పాకిస్తాన్ ఒక ప్రత్యేక దేశంగా ఏర్పడింది, కాని ఆదివాసీలకు ప్రత్యేక రాజ్యం రాలేదు. నెహ్రూ చేసుకున్న ఒప్పందాల్లో భాగంగానే ఐదో, ఆరో షెడ్యూల్లు ఆదివాసుల కోసం ఏర్పాటు చేసారు. పోలవరం విషయంలో ఆదివాసీ ప్రాంతాల్ని 'బలి' ఇచ్చి తెలంగాణ తెచ్చుకున్నారు. షెడ్యూల్ ఏరియాలో గిరిజనేతరుల నివసించడానికి వీల్లేదని చట్టం చెబుతోంది. కాని అమ్మడాలు, కొనడాలు జర్గుతున్నాయి. పంచాయితీ చట్టాలు అమలు కావటం లేదు. ఇటువంటి నేపథ్యంలో జనతన సర్కారును మైదాన ప్రాంతానికి విస్తరించగలమా? ఒక్క ఎమ్మెల్యే సీటును గెలుచుకోవటం కోసం 100 కోట్లు ఖర్చు చేస్తున్న నేపథ్యంలో ప్రజల ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకమే, కదా? ఇన్ని అత్యాచారాలు, ఘోరాలు బయట సమాజంలో జర్గుతున్నాయి కదా? దండకారణ్యంలో ఒక్క ఆదివాసీ యువకుడైనా అత్యాచారానికి పాల్పడిన కేసు ఉన్నదా? ఎందుకంటే అక్కడ స్వార్థం లేదు. కనుక క్రైం లేదు. అయితే భూమికోసం పోరాడడం ఉంటుంది. ఆదివాసీ కోయ సమాజంలో కొన్ని విలువలతో కూడిన సంస్కృతి, సాంప్రదాయాలు ఉన్నాయి. ఆదివాసులు మావోయిస్టు పార్టీ చొరవతో చదవటం, రాయడం నేర్చుకున్నారు.

శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత మాట్లాడుతూ తనకు సాహిత్యం మీద కంటే అక్కడి ఉద్యమాల మీదనే ఆసక్తి అని చెప్తూ జనతన సర్కారును బయటి సమాజానికి తేవడమే పరిష్కారం అన్నారు. ఆదివాసులు ఎట్లాగైతే 4 లక్షల భారత సైన్యంతో పోరాడుతున్నారో అట్లాగే భారత ప్రజలు, భారత ప్రభుత్వంతో పోరాడవలసిన అవసరం ఏర్పడింది. అయితే బయటి సమాజంలో ఈ మోడల్ సాధ్యమవుతుందా? అనే ప్రశ్నకు ఇంకా సమాధానం వెతకాల్సే ఉంది. ఇది చాలా సంక్లిష్టమైన వ్యవస్థ. అయినా అక్కడ ఒక ప్రయోగం జరుగుతోంది. దాన్ని ఒక ఉదాహరణగా ప్రచారం చేయాల్సి ఉందని అన్నారు.

సుంకిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో జరుగుతున్నది అస్తిత్వ పోరాటమా, వర్గపోరాటమా లేక ప్రజాస్వామిక హక్కుల పోరాటమా? అనే ప్రశ్న లేవనెత్తారు.

కా.వరలక్ష్మి జోక్యం చేసుకుంటూ కా.పాణి ఆరంభంలోనే చెప్పినట్లు ఆదివాసీ సమాజం వర్గసమాజం. ఆదివాసీ అనే అస్తిత్వం కూడా ఉంటుంది. వర్గ పోరాటం నిర్వహించే పార్టీ అక్కడికి వెళ్లి ఆదివాసీ భూస్వాములకు, పూజార్ల పెత్తనానికి వ్యతిరేకంగా భూమిలేని ఆదివాసులను ఆర్గనైజ్ చేసింది. ఈ క్రమంలో అనేక సాంఘిక సమస్యలను ఎజెండాగా ముందుకు తీసుకొని వచ్చింది. సారాంశంలో ఇదంతా వర్గపోరాటమే కదా అన్నారు.

'చూపు' కాత్యాయని మాట్లాడుతూ వర్గపోరాటానికి, అస్తిత్వ పోరాటానికి శతృత్వాన్ని అపాదించనక్ఖర లేదన్నారు. పితృస్వామ్యంపై స్త్రీలు పోరాటం చేస్తూనే వర్గ పోరాటం కూడా జమిలి చేయాల్సి ఉంటుంది. ఒక సాంఘిక అస్తిత్వం ఉన్న ఆదివాసులు అందులోంచే వర్గ పోరాటాన్ని నిర్మించారని, వర్గయుద్ధంలో భాగంగానే సాంఘిక అస్తిత్వ సమస్యల్ని పరిష్కరించడం జరుగుతుందని, ఉదాహరణకు మహిళల సాంఘిక విముక్తి, వర్గ యుద్ధంలో భాగంగానే సాధ్యమని రుజువు అవుతోందని అన్నారు. అయితే దండకారణ్యాన్ని ఇక్కడ ప్రచారం చేయాలంటే మన సమాజంలోని మేధావులు ఎంత సెన్సిబుల్‌గా ఉన్నారో తెలుసుకోవాలి. రాజ్యం నుంచి వచ్చే ఏ చిన్నదాన్నీ వదులుకోడానికి సిద్ధం కాకుండా ఒక జీవన్మరణ యుద్ధం మధ్య నిర్మాణమవతున్న ప్రజా ప్రత్యామ్నాయాన్ని ఎలా ఎత్తిపట్టగలం? ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణలో ఎందుకు ఉద్యమం నష్టపోయిందో చూడకుండా మావోయిస్టులు ఇక్కడ నష్టపోతే ఇంకోచోట ఉద్యమాన్ని నిర్మిస్తారని అనడం బాగానే ఉంటుందిగాని ఉద్యమంలో పాల్గొన్న ప్రజల ఆకాంక్షల వైపు నుంచి ఈ సమస్యను చూడాలని అన్నారు.

జనజ్వాల మాట్లాడుతూ – 'తెలంగాణ సమాజం పాలక వర్గాలతో ఎలా ఉండాలో నిర్ణయించుకోవాల్సిన దశలో విరసం ఈ సదస్సు నిర్వహించడం సంతోషం అన్నారు. మావోయిస్టు పార్టీ వెనుక కొంత దూరమైనా కలిసి వచ్చేవారున్నారు. అలాంటి వాళ్లను భాగస్వామ్యం చేస్తే బావుండును. జనతన సర్కారును చూసే అవకాశం ఉంటే బావుండునని ఆయన అన్నారు.

వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ దండకారణ్య చర్చ ప్రారంభించడం సంతోషమని, ఇరవై ఏళ్లక్రితం కూడా ఇట్లాంటి ఒక చర్చ జరిగిందని అన్నారు. 70లలో 3000 గ్రామాలు విముక్తం అయ్యాయని విన్నాం. దండకారణ్యలో ఏం జర్గుతుందో డాక్యుమెంటేషన్ చేయాలన్నారు. దండాకారణ్య సాహిత్యం మీద జరగాల్సినంత చర్చ రెండురాష్ట్రాల్లో జరగడం లేదని ఆయన అన్నారు. ముప్పైఏళ్ల క్రితం ఒక 80 ఏళ్ల పెద్దాయనను 'ఎలా ఉన్నారు' అంటే 'విప్లవం కోసం ఎదురు చూస్తున్నాను' అని అన్నారని అట్లాంటి నమ్మకమే తనకూ ఉందని ఆయన అన్నారు.

తెలంగాణలో బీజప్రాయంగా ఎర్రరాజ్యం ఎట్లుండ బోతోందో మహీధర రామ్మోహన రావు 'ఓనమాలు' నవలలో రాసారని, తెలంగాణ నుంచి వచ్చే రిపోర్ట్స్ ఆధారంగా రామ్మోహనరావు ఆ నవల రాసానని చెప్పారని వి.వి. అన్నారు. గంగు నవలలో కూడా విప్లవ ప్రక్రియ, భూసంస్కరణలు ఎలా చేసారో ఉన్నదని, కాని ప్రజాసైన్యంలో రాజ్యాధికారాన్ని పట్టుకోవడం అనేది అప్పటి నాయకత్వానికి లేకపోవడం వల్ల ఆ విషయాలు ఆ నవలల్లోకి రాలేదని అన్నారు. ఆ దృక్పథం అప్పటికీ చాలా మార్క్సిస్టు, లెనినిస్టుపార్టీలకే లేదని, చాలా ముందు చూపుతో చారుమజుందార్ తన తెరాయి డాక్యుమెంట్లలో చెప్పాడని కా.వి.వి. అన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట క్రమంలో ప్రజామంత్రి వర్గ ప్రణాళిక కూడా ఉండిందని, పంచ్ కమిటీలు ఏర్పాటుచేయడం గురించి, అందులో ఇద్దరు స్త్రీలు ఉండాలని ప్రతిపాదన కూడా ఉందని రత్నమాల అన్నారు. అయితే అప్పటి పరిమితుల వల్ల ఉండాల్సినంత లేకపోయినా కొంత ఉందని, ఇప్పుడైతే పరిమాణాత్మక మార్పు జరిగిందని ఆమె అన్నారు.

కృపాకర్ మాదిగ మాట్లాడుతూ నక్సల్బరీ తిరిగి, తిరిగి వచ్చినట్లు, కారంచేడుకు కూడా వచ్చి వెళ్లింది. దండకారణ్యంలోకి వెళ్లింది. పుదురుపాకకు కూడా వస్తే బాగుండనని అనుకుంటున్నట్లు అన్నారు. దండకారణ్య జనతన సర్కారును గుర్తించాలని భారతప్రభుత్వాన్ని ఐక్యరాజ్యసమితిని డిమాండ్ చేయాలని ఆయన అన్నారు. దండకారణ్యం హిడింబి వారసులదని, అది బర్బరీకులదని, అది తన వారసులదని అందుకే తాను ఇక్కడికి దండకారణ్యం గురించి వినడానికి, మాట్లాడటానికి వచ్చానని కృపాకర్ మాదిగ అన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమం వల్ల వర్గీకరణ వల్ల జరిగిన ఇంపాక్ట్ వివరాలు తమ దగ్గర, ప్రభుత్వాల దగ్గర ఉన్నాయని, అట్లాగే దండకారణ్య

పరిణామాలకు సంబంధించిన ప్రభావశీల అధ్యయన గ్రంథాలు అందుబాటులో ఉండాలని కోరారు. సూక్ష్మ స్థాయిలో అక్కడి మానవ వికాసం గురించి అందరికీ తెలియాలి. ఆపరేషన్ గ్రీన్‌హంట్ గిరిజనులకు మాత్రమే సంబంధించినది కాదు. అందరిదీ. రచయితలు కుహనా తాత్విక చింతన వదిలేసుకొని ఈ చర్చల్లోకి రావల్సిందేనని డిమాండ్ చేస్తున్నానని కృపాకర్ మాదిగ అన్నారు.

భోజన విరామానంతర సెషన్‌కు అధ్యక్షత వహిస్తూ కా.సి.ఎస్.ఆర్. ప్రసాద్ అధ్యక్షత వహించారు.

కాసుల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ప్రజల కోసం ఏ పోరాటం జరిగినా, అది సాయుధ పోరాటమైనా సమర్థించాలనే సెంటిమెంట్ ఉన్న రచయితనని, అందులో భాగంగానే మహాజన పార్టీలో పనిచేసాని అన్నారు. తెలంగాణ సామాజిక సందర్భంలో కూడా అదే దృక్పథంతో పనిచేస్తూ వద్దెబోయిన శ్రీనివాస్ తదితరుల అరెస్టును, బెల్లి లలిత హత్యను ఖండించామని అన్నారు. ప్రపంచీకరణకు వ్యతిరేకంగా జరిగే అన్ని స్థానిక ఉద్యమాలను సమర్థించాలనుకున్నామని అన్నారు. జనతన సర్కారుకు మద్దతుగా బయట ఒక సాంస్కృతిక పోరాట నిర్మాణం జరగాలని కోరుకుంటున్నట్లు ఆయన అన్నారు.

ఇంద్రవెల్లి రమేశ్ మాట్లాడుతూ వ్యక్తిగతం, రాజకీయం వేర్వేరు కాదని అందుకే 10, 15 ఏళ్ల సాహిత్య చరిత్రను విరసం, విప్లవం మీద తిరుగుబాటును సైతం రికార్డు చేస్తూ 'వెల్లడి' తీసుకొచ్చానని అన్నారు. దండకారణ్య సాహిత్యం గొప్ప సాహిత్యం. అరుంధతీరాయ్ దండకారణ్యంలో ఏం జరుగుతుందో రాస్తూ విప్లవ రాజ్యం వస్తే ఫలానా, ఫలానా అంశాల్లో ఏం చేస్తారో అనే సందేహాలతో సహా ఉన్నదున్నట్లుగానే రాసారని అన్నారు. అట్లాగే ఆధునికత పేరు మీద సాంప్రదాయక నమ్మకాలన్నీ వెనుకబాటేవని తేల్చడానికి మనం ఎవరమని ప్రశ్నించారు. తెలంగాణలో సాయుధ పోరాటం తర్వాత జరిగిన సమస్త పోరాటాల వల్లనే తమ లాంటి రచయితలు పుట్టుకొచ్చారని, దండకారణ్యానికి తమలాంటి రచయితలు వెళ్లి రావల్సిన అవసరం ఉందని అన్నారు. దండకారణ్య పోరాటాన్ని సమర్థించాల్సిందే కాని ఉన్నదున్నట్లుగా కాదని అన్నారు. దండకారణ్యంలోకి మావోయిస్టులు తమ ప్రోగ్రాం అమలు చేయడానికి వెళ్లారా? లేక ఆదివాసీ సంక్షేమం కోసం వెళ్లారా? అనేది కూడా చర్చనీయాంశమే అన్నారు.

సుంకిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ మన దేశంలోని ఆదివాసీ ప్రాంతాల్లో జరుగుతున్న పోరాటాన్ని, జనతన సర్కారును సమర్థించి, సంఘీభావం ప్రకటించాలి అన్నారు. అంతటి నిజాయితీతో, న్యాయబద్ధంగా జరుగుతున్న పోరాటానికి బయటి సమాజంలో మద్దతు కూడగట్టే ప్రయత్నం జరగాలని అన్నారు.

కాత్యాయని (చూపు) మాట్లాడుతూ "మధ్య తరగతి రచయితలుగా మనమేం చేయాలి? ఒక కొత్త ప్రజాస్వామిక సంస్కృతి అక్కడే పుడుతుంటే, అంతకంటే సంతోషించవలసినది మరేమి ఉండదు. రచయిత ఏం చేయగలరు! నైతిక మద్దతు ఇవ్వగలరు. ఈ సమాజాన్ని సెన్సిటైజ్ (సున్నితం) చెయ్యగలరు. పోలీసులు ఆదివాసుల మీద ఇంత దాడి చేస్తుంటే ఎవరూ ఎందుకు మాట్లాడడం లేదు? రాజశేఖరరెడ్డి ప్రభుత్వంతో చర్చల సందర్భంలో కంటే ఈ రోజు మేధావులు జాగ్రత్తగా ఉన్నారు. దండకారణ్యంలో ఇంత జరుగుతూ ఉంటే సరిహద్దు రాష్ట్రాల్లో ఎలాంటి స్పందన ఉండాలి? రచయితలు రాజ్యంలో భాగమై పోతే ఏమిటన్నట్లు? తెలంగాణ రచయితలు తెలంగాణ రాజ్యాంలో భాగమై పోయారా? రచయితలు వీటన్నింటి పట్ల నిజాయితీగా ఉంటున్నారా? చర్చల సందర్భంగా మనం ఏం పోగొట్టుకున్నాం అనే దాని మీద చర్చ జరగాలి. వై.ఎస్సార్ మోసం చేయవచ్చు. వాడు ఎలాగూ మోసం చేస్తాడు. మనవైపున ఏం పొరపాట్లు జరిగాయన్నది చర్చించాలి. ఏ చిన్న తక్షణ సమస్యపట్ల బాధ్యత లేనివాళ్లు 'జనతన సర్కారు'ను ఒకవేళ సమర్థించినా ఏంలాభం? దానికి ఏ ప్రతిప్రత్తి ఉంటుంది? అని ఆమె ముగించారు.

కవి జూకంటి జగన్నాథం మాట్లాడుతూ, "రాజ్యం అణిచివేతకు, ఏ రచయితా అతీతుడు కాదు. దోపిడీ తీవ్రంగా ఉంది. కాబట్టే తెలంగాణలో పోరాటాలు జరిగాయి. కథలను కళాత్మకంగా రూపొందించడంలో ఏదో లోపం జరిగిందను కునేవాణ్ని కాని అల్లం రాజయ్య కథలు గొప్పవి. 'గ్రామాలకు తరలండి' క్యాంపెయిన్‌లో విరసం సభ్యులతో పాటు నేనూ అరెస్టు అయ్యాను. ఆ తర్వాతే ఉద్యమం దండకారణ్యం వెళ్లింది. సర్కారు కవులూ, రచయితలూ అప్పుడూ ఉన్నారు. ఇప్పుడూ ఉన్నారు. కాబట్టి ఇపుడా చర్చ అనవసరం. ఇట్లాంటి భద్రజీవులు ఎప్పుడూ ఉంటారు. కవులను, రచయితలను దండకారణ్యం తీసుకెళ్లండి. అల్లం రాజయ్య రచనల నుండి దండకారణ్య సాహిత్యం దాకా అందరూ చదవాలి. బయటి రచయితలకు విరసం ప్రపంచీకరణ గురించి, విప్లవోద్యమం గురించి ప్రత్యేక క్లాసులు పెట్టాలి. మనందరి ఆలోచనలకు అందనం ఎత్తుకు దండకారణ్య రచయితలు వెళ్తున్నారు. వారికి మద్దతు తెలపాల్సిన అవసరం ఉంది...' అంటూ ముగించారు.

నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ 'దండకారణ్యంలో జనరాజ్య నిర్మాణం జరగడం సువర్ణాక్షరాల్తో లిఖించదగ్గది. జనతన సర్కార్ విషయంలో మీడియా అన్యాయంగా వ్యవహరిస్తోంది. ప్రజల తరపున ఏం చేయాలో మనం తేల్చుకోవాలి" అన్నారు.

ఎన్.సుధాకర్ మాట్లాడుతూ "నేను కవిని, రచయితను కాకపోయినా విప్లవ జనతన సర్కార్ గురించి మాట్లాడుకుందాం రమ్మని పిలిచారు కాబట్టి వచ్చాను. ఏదైనా రాసినా కార్యాచరణలో భాగమగానే రాసాను. జనతన సర్కారును బయట ప్రచారం చెయ్యడానికి ఒక పాటో, కరప్రతమో, వ్యాసమో రాయాలి. అది నేను చేయలేను. నేను చేయగలిగిన పని ఏదో నాకు ఇవ్వండి. విరసం ఏదైనా చేసి జనతన సర్కారుకు సంఘీభావం తెలిపే పనిని మాకివ్వాలి. దండకారణ్య ఆదివాసుల సంస్కృతిని వెనుకబాటు తనం అనడానికి లేదు. తెలంగాణలో ప్రజారాజ్య కమిటీ ఏర్పాటయ్యాయి. ఇవాళ దండకారణ్యం గురించి బయటి పత్రికల్లో, మన పత్రికల్లో విస్తృతంగా రాయాలి. అందరికీ అందజేయాలి. దండకారణ్య ఆదివాసులకన్న మనం దౌర్భాగ్యులం. మనకన్న మన పిల్లలు బ్యాక్‌వర్డ్. కనుక విరసం ఈ స్థితిని మార్చే పనిని చేస్తుందని ఆశిస్తున్నానని చెప్పారు.

కవి లోచన్ మాట్లాడుతూ "జనతన సర్కార్ గురించి సాంస్కృతిక దళాలు ఏర్పడి విశాల జనంలోకి తీసుకెళ్లాలి. మద్దతు కూడగట్టాలి" అన్నారు.

కవిని మాట్లాడుతూ, "నిత్య నిర్బంధంలో సైతం దండకారణ్య రచయితలు అద్భుత కథలు రాసారు. వాటిని అధ్యయనం చేయాలి. జనసామాన్యంలోకి దండకారణ్య సాహిత్యాన్ని తీసుకెళ్లాలని" అన్నారు.

కవి, కాసుల లింగారెడ్డి మాట్లాడుతూ "84ఏళ్ల స్వీడన్ రచయిత దండకరణ్యం వెళ్లి రాయగలిగినప్పుడు మనం ఎందుకు రాయలేం? కనీసం సంఘీభావం తెలుపలేకపోతున్నాం. అక్కడికి వెళ్లడానికి విరసం

ఏర్పాటు చేయాలి. దండకారణ్యానికి సంఘీభావంగా విరసం విశాల వేదిక ఏర్పాటుకు చొరవచూపాలి" అన్నారు.

జి.ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ, "ఉద్వేగ భరిత వైఖరి ఉద్యమాలకు నష్టం చేస్తుంది. ఆ మోతాదు కాస్త తగ్గించాలి. వాళ్లు పీడితులు అవడం వల్ల సంఘీభావం తెలియజేస్తున్నామా? జనతన సర్కారు గురించి నాకు స్పష్టత లేదు. చట్టం ఆధారంగా కూడా జరగాల్సిన అభివృద్ధి లేని స్థితిలో అక్కడ ఉద్యమం జరుగుతోంది. ఆదివాసులపై వినరాని, కనరాని అవమానాలు, ఘోరాలు జర్గుతున్నాయి. వాళ్ల రాజకీయాలు ఏవైనా కావొచ్చు కాని అక్కడ హక్కుల ఉల్లంఘనలు జర్గుతున్నాయి. రాజకీయంగా ఆ ఉద్యమాన్ని అర్థం చేసుకొని వైఖరి ఏర్పరుచుకోవడం కష్టం. అయితే పురోగామి శక్తులకు మీడియా శత్రువుగా ఉన్నది. కనుక అక్కడికి రచయితలుగా వెళ్లి హక్కుల కోణంలో మద్దతు ప్రకటించాలని కోరుతున్నాను అన్నారు.

తెలంగాణ రచయితల సంఘం నుండి నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ "దంకారణ్య జనతన సర్కారుకు సంఘీభావంగా నేనిక్కడికి వచ్చాను. మార్పు వాస్తవం అవుతున్నపుడు, రష్యా చైనా విప్లవాలు, తెలంగాణ సాయుధ పోరాటాల నేపథ్యంలో మార్పులు నిలబడాలని, కనీసం దండకారణ్యంలోని జనతన సర్కార్ నిలబడాలని కోరుకోవడం అవసరం. నేను కూడా అందుకు నిలబడతాను. ఉద్యమాన్ని ప్రపంచవ్యాప్త ఫలితాలు అడ్డుకుంటున్న నేపథ్యంలో రచయిత ఒకే ముఖంగా ఉండాలని కోరుకుంటున్నాను." అని అన్నారు.

దానీ మాట్లాడుతూ రాజ్యం బీజరూపంలో ఉందని అంటున్నారు. రాజ్యం ప్రవేశిస్తే ఉండే ప్రత్యేకతలు చాలా ఉంటాయి. శతృవుతో పోరాడుతున్న మనలో కూడా రాజ్యం ఉంటుంది. మన అంతర్గత కారణాలు ఉంటాయి. దండకారణ్యంలో రాజ్యవ్యవస్థ బీజరూపంలో అయినా ఉందా? అనేది అధ్యయనం చేయాల్సిందే. ప్రభుత్వం ప్రజల మీద దాడి చేస్తే అతడు కమ్యూనిస్టు అయినా, కాకున్నా ఆ దాడిని ఖండించాల్సిన అవసరం ఉంది. అట్లా చేయగలిగితేనే రచయిత. లేకుంటే కాదు. దండకారణ్యంలో రాజ్యం చేస్తున్న దాడిని ఖండిస్తున్నాని అన్నారు.

ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ "మావోయిస్టు ఉద్యమం వల్ల కులాలు, వర్గాలు చైతన్యం పొంది అధికారాలు, హక్కులు పొందాయి. ఇంద్రవెల్లి దురాగతాన్ని చూసిన వాళ్లింకా జీవించే ఉన్నారు. దండకారణ్య ఉద్యమాన్ని కాపాడుకోవలసిన అవసరం ఉంద"ని అన్నారు.

ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకుడు అనంద్ మాట్లాడుతూ "ఆదివాసీ సమాజం మొదటి నుంచి ప్రతిపక్షమే. ఆదివాసుల్ని కాపాడే జనతన సర్కార్, దండకారణ్యం వైపు ప్రపంచం మొత్తం దేగ కన్నువేసింది. మావోయిస్టులే లేకపోతే ఆదివాసులు కనుమరుగు అయిపోయేవారు. 'మా వూళ్లో మా రాజ్యం' మా నినాదం. బయటికి వచ్చి మేం బతకలేం. పోలవరంలో ఆదివాసుల్ని ముంచి తెలంగాణ తెచ్చుకున్నరు. ఇక ఆదివాసులు అనివార్యంగా జనతన సర్కార్‌తో ఉంటారు. ఆదివాసులు విరసం వెంటే ఉంటారు" అన్నారు.

హెచ్.ఎం.టీ.వి. అధినేత, హంస్ ఇండియా, ఎడిటర్ - ఇన్ - చీఫ్ రామాచంద్రమూర్తి మాట్లాడుతూ, జనతన సర్కార్ పనిచేసిన తీరు గురించి వనజ రూపొందించిన డాక్యుమెంటరీ చూశాను. ప్రపంచంలో ఎక్కడలేని కొత్త పద్ధతిలో జరగడం అద్భుతం. వాటిని గురించి నేను తెలుసుకోవాల్సి ఉంది అన్నారు.

ప్రొ.హరగోపాల్ మాట్లాడుతూ దండకారణ్యం గురించి మనం తెలుసుకోవాల్సినవి చాలా ఉన్నాయి. సరియైన సమాచారం ఇవ్వకపోవడమేకాదు, తప్పుడు సమాచారం ఇవ్వడం వల్ల రాజ్యం ప్రజా వ్యతిరేకంగా పని చేస్తోంది. దండకారణ్యం గురించి కూడా అట్లాగే వ్యవహరిస్తోంది. అయితే సంస్కృతి గురించి అక్కడ చాలా ప్రయత్నం జరుగుతోంది. అవి మనం తెలుసుకోవాలి. ఇక్కడ మన సమాజంలో కూడా సంస్కృతి గురించి విరసం అలాంటి కృషి చేయాల్సి ఉందని నేను ఎప్పటి నుంచో అంటున్నాను.. అన్నారు.

పాణి మాట్లాడుతూ క్రాంతికారీ జనతన సర్కార్ మీద చర్చ కాబట్టి మన ప్రయత్నం ముందుకు పోవడానికి కొన్ని విషయాలు ప్రస్తావించుకుందాం.. అని ఇలా చెప్పారు.

1. దండకారణ్యానికి అప్పటి పీపుల్స్‌వార్ ఆదివాసీ సంక్షేమం కోసం, ప్రభుత్వ రాయితీలు అందించేందుకు వెళ్లలేదు. నూతన ప్రజాస్వామిక విప్లవ వ్యూహంలో భాగంగా వెళ్లింది.

2. మావోయిస్టు పార్టీ తన వ్యూహాన్ని ఆదివాసులపై రుద్దడానికి వెళ్లలేదు. ఆదివాసులు విప్లవకర శక్తులు కాబట్టే వాళ్లను విప్లవంలోకి తీసుకరావడానికి వెళ్లింది.

3. అమాయక ఆదివాసులని, వాళ్లు కష్టాల్లో ఉన్నారని సానుభూతితోనో, ఉద్వేగంతోనో చూడాల్సిన పని లేదు. అది సరైంది కూడా కాదు. వాళ్లు ఒక రాజకీయ పోరాటం చేస్తున్నారు. బాధితుల పక్షాన నిలబడ్డట్లు కాదు.. న్యాయన్యాయాలతో కూడా ఇది తేలదు. వాళ్ల రాజకీయాలు సమాజాన్ని మార్చాలనుకుంటున్నాయనే దృష్టితో చూడాలి.

4. దండకారణ్యం గురించి, జనతన సర్కార్ గురించి ఏక పక్షంగా చెప్పాలని మేం అనుకోవడం లేదు. పిసరంత కూడా ఎక్కువ చేసి చెప్పకూడదు. రొమాంటిసైజ్ చేయడం జరిగితే పరిహరించుకోవాలిందే.

6. మావోయిస్టు పార్టీ రాజకీయాలతో ఏకీభావం ఉన్న వాళ్లతోనే ఈ విషయాలు చర్చించాలని మేం అనుకోవడం లేదు. దాని వల్ల ప్రయోజనం ఏమీ ఉండదు. అది రాజకీయంగా మంచిది కూడా కాదు. మేం 90 మంది రచయితలకు దండకారణ్య సాహిత్యం అందించి ఈ సమావేశానికి ఆహ్వానించాం. వాళ్లంతా మావోయిస్టు పార్టీతో ఏకీభావం ఉన్నవాళ్లు కాదు. అసలు ఏ ఉద్యమానికైనా విమర్శనాత్మక సంఘీభావం అందిస్తూ ఆ ఉద్యమం గురించి తెలియని వాళ్లకు తెలియజేస్తూ ఒక సుదీర్ఘ సంభాషణ కొనసాగించాల్సి ఉంది.

7. తెలంగాణలో ప్రభుత్వ ఆశ్రయం కోసం మేధావులు, బుద్ధి జీవులు పడుతున్న తపన మీద మనకు విమర్శనాత్మక వైఖరి ఉండాలి. బహుశా అనేక మంది సి.నారాయణరెడ్డిలు, దాశరథులు తయారవుతారు. ఒక రకంగా వాళ్లకంటే ఇప్పటి వాళ్లు ఇంకా తెలివైనవాళ్లు.

8. పోడు వ్యవసాయం కన్న స్థిర వ్యవసాయం ప్రగతిదాయకం. ఆదివాసీ సంస్కృతిలో ప్రాచీన సాంఘిక జీవితానికి సంబంధించిన విషయాలు ఎన్నో ఉంటాయి. విప్లవమంటే ప్రగతిదాయకమైన పరివర్తన. దాన్ని కోరుకొనేవాళ్లు ప్రాచీన కట్టుబాట్లను, విలువలను, ఆచారాలను మొత్తానికి మొత్తం అంగీకరించలేదు. పైగా అవి ప్రగతిదాయకమైన ఉద్యమగమనానికి ఆచరణలోనే అవరోధంగా పరిణమిస్తాయి. నిజానికి మావోయిస్టు ఉద్యమ అనుభవాలను పరిశీలిస్తే అలాంటి సంస్కృతీ సంప్రదాయాల మీద పోరాటాలు చేసినట్లు తెలుస్తుంది. ఆదివాసీ సంస్కృతిలోని మంచిని గుర్తిస్తూనే ఈ ప్రగతిదాయక గీటురాయి మీద వైఖరి ఏర్పాటు చేసుకోవాలి. అయితే ఆ సమూహాన్ని ఒప్పించి, మెప్పించి ఉద్యమంలోకి తీసుకొని రావడానికి వ్యూహాత్మకంగా వ్యవహరించడానికి, సిద్ధాంత వైఖరి అలవర్చుకోడానికి తేడా ఉంటుంది.

సౌహార్ద సందేశం

(అరసం 17వ మహాసభల సందర్భంగా విరసం కార్యదర్శి కా.పి. వరలక్ష్మి రాసిన సందేశాన్ని కామ్రేడ్ బాసిత్ చదివారు.)

సామ్రాజ్యవాదం, హిందూ ఫాసిజంపై విశాల ప్రాతిపదికన ఐక్యంగా ఉద్యమిద్దాం

- పి.వరలక్ష్మి

తెలంగాణ రాష్ట్రంలో తొలి మహాసభలు జరుపుకుంటున్న అభ్యుదయ రచయితల సంఘానికి అభినందనలు. ప్రజాసంస్కృతిని, ప్రజాస్వామిక విలువలను, ధిక్కార సంప్రదాయాన్ని సాహిత్యంలో నెలకొల్పిన కాళోజీ వంటి ప్రజాకవులకు, ప్రజా ఉద్యమాలకు ఊపిరినిచ్చిన వరంగల్‌లో అరసం 17వ మహాసభలు జరుపుకోవడం సంతోషకరం.

ఇదే వరంగల్‌లో జరిగిన విరసం 24వ మహాసభల సందర్భంగా సాహితీ మిత్రులం మోడిత్వ రాజకీయాల ప్రమాదాన్ని గుర్తించి రానున్న కాలంలో ప్రగతిశీల ప్రజాస్వామిక లౌకిక శక్తులన్నీ కలిసి ఫాసిస్టు శక్తులను ఐక్యంగా ఎదుర్కోవలసిన అవసరాన్ని గురించి మాట్లాడుకున్నాం. ఊహించిన దానికన్నా అధికంగానే పార్లమెంటరీ ఎన్నికలు హిందుత్వ రాజకీయాలకు ప్రతిపక్షం కూడా లేని అపరిమిత అధికారాన్ని కట్టబెట్టాయి. అభివృద్ధి ముఖం తొడుక్కొని కార్పొరేట్ అండదండలతో అధికారంలోకి వచ్చిన ఈ హిందుత్వ రాజకీయాలు వచ్చీరాగానే సామ్రాజ్యవాద మార్కెట్‌కు దేశాన్ని అర్పించి తమ విశ్వసనీయతను కాపాడుకుంటున్నాయి. కోస్తాంధ్ర తీరప్రాంతంలో కార్పొరేట్ కంపెనీల కోసం ఉద్దేశించిన పోలవరం ప్రాజెక్టుకు ప్రతిఘటన లేకుండా చేయడం కోసం ముంపు మండలాలను ఆంధ్రప్రాంతంలో విలీనం చేసే ఆర్డినెన్సును తెచ్చింది. దేశాభివృద్ధి కోసం కఠిన నిర్ణయాలు తీసుకోడం అవసరం అంటూ బడ్జెట్‌లో కార్మిక హక్కులను పూర్తిగా హరించే నిర్ణయాలు తీసుకున్నది. నరేంద్రమోడీ ప్రధాని అయినవెంటనే ఒక చోట కాలు నిలవనీయక విదేశాలన్నీ పర్యటిస్తున్నాడు. బహుళజాతి కంపెనీల మార్కెట్ దాహాన్ని తీర్చే ఒప్పందాలు చేసుకుని వస్తున్నాడు. తన వెంట మీడియాను కూడా అనుమతించకుండా అమెరికా, జపాన్, చైనా వంటి దేశాలతో అణుఒప్పందాలు మొదలుకొని దేశానికి వినాశకరమైన బహుళ జాతి ప్రాయోజిత మేక్ ఇండియా వంటి అనేక నిర్ణయాలను ఏకపక్షంగా ఏ అడ్డూ లేకుండా తీసుకుంటున్నాడు. ఇది స్థానీయ ఉత్పత్తి శక్తుల స్వావలంబ మేక్ ఇండియా కాదు. కనిపించే హిందూ ఫాసిస్టు వికృత రూపం వెనక ఉన్న సామ్రాజ్యవాద దళారీ ముఖం మరింత ప్రమాదకరమైనది. ఎందుకంటే దానికి అభివృద్ధి పేరు మీద సమాజంలో మరింత ఆమోదం ఉంటుంది. మరో వైపు ఆర్టికల్ 370 రద్దు, కామన్ సివిల్ కోడ్, పాఠ్యపుస్తకాల్లో తప్పుడు చరిత్ర పాఠాలను

---

10. మావోయిస్టు ఉద్యమం దండకారణ్యానికి మాత్రమే పరిమితమైంది కాదు. ఈరోజు ఇక్కడ పంపిణీ చేసిన సాధన ఇంటర్వ్యూ శీర్షిక దండకారణ్యాన్ని కాపాడుకుందాం... అనేక దండకారణ్యాల్ని నిర్మించుకుందాం అని ఉంది. ఈ లక్ష్యంతోనే పని చేయాల్సి ఉంది.

చివర్లో వివి మాట్లాడుతూ ప్రజాసైన్యం లేకపోవడం వల్లనే పారిస్ కమ్యూన్‌ను కాపాడలేకపోయాం. కనుక బోల్షివిక్ పార్టీ ఉండాలి. ప్రజల రాజ్యాన్ని కాపాడగలిగే బోల్షివిక్ పార్టీగా మావోయిస్టు పార్టీ పని చేస్తోంది. జనతన సర్కార్ మాత్రమే లూటీ సర్కార్‌కు ప్రత్యామ్నాయం. ఉక్కు శిక్షణ గల పార్టీ ఉండాలి. దాన్ని బోల్షివికీకరణ చేయాలి. ఒకటి లేదా అనేక విముక్తి ప్రాంతాలు ఏర్పడాలి. దీనిని ప్రజాసైన్యం లేకుండా కాపాడుకోలేం. దీన్ని రొమాంటిసైజ్ చేయడం అంటే విప్లవ రచయితల సంఘం చేసేదేమి లేదు. ఇది సిద్ధాంత అవగాహన. మీరంతా వెళ్లిరావడం సులవు. ఈ విషయాలన్నీ విరసం మీతో కమ్యూనికేట్ చేయడానికి ఇంకా నేర్చుకోవాల్సే ఉంది. విరసం పీడితుల వైపు మాత్రమే కాదు. పీడిత పోరాట ప్రజల వైపు ఉంటుంది వివి అన్నారు.

చివర్లో కామ్రేడ్ వరలక్ష్మి... కొందరు రచయితలకు సమాచారం అందివ్వడంలో లోపం జరిగి ఉండవచ్చు. ఇలాంటి వాటిని సరిదిద్దుకుంటూ భవిష్యత్తులో జనతన సర్కార్‌కు సంబంధించిన ప్రచార కార్యక్రమాలను రూపొందించుకొని కలిసి పని చేద్దామని ముగించారు.

సమావేశానికి హాజరయినవారు :

జనజ్వాల (ప్రజాకవి), బి.ఎస్. రాజు (ఇంజనీరింగ్ కన్సల్టెంట్), కవిని ఆలూరి (ప్రరవే / లెక్చరర్), ప్రసాదమూర్తి (10 టివి), పద్మకుమారి (ఎబిఎంఎస్), ఆనంద్ (ఆదివాసీ విద్యార్థి సంఘం), చంద మహేష్ (ఆదివాసీ విద్యార్థి సంఘం), మైపతి అరుణ్‌కుమార్ (ఆదివాసి రచయితల సంఘం), దేవులపల్లి కృష్ణమూర్తి (రచయిత), నరసింహారెడ్డి (రచయిత), కె. శివారెడ్డి (కవి), సుజాత సూరేపల్లి (అసిస్టెంట్ ప్రొఫెసర్, శాతవాహన యూనివర్సిటీ), అనిశెట్టి రజిత (కాకతీయ యూనివర్సిటీ, ప్రరవే), కాత్యాయని (ప్రరవే), భండారు విజయ (ప్రరవే), ఎన్. వేణుగోపాల్ (ఎడిటర్ వీక్షణం), ఎస్. సుధాకర్ (జర్నలిస్టు), సుమంత్ (విద్యార్థి), అరవింద్ (టివివి), వాసిరెడ్డి నవీన్ (కథ), కె. ప్రభాకర్ (టివివి), ఆర్. బాలు (టివివి), డి. శ్రవణ్ (టివివి), సి.ఎచ్. సతీష్ (టివివి), కోడూరి విజయమ్మ, ఎం. గంగాధర్ (డిటిఎఫ్), ఎ. నాగేశ్వరరావు (అసిస్టెంట్ ప్రొఫెసర్), పి. కృపాకర్ (మాదిగ మహాశక్తి), ఎం. రాఘవాచారి (పాలమూరు అధ్యయన వేదిక), నాళేశ్వరం శంకరం (లెక్చరర్), యాకూబ్ (లెక్చరర్, కవి), కె. భాస్కర్, ఇంద్రవెల్లి రమేశ్ (జర్నలిస్టు), డా. పగడాల నాగేందర్ (నిజాం కళాశాల అధ్యాపకుడు), సంతోష్ (విద్యార్థి), శివచరణ్ (విద్యార్థి), రామచంద్రం (వీక్షణం), కె.వి.వి. సత్యనారాయణ (ఎఎల్ఆర్‌సి), కాసుల ప్రతాప్‌రెడ్డి (రచయిత), సుంకిరెడ్డి నారాయణరెడ్డి, బి. శ్రీనివాస్, ప్రశాంత్, కె. సాయన్న, కె. పద్మ, జి.ఎస్. రామ్ మోహన్ (రచయిత & జర్నలిస్టు), జి.ఎస్. చార్యులు (టీచర్, డిటిఎఫ్), ఎ. నర్సింహ్మారెడ్డి (సి.ఆర్.పి.పి.), కె. ప్రకాశ్ (టీచర్), పి. హేమలత, లోచన్ (రచయిత), ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, కాత్యాయనీ, శ్యాంరావు, రమేష్, పి. గిరిధర్ (విద్యార్థి), డా. కాసుల లింగారెడ్డి (డాక్టర్), ఉషా ఎస్ డానీ (జర్నలిస్టు), ఇ. అజితా (జర్నలిస్టు), వెంకటేష్ భారత (పరిశోధక విద్యార్థి), మోతుకూరు శ్రీనివాస్ (కవి), నందిని సిధారెడ్డి (మరసం), పి. శ్యామలరావు (ఐఎఫ్‌టియు), కె. రామచంద్రమూర్తి (జర్నలిస్టు), జి. హరగోపాల్ (టీచర్), డి. నరసింహారెడ్డి (టీచర్), ఇంకా విరసం సభ్యులు.

ప్రవేశపెట్టడం లాంటి సంఘపరివార్ ఎజెండా అంశాలను ప్రభుత్వం కదిలిస్తున్నది.

సహజంగానే లౌకిక, ప్రజాస్వామిక సమూహాల, ఉద్యమాల ప్రతిఘటన బలహీనంగా ఉన్న ఈ దశ వారికి కలిసి వస్తున్నది. ఆదివాసీ ప్రాంతాలు మొదలుకొని మూలమూలల్లోనూ సంఘపరివార్ శక్తులు శాఖోపశాఖలుగా బలం పుంజుకుని విస్తరిస్తున్నాయి. ఒకప్పుడు కమ్యూనిస్టు, విప్లవ రాజకీయాల భావ సంఘర్షణా కేంద్రాలుగా, ప్రగతిశీల ఉద్యమాలకు నెలవుగా ఉన్న విశ్వవిద్యాలయాలు నేడు హిందుత్వ శక్తుల కబంధ హస్తాల్లోకి వెళ్ళిపోతున్నాయి. పరమత సహనాన్నే పాటించని హిందూ ఫాసిస్టులు అభ్యుదయ, ప్రగతిశీల భావాలను అసలు సహించరు. ప్రత్యామ్నాయ ఆలోచనలను, రాజకీయాలను లక్ష్యంగా చేసుకుని ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట వారు దాడులు చేస్తున్నారు. హేతువాది దభోల్కర్ హత్య, ప్రొ.సాయిబాబా అక్రమ నిర్బంధాన్ని నిరసిస్తున్న విద్యార్థులపై ఎబివిపి శక్తుల వీరంగం, ఉస్మానియా, హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ వంటి చోట్ల వామపక్ష, దళిత, బీసీ, ఆదివాసీ విద్యార్థి సంఘాల బాధ్యులపై దాడులు, ఇట్లా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉదాహరణలు. ఒక వైపు విధ్వంసక సామ్రాజ్యవాద అభివృద్ధి నమూనా, మరోవైపు హిందూ మతోన్మాద ఫాసిజం అనే రెండంచుల కత్తి వంటి పాలకపక్ష స్వభావాన్ని అర్థం చేసుకుంటేగానీ దాన్ని ఎదుర్కొనలేం.

సామ్రాజ్యవాద స్వాభావిక లక్షణం యుద్ధం. అది ఎంతగా సంక్షోభాలను వెంట తీసుకొస్తుందో అంతగా యుద్ధాన్ని కూడా వెంట తీసుకొస్తుంది. అంతర్జాతీయ పెట్టుబడి రోజురోజుకూ అనేక సంక్షోభాలలో కూరుకుపోతుంటే, మరో వైపు అది నిరంతర యుద్ధాలను ప్రేరేపిస్తున్నది. పాలస్తీనాపై ఇజ్రాయెల్ ఏకపక్ష దాడులను సామ్రాజ్యవాదుల యుద్ధోన్మాదాన్ని ప్రపంచ ప్రజల కళ్ళముందు పెట్టాయి. అటు పాలస్తీనాలోనూ, ఇటు ఇరాక్‌లోనూ హమాస్ తీవ్రవాదులపై యుద్ధం పేరిట సామ్రాజ్యవాదులు చేస్తున్న దారుణాలకు అంతూపొంతూ లేదు. ఈ సామ్రాజ్యవాద యుద్ధం వనరులపై ఆధిపత్యం కోసం చొరబడని నేల ప్రపంచంలో రవ్వంత కూడా లేదు. బహుళజాతి కంపెనీల యంవోయూలను అమలు చేయడం కోసం మన దేశపాలకుల చేతులతో మన మీద కూడా అది యుద్ధం చేస్తూనే ఉన్నది. తీవ్రవాదుల పేరుతో మూలవాసులను తరిమేసి భూమిని కబళించి వేసేందుకు, అభివృద్ధి పేరుతో ఆక్రమించేందుకు దేశమంతా అల్లుకుపోయింది. ఆ యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజల పక్షాన సాహిత్యకారులు నిలబడాలి.

తెలంగాణ రాష్ట్రం వచ్చీ రాగానే బూర్జువా నాయకులపై భ్రమలు పటాపంచలు చేసేలా రాజ్యం తన స్వభావాన్ని బహిరంగంగానే చాటుకుంటున్నది. ధిక్కారమును సైతునా అంటూ ముఖ్యమంత్రి అటు మీడియాపైనా, ప్రజాసంఘాలపైనా తన ప్రతాపం ప్రదర్శించడం చూశాం. ఇట్లా నియంతృత్వంతో, దమనకాండతో పాలన సాగించే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా రచయితలు, కళాకారులు రాజీలేని పోరాటం చేసి తెలుగునేలపై తమ ధిక్కార సంప్రదాయాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉంది. అటువంటి దశలో ప్రజా ఉద్యమాలకు కేంద్రంగా ఉండిన వరంగల్‌లో ఒకే ఏడాది విరసం, అరసం తమ మహాసభలు జరుపుకోవడం కాకతాళీయం కావొచ్చు గాని ఇక్కడి నుండి నిర్దేశించుకుంటున్న లక్ష్యం మాత్రం చరిత్ర మన మీద పెట్టిన బాధ్యతగా మేము భావిస్తున్నాం. ఒకప్పుడు భారతదేశంలో ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్‌కు చెందిన ప్రేమ్‌చంద్, సఫ్దర్ హాష్మి వంటి ప్రగతిశీల రచయితల కాలం నాటి ఫాసిస్టు వ్యతిరేక సాహిత్య సాంస్కృతిక ఉద్యమాలను గుర్తు చేసుకుంటూ, అందులోనూ అరసం పోషించిన చైతన్యయుతమైన పాత్రను గొప్పగా స్మరిస్తూ అటువంటి ఫాసిస్టు వ్యతిరేక ఐక్య సంఘటన ఆవశ్యకత నేడు ఎన్నో రెట్లు అధికంగా ఉన్నదని విరసం భావిస్తున్నది. ఆ దిశగా కొంత ప్రయత్నం కూడా చేస్తున్నాం. సామ్రాజ్యవాదం, హిందూ ఫాసిజంపై విశాల ప్రాతిపదికన ఐక్య ఉద్యమంలో విప్లవ రచయితల సంఘం పాలుపంచుకుంటుందని, లౌకిక ప్రజాస్వామిక విలువలకై సాహిత్య సాంస్కృతిక రంగాల్లో అరసంతో కలిసి ఉమ్మడిగా కృషి చేస్తుందని తెలియజేస్తున్నాం.

అరసం 17వ మహాసభలకు మమ్మల్ని ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ మహాసభలు విజయవంతం కావాలని ఆశిస్తున్నాం. -విప్లవ రచయితల సంఘం, 27.09.2014

లేఖ : అరుణతార సంపాదకులకు, నమస్తే,

జూన్ - జూలై 2014 సంచిక చదివాను. నేను చాల కాలంగా అరుణతార పాఠకురాలిని, అభిమానిని.

ఇది నా మొదటి ఉత్తరం.

ఈ సారి ప్రచురించిన మూడు కథలు స్త్రీ ప్రధానాంశంగా సాగినవే. కమలమ్మ లాంటి అమ్మలందరికి కన్నీటి వందనాలు. హనీమూన్ కథ లోని చామంతి పాత్ర గొప్ప వ్యక్తిత్వం ఉన్న చురుకైన అమ్మాయిని కళ్ళముందు నిలిపింది. విమలగారి 'దౌత్య' చాల కలవర పరిచింది, ఆలోచింపచేసింది.

దౌత్య కథనం హృదయాన్నీ కదలించే దిగా ఉన్నా, ఆలోచిస్తుంటే ఆ పాత్రకు విమలగారి ముగింపు సమర్ధనీయంగా అనిపించడం లేదు. ఎందుకటే శ్రీధర్, మాధవి లాంటి చదువుకొని, విశాల భావాలు కల తల్లిదండ్రులు కల దౌత్య కు ఆత్మహత్య పరిష్కారం కావడం చాల బాధ కలిగించింది. విమలగారి లాంటి వాళ్ళు కూడా మోసగించ బడ్డ అమ్మాయిలకు మరణం తప్ప పరిష్కారం లేదంటే ప్రతి నిత్యం వివిధ రకాల సమస్యలతో బాధ పడుతూ, దహింపబడుతు, తాము ఏమి నేరము చేశామో తెలయకుండానే క్షోభను అనుభవిస్తున్న అమ్మాయిలకు దిశా నిర్దేశం చేసింది ఎవరు. మోసపోవడానికి ఫలితం ఆత్మహత్య అయితే, మోసగించిన వాడికి శిక్ష అవసరం లేదా ?? మీ కథలోని 'అతడు'ని అలా వదిలేశారే వాడికి మరో దౌత్య బలి అయ్యే అవకాశం లేదా?? ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుది అంటారు కదా మరి అమ్మాయిల విషయంలో మేధావుల పరిష్కారం ఇదేనా?

ఎందుకు ఇలా అడగవలసి వస్తుంది అంటే ఇది అరుణతార ప్రచురించిది కాబట్టి. ఇక్కడ సమకాలీన జ్ఞానం తప్ప ,వ్యాపార ధోరణి ఉండదు కాబట్టి. ఇలాంటి పుస్తకాలను గ్రంథాల గంజాయి వనంలో తులసి మొక్కల్లా భావిస్తాం కాబట్టి.

- అరుణతార అభిమాని

కామ్రేడ్ ఎం.టి.ఖాన్‌కు అరుణారుణ జోహార్లు!

ఖాన్ సాబ్.., మీ ఆదర్శం, స్ఫూర్తి విరసానికి నిరంతర శక్తినిస్తుంది

సుదీర్ఘకాలం ప్రజాపోరాటాలతో, విప్లవ రాజకీయాలతో, ఉన్నతమైన జీవన విలువలతో, ఆదర్శ కమ్యూనిస్టుగా కొనసాగిన కామ్రేడ్ మహ్మద్ తాజుద్దీన్ ఖాన్ (ఎం.టి.ఖాన్) ఆగస్టు 20వ తేదీన అమరుడైనారు. ఖాన్ సాబ్ అని విప్లవాభిమానులు ఆప్యాయంగా, గౌరవంగా పిలుచుకునే కామ్రేడ్ ఎం.టి ఖాన్ 1935లో జన్మించారు. కా.ఎం.టి. ఖాన్ మొదట ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో పనిచేశారు. చదువుకునే రోజుల్లోనే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తిని తనలో నింపుకున్నారు. మఖ్దూం మహియుద్దిన్ ప్రభావం ఆయనపై గాఢంగా ఉండింది. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో, ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్‌లో ఆ తర్వాత సిపిఎంలో పని చేసి నక్సల్బరీ పిలుపునందుకుని విప్లవ రాజకీయాలకు అంకితమయ్యారు. శ్రీకాకుళ ఉద్యమాన్ని ప్రభుత్వం నెత్తుటిలో ముంచిన తరువాత విప్లవోద్యమాన్ని మళ్ళీ నిర్మించే సన్నాహాలు సాగుతున్న దశలో కా.కొండపల్లి సీతారామయ్య 'పిలుపు' పత్రికను వెలువరించారు. ఆ పత్రికకు ఖాన్ సాబ్ ప్రచురణకర్తగా ఉన్నారు. జీవిక కోసం టీచర్‌గా, జర్నలిస్టుగా పని చేస్తూనే ఆయన నిరంతరం విప్లవ రాజకీయాలలో క్రియాశీలకంగా ఉంటూ వచ్చారు. విప్లవ రచయితల సంఘం ఆవిర్భావ కాలం నుండి ఆయన సంస్థలో కొనసాగుతున్నారు. 1971లో తన చేతుల మీదుగా హైదరాబాదులో విరసం సభలు నిర్వహించిన దగ్గరి నుండి ఈ ఏడాది వరంగల్‌లో జరిగిన విరసం 24 మహాసభల్లో తీవ్ర అనారోగ్యంలోనూ పాల్గొన్నంత వరకు ఆయన శ్వాస, ధ్యాస విప్లవమే. 1973లో మీసా కింద, ఆ వెంటనే సికింద్రాబాదు కుట్ర కేసులో, తర్వాత ఎమర్జెన్సీ కాలం మొత్తం రాజ్యం ఆయనను నిర్బంధంలో ఉంచగలిగింది కాని ఆయన ఆశయాలను, విశ్వాసాలను ఏ మాత్రం సడలించలేకపోయింది.

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుండి నేటి మావోయిస్టు ఉద్యమం దాకా విప్లవోద్యమాల పక్షానే నిలబడిన ఎం.టి.ఖాన్ 1974లో పౌరహక్కుల సంఘం (ఎపిసిఎల్‌సి) ఏర్పాటులోనూ ఉన్నారు. 1992లో ఎపిసిఎల్‌సి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. చివరి దాకా పౌరహక్కుల ఉద్యమంతో కొనసాగారు. ఎన్నో నిజనిర్ధారణలు చేశారు. పౌరహక్కులు, సాహిత్యం, ఆర్ట్ అండ్ థియేటర్ ఆయన ఇష్టమైన కార్యరంగాలు. కవిత్వం, వ్యాసాలు రాశారు. అనువాదాలు చేశారు. అఖిల భారత విప్లవ సాహిత్య సాంస్కృతిక సమితిలోనూ (ఏఐఎల్ఆర్‌సి) ఆయన భాగమయ్యారు. జీవితాంతం ప్రజాఉద్యమాలకు కొండంత అండగా నిలిచి, దగ్గరైన ప్రతి ఒక్కరికీ మానవత్వ పరిమళాలు వెదజల్లిన ఎం.టి.ఖాన్‌ది నిరాడంబర జీవితం. మహోన్నత వ్యక్తిత్వం. ఆ కమ్యూనిస్టు ఆదర్శమూర్తికి విరసం వినమ్రంగా జోహార్లు అర్పిస్తూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోతామని ప్రతిజ్ఞ చేస్తున్నది.

- పి. వరలక్ష్మి (కార్యదర్శి)

రివేరా, కాశిం, రాంకీ, పాణి, బాసిత్, నల్లూరి రుక్మిణి

(కార్యవర్గ సభ్యులు) విప్లవ రచయితల సంఘం

తేది: 20.08.2014

ఎ.బి.వి.పి. దాడులను ఖండిద్దాం!

ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి, రచయిత, గాయకుడు నలిగంటి శరత్‌పై ఎ.బి.వి.పి. నాయకులు చేసిన దాడిని విప్లవ రచయితల సంఘంగా తీవ్రంగా ఖండిస్తోంది. బుధవారం రాత్రి ఓల్డ్ పీజీ హాస్టల్‌లోని శరత్ గది (రూం నెం. 62) పై దాడి చేసిన ఎ.బి.వి.పి. నాయకులు అతని పుస్తకాలు, ల్యాప్‌ట్యాప్, సర్టిఫికెట్లు ఇతర సామాగ్రిని కాల్చివేశారు. శరత్‌పై పథకం ప్రకారం భౌతిక దాడికి యత్నించి విఫలమైన పరిషత్ నాయకులు అతని గదికి నిప్పు పెట్టారు.

ఎలాంటి విధ్వంసకర చర్యల ద్వారా కేంద్రంలో బి.జె.పి. అధికారాన్ని చేజిక్కించుకుందో తెలంగాణలోనూ అలాంటి విధ్వంసకర వాతావరణాన్ని సృష్టించేందుకు పరివార్ శక్తులు యత్నిస్తున్నాయి. దళిత, మైనార్టీ, ఆదివాసీ సమూహాలపై జరుగుతున్న దాడులు అందులో భాగమే. విశ్వవిద్యాలయాల్లో హిందుత్వకు ప్రత్యామ్నాయంగా రూపొందుతున్న ప్రజాస్వామిక వాతావరణాన్ని దెబ్బ తీసేందుకు మతోన్మాద శక్తులు ఉద్దేశ్యపూర్వక దాడులకు పాల్పడుతున్నాయి. గత నెల డెమోక్రటిక్ స్టూడెంట్ యూనియన్ కార్యదర్శి బద్రిపై దాడిని, ఇప్పుడు సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో కృషి చేస్తున్న విద్యార్థి నాయకుడు శరత్‌పై జరిగిన దాడిని ఈ క్రమంలోనే అర్థం చేసుకోవాల్సి ఉంది. తమ చర్యలను సమర్థించుకునేందుకు ఎ.బి.వి.పి. ప్రతిఘాతుక ఉద్యమాలను అడ్డుపెట్టుకో జూస్తుండడం విచారం. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఓ చారిత్రక వారసత్వం ఉంది. మతోన్మాద ఆగడాలను ఎదురు నిలిచి విద్యార్థులను ఏకం చేసిన చరిత్ర ఉస్మానియాది. అక్కడి ప్రతి పోరాటం వెంట ప్రజాస్వామిక ఉద్యమాలు కలిసి నడిచాయి. తెలంగాణలో విధ్వంసకర రాజకీయాలను ఎదుర్కొనేందుకు, మతోన్మాద శక్తుల అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక వాదులంతా గొంతువిప్పాల్సిన అవసరం ఉంది.

విప్లవాభినందనలతో..

- పి. వరలక్ష్మి (కార్యదర్శి)

వరవరరావు, కాశీం, బాసిత్, గీతాంజలి, రివేరా, రాంకీ

12-09-2014

కెసిఆర్ ప్రభుత్వం పూర్తిగా ముసుగు తీసేసింది తెలంగాణ మేధావులు ఇకనయినా గ్రహించాలి

విప్లవ ప్రజాతంత్ర వేదిక (ఆర్.డి.ఎఫ్.) పైనా, మావోయిస్టు పార్టీతో పాటు రైతుకూలీ, కార్మిక, విద్యార్థి, యువజన సంఘాలపైనా గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విధించిన నిషేధాన్ని కొనసాగిస్తూ జారీ చేసిన జీవోను అయిదు వారాలకు బహిరంగ పరచిన తెలంగాణ ప్రభుత్వం ఇక ముసుగుల్ని పూర్తిగా తొలగించుకుంది. రాజకీయ పార్టీలపైన, ప్రజాసంఘాలపైన, విశ్వాసాలపైన నిషేధం లేని స్వేచ్ఛాయిత తెలంగాణను ప్రజలు, ప్రజాసంఘాలు ఆశిస్తున్న సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజాభద్రతా చట్టాన్ని యథావిధిగా అమలు చేయడానికి

తెలంగాణ ప్రభుత్వం ఏ మాత్రం వెనకాడలేదు. ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక సభ సందర్భంగా సెప్టెంబరు 20 అర్ధరాత్రి నుండి ప్రజల్ని భయభ్రాంతులను చేసి హైదరాబాదు నగరం నడిబొడ్డున జడలు విప్పుకున్న తెలంగాణ స్టేట్ తాను తిట్టిపోసిన సీమాంధ్ర పాలకుల కన్నా ఏ మాత్రం భిన్నంగా ఉండనని బహిరంగంగా ప్రకటించుకుంది. మీడియాను పాతర పెడతానని కేసిఆర్ అనడమే కాదు తాను తప్ప మరెవరూ మాట్లడకూడని, తన మాటలు వల్లె వేయడం తప్ప మరే ఆలోచనలకూ తావు ఉండకూడదని చేతల్లో చూపిస్తున్నారు. ఏ.పి. పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్ సాంకేతికంగా తెలంగాణలో చెల్లుబాటులో లేదని ఎవరైనా భ్రమించి ఉంటే వాటిని పటాపంచలు చేస్తూ ఆగస్టు 21న జారీచేసిన జీవోను ఇప్పుడు విడుదల చేసింది తెలంగాణ ప్రభుత్వం.

ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక సభను పాశవికంగా అడ్డుకుని వందల మందిని నిర్బంధించిన సందర్భంలో మీరు చెప్పిన మావోయిస్టు ఎజెండా ఇదేనా అని ప్రశ్నించిన ప్రజాసంఘాలకు ఈ జీవో ద్వారా సమాధానం చెప్పారు తెలంగాణ ముఖ్యమంత్రి. తనది తెలంగాణ కోసమే పుట్టిన ఉద్యమ పార్టీ అని చెప్పుకునే ఆయన కనీసం బూర్జువా ప్రజాస్వామిక విలువల్ని కూడా తోసివేసి ఫక్తు నియంతలాగా భావ ప్రకటనా స్వేచ్ఛను కబళించారు. ఉద్యమాల ద్వారా సాధించుకునే తెలంగాణ రాష్ట్రంలో స్వేచ్ఛాయుతంగా ప్రజాస్వామిక భావ సంఘర్షణ జరుగుతుందని ఆశించిన ప్రజాసంఘాలకు, నిర్బంధాల నుండి ఊపిరి పీల్చుకోవచ్చని ఆశించిన ప్రజలకు ప్రభుత్వాలు మారినా, పరాయివాడైనా, తన వాడైనా నెత్తినెక్కి తొక్కేవారేనని తెలియపరిచారు. నిజానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే మహాద్భుతాలు జరుగుతాయని ఆశించకపోయినా ఎక్కువ మంది ప్రజాఉద్యమాలు పట్టం గట్టిన ప్రభుత్వం కాబట్టి ప్రజాసంఘాలపై నిషేధం కాస్తయినా సడలుతుందని భ్రమపడ్డారు.

దేశవ్యాప్తంగా విభిన్న రాజకీయ భావజాలాల నుండి పుట్టిన ప్రజాస్వామిక ఉద్యమాల వేదికగా ఆర్‌డిఎఫ్ ఏర్పడీ ఏర్పడక ముందే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏ తప్పుదు కారణం చూపి నిషేధించిందో అట్లాగే తెలంగాణ ప్రభుత్వమూ నిషేధించింది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంతో పాటు అటువంటివే ఎన్నో ప్రజాస్వామిక ఉద్యమాలకు ఉమ్మడి వేదికగా ప్రకటించుకున్న ఆర్‌డిఎఫ్‌నే కాదు అన్ని ప్రజాసంఘాలపైన, మావోయిస్టు పార్టీపైన నిషేధం ఎత్తివేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని మేము డిమాండ్ చేస్తున్నాం.

తెలంగాణ మేధావులు, ప్రజాస్వామికవాదులు గత ప్రభుత్వాల నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా ఎట్లా నిలబడ్డారో అందరూ కోరుకున్న విధంగా భిన్న భావాలు వికసించి, సంఘర్షించి సమాజాన్ని ముందుకు తీసుకుపోయే విధంగా తెలంగాణ నిర్మించుకోడానికి కృషి చేయాలని విరసం కోరుకుంటున్నది. వేలాది మంది సర్వస్వం త్యాగం చేసి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని నియంతృత్వ రాజ్యాల ఇనుప పాదాల కిందికి పోకుండా అందరం కలిసి అడ్డుకుందామని పిలుపునిస్తున్నది.

- పి. వరలక్ష్మి (కార్యదర్శి)
తేది: 25.09.2014

పైడి తెరేష్‌బాబుకు నివాళి

ప్రఖ్యాత దళిత కవి పైడి తెరేష్‌బాబు సెప్టెంబరు 29వ తేదీన తన 51వ ఏట అనారోగ్యంతో మరణించారు. దళిత ఆత్మగౌరవ వక్తీకరణను అద్భుతమైన కవితా పక్తులుగా సాహితీ లోకానికిచ్చిన కవి ఇంత తొందరగా మనల్ని విడిచి వెళ్ళడం అత్యంత విషాదం. ఆధిపత్య సంస్కృతి, అగ్రకుల అణచివేతపై ఆగ్రహావేశాలతో కవిత్వ 'శరసంధానం' చేసిన తెరేష్‌బాబు అల్పపీడనం, హిందూ మహాసముద్రం, నేను నా వింతలమారి ప్రపంచం వంటి మేటి కవితా సంకలనాలతో తెలుగు కవిత్వానికి మంచి చేర్పునిచ్చాడు. పడగవిప్పిన హిందూ ఫాసిజాన్ని పదునైన పదాలతో నిరసించాడు. ప్రపంచీకరణ ఆర్థిక విధానాలవల్ల పరాయీకరణ చెందుతున్న వ్యక్తిత్వాల కోసం, సంస్కృతి, విలువల కోసం తపించాడు. తెలంగాణ ఉద్యమ సందర్భంలో కోస్తాంధ్ర, రాయలసీమ పాలకవర్గాలు ప్రతీఘాతుక సమైక్యాంధ్ర ఆందోళనలను రెచ్చగొడుతున్న సమయంలో ఆ ప్రాంతం నుండి తెరేష్‌బాబు వంటి రచయితలే 'కవడి కుండలు' కవితా సంకలనంతో తెలంగాణ ఉద్యమానికి మద్దతు తెలిపి తెలుగు సాహితీ లోకంలో ప్రజాస్వామిక విలువలకు ప్రతీకగా నిలిచారు. రెండు రాష్ట్రాల వాళ్ళం 'కావడి కుండల్లా విడిపోదాం, కావడి బద్దలా కలిసుందామని' అద్భుతంగా వ్యక్తీకరించింది ఆయన కవిత. తెరేష్‌బాబు దృక్పథ రీత్యా మార్క్సిజానికి వ్యతిరేకం. విప్లవోద్యమం పట్ల ఆయనకు తిరస్కార వైఖరి ఉండేది. విప్లవ సాహిత్యోద్యమానికి, దళిత అస్తిత్వోద్యమానికి మధ్య రాజకీయ ఉద్వేగపూరిత సంవాదం నడిచిన రోజుల్లో ఇది బలంగా ప్రతిఫలించింది. సాహిత్య విమర్శ, సైద్ధాంతిక రంగాల్లో నేటికీ సంభాషణ బదులు సంవాదం జరిగే ధోరణిని ప్రయత్నపూర్వకంగా మార్చుకోవాల్సిన అవసరం ఉంది.

1993నాటి చిలకలూరిపేట బస్సు దహనం కేసులో ఉరిశిక్ష పడ్డ చలపతి, విజయవర్ధన్‌ల కోసం కొన్ని సంవత్సరాల పాటు నడిచిన ప్రజాస్వామిహక్కుల ఉద్యమం న్యాయవ్యవస్థపైన దళిత కోణం నుండి ఎంతో చర్చను లేవనెత్తింది. నేరం, శిక్ష అందరికీ సమానంగా వర్తించని చోట చట్టం ఎట్లా ఆధిపత్య కుల, మత, వర్గ స్వభావంతో కూడి ఉంటుందో విశ్లేషించింది.

ఆ ఉద్యమంలో తెరేష్ బాబు పాత్రను విరసం గుర్తుచేసుకున్నది. సరిగ్గా అటువంటి ఐక్య ఉద్యమాల ఆవశ్యకత నేడు మరింత ఎక్కువగా ఉంది. పైడి తెరేష్ బాబు సాహిత్య పరిభాషకు అట్టడుగు కుల సాంస్కృతిక సంపద నుండి కొత్త సౌందర్యాన్ని అద్దిన కవిగా, అన్ని పీడిత ప్రజాసమూహాల వైపు నుండి పదునైన గొంతును వినిపించిన కవి, గాయకుడిగా చిరకాలం నిలిచిపోతాడు. ఆయనకు నివాళుర్పిస్తూ ఆయన మిత్రులకు, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం.

- పి. వరలక్ష్మి (కార్యదర్శి)
తేది: 01.10.2014

ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక సభను భగ్నం చేసి హాజరయిన ప్రతినిధులను అరెస్టు చేసి,
సికింద్రాబాద్‌లోని బొల్లారం పోలీసు స్టేషనులో బంధించగా జరిగిన ప్రత్యామ్నాయ సభ దృశ్యాలు!

గాజాపై ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా విరసం ఆధ్వర్యంలో
ఆగస్టు 3న హైదరాబాదులో జరిగిన సభ దృశ్యాలు!

ARUNATARA ...onthly Journal of Revolutionary Writers' Association (VIRASAM)
● RNI Regn.No....
● Published on 05/11/2014
306 - Aug-Sept., 2014

KLVA101M140
BC



నాకు తెలుసు నాకు విధించిన ఈ శిక్ష వలన
నేను భాదపడే దాని కన్నా కొన్ని వేల రెట్లు
నా సిద్ధాంత భయంతో మీరు నాకు ఈ శిక్ష విధించారు

\- బ్రూనో

Edited, printed, published and owned by Chalasani Prasad, H.No. 33-13-3, Seetharampuram, Vijayawada - 520 002
Printed at Nagendra Printing Press, Vijayawada - 520 002.
Editor : Chalasani Prasad

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M170
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	ఉన్న
వెనుక అట్ట	ఉంది
మొత్తం పేజీలు	69
పెద్ద సైజు పేజీలు	nil
ఖాళీ పేజీలు	nil
లేని పేజీలు	nil
తయారు చేసినది	Susmitha
పేజీలు విడదీసినది	Bhanusree
స్కాన్ చేసినది	[illegible]
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good